UNIVERSAL LIBRARY
OU_206203
UNIVERSAL LIBRARY

రా॥ గ్రంథమాలిక ౧౩.

# బ్రహ్మపురాణము

(మూఁడవసంపుటము.)



# రాజపోషకులు

మహారాజరాజశ్రీ

# బ్రహ్మపురాణము

( మూఁడవసంపుటము. )

మూర్తిత్రయప్రణీతము.

విమర్శకర్త

గిరరాజు పంతు

పి ఠా పు ర ము

శ్రీ విద్వజ్జన మనోరంజనీ ముద్రాక్షరశాల

౧౯౩౧.

# విషయసూచిక.


| | | పుట. |
|---|---|---|
| ౧ | భానుతీర్థాభివర్ణనము. | ౧ |
| ౨ | గరుడతీర్థాభివర్ణనము. | ౭ |
| ౩ | గోవర్ధనతీర్థాభివర్ణనము. | ౧౨ |
| ౪ | ధౌతపాపతీర్థమాహాత్మ్యము. | ౧౪ |
| ౫ | విశ్వామిత్రతీర్థవర్ణనము. | ౨౦ |
| ౬ | శ్వేతతీర్థవర్ణనము. | ౨౩ |
| ౭ | మృతసంజీవనీతీర్థము. | ౨౮ |
| ౮ | ఇంద్రతీర్థప్రశంస. | ౩౨ |
| ౯ | పౌలస్త్యతీర్థము. | ౩౪ |
| ౧౦ | అగ్నితీర్థము. | ౩౭ |
| ౧౧ | ఋణమోచనతీర్థము. | ౩౯ |
| ౧౨ | కుమారీసుపర్ణాసంగమతీర్థము. | ౪౦ |
| ౧౩ | సరస్వతీసంగమతీర్థము. | ౪౩ |
| ౧౪ | పంచతీర్థవర్ణనము. | |
| ౧౫ | శమ్యాదితీర్థవర్ణనము. | |

| | | |
|---|---|---|
| ౨౧ | చక్రతీర్థము. | ౮౪ |
| ౨౨ | పిప్పలతీర్థము. | ౮౯ |
| ౨౩ | నాగతీర్థము. | ౧౧౪ |
| ౨౪ | మాతృతీర్థము. | ౧౨౩ |
| ౨౫ | బ్రహ్మతీర్థము. | ౧౨౬ |
| ౨౬ | అవిఘ్నతీర్థము. | ౧౨౯ |
| ౨౭ | శేషతీర్థము. | ౧౩౧ |
| ౨౮ | బడబాసలతీర్థము. | ౧౩౨ |
| ౨౯ | ఆత్మతీర్థము. | ౧౩౫ |
| ౩౦ | అశ్వత్థతీర్థము. | ౧౩౭ |
| ౩౧ | సోమతీర్థము. | ౧౩౯ |
| ౩౨ | ధాన్యతీర్థము. | ౧౪౧ |
| ౩౩ | విదర్భారేవతీసంగమతీర్థములు. | ౧౪౨ |
| ౩౪ | పుణ్యతీర్థాదివర్ణనము. | ౧౪౫ |
| ౩౫ | రామతీర్థము. | ౧౫ |
| ౩౬ | పుత్రతీర్థాదివర్ణనము. | ౧౭౧ |
| ౩౭ | యామ్యాదితీర్థవర్ణనము. | ౧౮౬ |
| ౩౮ | ఉపసీర్థాదివర్ణనము. | ౧౮౮ |
| | | ౧౯౩ |

శ్రీరామచంద్ర.

# బ్రహ్మపురాణము

## తృతీయసంపుటము.

క. అవ్యయు, నజు, నఖిలజగ
త్సేవ్యు, నజరు, నపరిమితు, న౯చింత్యు, ననంతు౯
భవ్యు, నను భావ్యు, నమృగం
తవ్యు, ననంభావ్యు, దివ్యు౯ దలంతును భక్తి౯.

### — భానుతీర్థాభివర్ణనము —

అనంతరము బ్రహ్మదేవుండు, "మునిసత్తమా! నారదా! అరుణా వరుణానామంబులం [illegible] ఖ్యాతరంబులును, శుభకరంబులు నైన యొప్పు రెండు నదిశ్రేష్ఠంబులు గలవు. అమ్మహానదులు గంగానదితో సంగమించుస్థానంబు సకలపుణ్యప్రదంబును, సర్వోత్కృష్టంబును [illegible]. సమస్తపాపహారంబగు దానియుత్పత్తిని గూర్చి చెప్పెదను వినుము." అని యీరీతిని వచియింపందొడంగెను.

కలఁడుగదా కశ్యపప్రజాపతి జ్యేష్ఠపుత్త్రుండును, లోకవిశ్రుతుండును నగు నాదిత్యుండు? ఆతండు త్రైలోక్యచక్షువు; తీక్ష్ణకిరణుండు; సహస్రాంశుండు; లోకపూజ్యుండు. త్వష్టృప్రజాపతితనయయు, [illegible] నగును [illegible] యాతనియొక్క [illegible]. ఆమె [illegible] ప్రదక్షిణ [illegible] లో నిట్లు

దలంపసాఁగెను. "ఓర్చుకొనశక్యముగాని సహస్రకిరణంబులవేఁడిమితో నిరంతరము వెలుంగుచుండు నాహృదయనాథునిసన్నిధిని ననవరతంబును నివసించుట నాకు మిక్కిలి కష్టముగా నున్నదే! ఏమి చేయుదును."

నారదా! వింతమైన యీసంఘటనమును వింటివా? విశ్వకర్మనందని యగు నయ్యుషాదేవికి నమితప్రజ్ఞావంతు లగువైవస్వత మనువు, యముఁడు నను నిద్దరు పుత్త్రులును, పుణ్యనదీమతల్లి యగు యమున యనునొకకన్యయుఁ గలరు. సంతానవతియైనయాదేవి యానాఁ డట్లు తలపోసి తుదకుఁ బ్రయత్నపూర్వకముగాఁ దననీడను దనపోలిక గలయాఁడుదానినిగా సృష్టించి యామెతో నిట్లు పలికెను. "నీవును, నేనును సమానరూపవయోవిలాసంబుల నొప్పుచుంటిమి. కావున నీవు నాస్థానంబున నిల్చి, నాపతిదేవుని భక్తిశ్రద్ధలతో నారాధించుటయందును, ఆయనకుఁ బ్రియమును జేకూర్చుటయందును, మఱియు నాబిడ్డలను నితాంతప్రేమతో సంరక్షించుటయందును నెంతమాత్రమును వెలితిగానరాకుండ సంచరించుచుందుము. మఱియు నీయుత్పత్తివృత్తాంతముగాని, నాప్రయాణోదంతముగాని నా భర్తకును, నాబిడ్డలకును నెన్నఁడును, ఏవిధమునను దెలియనీయకుము. నే నిప్పుడే యిల్లు వెడలి పోవుచున్నదానను. ఈనిముసము మొదలుకొని నేను చెప్పినట్లు వర్తింపుము. ఇదె నాయాజ్ఞ. భద్రముసుమా!"

ఈమాటలకు ఛాయాదేవి సమ్మతించెను. అంతట నుషాదేవి గృహమునుండి వెడలి తనప్రాణేశ్వరుని తీక్ష్ణతేజమును శాంతింపఁజేయుభావముతోఁ బితృసన్నిధికిఁ బోయి తనవృత్తాంతమంతయు నాతనికి విన్నవించెను. త్వష్టృప్రజాపతియు, నామె వాక్యములను

విని చకితుండై "భద్రా! పతివ్రతలగు నారీమణుల కిట్టి స్వేచ్ఛాప్రవృత్తి దగినపని కాదు. నీభర్తకును, బిడ్డలకును నేమి గతి కల్పించి వచ్చితివి? ఈనీసాహసమునకు మిక్కిలి భీతిల్లుచున్నాను. నామాట విని తిరిగి భర్తృగృహమునకుం బొమ్ము." అని మందలించెను. ఆమాటల కయ్యుషాదేవి "తండ్రీ! ఆవేడిమి నేను సహింపఁజాలను, అక్కడకు వెడలఁజాలను." అని మాటిమాటికిం బలుకుచు శీఘ్రముగా నక్కడనుండి కదలి యుత్తరకురుభూములకుఁ దపస్సు చేయుటకై వెడలిపోయెను. అచ్చోట బడబా (ఆఁడ గుఱ్ఱము) రూపమును ధరియించి దుర్నిరీక్ష్యప్రతాపవంతుం డగు తనపాతికాంతుని నిశ్చలభావములో మనంబున నిడుకొని తీవ్రమైన తపంబు నొనరింపం దొడంగెను.

ఇక్కడ యిట్లుండ, నచ్చట నుషాస్వరూపిణి యగు ఛాయాదేవి భర్తృపరిచర్య గావించుచుఁ గొంతకాలములో 'సావర్ణి, శనైశ్చరుఁడు' అను నిరుపురుపుత్రులను, 'విష్టి' అను నొకపుత్త్రికను సంతానముగాఁ బడసెను. మొదట నెట్లైనను సంతతి గలిగినతరువాత ఛాయాదేవి యుషాదేవిబిడ్డలకంటెఁ దనబిడ్డల నెక్కువగాఁ బ్రేమింపఁబొచ్చెను. తల్లియైనయీభేదభావమును గనిపట్టి యముండు క్రుద్ధుండై తనకాలితో ఛాయాదేవి నొక్కతన్ను తన్నెను. పుత్త్రుని యీయాగడమునకు సంక్షోభించి ఛాయాదేవి కుపితురాలై, "ఓరి పాపీ! నాయాజ్ఞచే నీరెండుపాదంబులును విశీర్ణంబు లగుఁగాక!" అని వైవస్వతుండైన యముని శపియించెను. యముండును విశీర్ణచరణుండై దుఃఖించుచుఁ దనతండ్రియైన సూర్యదేవునిసన్నిధి కేఁగి యావద్వృత్తాంతము నాతనికి విన్నవించెను. మఱియు నిట్లనియెను. "తండ్రీ! సురశ్రేష్ఠా! ఈమె నాతల్లి గాదు. ఏమన, చిన్నతనపు చేష్టలచే సంతాన మేదైనఁ దప్పు చేసినను తల్లి యించుక మందలించును

గాని యిట్టి తీవ్రశాపము నెన్నఁడు నీఁజాలరు. ఏమూఁడుది యైనను కడుపారఁ గన్నబిడ్డల నీరీతి దుర్భరమైన యంగవైకల్యమునకుఁ బాల్పఱచునా? ఇంత బాల్యవయస్సుననే నీకష్టాంగంబుల నెట్లు ధరించి యుండఁగలను? బిడ్డలు మంచివారైనను, చెడ్డవారైనను, వారేనేరమి చేసినను తల్లియైనది సహించుకొనును గాని యిట్టి కష్టకోపమును వహియింపదు. కావున, తండ్రీ! ఈమె నిశ్చయముగా నాజనని గాదు."

తనయుని యీ వాక్యములను భానుదేవుం డాకర్ణించి మిక్కిలి విచారము నొంది యిట్లనుకొనియెను. "వాస్తవముగ నీమె యుషాదేవిచాయ గాని యమునాదుల జనని యైన త్వాష్ట్రి గాదు. తల్లి బిడ్డల యెడ నిట్టి దుష్కార్యమును గావించియుండదు. దానిస్వభావము వేఱుగను దీనిస్వభావము వేఱుగను గానంబడుచున్నది." ఇట్లనుకొని పిమ్మటఁ దనదివ్యజ్ఞానముచే సర్వము నెఱింగి యిట్లు తలపోసెను. "విశ్వకర్మనందన యగు నుష నాప్రచండతరతాపమును శమింపఁ జేయఁగోరి యుత్తరకురుభూములయందు బడబారూపమునఁ దపంబు సేయుచుఁ గాలము గడపుచున్నది." ఆదిత్యుం డీవిధముగాఁ దలంచి తన ప్రాణప్రియను జూచు సభిలాషముతోఁ దానును నయిత మశ్వరూపమును ధరించి యామె యున్నస్థలంబునకుఁ బోయి, యచ్చట నున్న ఘూలయాఁడుగుఱ్ఱమును గాంచి కామభావంబు విశదమగునట్లు గట్టిగా సకిలించుచు దానిని సమీపించెను. మోహాతుర మగు నయ్యశ్వమును గనియు, అట్టిదే యైనదాని హేషారవమును వినియు పతివ్రతపరాయణయు, పతిధ్యాననిష్ఠితయు నశ్వరూపధారిణియు నగు నయ్యుష మిక్కిలి భీతిల్లినదై 'ఈయశ్వ మెక్కడిది?' అని యనుకొనుచు నయ్యశ్వమును ధర్షించునుఁ దన ప్రాణేశ్వరునికడకుఁ బోవుతలంపుతో దక్షి

శాభిముఖ మై పరుగువాఱందొడంగెను. పరువెత్తునప్పు డామె "యీ యాపదనుండి నన్ను రక్షించువా రెవ్వరు? దేవతలా? ఋషులారా !" అని భావించుకొనెను. అశ్వరూపధరుం డైన సూర్యదేవుండును, అయ్యాడుగుఱ్ఱము వెంట నంటి పరువెత్తం దొడంగెను. కామగ్రహావేశపరవశు లగువా రెవ్వరు దుశ్చేష్టలను గావింపరు? ఈవిధముగా నా రెండుగుఱ్ఱములును గంగానర్మదాదినదులును, వింధ్యాచలాదిపర్వతములును, వనములు, నుపవనములును దాటికొనుచు దక్షిణాభిముఖముగా ధావనము సేయసాగెను.

అట్లుపరుగువాఱుచుం దుదకుం ద్వష్టపుత్రి యగు నాయాడుగుఱ్ఱము భయోద్విగ్నయై గౌతమీనదీజలంబులయం దుఱికెను. గౌతమీనదీతీరంబునందలి జనస్థానాశ్రమమున నుండు ఋషు లార్తత్రాణపరాయణు లను ప్రతీతి నామె యింతకుమున్ను వినియుండెను. దానం జేసి యిప్పు డామునీంద్రు లెవ్వరైన వచ్చి తన్ను రక్షింతు రను భావముతో నామె యానదియందు పడెను. అశ్వరూపధారి యగు భానుదేవుండును ఆనదియం దుఱుకుటకై పరువెత్తుచుండెను. అప్పు డాజనస్థాననివాసులగు మునిబాలకు లాయాడుగుఱ్ఱమును గట్టిగాం బట్టుకొని దానిపరువు నాపివైచిరి. మోహావేశముతో నున్న యాభాస్కరదేవుండు ఋషికుమారులను తీవ్రక్రోధముతోం జూచుచు "మీ రేకారణమున న న్నిట్లు నిరోధించినారు? ఈయపచారమునకు మీరు వటవృక్షమై పుట్టుదురుగాక!" అని శపియించెను.

అంతట నాజనస్థానమునీంద్రులు తమదివ్యదృష్టిచే నాయశ్వమును దేవముఖ్యుం డైనభానుదేవునిగా నెఱింగి యత్యంతభయభక్తిసంభ్రమాశ్చర్యమనస్కులై యాతని నెంతయు స్తుతించిరి. మునిగణస్తుతుం డైన యాసూర్యదేవుండు పిమ్మటం దనప్రియురాలైన యయ్యాం

డుగుల్లమును జేరి దాని మోమునఁ దన మోమును గదియించెను. బడబారూపిణియైన యుషాదేవియు నయ్యశ్వరూపునిఁ దన ప్రాణేశ్వరునిఁగా నెఱింగి యానందములోఁ దనయునయమును జూపెను. వారియప్పటిసంయోగము చేతనే యాతీరమున నశ్వనీకుమారు లుదయించిరి. అప్పు డచ్చటికి సుర, సిద్ధ, సాధ్యగణంబులును, సదీగోగణంబులును, ఓషధీజ్యోతిర్గణంబులును వచ్చెను. అనంతరము సప్తాశ్వనామకంబగు సూర్యదేవుని పుణ్యరథంబును సారథియగు ననూరుఁడును, యమ, వరుణ, శని, వైవస్వతులును, నిజరూపములతో పుణ్యనదులగుయమునా తపతీమహానదీప్రభృతులును ఈవిచిత్రసంఘటనమును జూచుటకు వచ్చిరి. సూర్యునిమామ యగువిశ్వకర్మయు నచ్చటికి విచ్చేసెను. అప్పుడు భానుదేవుండు తన మామ రాకను, అతనియభిప్రాయంబును గ్రహించి "ఆర్యా! మీపుత్రిక యానందించునట్లు ప్రచండమైన నా తేజంబును గొంతవఱకు సానపట్టి యుపశమింపఁజేయ వేఁడెదను. కావున నట్లు చేయుఁడు. నాప్రియురాలింతటినుండి సుఖపడునుగాక!" అని విశ్వకర్మతోఁ బల్కెను.

బ్రహ్మదేవుం డీప్రకారము చెప్పి మరల నారదునితో నిట్లనియెను. సూర్యుఁ డట్లు పల్కఁగానే త్వష్టృప్రజాపతియు భానుదేవుని తేజోరాశిని సముచితరీతిని సానపట్టి తగ్గునట్లొనరించెను. నారదా! నాఁటినుండియు నాస్థానము ప్రభాసతీర్థ మనునామముతోఁ బ్రఖ్యాతిం జెందెను. మఱియు [illegible] నచ్చట నశ్వినీరూపధారిణియగు నుషాదేవి భర్తృసమాగమమునుఁ గాంచెనో, [illegible] నచ్చట నశ్విని దేవత లావిర్భావముం గాంచిరో యాస్థానంబునకు నశ్వతీర్థం బనునభిధానము గల్గెను. పై రెండుతీర్థములే భానుతీర్థ మనియుఁ బంచవటాశ్రమ మనియు వరుసగాఁ బ్రఖ్యాతంబు లయ్యెను. పితృదర్శనార్థమై

వచ్చిన యమునా తపతీ నదులు రెండును గంగాసంగమప్రభావము గలిగి అగుటా, ఎదుటానామంబులతోc బుణ్యతీర్థములుగా విఖ్యాతంబు లయ్యెను.

నారదా! ఈతీర్థం[illegible]లు [illegible] [illegible]సకల[illegible]బులును బహుపుణ్యప్రదంబులు. భారతవర్ష మున [illegible] గల[illegible]లతీర్థంబులును సర్వదేవ[illegible] [illegible] [illegible] సమాగతంబులై యుండును గావున [illegible] సక్షయంబులగును. ఈతీర్థంబులకథను స్మరించినను, పఠించినను, ఆకర్ణించినను సమస్తపాపక్షయ మగుటయే కాక మానవులు ధార్మికులును, సుఖసంపన్నులును నగుదురు.

## ——• గరుడతీర్థాభివర్ణనము •——

అనంతరము బ్రహ్మదేవుం డిట్లని చెప్పందొడంగెను. నారదా! సర్వవిఘ్నోపశాంతికరమైన గారుడం బనుతీర్థరాజం బొండు గలదు. దానిప్రభావంబు నుడివెదను. సావధానమనస్కుండవై యాకర్ణింపుము. ఆదిశేషుని పుత్త్రుండును, మహాబలుండును నగు మణినాగుc డను సర్పశ్రేష్ఠుc డొకండు గలcడు. ఆతండు నాగులకు వైరి యగు గరుత్మంతునివలని భయముచే భక్తిపూర్వకముగ శంకరు నారాధించుచుండెను. కొంతకాలమునకు మహాదేవుండు ప్రసన్నుండై "పన్నగేంద్రా! నీభక్తికి మెచ్చితిని. వలయువరంబు వేఁడుము." అని పలికెను. అప్పు డానాగేంద్రుండు 'ప్రభో! మత్కులశత్రు వగుగరుడునివలని భయంబు నాకుc గలుగకుండునట్లు వరంబుం బ్రసాదింపుము.' అని యాశంభుదేవుని వేఁడుకొనియెను. పరమేశ్వరుడు నాతని కవ్వరంబుం బ్రసాదించి పిమ్మట నంతర్హితుం డయ్యెను. నాగాంతకుండైన

గరుత్మంతుని వెంట నిర్భయుండై మణినాగుండును స్వస్థానంబున కరిగెను. పిమ్మట నానాగరాజపుత్త్రుండు విష్ణుదేవుని శయనస్థానం బగు క్షీరసముద్రతీరంబున నిర్భయముగాఁ జల్లగాలికి నిటునటు సంచారము చేయఁదొడంగెను. మఱియు గరుత్మంతుం డెక్కడ నివసించునో యా స్థానంబునకును బోయి సవిలాసంబుగఁ దిరుగాడఁజొచ్చెను. కొంతసేపటికి నాగాంతకుండు వినిర్భయుఁడై చెఱలాడుచున్న యాభుజంగకుమారునిం జూచి యాతనిం గాళ్లతోఁ దన్నికొని తననివాసంబునకుఁ గొనిపోయెను.

ఈసమయంబున మహానుభావుండైన నందికేశ్వరుండు జగత్ప్రభుండైన మహేశ్వరునితో "దేవా! మనమణినాగుఁడు ప్రతిదినమును వచ్చుచున్నట్లు నేఁ డేకారణముననో రాలేదు. బహుశః వానిని వైనతేయుండు భక్షించెనో, లేక బంధించెనో యుండును!" అని విన్నవించెను. నందికేశ్వరునియీవాక్యములను విని శివుండు తాను నాగున కిచ్చినవరముసంగతి జ్ఞప్తికి రాఁగా, నందిం జూచి యిట్లని యెను. "ఓయీ! నందికేశా! మణినాగుఁడు సుపర్ణునిచే బంధితుఁడై యున్నాఁడు. తత్క్షణమే క్షీరసముద్రమునకు నీవు పోయి శ్రీమహావిష్ణువును స్తుతించి యానాగుని విడిపించికొని శీఘ్రముగ నాకడకుం గొనితెమ్ము" అని యానతిచ్చెను. నందియు నక్షణంబ విష్ణుసన్నిధికి నేఁగి యాదేవుని స్తుతియించి మహానాగునకు మహేశ్వరుండు వరం బిచ్చుటయు, నాతఁ డిప్పుడు గరుడనిచే బంధింపఁబడుటయు, శివునిసందేశమును సమగ్రముగ విన్నవించెను. నారాయణుండును నందివచనంబులకు సంప్రీతచిత్తుండై పన్నగాశనునిఁ బిలిపించి యాతని కిట్లనియెను. 'వినతానందన! మణినాగుని విడిచిపుచ్చి నందికేశున కొప్పింపుము. లోకశంకరుం డగుశంకరుం డాతనిని గాంచి

యానందింపఁగలఁడు. నామాట వినుము.' అని యానతిచ్చెను. నారాయణునివచనములను విని నందియు నానందించెను. కాని గరుత్మంతుఁడు మిక్కిలికోపముతో "స్వామీ! వలదు. వలదు. నేనొప్పుకొనను. నీయాజ్ఞను సహింపఁజాలను. దేవా! ప్రభుభృత్యులకుఁ గలయన్యోన్యతచే భృత్యునకుఁ బ్రియతమమైన పదార్థమును ప్రభు వొసగుచుండుటయు, భృత్యుఁ డానందించుటయు లోకమునఁ గలదు. ఇట్టిచో నాకెన్నఁడును నీ వేవస్తువును నిచ్చియుండలేదు సరిగదా, నేను సంపాదించుకొన్నవస్తువునయిన మిప్పు డిచ్చివేయుమనుచున్నావు! చిత్తగింపుము! త్రిలోచనుండగు శంకరుండు భక్తప్రియుండగుటచేతనే కాదా, యీనాగుని రక్షించుటకై యీనందీశ్వరుని నీసన్నిధానమునకనిచియున్నాఁడు? ఇట్టిదయ నాపైని నీ కేమైన నున్నదా? ప్రభూ! నీభృత్యుఁడనైన నే నెంతో ప్రయాసతో నీపామును దెచ్చుకొనియున్నాను. దీనిని నందిపరముగా నిచ్చివేయుమనుచున్నావు! ఇదేఁటి న్యాయము! నేను నిత్యమును నీకు వాహనమనై నిన్ను వహించుచున్నాను. ఇట్టినాకు నీ వేమైన నిచ్చుచుండుట యుక్తము. అట్లీయకుండుటయే కాక నేను సంపాదించుకొన్నదానినిఁగూడ నితరుల కిమ్మని యాజ్ఞాపించుచున్నావు. ఇట్టియాజ్ఞ మిక్కిలి యధర్మయుక్తము. సచ్చారిత్రముగల నీయట్టిప్రభువు లిట్టివ్యవహారముల నెన్నఁడును గలుగఁజేసికొనరు. భృత్యులకు దయతో నిత్తురుగాని వారియొద్దనుండి సత్ప్రభువులు లాగికొనరు. కేశవస్వామి! నావిన్నపము నాలింపుము! రాక్షసులయుద్ధములందు జయమునుగాంచి నాయాహారమును నేనే సంపాదించుకొనుచున్నాను గాని యొక్కనాఁడును నిన్నడుగలేదు. నీవీయనులేదు. స్వతస్సిద్ధముగా నేను బలవంతుఁడను. కావున నాగకుమారుని నే నీయఁజాలను."

ఇట్లు చెప్పి బ్రహ్మదేవుండు మరల వచియింపం గడంగెను. నారదా! చక్రియు, గదాధరుండును నగు విష్ణుదేవుండు గరుడునియ వాక్యంబుల నాకర్ణించి, లోకపాలకనందికేశ్వరులయెదుట నింతుక నవ్వి "ఖగోత్తమా! నిరంతరము నన్ను మోయుటచేత నేసుమా నీవీరీతిని గృశించిపోవుట! రాక్షసయుద్ధంబులయందు నాకుఁ గలుగుచున్నజయములు సయితము బలవంతుఁడ వగు నీసాయముచేతనే!" అని జితక్రోధుం డైన యాశ్రీపతి పలికి మరల నిట్లనియెను. "ఓమహాబలశాలీ! నీశక్తి నుపయోగించి నాచేతిచిటికెనవ్రేలిని మోయుము." అని తనకనిష్ఠాంగుళి నానందికేశ్వరుని మ్రోల గరుడనిశిరముపై నునిచి మఱియు నిట్లనియెను:—"విహంగమపుంగవ! నిజముగా నీవు నన్ను నిత్యమును మోయుచున్నావు. ఇప్పుడు ధర్మబలమును బరీక్షింపుము!"

నారాయణుం డీరీతిని బల్కుచుండఁగానే యాతనిచిటికెనవ్రేలిని ధరించియున్నగరుత్మంతునిశిరం బాతనికుక్షిలోనికిఁ గూరుకొనిపోవుచుండెను. మఱియుఁ దత్క్షణమే యాతనికుక్షియు నాతనిపాదము గుల్ఁగి చూర్ణమైపోయెను. అంతట వైనతేయుఁడు కృతాంజలియై లజ్జాభయంబులు మనంబునం బెనఁగొన దీనత్వముతో "దేవా! జగన్నాథ! నాయీయపరాధమును క్షమించి నీభృత్యుండ నైననన్ను రక్షింపుము! రక్షింపుము! నీమహామహిమఁ దెలిసికొన నేనెంతవాఁడను? నీవు సర్వలోకంబులకును బ్రభుండవు. సర్వలోకంబులను నీకుక్షిని ధరించియున్నవాఁడవు. ప్రభువులు భృత్యవర్గము చేయు నపరాధసహస్రంబుల మన్నింతురు. లోకంబున నెవ్వరేయపరాధంబుల నొనర్చినను నీవు వారిని రక్షించుకరుణాస్వభావుండ వని మునీంద్రులు వచియింతురు. కావున దేవా! రక్షింపుము! రక్షింపుము!" అనియిట్లు గరుడుండు వైకుంఠదేవునిం బ్రార్థించి, మఱియు జగదంబిక యగు రమా

దేవి నిట్లు స్తుతియించెను. “జననీ! పుత్త్రివత్సలా! పద్మాలయా! దీనుండైన నీబిడ్డని నార్తుని నన్ను రక్షింపుము తల్లీ!”

అంత శ్రీదేవి కరుణాకులచిత్తయై తనభర్తయైన జనార్దనునిం గాంచి “నాథా! విపన్నుండైనయీభృత్యుని రక్షింపుము!” అని పలికెను. అప్పుడు జనార్దనదేవుఁడు శివానుచరుండైన నందికేశ్వరునిం గాంచి యిట్లనియెను. “ఓయీ! నందీ! ఈనాగకుమారునితో గరుడ నిం దీసికొని మహేశ్వరసన్నిధానమునకుం బొమ్ము. ప్రసన్నచిత్తుఁ డైనయాదేవునికటాక్షదృష్టిచే నీతనిదేహము యథారూపమును బడ యును.” విష్ణుదేవునియీవాక్యములను విని నందికేశ్వరుండు వల్లెయని పలికి పన్నగపన్నగాశనులం దోడ్కొని శంభుసమ్ముఖమ్మునకుఁ బోయి సమస్తవృత్తాంతము నాదేవదేవునకు విన్నవించెను. చంద్రశేఖరుండు ను గరుత్మంతునిపైఁ గాఁగ్యావీక్షణముం బఱపి యాతని కిట్లనియెను. “ఓమహాబాహుఁడా! లోకపావనియు, సర్వకామప్రదాయినియు, శాంతిస్వరూపిణియు, గంగయు నగు గౌతమీమహానదియందు స్నాన మొనరింతువేని నీపూర్వశరీరమును నీవు పొందఁగలవు. మఱియు నా స్నానమహిమవలన ప్రాణికోటుల సమస్తపాపములును పరితప్తము లగుటయేకాక దైవదుర్విపాకమువలన వినష్టములైన సమస్తకార్యము లును జక్కఁబడి యెల్లకోర్కెలును సఫలంబులు గాఁగలవు. భూత సముదాయంబునకు గౌతమియే యుత్తమశరణము.”

శంకరునియీవాక్యములను విని ఖగేశ్వరుండైన గరుడుఁడు ప్రణతుఁడై తత్క్షణమే మహాగంగ యగు గోదావరీనదియందు స్నానం బొనర్చి శివకేశవులను నమస్కారపూర్వకముగా మనసార స్మరియించె ను. నారదా! అప్పు డావినతానందనుండు స్వర్ణచ్ఛాయమును, మహా బలసంయుతంబును, వజ్రసంకాశంబును, వేగవంతంబును నగుశరీరము

గలవాఁడయ్యెను. అనంతర మాతఁడు విష్ణుసన్నిధి కేఁగి యాతనికి సాష్టాంగనమస్కారం బొనర్చి యావద్వృత్తాంతమును విన్నవించి సుఖంబుండెను.

వత్సా! నారదా! గరుత్మంతుండు స్నానం బొనర్చిన యానాఁటినుండియు నాతీర్థంబు గరుడతీర్థం బనునామంబునఁ బ్రసిద్ధికెక్కెను. ఆతీర్థంబు సర్వకామప్రదంబు. మానవుండు పరిశుద్ధచిత్తముతో నాతీర్థంబున నొకమాఱు స్నానం బొనర్చినను సకలాభీష్టంబులను బొందఁగలఁడు. అచ్చటఁగావించు నల్పమాత్రదానాదికర్మంబు లైనను నక్షయంబులై హరిహరప్రీతిపాత్రంబులై మానవునకు సకలపుణ్యప్రదంబులు గాఁగలవు.

## గోవర్ధనతీర్థాభివర్ణనము

అనంతరము పరమేష్ఠి నారదున కిట్లనియెను. వత్సా! స్మరణమాత్రసర్వపాపహారంబును, పితృపుణ్యజనకంబును నగుగోవర్ధనతీర్థం బొండు గలదు. దానిప్రభావమును నేను స్పష్టముగాఁ జూచియుంటిని. చెప్పెదను వినుము. జాబాలియను బ్రాహ్మణకర్షకుం డొకానొకండు సుప్రసిద్ధుండు గలఁడు. ఆతండు తనవ్యవసాయము నందు దనయెద్దును నానిపాటునుండి విడువఁడు సరికదా, మాటిమాటికి మునికోలతో వానిపృష్ఠభాగంబులను, పార్శ్వభాగంబులను బొడుచుచుఁ గొట్టుచు బాధించుచుండెను. పాపము! నోరులేనియాజంతువు లోలోన దుఃఖించుచు కన్నులనిండ నీరుగ్రుక్కుకొనుచు చేయునది లేక యట్లే యాకర్షకుఁడు పెట్టుబాధల ననుభవించుచు నుండెను. ఇట్టిదానిదుర్వ్యథలఁ గాంచి గోమాత యగుకామధేనువు, నందికేశ్వరునితో నాయెద్దు పడెడుపాట్లను జెప్పి దుఃఖించెను. నందీశ్వరుఁడును

మిక్కిలి బాలింబడి తనయధిపతియగు శంకరునితో నీవృత్తాంతమును విన్నవించెను. ఈశ్వరుండును నందిచెప్పిన యక్కథను విని "నందీ! చింతింపకుము. ఈవిషయమున నీ వేమితలంచిన నది యగునట్లు వరంబిచ్చితి. నీకోరిక సిద్ధించుఁబోమ్ము.' అని పలికెను.

నందియు, స్వర్గ, మర్త్య, పాతాళలోకంబులయందున్న గోజాతి నెల్ల శంభుదేవుని వరప్రసాదబలంబునఁ దక్షణమే యొకచోట సమావేశపఱిచి "మీరెవ్వరును నెచ్చటికిని బోవలదు. ఎవ్వరికిని గానుపింపవలదు." అని యాజ్ఞాపించెను. అంతట దేవతలందఱును, నారదా! నాసన్నిధికివచ్చి యిట్లు మొఱపెట్టుకొనిరి. "దేవా! ఏకారణముననో గోజాతి యంతయు నొక్కుమారుగ మాయమయ్యెను. గోవులు లేకుండ ముల్లోకములవారును జీవించుటయెట్లు?" అమరులిట్లు ప్రార్థింపఁగా నేను వారితో 'సురలారా! పశుపతియైన మహాదేవుని సన్నిధానమునకుఁ బోయి యాతనిం బ్రార్థింపుఁడు.' అని చెప్పితిని. అప్పుడు నిర్జరసమూహం బెల్ల కైలాసగిరి కేఁగి శంకరునితో గోగణాభావంబుం గూర్చి విజ్ఞాపించిరి. ఈశానుం డిట్లనియెను. 'ఈవిషయము నావాహనం బగునందీశ్వరుఁడే కాని నే నిసుమంతయు నెఱుఁగను. ఆతనికడకుఁబొండు."

అప్పుడు దేవతావర్గం బంతయు నందిచెంతకుఁ బోయి, 'ఓపరోపకారీ! మాకెల్లరకు గోప్రదానం బొనరింపుము.' నందికేశుండును వారిపలుకులను విని 'ఓవిబుధులారా! మీరందఱును గౌతమీపుణ్యతీరంబున గోసవననామకంబగు యాగంబు నొనర్పుఁడు. అక్కడకు స్వర్గమర్త్యాదిలోకంబులం గల సమస్తగోజాతియు వచ్చి మిమ్మానందపఱుచును.' అని పలికెను. అంతట గోసవననామకం బగు యజ్ఞం బాగోదావరీమహానదీతటంబున దేవతలచే నారంభింపఁబడెను.

ఆపుణ్యస్థలంబునకు సకలగోసమూహంబులును నేలయీనినట్లు వచ్చి యాపుణ్యతీరం బంతయు నిండించెను. దేవతలును, మనుష్యులును మిక్కిలి యానందముం బొందిరి. నాఁటంగోలె గోవులకుఁ బూజ్యత హెచ్చెను.

నారదా! నాఁటినుండియు నాపుణ్యస్థానంబునకు గోవర్ధనతీర్థం బను నామంబు విఖ్యాతం బయ్యెను. ఆతీర్థంబున స్నాన మాచరించినంతమాత్రంబుననే సహస్రగోవులకు దానం బొనర్చినఫలంబు గలుగును. అచ్చట నించుకంత దానకర్మం బాచరించునో నెట్టియపూర్వఫలంబు గలుగునో వర్ణింపఁజాలను.

## ధౌతపాపతీర్థమాహాత్మ్యము.

పుత్త్రా! నారదా! సమస్తపాపభయాపహమును, పాపప్రణాశననామకంబును నగు తీర్థరాజం బొండు గలదు. దానినామనిరూపణమును, తన్మాహాత్మ్యంబును జెప్పెదను. అనన్యచిత్తుండవై యాకర్ణింపుము. తొల్లి ధృతవ్రతుం డను లోకవిశ్రుతుండైన బ్రాహ్మణుం డొకం డుండెడివాఁడు. ఆతని భార్య మహి. ఆమె తరుణియు, జగదేకసుందరియు నై యుండెను. ఆదంపతులకు సనాజ్జాతుఁ డను సూర్యసన్నిభుం డగు నొకపుత్త్రుఁ డుదయించెను. ఆపుత్త్రుఁడు జనియించినతరువాత, పాపము! ధృతవ్రతుండు పరలోకగామి యయ్యెను. అనంతరము బాలవిధవ యగు నాయువతి దనకును దనపుత్త్రునకును దగినపోషణము గలయాశ్రయ మేదియు లేకపోవుటచే తననందనుని వెంటఁగొని గాలవమహామునియాశ్రమమునకుఁ బోయెను. కొలఁది దినము లయినపిమ్మట నామె పురుషకాంక్షిణియు, స్వేచ్ఛాచారాభిరతియు నై తనపుత్త్రు నయ్యాశ్రమమునులకడ విడిచిపెట్టి పాపమోహవృత్తితో బహుదేశంబులఁ బరిభ్రమింపఁజాఁగెను. ఇచ్చట నామెపు

త్రుఁడును గాలవాశ్రమమున వేదవేదాంగపారగుఁ డయ్యె, మాతృదోషంబునం జేసి దేశాభిరతుండై నానాదేశపరిభ్రమణవశంబున మహాజనసంకులం బగు జనస్థానం బనునొక పత్తనంబుం జేరెను. అంతకు మున్న యాతనితల్లి మహియు బహువిషయపర్యటనంబొనర్చి క్రమముగా నాపురమునకే వచ్చి స్వైరిణీవృత్తితో నివసించియుండెను. బ్రాహ్మణకుమారుఁడును నానగరంబునం గలవేశ్యాంగనలతోడ పొత్తునకు మరఁగి తిరుగుచుండెను. ఇట్టిసమయంబున నాతనితల్లియు సుందరీమణియు నగు మహి, వేశ్యావృత్తితో ధనికులును, రూపవంతులును నగు పురుషుల నాకర్షించుచుండెను. ఆద్విజబాలకుండు మహిని దనతల్లి యనియు, నామె యీతనిఁ దనకుమారుఁడనియు నెఱుఁగకయే దైవయోగంబునఁ బరస్పరవిమోహితులై సంగమక్రీడకు లోనైరి. ఈరీతి మోహపారవశ్యంబున నొకరివృత్తాంత మొకరు తెలిసికొనకయే యాతల్లీకొడుకులు చాలదినములు కామవ్యాపారంబునఁ గడపివైచిరి. ఆవిప్రకుమారుం డట్లు నిరంతరవిమోహవ్యాపారనిమగ్నుఁడై యుండియుఁ బితృతపోబలంబునం జేసి ధర్మకర్మములయందు మాత్ర మప్రమత్తుఁడై యుండెను. అనుదినము ప్రాతఃకాలంబున మేల్కాంచి గౌతమీనదీతీరంబున కేఁగి తద్గంగయందు స్నానం బొనర్చి సంధ్యాద్యనుష్ఠానంబులను, బ్రహ్మయజ్ఞపితృతర్పణంబులను నెఱవేర్చుకొని, యచ్చటిపెద్దలకు నమస్కరించి, మరల నింటికి వచ్చుచు నుండెను.

వింటివా, నారదా! అత్యాశ్చర్యకరమైన యీవిషయమును? మాతృగమనంబున నాబ్రాహ్మణపుత్త్రుని శరీరాంగకము లెల్ల వేకువజాము వేళకు కుష్ఠవ్యాధినిపీడితములై శిథిలములై చీము, రక్తములను స్రవించుచున్న వయ్యును పవిత్రములైన గోదావరీజలంబులందు స్నాన

ము చేసిన వెంటనే పరిశుద్ధములై పుటము వెట్టిన బంగారువలె నత్యంత శోభాయితములై ప్రకాశించుచు వచ్చుచుండెను. నిత్యమును దానిట్లు విరూపియు, సురూపియు నగుచుండుట యాద్విజనందనుం డెఱుంగనే యెఱుంగఁడు. ఏమన, గాత్రములయందు గలిగిన యాదోషంబుచే నైన యంగవైరూప్యము గోదావరీపవిత్రగంగాసంస్పర్శంబున నపగతమగు చుండఁగా నాబ్రాహ్మణపుత్రుఁడు, పుడమికి నవతెంచిన భాస్కరదేవుని మూర్తివలెఁ బ్రత్యహమును వెలుంగుచుండెను. దానంజేసి యా వికృతాకార మాతని కెఱుంగరాకయే యుండెను.

ఇక్కథ యిట్లుండఁగా, పూర్వ మీబ్రాహ్మణకుమారునిఁ బెంచి పెద్దవానిఁ జేసిన తపోధ్యానపరాయణుండును మహాత్ముండు నగు గాలవమహాముని మునుపు దానున్న యాశ్రమమును వదలి పవిత్రమైన యాగౌతమీగంగాతీరంబునకు మునిశిష్యసంఘంబులతోఁ గదలివచ్చి యచ్చట నాశ్రమమును నిర్మించుకొని యచ్చటనే నివసించుచుండెను.

ఆవిప్రకుమారుండు గోదావరీగంగాస్నానానంతరంబున నిత్యమును తత్తీరంబునం గలవయోజ్యేష్ఠులగు బ్రాహ్మణవరులతోపాటు గాలవమహామునీంద్రునకును నమస్కరించి, యింటికిఁ బోవుచువచ్చెను. గంగాస్నానంబునకుఁ బూర్వమును, స్నానమునకుఁ దరువాతను ఆతండు పొందుచువచ్చిన రూపపరివర్తనమును గాంచి యాగాలవమహాముని యత్యాశ్చర్యనిమగ్నుఁడై "ఏమి! ఈయువకుఁడు ప్రతిదినమును రెండురూపములను దాల్చుచున్నాఁడు! దీని కేదో గూఢమైనకారణ ముండవలయును." అని తలపోయుచువచ్చెను. ఒకనాఁ డావిప్రకుమారుఁడు యథాప్రకారము తనకుఁ బ్రణామ మొనర్ప వచ్చినప్పుడు విస్మయకారుణ్యచిత్తుఁడై యాతనిఁ జేరరాఁ బిలిచి యాగాలవమహా

మును, "వత్సా! నీ వెవ్వరు? ఎచ్చటికిఁ బోయెదవు? ఏమి చేయు చుందువు? నీభోజన మెక్కడ? నీపేరేమి? నీ వెచ్చట శయనింతువు? నీభార్య యెవ్వరు? ఈవిషయము లెల్ల నాకుఁ దెలుపుము!" అని యడిగెను. ఆయన ప్రశ్నములను విని యాస్వజనందనుండు, 'స్వామీ! మీరాయడిగినప్రశ్నంబులకుఁ దగునుత్తరంబులం దెలిసికొని రేపటియుదయంబున మనవిచేసెదను' అని చెప్పి యాయనకు నమస్కరించి యింటికిం బోయెను.

అట్లు బ్రాహ్మణకుమారుం డింటికివచ్చి రాత్రి భోజనానంతరము నిజశయ్యం జేరి యంతలో గాలవుని సంప్రశ్నంబు లెల్ల జ్ఞప్తికి రాఁగా, త్రుళ్లిపడి తన్ను డాసి యున్నస్వైరిణిం గాంచి యిట్లు వలికెను. "నీవు వేశ్య వయ్యును సర్వసద్గుణసంపన్నురాలవును విశేషించి పవిత్రవును నై యున్నావు. మనయిరువురిప్రేమంబు నఖండంబై మనప్రాణమ్ము లున్నంతకాలము నిల్చి యుండునుగాక! నిన్ను నేను గొన్నిసంగతుల నడుగుచున్నాను. వానికిఁ దగుప్రత్యుత్తరముల నిమ్ము—నీపే రెవ్వరు? నీకుల మెయ్యది? నీపూర్వనివాస మెక్కడ? నీబంధువు లెచ్చట నున్నారు? ఈవిషయంబు లెల్ల నాకు సవిస్తరముగాఁ జెప్పుము." అని యక్కుమారుం డడుగఁగా, నాబంధకి యిట్లనియెను.

"ఆర్యా! ధృతవ్రతుం డను విఖ్యాతబ్రాహ్మణుం డొకం డుండెడివాఁడు. నేనాతని భార్యను. నన్ను మహి యని యందురు. మా కిరువురకు నొకపుత్త్రుఁడు గలిగినతరువాత నాభర్త మరణించెను. దిక్కు గానక యక్కుమారుని గాలవాశ్రమంబున విడిచి పురాకృతదోషవశంబునఁ గులక్రమాగతంబైన ధర్మంబును విడనాడి స్వైరిణినై యిప్పు డిచ్చట నిల్చియుంటిని. ఓవిప్రవర్య! నన్ను బ్రాహ్మణ

స్త్రీగా నెఱుంగుము. నాపుత్త్రుఁడు గాలవాశ్రమమున రక్షింపఁబడు చున్నాఁడు. అతఁ డీపాటికిఁ బెద్దవాఁడై సమస్తవిద్యాపారంగతుండై యుండియుండును.''

బ్రాహ్మణి చెప్పిన యీవృత్తాంతంబు విని యాద్విజకుమారుండు నిర్విణ్ణుండై, అవయవపటుత్వము సడలిపోవ, శయ్యనుండి తత్క్షణమే భూతలంబుపైఁ బడిపోయెను. ఆతనియాపాటుంగాంచి యక్కలట, ''ఓవిప్రశ్రేష్ఠా! ఏమి వచ్చినది నీ విట్లగుటకు? నీకు నాపైఁ గల ప్రేమ యెక్కడకుఁ బోయెను? నావృత్తాంతమున నీకు మనోవ్యథను గలిగించిన వాక్య మేది?'' అని ససంభ్రమయై పలికెను. అంతట విప్రసుతుండు తనకుఁ దానే యూఱడించుకొని వేశ్యారూపమున నున్న యాబ్రాహ్మణికి నిట్లనియెను.

''అక్కటా! మహానుభావుండును తపోనియమవంతుండును నగు ధృతవ్రతుండు నాతండ్రి! నే నాయనపుత్త్రుండను! ఈనీవు నాతల్లివైన మహీసతివి. దైవయోగంబున మన కిట్టిసంగమంబు ఘటిల్లినది.''

ఈవచనంబుల నాలకించి యావిప్రకాంత విధినియోగంబున నైన తనదురవస్థకు మిక్కిలి దుఃఖపిల్లెను. తల్లియుఁ, బుత్త్రుండును నిట్లు దుఃఖనిమగ్నులై యారాత్రి గడపిరి. అంతట లోకంబు నెల్ల వెలిఁగించుచు సూర్యోదయవేళ సంప్రాప్తం బయ్యెను. అప్పు డాబ్రాహ్మణతనయుఁడు తనగురువైన గాలవమహామునిసన్నిధికిం బోయి యాతనికిఁ దనవృత్తాంతము నిట్లు నివేదించెను.

ఓబ్రహ్మజ్ఞశ్రేష్ఠా! మహామునీంద్రా! నేను సుప్రసిద్ధుఁడైన ధృతవ్రతుని పుత్త్రుఁడను. ఇంతకుముందు మీచేఁ బోషింపఁబడినవాఁడను, ఉపనయనాదిసంస్కారంబులను గాంచినవాఁడను నేనే. ఓప్రభూ!

ఆనాఁడు మీయాశ్రమంబున నన్ను నర్పించి చనిన మహీ యనునది మాతల్లి. అనంతరవృత్తాంతము నేమని విన్నవింతును? ఇఁక నేమి చేయుదును. ఈనాపాపంబునకుఁ బ్రాయశ్చిత్త మేది?" అని శోకింపఁ బూఁనెను. గాలవుండును ద్విజసుతుని చెప్పినవృత్తాంతమువలన విష య మంతయును గ్రహించి యిట్లనియెను. ॥ వత్సా! శోకంబు మాను ము. నిత్యమును నపూర్వమైన నీరూపద్వయమును గాంచియే విష యవైశద్యముకొఱకు నిన్నిట్లు ప్రశ్నించితిని. ఇప్పుడు నీసంగతి యంతయును నాకు విశదమైనది. చింతిల్లకుము. నీపాపపుంజ మెల్ల నీగంగాస్నానంబువలన నిసుమంతయేని మిగులకుండ నేదినంబున కా దినంబే ప్రక్షాళితంబై క్షయంబుం గాంచియున్నది. దీనికి నీతీర్థమా హాత్మ్యంబును నీగౌతమీమహాగంగాప్రసాదంబును గారణంబులు. ఇదియునుంగాక నాయనా! నీవు పవిత్రుఁడవైతివి. దీనికి నెంతమా త్రంబును సందేహింప నక్కఱ లేదు. ఏమన, నేను నిత్యమును నీ వీ తీరంబున కరుగుదెంచునప్పుడు కలుషావృతంబైన విరూపంబును, స్నా నానంతరంబు సూర్యాగ్నిసన్నిభంబైన గుణోత్తరరూపంబును నీయెడఁ గాంచుచున్నవాఁడను. మఱియు స్నానమునకు నీవు వచ్చునప్పుడు సమస్తపాపంబులును నీమొగంబున వ్రేలుచున్నట్లును స్నానం బొనర్చి నీవు పోవునప్పు డాపాపంబు లన్నియు దుల్లిపోయి నీవు పరిశుద్ధస్వరూ పుఁడవై పావనుఁడ వగుచున్నట్లును నేను నిత్యమును గనుఁగొనుచునే యున్నాను. కావునఁ బాపభయముగాని నీవుచేసికొనవలసిన ప్రాయ శ్చిత్తముగాని యీగౌతమీగంగాదేవియనుగ్రహంబున నీకు లే దని దృఢముగా నమ్ముము. వేశ్యారూపిణి యైన యీకాంత నీతల్లి యని నే నెఱుఁగుదును. ఈమె యత్యంతపశ్చాత్తప్త యైనది గావున నీమె యుఁ బాపములనుండి నివృత్త యైనది. పశ్చాత్తాపమువంటి ప్రాయ

శ్చిత్తము లేదుగదా? వత్సా! ప్రాణికోటికి విషయలోలత్వము స్వాభావికమే. అయినను, పురాకృతపుణ్యవిశేషంబున సత్సాంగత్యము లభించి, యాయాజీవు లాయాపాపంబులనుండి నివృత్తంబు లగుచుందురు. నీజనని పూర్వపుణ్యబలంబున నిప్పుడు మిక్కిలి పశ్చాత్తప్తురాలైనది. ఈపవిత్రతీర్థంబున నవగాహనం బొనరించునేని పరమపవిత్రురా లగును జుమా!''

నారదా! గాలవమునీంద్రుని యీయుపదేశవాక్యంబులను విని యామాతాపుత్రు లిరువురును నితాంతభక్తిసంతోషం బొప్ప నాగౌతమీగంగయందు భక్తిపూర్వకంబుగ స్నానం బొనర్చి యిరువురు నొక్కమాటుగఁ బాపవిముక్తులైరి. అదినంబునుండియు నమ్మహాతీర్థంబునకు ధౌతపాపనామంబు సుప్రసిద్ధం బయ్యెను. మఱియు దానికి పాపప్రణాశనం బనియు, గాలవతీర్థం బనియు నితరనామంబులు గలవు. ఈ తీర్థరాజంబు సమస్తమహాపాతకంబులను, ఉపపాతకంబులను నశింపఁ జేయుటయే కాక యగ్నిష్టోమపుణ్యతీర్థంబై యొప్పుచున్నది.

## — విశ్వామిత్రతీర్థవర్ణనము —

అనంతరము బ్రహ్మదేవుఁ డిట్లనియెను. నారదా! దశరథనందనుం డగు శ్రీరామచంద్రుండు సీతాసహితుండై పితృదేవతలకుఁ దర్పణం బొనరించినతీర్థంబు పితృతీర్థం బని చెప్పంబడుచున్నది. అచ్చటఁ గావించు స్నానదానపితృతర్పణాదికకర్మంబు లెల్ల నక్షయంబు లగును. అచ్చోట రఘువంశతిలకుండును, రాజేంద్రుండును నగు శ్రీరాముఁడు తత్త్వవిదు లగుమహాత్ములతోఁ గూడియున్న విశ్వామిత్రసంయమీంద్రుని భక్తిమెయిఁ బూజించెను. పరమపవిత్రంబును, పుణ్యదాయకంబును నగు నాస్థలంబు విశ్వామిత్రతీర్థం బనం బరగుచున్నది. ఆతీ

స్థ రాజంబున కానామము వేదవాదులగు మునీంద్రులచే నిర్దిష్టంబు గాఁబడినది. ఆనామమెట్లు గలిగెనో వివరించెద నాకర్ణింపుము.

పూర్వకాలమున నొకప్పుడు లోకభయంకరం బగు ననావృష్టి దోషము సంభవించెను. ఆఘోరసమయంబున విశ్వామిత్రమహాముని భార్యను, శిష్యులను వెంటఁబెట్టుకొని సుక్షేత్రం బగు గౌతమీనదీతీరంబునకు వచ్చెను. ఆఁకటిచే మలమలమాడుచుఁ గృశాంగులై యున్న తనయాలుబిడ్డలను శిష్యులను గాంచి వ్యథాకులితచిత్తుండై పూజ్యుఁడైన యవ్విశ్వామిత్రమునిచంద్రుఁడు తనశిష్యులం జేరఁబిలిచి యిట్లనియెను. "వత్సలారా! ఎచ్చటకిఁ బోయి యైననుసరే, ఏవిధముగా నైననుసరే, ఏమాత్రమైననుసరే, ఎట్లున్ననుసరే భక్ష్యభోజ్యాన్నములైన యాహారపదార్థములను గొనిరండు! ఆలస్యము వలదు. ఇదిగో! ఈదారిని పొండు. క్షణకాలములోఁ దెండు." గురువర్యుఁ డిట్లాజ్ఞాపింపఁగానే క్షుధాతురులై యున్న యాశిష్యులు భోజనపదార్థసంగ్రహణార్థము బయలువెడలి పోయి, పలుచోట్లం దిరిగితిరిగి తుదకుఁ జచ్చిపడియున్న యొకశునకమును గాంచి దానిం గొని శీఘ్రముగ గురువుచెంతకు వచ్చి చచ్చినయాకుక్క నాయన కిచ్చిరి. విశ్వామిత్రుండును "భద్రము!" అనుచు సంప్రీతితో దానిం గ్రహించెను. పిమ్మట నమ్మునీంద్రుండు శిష్యులం గనుంగొని "దీనిమాంసమును ఖండించి, జలంబులం బ్రక్షాళనంబు చేసి పచనం బొనర్పుఁడు; యథావిధిగ దాని నగ్నియందు వేల్చి, దేవ, ఋషి, పితృ, గుర్వతిథులకు సంప్రీతిం గావించినపిమ్మట తచ్ఛేషమును మన మందఱమును భుజింతము." అని చెప్పెను. తదాజ్ఞానుసారముగ నాతనిఛాత్రు లాప్రకారము దానిని పచనము గావింపఁ గడఁగిరి.

కుక్కమాంసమును వండుచున్నప్పుడే దానినుడికించుచున్న

యగ్నిదేవుండు దేవమాతరూపమున నమర సభకుం బోయి దేవగణం బులతో "అయ్యో! దేవత లెల్లరును క్షుధాతురులైన కౌశిక ఋషీంద్రునిచేఁ గల్పితంబైన కుక్కుర మాంసమును భక్షింపనై యున్నారు." అని పలికెను. వీతిహోత్రుని యావచనంబుల నాలించి నిర్జరనాథుం డగునింద్రుండు డేగరూపము ధరించి యాకాశమార్గంబున వచ్చి విశ్వామిత్రశిష్యులు వండుచున్న యామాంసపూర్ణ పాత్రము నెత్తికొని గగనవీథి కెగసిపోయెను! అది గాంచి యాశిష్యులు గురుసన్నిధికిం బోయి శ్యేన మొనర్చిన యపకారమును గురువునకు విన్నవించిరి. ఆఁకటిచేఁ గడు పంటుకొనిపోవుచున్న యామునీంద్రుం డా మాటలు విని కుపితుండై, దేవేంద్రుని శపియించుటకు సంసిద్ధుం డయ్యెను. ఈసంగతిని సునాసీరుం డెఱింగి శరవేగమునఁ గ్రిందికి వచ్చి యామాంసస్థాలిని మధుపూర్ణపాత్రము (తేనెకుండ) గా మార్చి యాపంటపొయ్యిపై నునిచెను. దానిం జూచి యాఋషిసత్తముండు, క్రోధఘూర్ణితస్వరంబున 'ఇంద్రా! నీ వమృతమును దెచ్చి యున్నను మా కక్కఱ లేదు. దాని నీవే తీసికొనిపొమ్ము. మాకుక్కుర మాంసమునే మాకిమ్ము. అట్లియ్య వేని నిన్ను భస్మీభూతునిం గావించెదను' అని వక్కాణించెను. అప్పు డింద్రుండు కడుంగడు భీతుండై "మహా మునీంద్రా! అసహ్యకరమైన కుక్కుర మాంసముతో నేమిపని? జిహ్వాకింపయిన తేనెను పానము చేసి, యనంతరము సకుటుంబముగ నారగింపుము." అని పలికెను.

దేవనాయకుని యావాక్యమ్ముల నాకర్ణించి ఋషిప్రవరుండు "దివస్పతీ! వలదు! ఆమధువు వలదు! ఈమధుసేవనమువలన నయ్యెడిలాభ మేమి? జీవలోక మెల్ల క్షుధాతురమై కృశించి యుండఁగా, నేను మాత్రి మామధు వెట్లు భక్షింపఁగలను? ఊఁడఅకును

నమృతము లభించునేని నేనును నమృతమును భక్షించెదను. లేదేని దేవపితృదేవతల కీకుక్కురమాంసమును నివేదించి తచ్ఛేషమే నేనును భుజించెదను. దీనివలన నా కేవిధమైనపాపమును లేదు." అని పలికెను.

అప్పుడు భీతచేతస్కుండైయున్న సహస్రాక్షుండు చేయునది లేక తక్షణమే మేఘబృందమును రప్పించి యమృతవర్షముఁ గురియించెను. అయ్యమృతముచేఁ బ్రజలెల్ల సంతృప్తులైరి. ఈరీతిని విశ్వామిత్రుఁ డమృతవర్షమును దెప్పించి దానిచే దేవపిత్రాదిలోకత్రయమును సంతృప్తంబు గావించి మించి యనంతరము దానును దనకుటుంబమును, శిష్యగణంబులతోఁ గడుపార నారగించి ప్రహృష్టహృదయుం డయ్యెను.

నారదా! సురనాథుండు స్వయముగ వచ్చి యమృతవర్షమును గురియించి విశ్వామిత్రుండు మాంసవిసర్జనముఁ గావించిననాఁట నుండియు బహు పుణ్యప్రదం బైనయాతీర్థంబునకు విశ్వామిత్రతీర్థం బను నామం బాఖ్యాతం బయ్యెను. అచ్చటఁ గావించుస్నానదానాది కర్మంబు లెల్ల బహుక్రతుఫలంబుల నొసగును. అందును మానవలోకమున కీతీర్థంబు సమస్తపుణ్యప్రదంబు—మఱియు నీసుప్రసిద్ధతీర్థంబునకు విశ్వామిత్ర మనునామంబె కాక మధుతీర్థం బనియు, ఇంద్రతీర్థం బనియు, శ్యేనతీర్థం బనియుఁ బర్జన్యతీర్థం బనియు నితరనామంబులును గలవు.

## —♦ శ్వేతతీర్థవర్ణనము. ♦—

ఇట్లు చెప్పి బ్రహ్మదేవుండు మరల నారదమునితో నిట్లనియెను. కుమారా! త్రైలోక్యవిశ్రుతంబును, శుభప్రదంబును నగుశ్వేతతీర్థం బనుతీర్థరాజం బొకండు గలదు. ఈతీర్థనామంబు శ్రవణముల సోఁకి

యగ్ని దేవుఁడు దేవదూతరూపమున నమర సభకుం బోయి దేవగణం బులతో "అయ్యా! దేవత లెల్లరును క్షుధాతురులైన కౌశికఋషీంద్రునిచేఁ గల్పితంబైన కుక్కురమాంసమును భక్షింపనై యున్నారు." అని పలికెను. వీతిహోత్రుని యీవచనంబుల నాలించి నిర్జరనాథుం డగునింద్రుండు డేగరూపము ధరించి యాకాశమార్గంబున వచ్చి విశ్వామిత్రశిష్యులు వండుచున్న యామాంసపూర్ణ పాత్రము నెత్తికొని గగనవీధి కెగసిపోయెను! అది గాంచి యాశిష్యులు గురుసన్నిధికిం బోయి శ్యేన మొనర్చిన యపకారమును గురువునకు విన్నవించిరి. ఆఁకటిచేఁ గడు పంటుకొనిపోవుచున్న యాముసీంద్రుం డా మాటలు విని కుద్ధుండై, దేవేంద్రుని శపియించుటకు సంసిద్ధుం డయ్యెను. ఈసంగతిని సునాసీరుం డెఱింగి శరవేగమునఁ గ్రిందికి వచ్చి యామాంసస్థాలిని మధుపూర్ణపాత్రము (తేనెకుండ) గా మార్చి యాపంటపొయ్యిపై నునిచెను. దానిం జూచి యాఋషిసత్తముండు, క్రోధఘూర్ణితస్వరంబున 'ఇంద్రా! నీ వమృతము దెచ్చి యున్నను మా కక్కఱ లేదు. దాని నీవే తీసికొనిపొమ్ము. మాకుక్కురమాంసమునే మాకిమ్ము. అట్లియ్యవేని నిన్ను భస్మీభూతునిం గావించెదను' అని వక్కాణించెను. అప్పు డింద్రుండు కడుంగడు భీతుండై "మహా మునీంద్రా! అసహ్యకరమైన కుక్కురమాంసముతో నేమిపని? జిహ్వాకింపయిన తేనెను పానముచేసి, యనంతరము సకుటుంబముగ నారగింపుము." అని పలికెను.

దేవనాయకుని యావాక్యములు నాకర్ణించి ఋషిప్రవరుండు "దివస్పతీ! వలదు! ఆమధువు వలదు! ఈమధుసేవనమువలన నయ్యెడిలాభ మేమి? జీవలోక మెల్ల క్షుధాతురమై కృశించి యుండఁగా, నేను మాత్రి మామధు వెట్లు భక్షింపఁగలను? ఊఁదఱకును

నమృతము లభించునేని నేనును నమృతమును భక్షించెదను. లేదేని దేవపితృదేవతల కీకుక్కురమాంసమును నివేదించి తచ్ఛేషమే నేనును భుజించెదను. దీనివలన నాకేవిధమైనపాపమును లేదు.'' అని పలికెను.

అప్పుడు భీతచేతస్కుఁడైయున్న సహస్రాక్షుండు చేయునది లేక తత్క్షణమే మేఘబృందమును రప్పించి యమృతవర్షముఁ గురియించెను. అయ్యమృతముచేఁ బ్రజలెల్ల సంతృప్తులైరి. ఈరీతిని విశ్వామిత్రుఁడమృతవర్షమును రెప్పించి దానిచే దేవపిత్రాదిలోకత్రయమును సంతృప్తంబు గావించి మించి యనంతరము దానును దనకుటుంబమును, శిష్యగణంబులోఁ గడుపార నారగించి పరిహృష్టహృదయుం డయ్యెను.

నారదా! సురనాథుండు స్వయముగ వచ్చి యమృతవర్షమును గురియించి విశ్వామిత్రుండు మాంసవిసర్జనముఁ గావించిననాఁట నుండియు బహు పుణ్యప్రదంబైనయాతీర్థంబునకు విశ్వామిత్రితీర్థంబను నామం బాఖ్యాతం బయ్యెను. అచ్చటఁ గావించుస్నానదానాది కర్మంబు లెల్ల బహుక్రతుఫలంబుల నొసగును. అందును మానవలోకమున కీతీర్థంబు సమస్తపుణ్యప్రదంబు—మఱియు నీసుప్రసిద్ధతీర్థంబునకు విశ్వామిత్రి మనునామంబె కాక మధుతీర్థం బనియు, ఇంద్రతీర్థం బనియు, శ్యేనతీర్థం బనియుఁ బర్జన్యతీర్థం బనియు నితరనామంబులును గలవు.

## —♦ శ్వేతతీర్థవర్ణనము. ♦—

ఇట్లు చెప్పి బ్రహ్మదేవుండు మరల నారదునితో నిట్లనియెను. కుమారా! త్రైలోక్యవిశ్రుతంబును, శుభప్రదంబును నగు శ్వేతతీర్థం బనుతీర్థరాజం బొకండు గలదు. ఈతీర్థనామంబు శ్రవణముల సోఁకి

నంతమాత్రంబున సమస్తపాపంబులును నశించిపోవుచున్నవి. పూర్వకాలమున గౌతమమహర్షికిఁ బ్రాణసఖుఁడును, అతిథిపూజానిరతుండును, గౌతమీనదీతీరనివాసియు, మనోవాక్కాయకర్మంబుల నెప్పుడును శివుని ధ్యానించుచుఁ బూజించుచు నుండువాఁడును నగు శ్వేతుఁడను బ్రాహ్మణశ్రేష్ఠుం డొకండు గలఁడు. శివభక్తుఁడగు నాద్విజవర్యుఁ డాకీతిని అతిథిసంతర్పణములతోడను, శివధ్యానముతోడను, తద్భక్తిపరాయణత్వముతోడను దనయాయువునంతయుఁ గడపివైచెను. అనంతర మొకనాఁటితో నాతనియాయువు చెల్లఁగా యమధర్మరాజు నాజ్ఞచే యమకింకరు లాశివభక్తుని ప్రాణములను దీసికొనిపోవలయునని వచ్చిరి కాని వారాతనిగృహంబునఁ బ్రవేశింపఁజాలకపోయిరి.

ఆలస్యం బగుటయు నప్పుడు చిత్రకుండు మృత్యుదేవతం బిలిచి ఓమృత్యువా! గతాయువగు శ్వేతుం డింకను రాలేదు. అతనిఁ గొనితెచ్చుటకై పోయిన యమదూతలును రాలేదు. దీనికిఁ గారణమేమో తెలియకున్నది. వాస్తవముగా నీవు మృత్యువు గదా! నీవిట్లు నియమము నుల్లంఘించుట యుచితము గాదు. అని పలుకుటయు మృత్యువు కోపించి యాక్షణంబుననే తాను స్వయముగా శ్వేతగృహంబునకుం బోయి చూచెను. యమదూత లాయింటివెలుపల భయవిహ్వలులై నిలిచియుండిరి. వారిం గాంచి యిదియేమని మృత్యువు ప్రశ్నించుటయు యమదూతలు జంకుచు "అదిగో! చూడుము ఈ శ్వేతుని శివుండు స్వయముగా సంరక్షించుచున్నాఁడు. అందుచే మేమాతని వంకఁ దేఁచూచుటకైనను శక్తులము గాఁజాలకున్నాము. మహాదేవుం డెవ్వరియెడలఁ బ్రసన్నుఁడై యుండునో వారి కితరభయంబు లెట్లుండును!" అని చెప్పిరి. అప్పుడు పాశపాణి యగుమృత్యువు శ్వేతుని సమీపమునకుం బోయెను. ఆమృత్యువునుగాని కింకరులనుగాని

యా బ్రాహ్మణుఁడు చూడనే లేదు. అతఁడు నిశ్చలభక్తిపూర్వకంబుగాఁ శివారాధనముం గావించుచుండెను. అప్పుడు పాశమును జేతఁబట్టుకొనివచ్చిన మృత్యువుం గాంచి శివానుచరుండగు దండి "ఓ మృత్యువా! నీవిచ్చటికి కేలవచ్చితి"వని ప్రశ్నించెను. "నేనిప్పుడీ శ్వేతుం డను విప్రునిఁ దీసికొనిపోవుటకై వచ్చితి" నని మృత్యువు ప్రత్యుత్తర మిచ్చెను.

అప్పుడు దండి నీవిటనుండి వెడలిపోవలయు నని చెప్పుచున్నను వినక మృత్యువు శ్వేతునిపైఁ బాశమును వైచుటయు దండి కుపితుండై శివదత్తం బగుదండముచే మృత్యువును బ్రహరించెను. అమ్మహాఘాతముతో మృత్యువు క్రిందఁబడిపోయెను. ఆమృత్యునిహతింగాంచి యమకింకరులు బెదరి యతిత్వరితంబుగ యమసన్నిధికిం బోయి యెల్లవృత్తాంతము నాతనికి విన్నవించిరి. అది విని మహిషవాహనుం డగుయముండు కుపితుండై చిత్రగుప్తుని, యమదండమును, మహిషమును, భూతబేతాళములను, ఆధివ్యాధులను, అక్షిరోగము, కర్ణరోగము. కుక్షిరోగము, కర్ణమూలము, త్రివిధజ్వరములు మొదలగు రోగములను, సమస్తనరకములను ద్వరపడవలయు నని యాదేశించి స్వయంబుగఁ దానే యతిత్వరితగమనముతో నచ్చటికిం బోయెను. ఇట్లు బలపరివృతుండై మహిషవాహనారూఢుండై వచ్చియున్న ప్రేతనాథునిం గాంచి నందీశ్వరుండు వినాయకునకును, స్కందునకును, భూతపతికిని, దండికిని దదాగమనంబు నెఱింగించెను.

ఆసమయంబున నచ్చట సర్వలోకభయంకరంబగు మహారణంబు జరిగెను. కార్తికేయుండు తనయాయుధం బగుశక్తిచే యమకింకరుల దేహములను భిన్నభిన్నములుగాఁ జేసి యమునికూడఁ బ్రబలాహతునిం గావించెను. అప్పుడు హతశేషులగువారు సత్వరంబుగ

నాదిత్యునిచెంతకుం బోయి సర్వవృత్తాంతము నాతని కెఱింగించిరి. ఆయమకృతవ్యాపారము నాలించి యాదిత్యుండు బ్రహ్మ, విష్ణుదేవుఁడు, ఇంద్రుఁడు, అగ్ని, వరుణుఁడు, చంద్రుఁడు, ఆదిత్యగణము, మరుద్గణము, లోకపాలగణము మొదలగువారితోఁ గలసి యాస్థానమునకుం బోయి గంగాతీరంబున మృతావస్థయందున్న దక్షిణేశ్వరుం గాంచి మిఁగులవిచారించెను. అప్పుడు సముద్రనదీనదంబులును, నగంబులును, వివిధజీవులును వైవస్వతునిం గాంచుటకై వచ్చియుండిరి. అట్లు హీనబలుండై పడియున్న యమునింగాంచి యెల్లవారును భయప్రకంపితులై పోయిరి.

అప్పుడు దేవతలందఱును మహాదేవుండగుశివునకుఁ బునః పునరభివందనంబులు గావించుచు కరకమలంబులు జోడించుకొని "ఓ యాదికర్తా! నీలకంఠా! భక్తజనానురాగంబును, దుష్టదమనసామర్థ్యంబును నీకు నిత్యంబులు" అట్టినీకు మానమస్కారము. ఓబ్రహ్మప్రియా! దేవప్రియా! నీకుఁ బ్రణామశతంబులు. ఈశ్వేతుండనుద్విజుండు నీకుఁ బరమభక్తుఁడు. ఈతని కింక నాయువు లేదు. అయినను నిప్పుడు సమస్తదేవతలును గూడి యీతని గొనిపోఁజాలకున్నారు. ఓజగన్నాథా! ఇట్టినీభక్తప్రియత్వముం గాంచి మేమందఱమును బరమహర్షంబు నందుచున్నారము. కృపాళుండవగునీశరణంబు గన్నవారిని కృతాంతుండైనను దేరిచూడఁజాలఁడు. ఇందువలననే శివస్వరూపుండవగునిన్ను సకలజీవులు నాశ్రయించుచుందురు. ఓశంకరా! నీవే యీవిశ్వంబున కంతకును బ్రభుండవు. ఈవిశ్వపాలనంబునకు నీకంటెసమర్థుం డగువాఁ డెవ్వఁడున్నాఁడు?" అని యిట్లు సన్నుతించుటయు శివుండు ప్రసన్నుండై వారియెట్టయెదుట సాక్షాత్కరించి "మీకేమి కావలయునో కోరుకొనుఁడు" అని యనుగ్రహించెను.

అంత దేవతలందఱును సంతుష్టులై "మహాదేవా! వైవస్వతుండగు యముఁడు సర్వజీవనియామకుండై యున్నవాఁడు. ఈతఁడీలోకంబున ధర్మాధర్మవ్యవస్థాపనంబుకొఱకుఁ బ్రతిష్ఠితుం డయ్యెను. ఈతఁడెట్టియపరాధమును గావించినవాఁడు గాఁడు; ఎట్టి పాపమును జేసియెఱుంగఁడు. ఈతఁడు లేకున్నచో జగద్విధాతయుద్దేశమేదియును సిద్ధింపఁజాలదు. ఈతఁ డెంతమాత్రమును వధార్హుండు గాఁడు. కావున నో దేవా! ఈతనిసపరివారంబుగఁ బునర్జీవితునిం గావింపుము. మహాత్ములంగూర్చి కావించినప్రార్థనము సఫలము గావలసినదే కాని యెన్నటికిని విఫలముగానేరదుగదా!" అని యనేకవిధంబులఁ బ్రార్థించిరి.

అప్పుడు భగనుం డగుశివుండు దేవతలందఱును నామాట కంగీకరించినచో నేనీతని బ్రదికించెద నని చెప్పెను. ఆమాట విని దేవతలు దేవరయిష్టానుసారము మేమందఱమును బ్రవర్తించెదము. హరివిరించిప్రభృతులగుసకలదేవతలును సకలజగంబులును నీయధీనములు గదా!" అనుటయుభగవానుం డగుశంకరుండు "అట్లయినచో మద్భక్తులగువా రెన్నటికిని మృత్యుముఖపతితులు గాకుందురుగాక!" అనియెను. అంత దేవత లందఱును కృతాంజలిపుటులై "దేవా! మీరిట్లు తలంచుట యుక్తము గాదు. అట్లయినచో నీచరాచరప్రపంచంబంతయు నమరత్వముం గాంచఁగలదు. ఓజగన్మయా! ఇఁక మర్త్యులకు నమర్త్యులకును భేదమేముండును? కావున మీరిట్లాదేశించుట న్యాయముగాదు" అని విన్నవించిరి.

భగవానుండగుశివుండు మరల నిట్లనియెను. ఓదేవతలారా! మీరు నామాటల నాలకింపుఁడు. నాభక్తులును, విష్ణుభక్తులును, గౌతమీసేవానిరతులును గేవలము మాయధీనులే యైయుందురుగాక! వారియెడల నీయమున కెట్టియధికారమును లేకుండుఁగాక! అతఁడు

వారిమాటలయిన నెత్తకుండవలయును. ఆధివ్యాధులు వారినెన్నఁడు
నేవిధముగను బాధింపకుండవలయును. శివశరణ్యులగువారి కవిలంబ
ముగ ముక్తి లభించుఁగాక! సానుచరుండగుయముండు వారి కెల్లప్పు
డును వినతుండై యుండవలయును. అని యాదేశించుటయు దేవతలం
దఱును మహాదేవునివాక్యములను శిరసావహించిరి.

అప్పుడు భగవానుఁడు నందికేశ్వరుం గాంచి నీవు గౌతమీ
జలంబులచే మృతులగుయమాదులనభిషేకింపు మనియాజ్ఞాపించెను.
అనంతరము నందిచే నభిషిక్తులై యమాదులెల్లరును బునర్జీవితులై
దక్షిణాభిముఖులగుచు బ్రహ్మానంబు గావించిరి. గౌతమీనది యుత్తరతీ
రంబున విష్ణుప్రభృతులగుసకలదేవతలును దేవదేవుం డగుమహేశ్వరు
నిఁ బూజించిరి. అచ్చట నష్టాయుతంబులును, జతుస్త్రిశసహస్రంబులు
నగుతీర్థంబు లుత్పన్నంబు లయ్యెను. అట్లే దక్షిణతీరంబునను ముఖ్య
దివ్యాంబువేలతీర్థములు విరాజిల్లెను. ఇది శ్వేతతీర్థపుణ్యచరిత్రము.
ఇచ్చట మృత్యుపతనం బగుటచే దీనికి మృత్యుతీర్థంబను నామంబు
గూడఁ గలిగెను. ఈతీర్థశ్రవణమాత్రంబునఁ బరమాయువును, తీర్థ
స్నానంబున సర్వపాపక్షయంబు నగును. భుక్తిముక్తిదాయకంబగునీ
తీర్థచరిత్రశ్రవణపఠనాదులును, స్మరణంబును గూడ బాపనాశకంబులు.

## — । మృతసంజీవనీతీర్థము । —

మానవులకు సర్వసిద్ధిప్రదంబును, సర్వపాపప్రశమనంబును,
సర్వవ్యాధినివారణంబు నగు శుక్రతీర్థము లోకవిఖ్యాతమైనది. అంగి
రుఁడు, భృగుఁడు ననుపరమధార్మికులగు నిరువురుఋషులు గలరు.
వారికి రూపగుణసంపన్నులును, మహాప్రాజ్ఞులు నగుజీవుఁడు, కవి
యను నిరువురు పుత్రులు జనించిరి. ఆకుమారులిరువురను నిరంతర

మును దల్లిదండ్రులకు విధేయులై వర్తిల్లుచుండిరి. కొంతకాలమునకుఁ దండ్రు లయ్యిరువురుకుమారుల నుపనీతులం గావించి తమలో నొక రాపుత్రద్వయమును విద్యాభ్యాసంబు సేయించుటకును దక్కినవారు నిర్విచారముగ నుండుటకును నాలోచించుకొనిరి. అప్పు డంగిరసుఁడు భార్గవునిం గాంచి "నే నీతనయులకిరువురకును విద్యాభ్యాసంబు గావించెదను. నీవు సుఖంబుగ నుండుము" అనియెను. భృగువసుం డాతనివచనంబు లాలించి యది యే యుక్తం బనియంగీకరించి తనతనయుం డగుశుక్రునిశిక్షాభారమంతయు నంగిరునిపైఁ బెట్టి తాను వెడలిపోయెను. అంగిరుఁడే యయ్యుభయబాలకులకును విద్యాభ్యాసము సేయుచుండెను.

కాని యంగిరునివిద్యాశిక్షణముమాత్రము సమభావముతో నుండక తనపుత్రునియందుఁ బక్షపాతము గలిగి యుండెను. అది యెఱింగి బాలుం డగుశుక్రుం డొకనాఁడు గురునిం గాంచి "గురుదేవా! నీవు ప్రతిదినంబును విషమభావంబున నన్నుఁ జదివించుచున్నావు. వాస్తవముగా నీవంటిగురునకుఁ బుత్రుఁడనియును, శిష్యుఁడనియును భేదభావ ముండుట యుచితము గాదు. కేవలము మూఢులగు దేశికులుమాత్రమే శిష్యకోటియందు వైషమ్యమును గలిగి యుందురు. విషమబుద్ధులగుగురులపాపమునకుఁ బరిమితి యనునది లేదు. ఓ మహాచార్యవర్యా! నీవు సర్వజ్ఞుఁడవు. నేను నీకుఁ బునఃపునరభివాదనంబు లాచరించుచున్నాను. మఱియొకగురునియొద్ద విద్యాభ్యాసంబు గావించుకొనుటకు నన్ను ననుజ్ఞాపింపుము. మహాత్మా! నేనిప్పుడు నాతండ్రిచెంతకుఁ బోయి యాచించెదను. అతఁడును విషమబుద్ధియే యగునేని మఱియొకచోటి కెక్కడకైనను బోయెదను. స్వామీ! నీకంతయును విన్నవించితిని. ఇఁక నాకు సెలవొసంగవలయును" అని

ప్రార్థించి, యాతఁడు గురునిచే ననుమతుండై యటనుండి వెడలిపోయెను.

అట్లు పోవుచు నాతఁడు తనలో "నేను సకలవిద్యాపారంగతుండ నైనతరువాతనే జనకునిచెంతకుం జనియెదను. నాకట్టిగురుం డెచ్చట లభించును? ఈవిషయమై నేనెవ్వరి నడుగుదును?" అని భావించుకొనుచు మహాప్రాజ్ఞుండును, వృద్ధుండు నగు గౌతమునిసన్నిధికిం బోయి యోమునిశ్రేష్ఠా! నాకెవ్వఁడు గురుండు కాఁగలుగునో యానతీయవలయును. నీవు నిర్దేశించిన యాగురునిచెంతకుఁ బోయి నేనాశ్రయించెద నని ప్రార్థించెను. గౌతముండును బాగుగ నాలోచించి జగద్గురుండును, జగదీశ్వరుండు నగుశంభుండు నీకుఁ దగినగురుండని తెలిపెను. ఆతనినాశ్రయించుటకు నేనెచ్చటికిఁ బోవలయు నని శుక్రుండు ప్రశ్నించుటయు నీవు గౌతమీతీరంబునకుం బోయి శుచివై స్తోత్రపాఠంబులచే శంకరునిఁ బరితుష్టుం గావింపుము. అతఁడు ప్రసన్నుండై నీకు విద్యాదానంబు గావించు నని గౌతముండు బోధించెను.

ఇట్లు గౌతమునిచేఁ బ్రబోధితుండై భార్గవుండు గోదావరీతటంబునకుం జని యందు స్నానంబు చేసి శుచియై యథావిధిగ మహాదేవు నీవిధముగా సన్నుతింప నారంభించెను. "ఓ బాలచంద్రధరా! ప్రభూ! శంకరా! నేను కేవలమును బాలకుఁడను. నాబుద్ధిగూడ బాలజనోచితమైనదియే. నీస్తోత్రగీతముల నేనేమియు నెఱుంగను. నీకు నానమస్కారము. నాగురుండు నన్నుఁ బరిత్యజించి యున్నాఁడు. నాకిఁక సఖు లెవ్వరును లేరు. ఇప్పుడు నాకు నీవే సర్వవిధములను బ్రభుండవు. మహాత్ములకు మహాత్మును, గురులకు గురుండవు నగునీకు వందనసహస్రంబు లాచరించుచున్నాను. నేనల్పబాలకుఁడను. ఓజగన్మయా!

నమస్కారము. ఓసురేశ్వరా ! నేను విద్యార్థినై యున్నాను. నాకు నీతత్త్వ మించుకంతయును దెలియదు. నీకృపావలోకముల నాపైఁ బరగింపుము. ఓలోకసాక్షీ! నీకు నమస్కారము." అని యిట్లు శుక్రుండు స్తోత్రము చేయుటయు మహేశ్వరుండు ప్రసన్నుండై కుమారా ! దేవదుర్లభం బగువరం బెద్దియైనను గోరుకొమ్మని యనుగ్రహించెను.

అప్పు డుదారబుద్ధి యగుశుక్రుండు కృతాంజలియై " దేవదేవా! బ్రహ్మాదిదేవతలును, సమస్తఋషిగణంబులునుగూడ నెఱుంగనిమహావిద్యను నాకుఁ బ్రసాదింపఁగోరెదను. నీవే నాకుఁ బరమగురుండవు " అని వేడుకొనియెను. అంత శంకరుండు విబుధగణంబులకపరిజ్ఞాతం బగుమృతసంజీవనీవిద్య నాతని కుపదేశించుటయే కాక సకలలౌకికవిద్యలనుగూడ నాతనికిఁ బ్రసాదించెను. శంకరుండు ప్రసన్నుండైనచో నింక వరప్రదానమున కభావ మేమున్నది? శుక్రుండిట్లు మహాదేవునివలన విద్యాలాభంబు నంది తనజనకునిసన్నిధికిం బోయెను. ఆభార్గవుం డావిద్యాప్రభావముచే దైత్యగణంబులకుఁ బూజనీయుండగుగురుండయ్యెను.

ఒకప్పుడు బృహస్పతిపుత్రుం డగుకచుండనువాఁడు కారణాంతరముచే నాతనికడనుండి యమ్మహావిద్యను గ్రహించెను. క్రమముగా నాతనిమూలమున బృహస్పతియును సకలదేవతలునుగూడ నమ్మహావిద్యను బడయఁగలిగిరి. ఆశుక్రుం డేస్థానమునందుండి యామహేశ్వరునారాధించి మృతసంజీవనీవిద్యను సాధింపఁగలిగెనో యాస్థానము గౌతమీనదియుత్తరతీరము. అదియే శుక్రతీర్థం బను నామంబునఁ బ్రసిద్ధం బయ్యెను. దానికి మృతసంజీవనీతీర్థం బనుగూడ నామాంతరము గలదు. ఈదివ్యతీర్థ మాయురారోగ్యవర్ధక ... చ్చటిస్నానదానాదులు స్వల్పంబులైనను నక్షయఫలప్

## ఇంద్రతీర్థప్రశంస

బ్రహ్మహత్యాపాపవినాశకంబును జగద్విఖ్యాతంబు నగునింద్ర తీర్థమును స్మరించినమాత్రముననే యఖిలపాపక్లేశంబులును వినష్టంబు లగును. పూర్వకాలంబున నింద్రుండు వృత్రసంహారంబు చేసిన వెనుక నయ్యింద్రునకు బ్రహ్మహత్య తటస్థించెను. ఎచ్చటికేఁగిన నచ్చటనే ప్రత్యక్షంబగుచున్న యాభయంకరబ్రహ్మహత్యం గాంచి యింద్రుండు భీతుండై యొకమహాసరోవరంబుఁ జేరి యందలిపద్మనాళమధ్యంబున మృణాలతంతురూపంబు దాల్చి దాఁగియుండెను. కాని బ్రహ్మహత్య మాత్ర మాతనికొఱ కాసరస్తీరంబున దివ్యవర్షసహస్రపర్యంతమును గాచుకొనియుండెను. ఆసమయంబున దేవత లింద్రవిహీనులై యెట్లయినఁ దమప్రభునిఁ దీసికొనిరావలయు ననునుద్దేశముతో ననేకవిధముల నాలోచించుచుండిరి. అప్పుడు బ్రహ్మదేవుండు దేవతలఁ గాంచి గౌతమీజలంబులచే నింద్రు నభిషిక్తుం గావించినచో నాతఁడు పవిత్రుండుఁ గాఁగలఁడని బోధించెను. దేవత లట్లు నిశ్చయించుకొని సత్వరంబుగ గౌతమీతీరంబునకుం బోయి యచ్చట సురపతిని గోదావరీజలంబులచే నభిషిక్తుం గావించిరి. దేవర్షిగణంబు లిట్లయ్యింద్రు నభిషేకించుచుండుటం గాంచి గౌతముండు కోపించి "గురుతల్పగుండగు నిమ్మహేంద్రు నిట్లభిషేకించుట తగదు. ఓదేవతలారా! సత్వరంబుగ మీ రిటనుండి వెడలిపొండు. పోనిచో మిమ్మందఱ నిట భస్మీభూతులం గావించెదను" అని యదలించెను. అమ్మహర్షి వచనంబులకు భయపడి దేవతలందఱును దేవేంద్రుని వెంటఁబెట్టుకొని యటనుండి కదలి నర్మదానదికిం బోయి దానియుత్తరతటంబున నింద్రునభిషేకింపనుద్యుక్తులైరి. అ[illegible] గవానుండగుమాండవ్యముని శేఖరుండు "మీ రిం[illegible] చినచో మిమ్ము భస్మీభూతులం గావింతు నని

వారించెను. ఆమాటవిని యమునులాముని చంద్రుని నేకవిధముల నారాధించి "మహామునీంద్రా! ఈమహేంద్రు నెచ్చట నభిషేకింపఁజూచిన నచ్చటనే విఘ్నము తటస్థించుచున్నది. ఓకల్యాణమూర్తీ! వరకుండవై నీవు మాకట్టి విఘ్నములను శాంతింపఁజేయవలయును. ఈశతముఖు నిఁక నెచ్చట నభిషేకింపవలయునో యానతీయవలయును. మహేంద్రుని పాపప్రక్షాళనంబగు స్థానము సర్వసస్యఫలప్రదంబును, పుణ్యమయంబు నగునట్లనుగ్రహింపవలయును. అచ్చట ననావృష్టి దుర్భిక్షభయంబులు లేక యాస్థానము సర్వకామప్రదంబు గావలయును." అని దేవతలర్థించుటయుఁ ద్రిలోకపూజ్యుం డగుమాండవ్యుండు ప్రసన్నుఁడయ్యెను. కావున నాస్థలంబున నింద్రాభిషేకంబును బాపమలక్షాళనంబు నయ్యెను. అప్పటినుండి దేవమునిగణంబులాస్థలంబును మాళవనామంబునఁ గీర్తించుచుండిరి. సురపతియభిషేకంబువలన నది నిర్మలంబయ్యెను.

అప్పుడచ్చటికి గౌతమీగంగను గొనితెచ్చి మఱియును బవిత్రంబు గావించుకొని కయ్యింద్రు నభిషేకించిరి. ఆసమయంబున బ్రహ్మయు సురగణంబులును, ఋషులును, విష్ణుదేవుండును, వసిష్ఠుఁడు, గౌతముఁడు, అగస్త్యుఁడు, అత్రి, కశ్యపుఁడు మఱియు నితరదేవర్షిగణంబులును, యక్షపన్నగాదులును గలసి యాగౌతమీజలంబులచే నింద్రు నభిషేకించిరి. బ్రహ్మయుఁ దనకమండలుజలంబులచే నింద్రునభిషేకించెను. ఆజలంబువలన నప్పుడు సీతయనుపుణ్యనది ప్రాదుర్భవించి గౌతమీసంగతంబయ్యెను. ఆనదీసంగమస్థానము సర్వదా దేవమునిజనసేవితంబై యప్పటినుండియు పుణ్యసంగమం బనునామంబునఁ బ్రఖ్యాతంబయ్యెను. సీతానదీసంగమస్థానము పవిత్రంబగు నింద్రతీర్థంబయ్యెను. అందు సప్తసహస్రపుణ్యతీర్థంబులు ప్రతిష్ఠితంబు లయ్యె

ను. ఆసకలతీర్థంబులయందును, విశేషించి యాసిక్తాసంగమస్థానంబు నను గావించు నేసత్కర్మంబులైనను నక్షయపుణ్యఫలప్రదంబు లగు ననుట కెట్టిసంశయమును లేదు. ఈపుణ్యచరిత్రమును వినువారును బఠించువారును మనోవాక్కాయకృతంబు లగు సకలపాపంబులనుండియు విడివడి ముక్తిలాభంబు నందఁగలరు.

## —• పౌలస్త్యతీర్థము •—

పౌలస్త్యతీర్థము మానవగణంబులకు సర్వకామప్రదమైనది. ఆతీర్థసేవనంబుచే భ్రష్టరాజ్యులకు రాజ్యప్రాప్తి యగును. పూర్వకాలంబున నుత్తరదిగధీశ్వరుం డగుకుబేరుండు మహాసమృద్ధిశాలియు, సర్వార్థసిద్ధుండు నైయుండెను. ఆతఁడు విశ్రవబ్రహ్మకు జ్యేష్ఠపుత్రుఁడు. మొట్టమొదట నతఁడు లంకారాజ్యమునఁ బ్రతిష్ఠితుం డయ్యెను. ఆతనికి వైమాత్రేయులగు రావణుఁడు, కుంభకర్ణుఁడు, విభీషణుఁడు ననుబలశాలురు మువ్వురు భ్రాత లుండిరి. ధనదుం డాసోదరులతోఁ గూడ బ్రహ్మదత్తం బగువిమానము నధిరోహించి ప్రతిదినమును భక్తిభావముతో బ్రహ్మదేవుని సందర్శింపఁ బోవుచుండెను. రావణునితల్లి యాకుబేరునిసంపత్తిం గాంచి యసూయాపరవశయై యొకనాఁడు తన పుత్రులం జేరి "ఓకుమారులారా! నాబ్రతుకువలన నేమిప్రయోజనము? నేను చచ్చుటయే మంచిది. సవతిబిడ్డ లగు దేవదానవులు పరస్పరజయాభిలాషులై యొకరియైశ్వర్యము నొకరు వాంఛించుచుఁ బ్రవర్తించుచుందురు. కాని మీయం దట్టిపురుషత్వము లేదు. జయేచ్ఛగాని, శక్తిగాని యించుకంతయును లేదు. శత్రువునకు లొంగి యాతని ననుసరించి జీవించువానిబ్రతుకు నిరర్థకముగదా!" అని యుగ్గడించి మిగుల విచారించెను.

అట్లు చెప్పినతల్లిమాటల నాలించి రావణకుంభకర్ణవిభీషణులు వెంటనే వనంబునకుం బోయి మహాతపంబు గావింప నారంభించిరి. తరువాత వారు బ్రహ్మదేవునిచే వరంబులను బడసి తల్లివచనానుసారముగా మాతులమాతామహులమూలమున లంకారాజ్యమును మాకొసంగవలయు నని కుబేరునకు రాయబార మంపించిరి. మాతృదోషముచేతను, రాక్షసభావమువలనను వారికి ధనపతితో గర్భశత్రుత్వము వర్ధిల్లెను. అప్పు డయ్యిరుతెగలవారికిని దేవాసురులకుం బోలె ఘోరయుద్ధంబు సంప్రాప్తంబయ్యెను. ఆరణంబున వారు తమయగ్రజుం డగుకుబేరుని నిర్జించి యాతనిపుష్పకంబును, లంకారాజ్యమును దమవశంబుగఁ జేసికొనిరి. అనంతరము రావణుఁడు "ఈత్రిలోకమధ్యంబున నాయన్నయగుధనదున కెవ్వరాశ్రయ మిచ్చెదరో వారిని నేను వధింపకవిడువను." అని యెల్లయెడలఁ జాటించెను. కుబేరుండీరీతిగా రావణునిచే విదూరితుండై యెందు నాశ్రయవిరహితుండయ్యెను. అతఁడు తనపితామహుం డగుపులస్త్యునిసన్నిధికిం బోయి యాతనికి సమస్కరించి "మహాత్మా! దురాత్ముం డగురావణునిచే నేనిట్లు వితాడితుండ నైతిని. ఇఁక నే నేమిచేయవలయునో సెలవీయవలయును. ఏదైవము నాశ్రయించి యెచ్చట నిలువవలయునో నాకేమియును దోచుటలేదు." అని విన్నవించెను.

పులస్త్యుండు పౌత్రునివచనంబు లాకర్ణించి "కుమారా! నీవిప్పుడు గౌతమీతీరమునకుంబోయి యచ్చట మహాదేవు నారాధనంబు గావింపుము. ఆనదీజలాభ్యంతరంబునను రావణాదు లెవ్వరును రాఁజాలరు. నీకచ్చట నిర్విఘ్నముగాఁ గార్యసిద్ధి యగును." అని బోధించుటయు యక్షేశ్వరుండు మాతాపితరులను, ధర్మపత్నిని, వృద్ధుఁడగు పులస్త్యునిఁ దనవెంటఁబెట్టుకొని గౌతమీతటంబునకుంబోయి

యీ పావనసలిలంబులందు సుస్నాతుండై యతినియమంబున భక్తిముక్తిప్రదుం డగుశివునింగూర్చి స్తోత్రము చేయ నారంభించెను. "ఓశంకరా! నీవీచరాచరవిశ్వంబునకుఁ బ్రభుండవు. నీకంటెఁ బ్రధానుం డెవ్వండును లేఁడు. అజ్ఞానవశంబున నీయెడలనపచారంబు గావించువాఁడు శోచనీయావస్థం గాంచును. నీ వష్టమూర్తివై యీవిశ్వంబు నంతను వహించి యున్నాఁడవు. నీయాజ్ఞచే సర్వంబును నిష్పన్నం బగుచున్నది. వేదజ్ఞుం డగువానికిమాత్రమే నీతత్త్వంబు విదితంబగును. కాని యజ్ఞుండగువాఁడు నీమాహాత్మ్యము నెఱుంగఁజాలఁడు. ఓదేవా! అంబ యనుగౌరీదేవి తనగాత్రమలంబుచే నొకబొమ్మంగావించి పరిహాసంబుగా "ఈతఁడు పుత్రుఁడు" అని చెప్పినంతమాత్రముననే నీకృపాదృష్టిచే నాప్రతిమ బలపరాక్రమశాలి యగువిఘ్నేశ్వరుం డై విరాజిల్లెను. ఆహా! నీకటాక్షమహిమ యనిర్వాచ్యము గదా! దేవి యగు గిరిజ పూర్వము కామదేవుండు నిహతుండగుటచే దాంపత్యధర్మం బభావం బగుటంగాంచి యశ్రుస్నాపితనయనంబులతో నీవిషయంబునుగూర్చి నివేదించుటయు సోమమూర్తి వగునీదేహమునుండి మరల మనోభవుండును, రతియును, మదకారియగువసంతుండును జనియించిరి. దేవా! నీప్రభావ మెవ్వరు వర్ణింపఁగలరు?" అని యిట్లు యక్షనాయకుండు స్తవంబు చేయుటయుఁ ద్రిలోచనుం డాతని యెదుట సాక్షాత్కరించి వరప్రార్థనంబు గావింపుమని యాతని హెచ్చరించెను. కాని పరమానందముచే గుబేరుం డేమియును మాటాడఁజాలక పోయెను. అతం డిట్లు మౌనమువహించి యుండుటయు శివుండు మరల మరల వరంబుఁగోరుకొనుమని హెచ్చరించుచుండెను.

అప్పు డాకాశవాణి పులస్త్యునియొక్కయు, విశ్రవునియొక్కయు, ధనదునియొక్కయు నభిప్రాయమును గ్రహించి "ఓమహాదేవా!

ఈకుబేరునకు ధనపాలకత్వము లభించుఁగాక! మఱియు నీతనికి భవితవ్యము భూతంబుగను, దాతవ్యము దత్తముగను, ప్రాప్తవ్యము ప్రాప్తంబుగను నగుఁగాక!'' అనియెను. ఆవాక్యము లాక్షణంబుననే కార్యరూపంబునఁ బరిణతంబులయ్యెను. అప్పుడు కుబేరుండు సోమేశ్వర లింగార్చనంబు గావించి దిక్పాలకత్వమును, ధనాధిపత్యమును దానశీలత్వమును బడయఁగలిగెను. ధనదుం డాకాశవాణీవచనంబు లాలించి శూలపాణినుద్దేశించి ''మహాదేవా! ఈదైవవాక్యము సఫలంబగుఁగాక! ఇదియే నామనోరథము'' అనియెను. దేవదేవుండును ''తథాస్తు'' అని యంగీకరించెను. ఇట్లు ధనదుండు పుణ్యావరప్రాప్తుండగుటయు పులస్త్యుండును, విశ్రవుండును నాతని నభినందించుచు స్వస్థానంబునకుఁ బ్రస్థానంబు గావించిరి. అప్పటినుండియు నీతీర్థంబునకుఁ బౌలస్త్యం బనియు, వైశ్రవసంబనియు, ధనదతీర్థంబనియు నామంబులు గలిగెను. ఈతీర్థము సర్వకామప్రదంబును, పవిత్రంబును, శుభావహంబు నైనది. ఇందు స్నానదానాదులు బహుపుణ్యజనకంబు లగును.

## — అగ్నితీర్థము —

సర్వక్రతుఫలప్రదం బగు నగ్నితీర్థము సర్వవిఘ్నవినాశకమైనది. పూర్వము జాతవేదుం డనునామంబున నగ్నిదేవునకు భ్రాతయొకఁడు విఖ్యాతుండై యుండెను. అతఁడు దేవతలకు హవ్యమును మోచికొనిపోవుచుండెను. ఒకప్పుడు గౌతమీతీరంబున ఋషులయజ్ఞశాలనుండి జాతవేదుండు హవ్యమును గైకొనిపోవుచుండఁగా బలవంతుండగుమధుదైత్యుండు దేవర్షిసమక్షంబున నయ్యగ్నిసోదరుని వధించివైచెను. అతఁడు మరణించుటచే దేవతలకు హవ్యప్రాప్తి లేకుండెను. తనప్రియసోదరుని మరణవార్త విని పితృహోత్రుండు క్రోధావేశమున

శుద్ధుఁడై గంగాజలంబులఁ బ్రవేశించెను. అనలుం డిట్లు జలనిమగ్నుం డగుటవలన నగ్నిజీవు లగుదేవతలును, మానవులును బ్రాణపరిత్యాగంబు గావించుకొనుచుండిరి. అగ్నిదేవుండు జలప్రవిష్టుండై యున్న చోటికి సహస్రదేవతలును, పితృదేవతలును, మహర్షులును విచ్చేసి యయ్యనలునిఁ గూర్చి యందఱు నేకవాక్యంబుగా మహాత్మా ! నీవు లేక మేము జీవింపఁజాలము. ఓయగ్నిదేవా ! నీవు హవ్యకవ్యంబులచే దేవపితృగణంబులను, అన్నపాకంబుచే మనుష్యాదులను, క్లేదనంబుచే బీజాదులను సంజీవింపఁజేయుదువు. నీవు మ మ్ముద్ధరింపవలయు." అని సన్నుతించుటయు నగ్నిదేవుండు "ఓ దేవతలారా ! మీరు చెప్పినయ కార్యంబులన్నియును గావించుటకు మరణించిన నాభ్రాతయొక్కఁడే సమర్థుఁడు. మీకార్యసాధనవిషయంబున నిత్యప్రయత్నుం డగు జాతవేదున కెట్టిగతి కలిగినదో నాకును నట్టిగతియే కలుగఁగలదు. కావున మీకార్యంబుల నిర్వర్తించుటకు నా కుత్సాహంబు లేదు. సర్వసమర్థుం డగుజాతవేదునికే యిట్టియవస్థ వచ్చినప్పుడు నే నెంతవాఁడను ! ఐహికాముష్మికకర్మసాధనంబునకు నా కెట్టిశక్తియును లేదు. ఉన్నను నాకు నట్టియవస్థ తటస్థించునేమో యని మానుకొనియున్నాను." అని చెప్పుటయు దేవతలు "ఓ హవ్యవాహనా ! నీకుఁ బరమాయువును, గర్మప్రీతియును, సర్వాధికారశక్తియును బ్రసాదించుచున్నాము. మఱియుఁ బ్రయాజులను, అనుయాజులను సమర్పించెదము. నీవు దేవతలకు ముఖస్వరూపుఁడవు. ప్రథమాహుతి నీకే నివేదింపఁబడుచున్నది. నీచే నొసంగఁబడినసామగ్రియే మాకు భోజనము" అని యనేకవిధంబుల దేవతలందఱును బ్రార్థించుటయు నగ్నిదేవుఁడు పరితుష్టుండై వారియాజ్ఞలను మన్నించి యైహికంబులును పారలౌకికంబులు నగు సర్వకర్మంబులను గావించుట కెల్లయెడల నిర్భయుఁడను సమర్థుం

డును నయ్యెను. ఆతఁడు జాతవేదుఁడు, బృహద్భానుఁడు, సప్తార్చి, నీలలోహితుఁడు, జలగర్భుఁడు, శమీగర్భుఁడు, యజ్ఞగర్భుఁడు మొదలుగాఁగలనామంబులచే నభిహితుం డయ్యెను. అప్పుడు దేవత లాతని జలంబులనుండి వెడలించి యభిషేచనంబు గావించిరి. ఉభయపదవాసవశంబున నాతఁడు సర్వగుం డయ్యెను. అగ్నిదేవుండు జలంబులనుండి మొట్టమొదట యావిర్భవించినస్థాన మగ్నితీర్థనామంబున విఖ్యాతం బయ్యెను. దేవతలందఱు నాతీర్థంబునకు విచ్చేసియుండిరి. అచ్చట నింకను బహుగుణయుతంబు లగుసప్తశతతీర్థంబులు గలవు. నియమవ్రతులై యాతీర్థంబులయందు స్నానదానాదులం గావించువారు హయమేధఫలలాభంబు నందఁగలరు. అందు దేవతీర్థం బనుమఱియొకతీర్థంబు గలదు. ఆతీర్థంబున కాగ్నేయంబున జాతవేదసనామకంబును, అగ్నిప్రతిష్ఠితంబును, బహువర్ణవిశిష్టంబును నగునొకలింగంబు గలదు. తద్దర్శనమాత్రంబుననే సకలయజ్ఞఫలలాభం బగును.

## ఋణమోచనతీర్థము.

పూర్వకాలంబునఁ గాక్షీవానునకుఁ బృథుశ్రవుం డనునొకపుత్రుండు జనించెను. ఆతఁడు వైరాగ్యవశంబున దారపరిగ్రహంబు సేయక యగ్నిదేవు నుపాసింపకయుండెను. ఆతనితమ్ముఁడు సమర్థుం డయ్యును బరివిత్తి నగుదునన్న భయంబునఁ బెండ్లియాడకయుండెను. అప్పుడు వారిపితృదేవత లాయన్నదమ్ముల నిరువురను జేరి “కుమారులారా! మీరు ఋణత్రియవిమోచనంబుకొఱకు దారపరిగ్రహంబు చేయవలయునని యర్థించుటయు జ్యేష్ఠుం డగుపృథుశ్రవుండు “నేను పెండ్లియాడను. ఋణ మన నేమి? విమోచన మన నేమి?” యనియెను. అప్పుడు కనిష్ఠుఁడు పితృగణంబులను గాంచి “అన్న యుండఁ

గాఁ దమ్ముఁడ నగునేను బరిణయమాడుట యుక్తము గాదుగదా!" యనియెను. ఆసహోదరులవచనంబు లాలించి పితృదేవతలు "కుమారులారా! మీరు పుణ్యదాయినియు, లోకపావనియు నగుగౌతమిచెంతకుం బోయి యందు శ్రద్ధాభక్తులతో స్నానతర్పణాదులం గావింపుఁడు. అందువలన మీసకలాభీష్టంబులును సిద్ధింపఁగలవు. గౌతమీనదికి వినతి గావించుటయును, దానినిదర్శించుటయును, ధ్యానించుటయును సర్వకామఫలసిద్ధికిఁ గారణంబు లగును. గౌతమీస్నానంబునకు జాత్యాదివిచారంబును, దేశకాలంబులును లేవు. అందువలన జ్యేష్ఠుఁడు ఋణవిముక్తుండు గాఁగలఁడు. కనిష్ఠుండును బరివిత్తిదోషంబు పొరయఁడు." అనిబోధించిరి. అనంతరము పృథుశ్రవుండు గౌతమీనదికిం బోయి స్నానతర్పణాదులనిర్వర్తించి త్రైలోక్యంబునందును ఋణవిముక్తుం డయ్యెను. అదిమొదలుగా నాతీర్థము ఋణమోచననామంబునఁ బ్రసిద్ధంబయ్యెను. ఋణియగువాఁడు గౌతమీసలిలంబుల స్నానదానంబులఁ గావించి శ్రౌతస్మార్తఋణంబులనుండి విముక్తుండై సుఖలాభంబు నందఁగలఁడు.

## కద్రూసుపర్ణాసంగమతీర్థము.

సుపర్ణాసంగమంబును, కాద్రవాసంగమంబునునను రెండుతీర్థములు గలవు. ఆతీర్థపులినంబులయందు మహాదేవుం డగుమహేశ్వరుండు నిత్యాశ్రయుండై విరాజిల్లుచుండును. అచ్చట నగ్నికుండము, రౌద్రము, వైష్ణవము, సౌరము, సౌమ్యము, బ్రాహ్మము, కౌమారము, వారుణము ననునామములచే నింకను ననేకతీర్థంబులు గలవు. ఆస్థానంబున నప్సరానది గౌతమీగంగతో సంగమించియుండును. ఈసకలతీర్థస్మరణమాత్రంబున నరుండు కృతకృత్యుం డగును. పూర్వకాలము

బున వాలఖిల్యమహర్షిగణంబులు మహేంద్రునిచే హింసితులై పోయి
తమతపంబునం దర్ధభాగంబు సమర్పించి మహామునియగుకశ్యపుం
గాంచి యిట్లనిరి. ॥ఓమహాభాగా! యింద్రదర్పంబును భంజింపఁగల
యొకకుమారుని మాకు దయసేయుము. మేము మాతపంబులయంద
ర్ధాంశంబును నీకు సమర్పించుచున్నాము.'' అనిప్రార్థించుటయుఁ గశ్య
పుండు తథాస్తుఅని యంగీకరించి యాతఁడు సుపర్ణునకు సర్వమాత
యగుకద్రువునకును గర్భాధానంబు గావించి పోవుచు గర్భిణులగు
నయ్యువతులం గాంచి ॥ఓరమణీమణులారా! మీ రెన్నఁడు నెట్టి
యపచారంబు గావింపవలదు. మఱియు సంతతి లభించువఱకు నెచ్చ
టికిని బోవలదు. పోయినచో మిమ్ము శపించెదను.'' అని బోధించి
వెడలిపోయెను. అనంతర మాకాంతలిరువురును స్వాభావికం బగు
వయోధర్మముచే గర్వితలై గంగాతీరంబున సప్తర్షిగణంబులును గావిం
చుచున్న బ్రహ్మబృందసమాకీర్ణంబగు మహాసత్రంబును గాంచఁబో
యిరి. తత్త్వదర్శు లగుమునివరు లెన్నియోపన్యాసములు నివా
రించినను వినక వారాయజ్ఞశాలయందే యుండి మునివరులసామగా
నంబులను హవిర్దానంబులను నపహసించుచుండిరి. స్త్రీజనంబులదుర్వి
నయంబు నెవ్వరు సహింపఁగలరు? బ్రాహ్మణులు వారివికృతవర్తన
ములం గాంచి కోపించి ॥మీరిరువురును రెండునదు లైపోవుదురు
గాక!'' యని శపించిరి. తోడనే యయ్యువతులిరువురును సుపర్ణాకద్రూనా
మకంబు లగునదు లైపోయిరి. అనంతర మొకప్పుడు కశ్యపప్రజాపతి
యింటికి నచ్చి తనయిరువురుభార్యలవృత్తాంతమును ఋషులవలన సవి
స్తరముగ నెఱింగి విస్మయాక్రాంతుండై యిప్పుడు నే నేమిచేయవల
యునని మునుల విచారించెను. తుద కాతఁడు వాలఖిల్యమునిగణం
బుల కీవృత్తాంత మంతయును దెల్పుటకు వారును విన్నులై ॥యో

మహాత్మా! నీవు గౌతమీతీరంబునకుం బోయి యచ్చట మహేశ్వరుని స్తోత్రంబు చేయుము. అందువలన మీకు మరల భార్యాద్వయంబు లభింపఁగలదు. మహాదేవుం డగుమహేశ్వరుండు బ్రహ్మహత్యాభయంబున భీతుండై గౌతమీజలమధ్యంబున మధ్యమేశ్వరనామంబున విఖ్యాతుండై నిత్యవాసంబుచేయుచున్నాఁడు." అని చెప్పుటయు జితవ్రతుం డగుకశ్యపుండు గోదావరికిం బోయి యందు సుస్నాతుండై పవిత్రంబులును, మనోహరంబులు నగు వాక్యంబులతో దేవదేవుండగుమహేశ్వరు నిట్లు వినుతింపందొడంగెను. "లోకత్రయంబునకధీశ్వరుండును నెందునేవస్తువునందు నెట్టియభిమానలేశంబు లేనివాఁడును అగు నిఖిలవిశ్వవిధాత శివుండు సిద్ధినాథుండు నాకుఁ బ్రసన్నుం డగుఁగాక! మహాదేవా! చరాచరప్రపంచమంతయును దాపత్రయరూపం బగు దివాకరతాపముచేఁ దపించి తల్లడిల్లుచుండును. ప్రాణిదుఃఖనివారణంబునకు నీవొక్కఁడవే సమర్థుఁడవు. నీగుణత్రయసంయోగవిశేషంబును గూర్చి దేవతలుగూడ గ్రహింపఁజాలరు. అట్టి విచిత్రమూర్తివగు నిన్నుఁ జింతించుచుండువారు సర్వదా సుఖులును, దానశీలురును, వరేణ్యులును గాఁగలరు."

అని యిట్లు కశ్యపుండు ప్రార్థించుటయు శంకరుండు ప్రసన్నుండై "ఓమునీంద్రా! నీయిరువురుభార్యలును మరలఁ బ్రాదుర్భూతలగుదురుగాక! నదీరూపములం దాల్చియున్నవారు సరిద్వరయగు గంగతోఁ గలిసికొన్నంతనే స్వస్వరూపములం దాల్చి గంగాప్రసాదముచే నెప్పటివలె గర్భిణు లయ్యెదరు" అని యనుగ్రహించెను. మహామునీంద్రుఁడగు కశ్యపుండును బ్రీతుఁడై శివానుగ్రహంబున భార్యాద్వయమును బడసి యాగౌతమీతీరమునందు బ్రాహ్మణుల నాహ్వానించి యక్కాంతలకు విధివిధానంబున సీమంతోన్నయనంబు నిర్వ

క్రించి బ్రాహ్మణగణంబులకెల్ల వివిధసత్కారములం గావించెను. ఆ కశ్యపునియింటఁ బ్రాహ్మణులు భోజనము చేయుచుండఁగా భర్తృపార్శ్వవర్తినియై యున్న కద్రూకాంత యావిప్రులవంక వక్రదృష్టిం బరగించి పరిహసించెను. అది చూచి బ్రాహ్మణులు సంక్షుభితులై "ఓ పాపాత్మురాలా ! నీవేకన్నులతో మమ్మపహసించితివో యాకన్నులు భగ్నంబులగుఁగాక" యని శపించిరి. తోడనే యాసర్పమాత గ్రుడ్డిదియైపోయెను. అప్పుడు కశ్యపుండు మహర్షుల నందఱను బలువిధముల వేఁడుకొనుటయు వారనుగ్రహించి "సరిల్లలామంబగు గౌతమిని సేవించినచో సమస్తకోటిపాపంబులైనను సంక్షయంబులు గాఁగలవు" అని సూచించిరి. అనంతరము కశ్యపమునీంద్రుండు భార్యాసహితుండై గౌతమీతీరంబునకుం బోయి సేవించి కృతకృత్యుండయ్యెను. అప్పటి నుండియు నాతీర్థము సంగమతీర్థం బను నామంబున విఖ్యాతం బయ్యెను. ఆతీర్థము సర్వపాపవినాశకంబును సర్వయజ్ఞఫలప్రదంబునై విరాజిల్లుచున్నది.

## సరస్వతీసంగమతీర్థము

సువిఖ్యాతం బగుపురూరవతీర్థము వేదవిదులచే నిర్దిష్టంబైనది. ఆతీర్థస్మరణంబునఁ బాపక్షయం బగును. తద్దర్శనంబువలనం గలుగు ఫలం బింతయని వచింపఁజాలము. ఒకప్పుడు పురూరవుండు బ్రహ్మసభకుం బోయి యచ్చట విరించిసమీపంబున సవిలాసంబుగ హాసించుచున్న సరస్వతీనదిం గాంచి విస్మితుండై రూపవతియగు నూర్వశి నుద్దేశించి "ఓ రమణీమణీ ! విలాసవతియు, సాధ్వియు నగు నీసుందరి యెవ్వరు ? ఈమె సరసిజాసను చెంత నుండి సభనంతను బ్రకాశింపఁ జేయుచున్నది. ఈయువతి రమణీసంఘంబునకు శిరోమణి యని తోఁ

చుచున్నది. ” అని ప్రశ్నించుటయు నూర్వశి రాజేంద్రా ! ఇక్ష్వాకు కమలగర్భుని తనయ. పుణ్యనిలయ యగు దేవనది సరస్వతి. ఈమె ప్రతిదినము నిచ్చటికి వచ్చుచుఁ బోవుచుండును. ” అని చెప్పెను. ఆ మాట విని పురూరవుం డాశ్చర్యంబు నంది యాసరస్వతి నెట్లైన నా చెంతకుఁ గొనిరావలయు నని యూర్వశి నర్థించెను. ఊర్వశియు నట్లే యని పోయి సరస్వతికి రాజాభిప్రాయము నెఱింగించెను. సరస్వతియు నట్లే యని యంగీకరించి పురూరవుని సన్నిధికిం బోయెను. పురూరవుండును సరస్వతీతీరంబున బహువర్షంబులవఱకును విలాసవిహారంబు గావించుచుండెను. కొంతకాలంబున కాతనివలన నామె గర్భంబున సరస్వంతుం డను కుమారునిం గాంచెను. ఆసరస్వంతునకు బృహద్రథుండను జనించెను.

సరస్వతి యిట్లు ప్రతిదినంబును పురూరవుని చెంతకుం బోవుచుండుట తనయనుచరులవలన వినియు, నామెకు సరస్వంతుండను తనయుండు గలిగెనని తెలిసికొనియు బ్రహ్మదేవుండు మిగులఁ గోపించి యాసరస్వతిని మహానది[illegible]శపించెను. ఆసరస్వతియు బ్రహ్మశాపంబునకు భీతయై గౌతమిచెంతకుం బోయి బ్రహ్మకమండలు సంజాతయు, నిఖిలజగత్పావనియు, లోకమాతృస్వరూపిణియు, ఐహికాముష్మికశుభఫలప్రదాయినియు, తాపత్రయ వినాశినియుఁ, బుణ్యసలిలయు నగు నానదీమతల్లిని గాంచి తనశాపవృత్తాంతమంతయు నామె కామూలాగ్రముగా నివేదించెను. అప్పుడు గౌతమి హిరణ్యగర్భు నుద్దేశించి “ ఓదేవా ! నీవు కృపాళుండవై యీసరస్వతికి శాపముక్తిం గావింపుము. ఈదేవిని శపించుట నీకు చితముగాదు. స్త్రీజనము పురుషులఁ గామించుటయే సహజస్వభావము గలదిగా ! దేవా ! సకలకాంతలును స్వభావచంచలలే యగుదురు. సకలజగంబును సృజించినను స్త్రీ

స్వభావ మేల తెలియలేదు ? ఓయంబుజాసనా ! ఈజగంబునఁ గాను వశీకృతులు గానివా రెవ్వరున్నారు ! " అని విన్నవించుటయు బ్రహ్మ దేవుండు సరస్వతికి శాపమోక్షణంబు గావించి యిఁక సరస్వతి యెల్ల రకును దృశ్యయగుఁగాక యనియెను. బ్రహ్మశాపవశంబున నప్పటి నుండియు సరస్వతి భూమండలంబున దృశ్యాదృశ్యరూపంబున విరాజి ల్లుచుండెను. సరస్వతి శాపాకులయై గంగానదితో సంగమించిన స్థాన మునకు ధార్మికుం డగుపురూరవుండు పోయి యచ్చట మహాతపంబు గావించి సిద్ధేశ్వరుండగు మహాదేవు ననుగ్రహంబునను, గంగాప్రసాదం బునను సర్వకామఫలసిద్ధుం డయ్యెను. అప్పటినుండియు నాతీర్థము పురూరవతీర్థం బని ప్రసిద్ధం బయ్యెను. ఆసరస్వతీసంగమతీర్థము బ్రహ్మ తీర్థనామంబునఁ గీర్తితం బయ్యెను. ఆస్థానంబున సిద్ధేశ్వరుండు విరాజి ల్లుచుండెను. ఆతీర్థము సర్వాభీష్టదాయకమైనది.

## పంచతీర్థవర్ణనము.

సావిత్రి, గాయత్రి, శ్రద్ధ, మేధ, సరస్వతి యనుతీర్థంబు లతి పవిత్రంబులని మునులు చెప్పుదురు. ఆతీర్థజలస్నానపానంబులవలన సకలపాపంబులను నశించి ముక్తి లభించును. సావిత్రియు, గాయత్రి యు, శ్రద్ధయు, మేధయు, సరస్వతియును కూడ బ్రహ్మతనూజలు. వారు ధర్మసంస్థాపనంబునకు హేతువులు. వారిలో జ్యేష్ఠురాలగు సావిత్రిని జలజాసనుండు సర్వలోకసుందరిగను, సర్వశ్రేష్ఠగను సృజిం చెను. ఆసుందరిం గాంచినంతనే పద్మగర్భునిహృదయము చలించుట యు నాతఁ డామెను గ్రహింపఁ బ్రయత్నించెను. కాని యాబాలిక యాతనియుద్దేశమును గ్రహించి భయపడి మృగరూపముం దాల్చి పలాయిత యయ్యెను. విరంచియు మృగరూపధరుండై యామెను

వెన్నంటి బయలుదేఱెను. ఆసమయంబున ధర్మరక్షణంబుకొఱకు శంకరుండు మృగవ్యాధరూపముం దాల్చి మృగరూపియగు బ్రహ్మయొద్దకుం బోయి నిన్ను నేను వధించెద నని శరాసనంబున బాణంబును సంధించెను. అప్పుడు విధాత మిగులభయపడి యాదుష్కర్మమునుండి నివృత్తుండయ్యెను. అనంతరమాకన్యలైదుగురును నదులైపోయిరి. అయినను బ్రహ్మసన్నిధికి యథారూపములతో వచ్చుచుఁ బోవుచుండిరి. ఆయైదుగురును నదులై సంగమించినస్థానము పంచతీర్థం బనఁ బేరందెను. ఆపుణ్యసంగమస్థానమునఁ గావించిన స్నానదానాదికంబులు స్వల్పంబులైనను నధికఫలప్రదంబు లగును. శంకరుండు మృగవ్యాధుండై ధర్మరక్షణంబు చేసినచోటు సర్వకామప్రదం బగుపుణ్యతీర్థం బయ్యెను. అచ్చటి బ్రహ్మతీర్థము స్వర్గమోక్షప్రద మైనది.

## —♦ శమ్యాదితీర్థవర్ణనము. ♦—

సర్వపాపప్రశమనం బగుశమీతీర్థము సుప్రసిద్ధమైనది. విజయుండును, క్షత్రకులాభరణుండు నగుప్రియవ్రతుండను నొకరాజు గలఁడు. ఆతఁడు గౌతమీదక్షిణతీరంబున నశ్వమేధదీక్షితుం డయ్యెను. ఆతనికి వసిష్ఠుండు పురోహితుండై యుండెను. ఇట్లు ఋత్విక్కులు, పురోహితులు, మహర్షులును బరివేష్టించి యుండ నారాజు యజ్ఞారంభంబు గావించెను. అప్పుడు హిరణ్యాసుండను నొకదానవుండు యజ్ఞక్షేత్రంబున కేతెంచుటయు నాతనిం గాంచి యింద్రాదిదేవతలు చాలమంది స్వస్థానమునకుం బలాయితులై పోయిరి. అగ్ని శమీవృక్షంబునందును, విష్ణుదేవుఁ డశ్వత్థవృక్షంబునందును, భానుం డర్కవృక్షంబునందును, శివుండు వటవృక్షంబునందును దాఁగి యుండిరి. హవ్యవాహనుండు గంగాజలమధ్యంబునఁ బ్రవేశించెను. అశ్వినీకుమారు

యజ్ఞాశ్వంబున విలీనులైరి. యముండు వాయసాకృతిం దాల్చెను. ఆసమయంబున భగవానుం డగువసిష్ఠుండు మాత్ర మించుకంతయును జలింపక తనబ్రహ్మదండముచే నాదైత్యుని ససైన్యముగ వితాడితుసం గావించి యాతండు పలాయితుం డైనంతనే మరల యజ్ఞారంభంబు సేయించి నిర్విఘ్నంబుగ సంపన్నంబు గావించెను. కావున నచ్చటి పూర్వోక్తతీర్థంబు లన్నియును దశాశ్వమేధఫలజనకంబులై విరాజిల్లెను. అందు మొదటిది శవినాతీర్థము, రెండవది వైష్ణవతీర్థము, మూండవది అర్కతీర్థము, నాల్గవది సౌమ్యతీర్థము, అయిదవది వసిష్ఠతీర్థము. ఈ సకలతీర్థంబులును సర్వకామప్రదంబులు. ఆయజ్ఞంబు సంపూర్ణం బైనంతనే సకలదేవతలును, ఋషులును సంతుష్టులై పురోహితుం డగు వసిష్ఠునకును, యజమానుం డగుప్రియవ్రతునకును ఆతీర్థమాహాత్మ్య మును, ఆవృక్షమాహాత్మ్యమును సవిస్తరంబుగ వినిపించి పరమానంద ముతో స్వస్థానంబులకుం బోయిరి. ఆతీర్థంబులన్నియు నశ్వమేధఫల ప్రదంబు లని దేవతలు చెప్పియుండిరి. అందు స్నానదానంబులం గావించు నరులు పవిత్రులగుదురు. మఱియు నశ్వమేధయజ్ఞఫలంబును గాంతు రనుటకు సంశయము లేదు.

—• సహస్రతీర్థవర్ణనము. "—

ఇక్ష్వాకువంశంబున సుప్రసిద్ధుం డగుహరిశ్చంద్రుం డను నొక మహారాజు గలండు. ఒకనాం డాతనిమందిరంబునకుం బర్వతనారదులు విచ్చేయుటయు నమ్మహీపాలుండు వారికి విధివిధానంబున నతిథిసత్కా రంబు లాచరించి "మునివరులారా! లోకమునందు సకలమానవులును బుత్రార్థమై యెట్టికష్టములనైన ననుభవించుచుందురు. పుత్రునివలన నేమిప్రయోజన మున్నది? జ్ఞానులును, అజ్ఞానులును, ఉత్తములును,

మర్త్యములనుగూడ నిట్టి పుత్రార్థులై శ్రమపడుచుందురు. ఈవిషయమే నాకు సంశయముగానున్నది. మహాత్ములగుమీరు నాకు బోధింపవలయును.” అని ప్రార్థించుటయు నద్దేవమునులు “మహారాజా! ఈ ప్రశ్నంబునకుఁ బదులును, నూఱులును, వేలును సహస్రంబులు గలవు. ఏమైననేమి—వానిలోఁ బ్రధానం బగునొక్కయుత్తరమును జెప్పెదను వినుము. అపుత్రకుఁడగువానికిఁ బరలోకగతి లేదు. పుత్రముఖదర్శనంబు గావించి సుస్నాతుం డగుపురుషుఁడు దశాశ్వమేధంబులు నిర్వర్తించి యవభృథస్నానంబు లాచరించినఫలంబు నందఁగలుగును. పుత్రునివలననే యాత్మప్రతిష్ఠయు, నమరత్వంబును సిద్ధించుచున్నది. దేవత లమృతమువలనను, బ్రాహ్మణాదివర్ణంబులవారు పుత్రులవలనను నమరత్వంబు గాంతురు. పుత్రుండు పితృపితామహాదులను ఋణత్రయవిముక్తులం గావించును. పుత్రవ్యతీతంబు లగు మూలజలాశనంబులును, సన్యాసాదులును, తపంబులును గూడ నెట్టిఫలంబును జేకూర్పఁజాలవు. పుత్రునివలననే స్వర్గమును మోక్షమును లభించును. పుత్రుఁడే మానవులకుఁ బరమార్థము. మఱియుఁ బుత్రుఁడే ధర్మమును, కామమును, అర్థము నగుచున్నాఁడు. పుత్రుఁడే మోక్షము. ఆతఁడే పరమజ్యోతి. సర్వజీవులను దరింపఁజేయుట కాతఁడే కర్త. ధర్మకామార్థసిద్ధికిఁ బుత్రుఁడొక్కఁడే పరమసాధనమగుచున్నాఁడు. అపుత్రకుం డగువాఁడు చేయుదానంబులును, వ్రతహోమాదికంబులును నిరర్థకంబు లగును. కావునఁ ద్రిజగంబులయందును బుత్రతుల్యంబగు వస్తు వేదియును లేదు” అని చెప్పిరి.

ఆమాటలు విని హరిశ్చంద్రుండు విస్మయాక్రాంతుండై “మహాత్ములారా! ఎప్పటికిఁ బోయి యేమి గావించిన నాకుఁ బుత్రలాభంబు గలుగును? ఏపురుషకారమువలన, నేయుపాయమువలన,

నేమంత్రజపంబువలన, నేయజ్ఞారంభంబువలనఁ బుత్రోత్పాదనంబగు నో యానతీయవలయును.'' అని ప్రార్థించుటయుఁ బర్వతనారదు లించుకసేపు ధ్యానంబు గావించి పుత్రార్థి యగుహరిశ్చంద్రుం గాంచి ''ఓసార్వభౌమా! నీవు గౌతమీనదికిం బొమ్ము. అచ్చట జలపతి యగువరుణుండు నీమనోభీష్టముం దీర్పఁగలఁడు. ఆజలపతి సర్వకామ ప్రదుం డని మునులు వచింతురు. కావున నాతండు ప్రీతుండైనచో యథాసమయంబున నీకుఁ బుత్రలాభంబు సమకూర్పఁగలఁడు.'' అని బోధించుటయు నృపవరుం డగుహరిశ్చంద్రుండు సంతుష్టుండై గౌత మీతీరంబునకుం బోయి వరుణారాధనంబు గావించెను. అంత వరు ణుం డాతనికి సాక్షాత్కరించి ''ఓరాజా! త్రిలోకాలంకారమూర్తి యగునొకపుత్రుని నీకుఁ బ్రసాదించెదను. ఆపుత్రమూలంబున నీవొకయ జ్ఞంబు గావించినచో మరల నీకొకపుత్రుండు లభింపఁగలఁడు'' అని యనుగ్రహించెను.

హరిశ్చంద్రుం డట్లే యని యంగీకరించి వారుణచరునిర్మాణం బు గావించి దానిని భార్యకొసంగెను. ఆమె దానిం గైకొని సేవించు టయు యథాకాలంబున నామెకొకసుపుత్రుం డుదయించెను. తరు వాత వాగ్మియగుజలపతి హరిశ్చంద్రునికడకుం బోయి ''రాజా! ఈ తనయునిమూలమున యజ్ఞాచరణంబు గావింపవలయు ననువిషయము నీకు జ్ఞప్తియందున్నదా?'' అని ప్రశ్నించుటయు హరిశ్చంద్రుండు మహాత్మా! దశదినంబులతిక్రమించువఱకు నితఁడు పవిత్రుండు గానే రఁడు. యజ్ఞపశువుగా నెట్లుపయోగించును? ఈదశాహానంతరంబున యజ్ఞంబు గావించెద'' నని చెప్పెను. ఆమాటకు వరుణుం డంగీకరించి స్వస్థానంబునకుం బోయి దశదినఁబులు గడచినంతనే మరల వచ్చి యజ్ఞంబు గావింపుమని కోరెను. అప్పుడు హరిశ్చంద్రుండు పుత్రస్నే

మచే ॥ దేవా! యీబిడ్డ కింకను బండ్లు రాలేదు. యజ్ఞపశువుగా నుపయోగించు టెట్లు? పండ్లు వచ్చిన వెనుక యజ్ఞము చేయుదును." అని చెప్పఁబడియు వరుణుండు వెడలిపోయి రాజపుత్రునకు దంతోద్గమంబై సప్తవర్షంబులయినాఁడు వచ్చినప్పుడు మరల వచ్చి యజ్ఞంబు సేయుమని హరిశ్చంద్రునిఁ గోరెను. అప్పు డాతఁ ॥డో జలపతీ! యీపసిపాపనికిఁ బాలపండ్లన్నియు నూడి నూతన దంతము లుదయించిన వెనుక యజ్ఞము చేసెద" నని చెప్పెను. వరుణుం డట్లేయని పోయి యథాసమయమునకు మరల వచ్చెను. ఆతనిం గాంచి హరిశ్చంద్రుండు ॥మహాత్మా! ధనుర్వేదాభ్యాసంబు గానిక్షత్రియకుమారుండు యజ్ఞపశుత్వమున కర్హుండు గాఁడు గదా" యని చెప్పెను. వరుణుం డింకేమి చేయఁగలఁడు? సరేయని వెడలిపోయెను. తరువాత రాజపుత్రుఁ డగు రోహితుండు సమస్తశస్త్రాస్త్రవిద్యా పారగుండై సర్వవేదంబులను సర్వశాస్త్రంబులను జదివి యరిందముండును షోడశవర్షవయస్కుండును నై యువరాజ్యంబున నభిషిక్తుం డయ్యెను. అంత నొకనాఁడు వరుణుండు ప్రీతచిత్తంబుతోఁ బుత్రసహితుం డగు హరిశ్చంద్రునొద్దకు వచ్చి నీ విప్పుడైన యజ్ఞానుష్ఠానంబు గావింపుమని కోరెను. అప్పుడు హరిశ్చంద్రుండు తనయంగీకారమును సూచించి వరుణసమక్షంబునఁ బుత్రు నుద్దేశించి ॥కుమారా! మహావీరా! నిన్నుఁ బశువుగఁ జేసి వరుణు నుద్దేశించి యజ్ఞంబు గావింపవలయును. లెమ్ము" అనియెను. ఆమాట విని రోహితుం డది యేమని యడుగుటయు హరిశ్చంద్రుఁడు సవిస్తరముగా నంతయు నాతని కెఱిఁగించెను. ఆమాట విని రోహితుండు ॥మహారాజా! బుత్రపౌత్రసహితంబుగ శుచియై లోకనాథుఁ డగువిష్ణుదేవు నుద్దేశించి యొకయజ్ఞంబు గావింపవలయు నని నే నిదివఱకే సంకల్పించియుంటిని. నీవును వరుణుండును ముందుగ నాకార్యం

బున కామోదింపవలయును'' అని విన్నవించుటయు వరుణుండు రో
హితవచనంబులకుఁ గ్రోధావిష్టుం డై వెడలిపోయెను. అకారణంబు
న హరిశ్చంద్రుండు జలోదరపీడితుం డయ్యెను. రోహితుండు దివ్య
ధనుర్బాణంబులఁ దాల్చి నిరుద్వేగంబుతో వనంబునకుం బోయెను.
పిమ్మట హరిశ్చంద్రుండు వరుణదేవు నుపాసించి పుత్రలాభంబు గాం
చినగంగాతీరంబునకుం బోయి తపస్సు నొనరించి యుండెను. ఇట్లయి
దాలుసంవత్సరములు గడచినతరువాత రోహితుండు తనతండ్రి రోగ
వార్త నాకర్ణించి తనలో "నేను పుత్రుండ నై పుట్టి తండ్రికిఁ గ్లేశకారి
నైతిని. ఇట్టి నాజననమువలన నేమి ప్రయోజనము?" అని విచారించి
వెంటనే గంగాతీరంబునకుం బోయి మహారాజులనేగంబున సందర్శించెను.
అందు నజీగర్తుం డను నొకఋషి ముగ్గురుపుత్రులతో ననుదరిద్రుం
డను బరివేష్టితుం డై జీవితము కష్టముగ నిర్వహించుచుండెను.
రోహితుం డాతనిం గాంచి నమస్కరించి "ఓ మునీంద్రా! నీవు కష్ట
తరియుఁడ వై క్షుధావ్యాకులుండ వై చింతాకులితహృదయుండ వై యుగ్ర
పడుచున్నావు. దీనికిఁ గారణ మేమో వచింపుము" అని యడు
గుటయు నజీగర్తుండు "రాజకుమారా! నా కష్టము చెప్పలేను.
నేను బోషింపవలసినవా రనేకు లున్నారు. అన్నము లేక మే మందఱ
మును జచ్చుటకు సిద్ధముగ నున్నారము. ఇంతకంటె మాకు జీవనో
పాయ మే మున్నది?" అని చెప్పుటయు రాజకుమారుఁడు "ఓ మునీం
ద్రా! నీయభిప్రాయ మేమో చెప్పుము" అనియెను.

అప్పు డజీగర్తుండు "నాకు స్వర్ణము గాని, రజతము గాని,
గోధనము గాని, ధాన్యము గాని, వస్త్రములు గాని యేమియును
లేవు. జీవితమున కెట్టివృత్తియును లేదు. భార్యాపుత్రసహితముగా
మే మైదుగుర మున్నారము. మాలో నెవ్వని నైనఁ గ్రయంబునకుఁ

గాని మా కింత యన్నము పెట్టఁగలరక్షకుం డెవ్వండును లేఁడు.” అనుటయు రోహితుండు మీలో నెవ్వరినైన విక్రయించుటకు సత్యముగా నుద్దేశ మున్నదా? బ్రాహ్మణుల సత్యవాక్కు లగుటచే నీ వన్యథా వచింప లేదని నేను భావించుచున్నాను” అనుటయు నజీగర్తుండు “నాకు ముగ్గురు పుత్రు లున్నారు; నేనున్నాను; నాభార్యయున్నది. కోరినధన మిచ్చి మాలో నెవ్వరినైనఁ గ్రయమునకుఁ దీసికొనవచ్చును. దానివలనఁ దక్కినవార మెట్లో జీవింతుము” అనియెను. రోహితుం డామాట విని “ఓమహాబుద్ధీ! మీరు వృద్ధులు. మీవలనఁగాని మీభార్యవలనఁగాని మా కెట్టిప్రయోజనమును లేదు. ముగ్గురు పుత్రులలో నొక్కయువకుని నాకు విక్రయింపవలయు” నని కోరెను. అప్పు డజీగర్తుండు నేను నాజ్యేష్ఠపుత్రుం డగు శునఃపుచ్ఛుని విక్రయింపఁజాలను. అట్లే కనిష్ఠపుత్రుని విక్రయించుట కాతని తల్లి యంగీకరింపదు. కావున నామధ్యమపుత్రుం డగు శునశ్శేఫుని నేను విక్రయించెదను. ఎంతమూల్య మిచ్చెదవో చెప్పుము.” అనియెను. రోహితుం డామాట విని వరుణయాగంబునకు గుణశ్రేష్ఠుం డగు నొకపురుషునిఁ బశువుగాఁ గల్పింపవలసి యున్నది. కావున నందులకు నీ వంగీకరించి నీకుమారుని విక్రయింపఁదలఁచితివేని యెంతమూల్యము వాంఛింతువో తెల్పు మనియెను. అజీగర్తుండు నట్లు విక్రయించుట కంగీకరించి వేయిగోవులను, విశేషముగ ధాన్యమును, సహస్రసువర్ణముద్రలను, సహస్రవస్త్రములను మూల్యముగ నిచ్చినచో నాకుమారుని విక్రయించెద ననియెను. రోహితుం డట్లే యని యజీగర్తున కాతఁ డడిగినధనంబును, వస్త్రాదులను సమర్పించి ఋషికుమారునిఁ గైకొని తండ్రిచెంతకుం బోయి తా నాఋషిపుత్రుని మూల్య మిచ్చి కొన్నవృత్తాంతమును దెల్పి కౌఁగిలించి “ఓతండ్రీ! నీ ప్రీతకు

శుమూలంబున వరుణయాగంబు నిర్వర్తించి రోగవిముక్తుండ వగు''మని విన్నవించెను. హరిశ్చంద్రుండును పుత్రవచనంబు లాలించి "యోకు మారా! బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులునను నీమూఁడు వర్ణము లవారును మహారాజుచేఁ బ్రతిపాలింపఁబడఁదగినవారు. అందు విశే షించి ద్విజశ్రేష్ఠులు సర్వవర్ణంబులకును గురువులు. భగవానుం డగు విష్ణుదేవునకుఁగూడఁ బూజనీయు లగుబ్రాహ్మణులు మనవంటివారి కెల్లవిధముల సన్మాననార్హులని వేఱుగఁ జెప్పనక్కఱలేదు. నాయనా! యిటు వినుము. ఎవ్వరినిఁ బరాభవించుటవలన నృపగణంబులకుఁ గుల క్షయ మగునో యట్టిబ్రాహ్మణుని బశువుగఁ జేసి యజ్ఞంబును గావించి నే నెట్లు దీనజనరక్షణంబునకు సమర్థుండను గాఁగలను? ఎట్లయిన నీబ్రాహ్మణు నెన్నఁటికిని యజ్ఞపశువుగాఁ జేయఁజాలను. ఇది కేవల మసంగతము. నాకు మరణ మైన నగుఁగాక! ఈద్విజపుత్త్రుని బశువుగాఁ జేయఁజాలను. కుమారా! నీ పితనిం గైకొని నీయిచ్ఛ వచ్చినచోటికిం బొమ్ము." అని చెప్పుచుండఁగా నాకాశవాణి "యో హరిశ్చంద్రసార్వభౌమా! నీవు ఋత్విక్కులను బురోహితులను బుత్రుఁడగు రోహితుని విప్రపుత్రయగు నీపశువును గూడ వెంటఁ బెట్టుకొని గౌతమీతీర్థంబునకుం బోయి యజ్ఞానుష్ఠానంబు గావింపు ము. అచ్చట నీశునశ్శేఫుని బశువుగ వధింపకుండఁగనే నీచేననుష్ఠిత మగుయజ్ఞంబు సంపన్నంబు కాఁగలదు. కావున నీ విప్పుడే గౌతమికిం బొమ్మని ప్రబోధించెను. హరిశ్చంద్రుఁ డావచనంబు లాలించి సత్వ రంబుగ గౌతమీతీరంబునకుం బోయి విశ్వామిత్రుఁడు, వశిష్ఠుఁడు, వామదేవుఁడు మొదలగుమహర్షిగణంబులతోఁగూడ నాగంగాతీరం బున నరమేధయజ్ఞంబున దీక్షితుం డయ్యెను. వేది మండప యూప కుండాదు లగుసమస్తయజ్ఞోపకరణంబులను యథావిధిగ సంకల్పితంబు

లయ్యెను. యజ్ఞారంభం బగుటయు శునశ్శేపుని పశురూపంబున బంధించి సమంత్రకంబులగు జలంబులచేఁ బ్రోక్షితునిఁ గావించిరి. అది యంతయుఁ గాంచి విశ్వామిత్రుండు సకలదేవతలను, మహాత్ములను, మహారాజగు హరిశ్చంద్రుని, అతనిపుత్రుండగు రోహితుని నిర్దేశించి "ఓ మహాత్ములారా! మీరందఱు నీద్విజపుత్రుని శునశ్శేపు ననుగ్రహింపవలయును. ఈయజ్ఞంబునందు వేఱువేఱుగ హవిర్భాగంబుల నభిలషించు దేవతలందఱు నీశునశ్శేపు ననుగ్రహింపవలయును. ఈయజ్ఞంబున మంత్రోచ్చారణపూర్వకంబుగ నీతని వపాలోమత్వఙ్మాంసంబులు హోమము చేయవలసి యున్నది. ఓసదస్యులగు బ్రాహ్మణవరులారా! మీరెల్లరును నాప్రార్థనమును మన్నించి గాత మీయందఱు స్నానముచేసి వేఱువేఱువిధంబుల దేవతలనందఱను మంత్రస్తోత్రంబులచేఁ బ్రసన్నులఁ జేసెదరు గాక! హవిర్భాగులగు దేవతలందఱును, మహాత్ములగు మునివరులెల్లరును బహుస్వరూపియగు నీవిప్రకుమారుని సంరక్షించెదరుగాక!" అని ప్రార్థించుటయు హరిశ్చంద్రుండును మునిగణంబులు నాతనివచనంబుల కంగీకరించిరి. అనంతరము శునశ్శేపుండు త్రిలోకపావని యగుగౌతమీగంగయందు సుస్నాతుండై హవిర్భాగహారులగు దేవతలందఱను స్తోత్రము చేయనారంభించెను. ఆస్తవంబునకు సమస్తదేవతలును సంతుష్టులై విశ్వామిత్రుండు వినుచుండ శునశ్శేపునుద్దేశించి "ఈయజ్ఞంబు శునశ్శేపవధవ్యతిరేకంబుగనే సర్వసంపన్నం బగుఁగాక" యని యనుగ్రహించిరి. యజ్ఞకర్త యగువరుణుఁడే స్వయముగ వచ్చి హరిశ్చంద్రున కీప్సితంబు నెఱింగించెను. హరిశ్చంద్రుని లోకవిశ్రుతం బగునరమేధయాగ మప్పు డీవిధముగా సంపూర్ణం బయ్యెను. దేవగణంబులును, మునిగణంబులును, క్షితిరాజంబును బ్రసన్నంబు లగుటవలననే యమ్మ

హా రాజు మహేశ్వరం బిట్లు ఫలసిద్ధిం గాంచెను.

అప్పుడు విశ్వామిత్రుండు దయ్యాశ్వరపరిషన్మండలంబున శునశ్శేఫుని బరమాదరంబునఁ గౌఁగిలించుకొని యాత్మపుత్రునిగా భావించి యాదరించెను. విశ్వామిత్రుండు శునశ్శేఫుని దన జ్యేష్ఠపుత్రునిగాఁ జేసికొనియెను. కాని యాతనిపుత్రులు శునశ్శేఫునిఁ దమకు జ్యేష్ఠునిగ నంగీకరింపఁజాలరైరి. అందువలన విశ్వామిత్రుండు కోపించి తన కుమారులను శపించెను. అందు శునశ్శేఫుని జ్యేష్ఠునిగా నంగీకరించిన వారే విశ్వామిత్రున కాదరపాత్రులైరి. ఈసంఘటనంబులన్నియును గౌతమీదక్షిణతీరంబునఁ దటస్థించెను. ఆతీరదేశంబున విఖ్యాతంబులగుపుణ్యతీర్థంబు లనేకంబులు గలవు. అందు హరిశ్చంద్ర శునశ్శేఫ విశ్వామిత్ర రోహితాదినామంబులచే నష్టసహస్రచతుశ్శతతీర్థంబులు విరాజిల్లుచున్నవి. ఆసకలతీర్థంబులందును స్నానదానంబులం గావించువారు నరమేధయాగఫలంబు నందఁగలరు. ఈయాఖ్యానమును భక్తితోఁ బఠించువారును, బఠింపఁజేయువారును, వినువారును నపుత్రకులైనను బుత్రవంతులగుదురు. వారియభీష్టంబు లన్నియును సిద్ధింపఁగలవు.

## —• నదీసదసంగమతీర్థవర్ణనము. •—

ఓనారదా! సువిఖ్యాతం బగుసోమతీర్థము పితృగణంబులకుఁ బ్రీతిదాయకమైనది. పూర్వకాలంబున నమృతమయుండగు సోముండు గంధర్వులకు రాజై యుండెను. ఆతఁడు దేవతలతో లేకుండుటచే దేవతలందఱును గలసి యొకప్పుడు బ్రహ్మయొద్దకుఁ బోయి "యో పద్మాసనా! మాకుఁ బ్రాణప్రదుండైనసోముని గంధర్వులు పైకొని యున్నారు. మేమును దేవర్షిగణంబులును గూడ నాతనికొఱ కతిదుః

శితులమై యున్నాము. అందుచే మరల నెట్లయిన మాకు లభించును పాయంబు నానతీయవలయును." అని ప్రార్థించుటయు సరస్వతీదేవి దేవతలం గాంచి "ఓ దేవతలారా! గంధర్వు లెల్లప్పుడును కేవలము స్త్రీజనానురాగులై యుందురు. కావున మీరు నన్ను వారికి సమర్పించి మీ సోముని గైకొనుడు." అనిచెప్పెను. అనుటయు దేవతలు వాగ్దేవిం గాంచి "తల్లీ! మేము నిన్నట్లు సమర్పించుటకు సమర్థులము గాంజాలము. సోముండు లేకున్నను మేము జీవింపఁగలము గాని నిన్ను విడిచి మే మొక్కనిముసమైనను నిలువఁజాలము. అనుటయు భారతీదేవి నేను మరల నిచ్చటికే వచ్చెదను. ఈవిషయంబున మీ రొక్క కార్యంబు గావింపవలయును. మీ రందఱును గలిసి గౌతమీదక్షిణ తీరంబున నొకమహాయజ్ఞంబు గావింపవలయును. అచ్చటికి దేవగంధర్వాదు లెల్లరును జేరుట తటస్థించును. గంధర్వులు నిత్యమును రమణీప్రియులై యుందురు. ఆసమయంబున మీరు వారికిఁ జంద్రునకొఱకు నన్నుఁ బణంబు గావింపుఁడని యుపదేశించెను. సరస్వతీవచనంబులయందలివిశ్వాసంబుచే దేవతలందఱు నట్లు చేయుట కంగీకరించిరి. అనంతరము దేవయక్షగంధర్వపన్నగాదు లెల్లరును వేఱువేఱుగ దేవగిరియందు జరుగఁబోవుమహాయజ్ఞంబునకు విచ్చేయవలయునని దేవదూత లాహ్వానంబు గావించిరి. సురగంధర్వయక్షకిన్నరసిద్ధసాధ్యులును, ఋషిగణంబులును దేవగిరికి విచ్చేసిరి. గౌతమీతీరంబున మహర్షులచే నధ్వరారంభంబు గావింపఁబడియెను. అప్పుడు సహస్రాక్షుండు ఓదేవతలారా! మీరు గంధర్వులను బూజించి వారికి సోమునకు బదులుగా సరస్వతిని సమర్పించువిషయమును బ్రస్తావింపవలయునని తెలియఁజేసెను. దేవత లట్లు తెలుపుటయు స్త్రీకాముకు లగుగంధర్వులు సరస్వతినిఁ గైకొని సహస్రాక్షునకు సోముని సమర్పించివైచిరి.

అప్పటినుండియు నమరగణంబులకుఁ జంద్రుండును గంధర్వగణంబుల కు సరస్వతియు నాత్మీయులైరి. సరస్వతి గంధర్వులచెంతనే నివసించి యుండెను గాని రహస్యముగా నామె నిత్యమును సురగణంబులచెంత కేతెంచుచు నీవిషయమును నిగూఢముగ నుంచవలయు నని వారికి బోధించుచుండెను. దేవతల కీరీతిగా సోమక్రియంబు సిద్ధంబయ్యెను. క్రమక్రమముగ సోముండును సరస్వతియుఁగూడ దేవతలవారే యైరి. గంధర్వులలో వారెవ్వరును నిలుచుటయే లేదు. దేవతలచే నిట్లు సోమసంగ్రహంబు గావింపఁబడినయాసమయంబున గౌతమీతటంబున గోవులు, దేవతలు, పర్వతములు, యక్షులు, రాక్షసులు, సిద్ధులు, సాధ్యులు, మునులు, గుహ్యకులు, గంధర్వులు, మనుష్యులు, పన్నగులు, సంజీవన్యాదిసర్వౌషధులు, లోకపాలకులు, రుద్రులు, ఆదిత్యులు, అష్టవసువులు, అశ్వినీకుమారులు, మఱియుయజ్ఞభాగయోగ్యులగు సకలదేవతలును సమ్మిళితులైయుండిరి. ఇంతయేకాక తత్కాలంబునఁ బంచవింశతినదులు గౌతమీగంగయందుఁ బ్రవేశించియుండెను. ఆయ్యజ్ఞంబునందుఁ బూర్ణాహుతి గావించినస్థానము పుణ్యతీర్థంబనునామంబునఁ గీర్తితంబయ్యెను. గౌతమియందు నదులన్నియును బ్రవేశించినస్థానములు తన్నదీనామంబులచేఁ బ్రసిద్ధము లయ్యెను. ఆపుణ్యతీర్థంబుల లో సోమతీర్థము, గంధర్వతీర్థము, దేవతీర్థము, పూర్ణాతీర్థము, సాలతీర్థము, శిప్రస్నానసంగమతీర్థము, స్వాగతాసంగమతీర్థము, కుసుమాసంగమతీర్థము, పుష్టిసంగమతీర్థము, శుభకర్ణికాసంగమతీర్థము, వైష్ణవీసంగమతీర్థము, వాసవీసంగమతీర్థము, మఱియు శిల్య, ఆర్య, శిఖ, కుసుంభిక, ఉపావద్య, శాంతిజ, దేవజ, అజ, వృద్ధ, భద్ర, సురయనునదులు గౌతమీసంగతంబులైనతీర్థంబులును సుప్రసిద్ధంబులు. ఆదేవపర్వతంబున మఱియు భానుమండలస్థంబులగు నాలుగుదీనదసంగమతీర్థంబులును

సన్నిహితంబులయ్యెను. సోమసంగ్రహణార్థమై యాతీర్థంబు లన్నియును నయ్యక్షమండపమునకు విచ్చేసెను. ఆతీర్థంబులన్నియును గౌతమీగంగయందు సంగమించి కొన్నికొన్ని నదులుగను, కొన్నికొన్ని సరోవరంబులుగను, కొన్నికొన్ని స్థిరంబులుగను విఖ్యాతంబులయ్యెను. ఈ సకలతీర్థంబులయందును స్నానతపంబులును, జపహోమాదులును, పితృతర్పణంబులును గావించుట మానవులకు శుభకరము. ఈతీర్థసేవనంబు సర్వకామప్రదంబును, భుక్తిముక్తిదాయకంబు నైనది. ఈతీర్థనామంబులు స్మరించినను, ఉచ్చరించినను సర్వపాపవిమోచనం బగును.

## అమృతాసంగమతీర్థము.

ప్రవరాసంగమం బను నొకమహానది గలదు. అచ్చట సకలలోకహితకరుం డగు సిద్ధేశ్వరుండు విరాజిల్లుచుండెను. పూర్వకాలంబున దేవాసురుల కతిదారుణం బగుసంగ్రామంబు జరిగెను. కొంతకాల మట్లు పోరాడినతరువాత నిరుతెగలవారును మేరుశైలంబునం గలసి యాలోచించుకొని యందఱును బ్రయత్నించి యెట్లయిన నమృతమును సంపాదించి తన్మూలమున నెల్లరు నమరత్వంబుగాంచవలయు ననియుం దరువాత నైకమత్యముతో లోకపాలనంబు చేయుచు శాంతిసుఖంబులం గాంచవలయు ననియు, నింతటినుండి పరస్పరయుద్ధవిగ్రహంబులు మానవలయు ననియు, యుద్ధము దుఃఖమూలం బనియు, స్వార్జితసంపత్తిమూలంబున నన్యోన్యమును మాత్సర్యంబు లేకుండం బ్రేమభావంబున భోగానుభవంబు గావింపవలయు ననియు నిశ్చయించుకొనిరి. మఱియు వారు పరస్పరస్నేహాభావమే యన్యోన్యసుఖదాయకం బనియు, విపరీతవ్యవహారంబులయందు మన మెన్నండును బ్రవే

శింపరాదనియు, త్రైలోక్యరాజ్యమైనను, కైవల్యమైనను, నంతకంటెను మించినసుఖంబైనను నిర్వైరంబువలననే లభించుననియు భావించుకొని నైకమత్యంబు గాంచి శత్రుత్వమును విడిచి యుండిరి.

ఈవిధముగా దేవాసురులు పరస్పర శ్రేయోభిలాషులై మందర పర్వతమును గవ్వముగను, వాసుకిని రజ్జువుగను జేసి సముద్రమును మథింప నారంభించిరి. అప్పు డాసాగరంబునందు బవిత్రంబును సురప్రియంబు నగునమృతం బుత్పన్నంబయ్యెను. అది చూచి వారందరును కృతకృత్యులమైతి మని భావించి యిప్పు డెవరిస్థానంబులకు వారుపోవుటకును, మరల నొకశుభముహూర్తంబున వచ్చి యీయమృతంబును యథాయోగ్యంబుగ బంచుకొని యనుభవించుటకు నిశ్చయించుకొని యసురులు సురులునుగూడ స్వస్థానంబులకుం బోయిరి. రాక్షసు లట్లు పోయినతరువాత దేవతలందఱు నొక్కచోఁ జేరి " భాగ్యవశంబున మనశత్రువులందఱును వదలిపోయినారు. మంచి పని జరిగినది. ఈయమృతమునం దొక్కచుక్కయైనను రక్కసులకు దక్కనీయఁగూడదు." అని యాలోచించుకొనిరి. బృహస్పతి యందుల కంగీకరించి " దేవతలారా! పాపాత్ములగు రాక్షసుల కించుమాత్రమును దెలియకుండ మీరీయమృతమును సేవింపవలయును. శత్రువుల కెట్టియినను బరాభవంబు గావించుటయే యుచితాలోచనము. ద్వేషింపఁదగినవారి నెప్పుడును ద్వేషించుటయే కర్తవ్యము. శత్రువుల నెన్నఁడును విశ్వసింపఁగూడదు. వారితో నాలోచింపఁగూడదు. వారికెట్టిరహస్యమును వెల్లడింపఁగూడదు. కావున నసురుల కీయమృతంబు నీయఁగూడదు. అమృతపానంబు గావించినచో వారుగూడ నమరులే యగుదరు. అట్లయినచో వారిని బరాజితులం గావించుట యసాధ్యము."

అని బోధించుటయు దేవతలందఱు నంగీకరించి "ఓ గురు
వర్యా! మనమెప్పటికిఁ బోవుదము. ఎప్పటికేఁగిన మనకు మన
మంత్రరక్షణం బగును? ఎచ్చట మనమీ యమృతమును సేవింపవల
యును? ఈవిషయంబును మాకు బోధింపవలయును. మేము నీయా
జ్ఞననుసరించి వర్తించెదము" అని విన్నవించుటయు బృహస్పతి "ఓ
యమరవరులారా! మీరిప్పుడు వనజాసనుని చెంతకుం బోయి యివ్వి
షయంబున నుపాయంబు నెఱింగింపఁ బ్రార్థింపుఁడు. ఆపితా
మహుండు జ్ఞాతయును, వక్తయును దాతయుఁగదా!" అని యుపదే
శించెను. దేవతలప్పుడు బ్రహ్మసన్నిధికిం బోయి యాతనికిఁ బ్రణా
మంబులర్పించి యావృత్తాంతము సర్వము నివేదించిరి. అప్పుడు
విరించి విబుధగణంబులతోఁగూడ విష్ణుదేవుని సన్నిధికిం బోయి వారి
వారల సముక్షంబున నీవిషయంబుల నెఱిగించెను.

అనంతరము బ్రహ్మయు, విష్ణువును, మహేశ్వరుండును బా
గుగ నాలోచించి సకలదేవతలను వెంటఁబెట్టుకొని రాక్షసుల కెవ్వ
రికి నెఱుంగరాకుండ మేరుకందరమునకుం బోయిరి. అప్పుడు విష్ణుదే
వుని రక్షణంబునకు నియోగించి దేవతలు సోమపానంబున కుద్యుక్తు
లైరి. అప్పుడు సోమపానంబున కర్హులెవ్వరో, యెవ్వరనర్హులో యాది
త్యుఁడు పరిశీలించుచుండెను. విష్ణుదేవుండు రక్షకుండై యుండెను.
సోముం డమృతదాత యయ్యెను. ఈరహస్యకృత్యమును సింహికాసు
తుండును, మహాప్రాజ్ఞుండు నగు రాహువు దక్క నితరదైత్యులును,
దానవులు నెవ్వరు నెఱుంగఁజాలకుండిరి. రాహువీసంగతిని గ్రహించి
కామరూపధారియై దేవగణమధ్యంబునఁ బ్రవేశించి యుండెను. ఆతఁ
డు దేవతలలో నొకఁడుగనే పానపాత్రను దాల్చియుండెను. దివాక
రుం డది చూచి సోమునకు సంజ్ఞ చేసెను. సోముండు విష్ణుదేవునకు

విజ్ఞాపనంబు గావించెను. ఆసంగతి విన్నంతమాత్రముననే చక్రధరుండు సుధాపానంబు గావించుచున్న రాహువు మస్తకంబును ఖండించివైచెను. కాని యాశిరం బమరత్వంబు నందెను. ఆదైత్యుని శిరోవిహీనం బగుకళేబరముమాత్రము మహీతలంబునఁ బొరలాడుచుండెను. అమృతస్పర్శనంబు గాంచిన యామొండెముగూడ నమరత్వంబు గాంచి గౌతమీదక్షిణతీరంబున భూతలం బాతయును బ్రకంపితం బగునట్లు పడిపోయెను. అది యొకయద్భుతసంఘటనముగాఁ బరిణమించెను. మొండెము శిరంబును, శిరము మొండెమును నపేక్షించియుండును. కాని యప్పుడాయావశ్యకము లేకుండ శిరంబును మొండెమునుగూడఁ బ్రత్యేకముగ నమరత్వముం గాంచెను.

దేవత లవియంతయుం గాంచి శంకాన్వితస్వాంతులై "ఈమస్తకంబు శరీరంబును జేరుట తటస్థించినచో నీతండు సమస్తదేవతలను భక్షించివైచునంతటిసమర్థుండు గాఁగలఁడు. కావున మన మీభూతలపతితం బగుశరీరమును దహించివేయవలయును." అని యూహించుకొని వారందఱును ససంభ్రములై పోయి యావృత్తాంతమును శంకరునకు నివేదించి "మహాదేవా! ఈదైత్యదేహమును నీవే సంహరింపవలయును. నీవు కరుణాసాగరుఁడవు. శరణాగతరక్షకుఁడవు. ఈరక్కసుని కళేబరము మరలఁ దలతోఁ గలియకుండునట్టియుపాయమును నీవే కావింపవలయును." అని ప్రార్థించుటయు మహాదేవుండు మాతృగణసహితంబుగా జగన్మాతయు, లోకపాలినియు నగుతనయీశ్వరీశక్తిని ప్రేరణంబు గావించెను. ఆశక్తియు సర్వాయుధధారిణియు, భోజనాకాంక్షిణియు నై మహీతలగతం బగుదైత్యదేహంబు మెక్కుచుఁబోయెను. సకలదేవతలు నొక్కటిగాఁ జేరి మేరుపర్వతమున నాదైత్యశిరంబును శాంతింపఁజేయుటయందు సప్రయత్నులై యుండిరి. అప్పుడయ్యా

శ్వరి సకలశక్తిపరివారసహితయై యాదైత్యదేహముతో బహువర్ష
ములవఱకును మహారణంబు గావించుచుండెను.

అప్పుడు రాహుశిరంబు దేవతలనుద్దేశించి " సురవరులారా! మీరు నాదేహమును భేదించి యందుగల యుత్కృష్టరసంబు నాకర్షింపుఁడు. ఆయుత్తమరసంబు వెడలిననే యాదేహము భస్మీభూతం బైపోవును. కావున ముందుగ మీరాపని చేయుఁడు. ఈవృథాశ్రమం బంతయు నెందులకు ? " అని తెలియఁజేసెను. ఆమాట విని దేవతలందఱును ప్రీతులై యారాహుశిరంబును గ్రహగణమధ్యంబునఁ బ్రతిష్ఠించి యభిషిక్తంబు గావించిరి. ఆరాహువును గ్రహపదలాభంబు నంది ముదంబు గాంచెను. అనంతరము దేవతలవచనానుసారంబుగా నాశివశక్తియు నయ్యసురుని కళేబరంబును భేదించి దానినుండి సత్వరంబుగా నత్యుత్తమంబగు సుధారసంబు నాకర్షించి నీరసంబగు నమ్మాంసమును భక్షింప నారంభించెను. ఆదేవి యగు నంబికకాళరాత్రి, భద్రకాళి, మహాబలయను వివిధనామంబులచేఁ బ్రకీర్తితయయ్యెను. అద్దేవి యాదైత్యదేహమునుండి సుధారసము నాకర్షించి యొక్కచోటఁ జేర్చెను. ఆరసంబు క్రమంబుగాఁ బ్రసరించి పవిత్రనామంబున నదీరూపంబుగాఁ బరిణమించెను. అవశిష్టం బగురసంబు నద్దేవి సేవించివైచెను. రాహుదేహరససముద్భూత యగు నాశ్రవణానది శుభావహంబగు నమృతజలంబులతోఁ బ్రవహించుచు రుద్రశక్తిసమన్వితయై మహాప్రవాహంబుగ విరాజిల్లుచుండెను. ఆనదియందు బహుగుణాఢ్యంబు లగు పంచసహస్రతీర్థంబులుగలవు. అందు సర్వదేవతాగణపూజితుండగు శివుండు స్వయంబుగ నివసించి యుండును. దేవతలందఱును సంతుష్టులై వేఱువేఱుగా నానది కనేకవరంబుల నొసంగిరి. దేవత లన్నదీమతల్లినుద్దేశించి " ఓదేవీ ! [illegible]

యగుశంభుం డెట్లు జగత్పూజ్యుం డై యుండునో యట్లే నీవును బూజనీయవయ్యెదవు గాక! లోకహితంబుకొఱకు నీవిచ్చట వసింపుము. ఓరసేశ్వరీ! నీవు సకలజీవులకును సిద్ధిదాయినివై సర్వదా భూమండలమునఁ బ్రసిద్ధిం గాంచి యుండుము. నీనామకీర్తనంబును, నీస్తోత్రంబును, నీధ్యానంబును సకలాభీష్టప్రదంబు లగుఁగాక! భక్తియుక్తులై సర్వదా నీకుఁ బ్రణామంబు లర్పించువారు నీయనుగ్రహంబుచే సర్వార్థసిద్ధు లగుదురుగాక! సనాతనులగు శివశక్తులిట్లు నిత్యసన్నిహితులై యుండుటచే నీస్థానంబునకు నివాసపుర నామంబు విఖ్యాతం బగుఁగాక నీవు గౌతమీగంగతో సంగమించిన యీస్థానము సర్వదేవతాప్రియం బగుఁగాక. ఇచ్చటి స్నానదానాదికంబులు భుక్తిముక్తిప్రదంబు లగుఁగాక! ఈక్షేత్రంబునందు మానవులకు దేవదుర్లభంబు లగునభీష్టంబులుగూడ లభించుఁగాక!" అని యనుగ్రహించి సకలదేవతలు నంతర్హితులైరి. మహాదేవుండు పంపిన శక్తి యమృతమై యీవిధముగాఁ బ్రవరానదీనామంబున విఖ్యాతిలాభముం గాంచెను.

## వృద్ధాసంగమతీర్థము.

వృద్ధాసంగమతీర్థంబున వృద్ధేశ్వరుం డగుశివుండు ప్రతిష్ఠితుం డై యుండును. ఈతీర్థచరిత్రము పాపనాశకరంబైనది. పూర్వకాలంబున వృద్ధగౌతమ నామంబున మహాతపుండగు నొకమునీంద్రుం డుండెను. అతఁడు గౌతమునకు మఱియొకపుత్రుఁడు. ఆమునికుమారుండు బాల్యమునుండియు నాసికావిహీనుండై యుండెను. అట్టివికృతరూపముతోనే యాతఁడు జన్మించెను. క్రమక్రమముగా వృద్ధగౌతముండు వైరాగ్యంబు గాంచి వివిధతీర్థక్షేత్రంబులకుఁ బర్యటనంబు గావింప నారంభించెను. నాసికావిహీనుండగుటచే నాతఁ డేగురుని యొక్కనైనను

విద్యాభ్యాసంబు గావించుటకు సిగ్గుపడియెను. శిష్యులగుమునికుమా రులతోఁ గలసియుండుటకుఁగూడ నతండు లజ్జించెను. తండ్రియగు గౌతముం డాతనికి యజ్ఞసమయంబున నుపనయనంబు గావించెను. అనంతరము వృద్ధగౌతముండు మరలఁదీర్థసేవనంబునకు బయలుదేఱెను. ఈవిధముగాఁ జాలకాలము గడచెను. గాయత్రీమంత్ర మొక్కటియే యాతనికిఁ బరమవిద్యయై యుండెను. అంతకంటె నెట్టివేదాధ్యయనముగాని, శాస్త్రసమాలోచనముగాని యాతని కించుకంతయును సంప్రాప్తింపలేదు. నిత్యము నాతఁడు నియతవ్రతుండై యగ్నికార్యంబు గావించుచుఁ గేవలగాయత్రీమంత్రాభ్యాసంబువలన నామమాత్రబ్రాహ్మణుండై యుండెను. అగ్నినుపాసించుటవలనను, గాయత్రినిజపించుట వలనను నాతని బ్రాహ్మణత్వము సురక్షితం బయ్యెను. విధ్యుక్తంబుగ నగ్నిదేవుని, గాయత్రీదేవిని నుపాసించుటవలన నాతనికిఁ గ్రమక్రమముగా నాయుర్వృద్ధి యగుచుండెను. ఆతనికిఁ బెండ్లి కాలేదు. ఆతనికిఁ గన్యనిచ్చుట కెవ్వరు నంగీకరింపకపోయిరి. ఆతడనేకపుణ్యవనంబులను, బుణ్యక్షేత్రములను, బుణ్యతీర్థములను దర్శించుచుఁ బ్రచారము చేయుచుండెను. అట్లాతఁ డనేకాశ్రమంబులను గాంచెను.

ఇట్లు పరిభ్రమించుచు నాతఁ డొకప్పుడు హిమవన్నగంబునకుఁ బోయి యచ్చట వల్లీవిలపమాలినిమనోహరం బగు నొకగుహం గాంచి యందునివసింపవలయు నని యాలోచించుకొని యాగుహామధ్యంబునఁ బ్రవేశించి యందొక యుత్తమురాలగు కాంతం గాంచెను. అక్కాంత వృద్ధురాలును, కృశశరీరిణియు, శిథిలావయవయు, తపోనిరతయు నై యుండెను. ఆమె బ్రహ్మచర్యవ్రతంబు నవలంబించి విషయలాలసత్వమును బరిహరించి యానిర్జనస్థానంబున నేకాకిని యై నివ

సించి యుండెను. మునిశ్రేష్ఠుం డగువృద్ధగౌతముం డామెను గాంచి నమస్కరించుట కుద్యుక్తుం డగుటయు నావృద్ధురా లాతని వారించి "మహాత్మా! నీవు నాకు గురుండవు. నేను నీకు నమస్కారార్హను గాను. గురునిచే నమస్కారంబు నొందువాని యాయువును, విద్యయు, ధనంబును, గీర్తియు, ధర్మంబును, స్వర్గాదిఫలంబులును గూడ వినష్టంబు లైపోవును." అనిచెప్పుటయు వృద్ధగౌతముండు విస్మితుండై నిటలతటంబున నంజలి ఘటియించి "ఓభగవతీ! నీవు తపస్వినివి. అందుచే గుణజ్యేష్ఠురాలవు. మఱియు నాకంటె వయోవృద్ధురాలవు. అల్పవిద్యావంతుండను, అల్పవయస్కుండను, అల్పుండను నగునేను నీకు గురుండ నెట్లగుదును? నీ వట్లు భావించుట యుచితముగాదు." అనుటయు నావృద్ధురాలు "మునీంద్రా! పూర్వము ఋతుధ్వజుం డనునొకరాజు గుణవంతుండును, మతిమంతుండును, బలవంతుండును, క్షత్రధర్మపరాయణుండును నై యుండెను. ఆతఁ డొకప్పుడు మృగయార్థమై యరణ్యంబునఁ బ్రవేశించి యీగుహామధ్యంబుననే విశ్రమించి యుండెను. ఋతుధ్వజుం డప్పటికి యువకుండును, విచక్షణుండును, సర్వకార్యదక్షుండును నై యుండెను. అప్పు డాతనిచెంత బహుపరివారంబును, వాహనాదులును బరివేష్టించి యుండెను. ఈగుహామధ్యంబున నున్నప్పుడు గంధర్వరాజదుహిత యగుసుశ్యామ యనునొక యచ్చరవెలంది యాతనిం గాంచెను. ఆరాజుగూడ నామెం గాంచి కామపీడితుం డయ్యెను. అయ్యప్సరోరమణియు నామహారాజుం గామించెను. ఓమహామతీ! అప్పు డయ్యిరువురకును బరస్పరసంయోగంబు గలిగెను. కామావసానంబున నారాజేంద్రుం డాసుశ్యామ నచ్చట విడిచి స్వకీయంబగురాజధానికిం బోయెను. అనంతరము కాలక్రమంబున నాసుశ్యామగర్భంబున నేను జన్మించితిని. ఓతపోధనా! మా

తల్లి న న్నీగుహామధ్యంబున నుంచి వెడలిపోవుచు ''నో బిడ్డా! నీ విచ్చటినుండి యెచ్చటికిని బోవలదు. ఈగుహామధ్యంబునఁ బ్రవేశించుపురుషుఁడే నీకు భర్త కాఁగలఁడు.'' అని చెప్పి స్వస్థానంబునకుం బోయెను. అప్పటినుండియు నే నీగుహయందే నివసించియున్నాను. ఇంతకాలంబునకుఁ బురుషుఁడవు నీ వొక్కఁడవే యిచ్చటికి వచ్చితివి. ఇంతకుఁ బూర్వము నా కిచ్చట మఱే పురుషదర్శనమును గాలేదు. నా మాతృవచనంబును బట్టి నీవే నాకు భర్త వైతివి. ఓబ్రాహ్మణప్రవరా! నాతండ్రి యగుఋతుధ్వజుం డశీతిసహస్రవర్షంబులు రాజ్యపాలనంబు చేసి యిచటనే తపశ్చరణంబు గావించి స్వర్గంబునకుం బోయెను. అతనియనంతరమున నాభార్యకూడ దశసహస్రవర్షంబులు ధరణీతలంబు నేలి యాతండును స్వర్గప్రాప్తుండయ్యెను. నేను నాతండ్రిరాజ్యపరిపాలనకాలంబునుండియు నీగుహామధ్యంబుననే యున్నాను. నా కింకను వివాహము కాలేదు. నా కిప్పుడు తల్లిగాని, తండ్రిగాని యెవ్వరును లేరు. నాకు నేనే కర్తనై స్వతంత్రురాలనై యున్నాను. మఱియు నేను రాజకుమారికను. కావున నోవిప్రశ్రేష్ఠా! వ్రతచారిణిని. పురుషార్థినిని నైననన్ను నీవు వరింపవలయును.'' అనికోరుటయు వృద్ధగౌతముండు ''ఓభద్రా! నేను కేవలము వేయేండ్లవాఁడను. నీవు నా కంటె నెన్నియో వేలయేండ్లవయోధిక వైయున్నావు. నీమాటకు నే నేమి చెప్పఁగలను? నేను బాలుఁడను. నీవు వృద్ధురాలవు. ఇట్టి మనయిరువురకును బరస్పరవైవాహికసంబంధము సంఘటనం బగుట యసంభవము.'' అనియెను. అప్పుడావృద్ధురాలు ''మహాత్మా! యెట్లయినను నీవే నాకు భర్తగా నిర్దిష్టుండ వైతివి. ఇఁక నామనం బితరపురుషులవంకకుఁ బ్రసరింపఁజాలదు. నాకుఁ బరమేశ్వరప్రదత్తుం డగు భర్తవు నీవే. నాప్రార్థనంబు నీ వన్యథాకరింపవలదు. ఏకారణంబుచే

నైన నిరపరాధురాలను, అనువ్రతను నగునన్ను నీవు పెండ్లియాడుట కిచ్ఛగింపనిచో నీసమక్షమందే యీక్షణంబున నాప్రాణంబులను విసర్జించెదను. వాస్తవముగా నాశించినవస్తువు లభింపనప్పుడు మానవులకు మరణమే మంగళకరమైనది. మఱియొకమాట నీ వాలోచించుకొనవలయును. అనురక్తు లగువారిని విసర్జించుటవలనఁ గలుగుపాతకమునకుఁ బరిమితి లేదుసుమా!" అని చెప్పెను.

వృద్ధగౌతముం డామాట లాలించి "యోశోభనాంగీ! నాకు విద్య లేదు. తపస్సు లేదు. నేను కేవల మకించనుఁడను. విశేషించి వికృతాకారుఁడను. ఎట్టిభోగసుఖంబునకైనను నే నర్హుఁడను? కేవలము నావంటివాఁడు నీవంటికాంతకు యోగ్యవరుండు కాఁజాలఁడు. ఇదిగో! ఇటుచూడుము. నాకు నాసిక లేదు. విద్య లేదు. తపస్సు లేదు. నేను నిన్నుఁ గైకొని యేమి చేయఁగలను? కాని యొక్కమాటమాత్రము చెప్పఁగలను. ఎట్టియైన నెప్పటికైన సురూపంబును విద్యయు నాకు లభించినచో నప్పుడు నీవు చెప్పినట్లు చేయఁగలను" అనియెను. వృద్ధురా లించుక యాలోచించి "యోమహాత్మా! నేను దపంబుచే సరస్వతీదేవిని సంతృప్తచిత్తం గావించితిని. మఱియు రూపవంతుం డగువరుణుండును, అగ్నిదేవుండును నాతపంబునకు బరితుష్టిం గాంచియున్నారు. కావున వాగీశ్వరియగుభారతీదేవి నీకు విద్యాదానంబును, రూపవంతుండగునగ్నిదేవుండు సురూపంబును బ్రసాదింపఁ గలరు." అనిచెప్పుచు నావృద్ధురాలు వాణీవిభావసులను బ్రార్థించి వారిమూలంబున వృద్ధగౌతముని విద్యారూపసంపన్నుం గావించెను. అప్పుడు వృద్ధబ్రాహ్మణుం డగుగౌతముండు విద్వాంసుండును, సుందరుండును, గాంతిమంతుండును నై పరమానందంబున నావృద్ధురాలి పాణిగ్రహణంబు గావించి మనోహరి యగునారమణితోఁ గూడి

పరిపుల్లహృదయయుతయై నాగుహామధ్యంబున బహువర్షంబులు యథే
చ్ఛోపభోగంబుల ననుభవించెను. ఒకప్పు డావృద్ధదంపతులు ముదిత
హృదయులై యాగిరిగుహాయందు నివసించి యుండఁగా విమలచేతస్కు
లగువశిష్ఠవామదేవాదిమహాత్ములు సకలపుణ్యతీర్థపర్యటనంబు గావించు
చు నచ్చటికి విచ్చేసిరి. వృద్ధగౌతముండు భార్యాసహితుండై య
థాయోగ్యంబుగ వారికందఱ కతిథిసత్కారంబు గావించెను. ఆవచ్చి
నమహాత్ములలో బాల్యభావాపన్నులును, యౌవనోన్మత్తులును, ప్రౌఢ
గర్వాంధులును నగుకొందఱు ఋషులావృద్ధకాంతను సుందరాకారుం
డగుగౌతముని గాంచి యుపహాసంబు గావింప నారంభించిరి. అప్పుడు
మఱికొందఱుఋషులు కాంతం గాంచి "యోవృద్ధురాలా! యీగౌ
తముండు నీ కేమగును? ఓకల్యాణీ! యీతఁడు నీపుత్రుఁడో పౌత్రుఁ
డో నిజము చెప్పవలయును. మావారిలోఁ గొందఱీవిషయమును
గూర్చియే నవ్వుకొనుచున్నారు. వృద్ధుం డగుపురుషునకు యువతి
విషస్వరూపిణి యగుంగాని వృద్ధురాలికి యువకుఁ డమృతస్వరూపుఁడే
యగును. కాని యాహా! యింతకాలమునకు నిష్టానిష్టంబులకుఁ బర
స్పరానుకూలసంయోగము మే మిచ్చటఁ గన్నులారఁ జూడఁగలిగితి
మి." అని యుపహాసపూర్వకముగనే కొందఱు ఋషు లిట్లు ప్రస్తా
వించిరి. తరువాత నమ్మహాత్ములందఱును యథాయోగ్యంబుగ నా
దంపతులవలన నతిథిసత్కారంబును గాంచి ప్రీతచేతస్కులై వెడలి
పోయిరి.

అనంతరము మహాపతివ్రత లగునాదంపతులు మహాత్ములవచనం
బుల నాలించి తమునీవిరూపమును విస్మరించకొని యుభయులును దుఃఖి
తులును లజ్జితులునుగూడ నైపోయిరి. అప్పుడు వృద్ధగౌతముండు
మునిశ్రేష్ఠుం డగునగస్త్యుని పాలికిం బోయి "ఓమహాత్మా! ఏతీ

ర్థంబును సేవించిన సత్వరంబుగ సర్వశ్రేయంబులును, భుక్తిముక్తులును
సంఘటితంబు లగునో యట్టిదివ్యతీర్థముం గూర్చి నా కెఱింగింపవలయు
ను." అని ప్రార్థించుటయు నగస్త్యుండు "ఓవిప్రోత్తమా! నేను
పూర్వము మహర్షులవలన విన్నవిషయమును జెప్పుచున్నాను. గౌత
మీతీరమునకుం బోయినచో నిశ్చయముగా సర్వాభీష్టంబులును
సిద్ధింపఁగలవు. కావున నోమహాబుద్ధీ! నీవు పాపనాశిని యగుగౌత
మీతీర్థంబును సేవింపుము. నేను గూడ నీతో వచ్చెదను." అని
యగస్త్యుండు చెప్పుటయు వృద్ధగౌతముఁడు వృద్ధురా లగుతనభార్య
తోఁగూడ గౌతమీతటంబునకుఁ బోయి సతీసహితుం డై తీవ్రతపంబు
గావించి శంకరుని, విష్ణుదేవుని, గౌతమీగంగను బ్రసన్నులఁ గావించు
కొని "ఓశివా! యీవిశ్వంబునందు ఖిన్నులగుమానవులకు మరు
భూమియందలి మహాతటాకంబునుం బోలి ప్రియాసహితుండ వగునీ
వొక్కఁడవే శరణ్యుండవు. ఓకృష్ణా! అనావృష్టిదగ్ధంబు లగుసస్య
సమూహంబులకు ఘనాగమంబునుం బోలి యీజగంబునందలి యుత్త
మమధ్యమాధమంబు లగు భూతబృందంబులకు సర్వథా నీవొక్కఁ
డవే తాపహారివి. మఱియు నోగౌతమీ! నీ వమృతతరంగిణివై
వైకుంఠమార్గమును ఛేదించుకొనివచ్చి యధోగతులును, సంతప్తులు
నగు భూజనంబులకు నాశ్రయదాయినివై యున్నావు." అని ప్రార్థిం
చుటయు శరణాగతదీనజనంబుల దుఃఖనివారిణి యగుగౌతమీదేవి సు
ప్రసన్నయై వృద్ధాసహితుం డగుగౌతమునిం గాంచి "ఓవత్సా! నీవు
నానాసలిలంబులు కలశంబునం జేర్చి మంత్రపూతంబులుగఁ జేసి వివిధో
పచారంబులచే నర్చించి నీసహధర్మిణి నభిషేకింపుము. అప్పుడు నీభా
ర్య ప్రియయు, సురూపయు, సురుచిరకేశినియు, సుభగయు, సులో
చనయు, సులక్షణసంపన్నయు, సుకుమారిణియుఁ గాఁగలదు. అనఁ

తర మహారూపవతి యగు నీభార్య యిక్కే ని న్నభిషేకించినంతనే నీవు ను సర్వలక్షణసంపన్నుండ వై కమనీయాకారుండవు కాఁగలవు." అని యనుగ్రహించుటయు నాదంపతులు గౌతమీవచనానుసారం బుగ నభిషిక్తులై సురూపప్రాప్తులైరి. అప్పుడు వారియభిషేకజలంబు లును నావృద్ధురాలినామము ననుసరించి వృద్ధానామంబున విఖ్యాతం బగు నొకమహానదియై ప్రవహించెను. అప్పు డాసమీపవాసు ల్గ్ర లగుమహర్షు లాగౌతమనందనునకు వృద్ధగౌతమనామంబును గల్పిం చిరి. అనంతరము ప్రత్యక్షస్వరూపిణి యగుగౌతమీగంగ నుద్దేశించి ‹‹ యోదేవీ! నాపేరితోఁ బ్రవహించుచున్న యీవృద్ధగౌతమి నీతో నెచ్చట సంగమించునో యాస్థానము సర్వతీర్థంబుల యందును శ్రేష్ఠ స్థానం బగుఁగాక! ఆస్థానతీర్థంబునఁ గావించిన స్నానదానహోమా మాదికంబులు పితృగణంబులకుఁ బరమప్రీతికరంబులును, మానవు లకు రూపసౌభాగ్యసంపత్కారణంబులును, పుత్రపౌత్రప్రదంబులును, ఆయురారోగ్యకరంబులును, కల్యాణజయప్రమోదప్రవర్ధకంబులు న గుఁగాక!'' అని ప్రార్థించుటయు గౌతమీదేవి గౌతమపత్ని యగు వృద్ధురాలివచనంబులకు. తథాస్తు'' అని సమ్మతి నెఱింగించెను. అచ్చ ట నావృద్ధగౌతమునిచేఁ బ్రతిష్ఠిత మైనలింగ మావృద్ధురాలి నామము ననుసరించి వృద్ధేశ్వరాభిధానంబునఁ బ్రసిద్ధం బయ్యెను. ఆవృద్ధురా లితో నావృద్ధగౌతముని కాస్థానమునందే నభీష్టప్రాప్తి యయ్యెను. అచ్చటి స్నానదానంబులు సర్వాభీష్టదాయకంబులు. అప్పటినుండియు నాతీర్థంబునకు వృద్ధాసంగమం బనునామంబు గలిగెను.

## —♦ ఇలా తీ ర్థ ము ♦—

సువిఖ్యాతం బగు నిలాతీర్థము సర్వసిద్ధిప్రదమైనది. ఆతీర్థసేవ

నంబు గావించువారు బ్రహ్మహత్యాదిపాపవిముక్తులై ముక్తులగుదురు.
వైవస్వతవంశంబునందుఁ బవిత్రచరిత్రుండగు ఇలుం డను నరనాథుండు జనించెను. ఆతఁడు ధర్మయుక్తంబుగఁ బ్రజాపాలనంబు చేయుచు నొకనాఁడు బహుసేనాబలసహితుండై వేటకొఱకు వనంబునకుం బోయెను. వివిధవిహంగకలకలాలాపమనోహరంబును, కుసుమితఫలితలతాతరుమండితంబును, బహుజంతుసమాకీర్ణంబు నగు నయ్యరణ్యంబునఁ దిరుగుచున్న కొలఁది నన్నరనాథునకు వేఁటయందాసక్తి క్రమక్రమంబుగ వర్ధిల్లుచుండెను. ఆతఁ డట్లు మృగయాసక్తుండై యమాత్యాది రాజపురుషులం గాంచి మీరందఱును రాజధానికి మరలిపొండు. నాపుత్రుండు రాజ్యపాలనంబునకు నియుక్తుండై యుండెనుగదా. మీరు పోయి కోశబలవాహనాదులను, సకలరాజకార్యంబులను యథావిధిగఁ బాలించుచుండుఁడు. ధీమంతుండగు వసిష్ఠుండును నగ్నిసహితంబుగా రాజపత్నులను వెంటఁబెట్టుకొని తండ్రివలె మన్మందిరమునకుఁ బోవుఁగాక ! నేను కొంతకాలము మృగయాశీలురగు నారణ్యకులను, వాజివారణాదిపరివారంబునుగూడి యీవనంబున విహరించివచ్చెదను. తక్కినవారందఱును రాజధానికిఁ బోవలయును.

అని యాదేశించుటయు నందఱును రాజాజ్ఞనంగీకరించి రాజధానికిం బోయిరి. అనంతర మిలుండు మెల్లమెల్లగాఁ బ్రయాణంబు సాగించి రత్నమయం బగుహిమాలయంబుఁ జేరి యందు నివసించి యుండెను. ఆతఁడప్పుడు తానున్నచోటికి సమీపంబున నానారత్నచిత్రితం బగునొక సుందరకందరము దర్శించెను. అది సమన్యుండను నొకయక్షనాథునకు నివాసమై యుండెను. ఆతనికిఁ బతివ్రతపరాయణయగు సమ యనుభార్యగలదు. ఆతఁడొక్కొక్కప్పుడు ప్రియాసహితంబుగ మృగరూపముం దాల్చి యిచ్ఛవచ్చినరీతి విహరించుచు నొక్క

ష్టుడు నృత్యగీతాదులం గావించుచు నవ్వనంబున విహరించుచుండెను. అయ్యక్షుండు మృగరూపధరుం డయ్యును సకలవిషయాభిజ్ఞుండై యుండెను. అందుచే నిలుం డాకందరము యక్షపాలితం బని యించుకంతయు నెఱుంగఁజాలఁ డయ్యెను. అందుచే నమ్మహీపాలుండు తన పరివారంబుతో రత్నఖచితంబగు నవ్విశాలగుహాప్రదేశంబు నాక్రమించుకొని యందు వసించి యుండెను.

అప్పుడు మృగరూపధరుండై యున్న యక్షుండు రాజుగావించిన యీయసంగతవ్యాపారముం గాంచి కుపితుండై ॥ మహారాజగు నీయిలుని బలప్రయోగముచే నేను జయింపఁజాలను. ఒకవేళఁ బ్రార్థింతమన్నను నీతఁడు సామాన్యముగా నాభవనమును నాకు విడుచునట్లు తోఁచుటలేదు." అని యాలోచించుకొని ధనుర్ధరులను, శూరులును, ఆప్తులు నగు తనపరివారయక్షులంగాంచి ॥ మీరెల్లరును బోయి మదోద్ధతుండగు నయ్యిలుం డెట్లయినను నామందిరమును వదలిపోవునట్టి యేర్పాటు గావింపవలయును" అని యాజ్ఞాపించుటయు రణదుర్మ్మదులగుయక్షు లారాజుచెంతకుం బోయి ॥ ఓరాజా! నీవు మాగుహాగృహంబును విడిచిపొమ్ము! అట్లుపోకున్నచో యుద్ధంబునఁ బరాజితునిం గావించి పలాయితుని జేసెదము" అని చెప్పిరి.

ఇలుం డామాటలకుఁ గ్రోధావిష్టుండై వారితో మహారణంబు గావించి యందఱను బరాజితులం జేసెను. ఆతఁడు పదిదినంబులవఱకు నాగుహాయందే నివసించి యుండెను. యక్షనాథుఁడు మృగరూపధరుండై మృగీరూపధారిణియగు భార్యతోఁ గలసి వనవాసంబు చేయుచుండెను. ఆతఁడిట్లు హృతమందిరుండును, హృతపరివారుండును, వనగతుండునై చింతాక్రాంతస్వాంతంబునఁ దనపత్నియగు యక్షిణిం గాంచి ॥ ఓప్రియా! మృగయాసక్తుండును, దుష్టచిత్తుండు

నగునీరాజు మనగృహంబు నపహరించియున్నాఁడు. ఈతనికిఁ బ్రతీకా
రంబు గావించునుపాయం బేమైన నాలోచింపవలయును. సకలమహీపా
లురును పాపవ్యసనాసక్తులై రాజ్యవినాశంబు దెచ్చుకొనుచుందురు.
నీవు మనోజ్ఞనారీరూపంబుఁ దాల్చి యాతని నెట్లయిన నుమావనం
బుకడకుఁ దీసికొనిపొమ్ము. ఆవనంబునఁ బ్రవేశించినంతమాత్రముననే
యాతండు స్త్రీయైపోవును. ఓభద్రా! ఇక్కార్యంబు నీవే చేయఁగల
వు. నేను చేయఁజాలను. అట్లు నీవు గావించిన వెనుక నీవు యక్షిణి
వయ్యెదవు. నేను నెప్పటివలె యక్షుండ నయ్యెదను'' అనుటయు
యక్షిణి ''నాథా! ఉమావనంబున కాతని మరలించుకొని నీవేల పోఁ
గూడదు?'' అని ప్రశ్నించెను. అప్పుడు యక్షుండు ''ప్రియా! ఒక
ప్పుడు మహాదేవుండగు శివుండు గిరిజాసహితుండై దేవగణంబులతోఁ
గూడి హిమాలయపృష్ఠంబున విహరించుచుండెను. అప్పుడు పార్వతీ
దేవి యేకాంతముగా శంకరుం గాంచి ''నాథా! రతివ్యాపారము గో
పనంబు చేయుట స్త్రీజనంబునకు స్వభావము. కావున నీవు నాకొక
సురక్షితం బగురహస్యప్రదేశమును దయచేయవలయును. ఆస్థానంబున
కుమావనంబను నామంబు ప్రసిద్ధం బగుఁగాక! ఇచ్చటికి నీవును, గణే
శ్వరుండును, గార్తికేయుండును, నందీశ్వరుండును దక్కఁ దక్కినవా
రెవ్వరు వచ్చినను స్త్రీలైపోవుదురుగాక!'' అని ప్రార్థించుటయుఁ జం
ద్రమాళి ప్రసన్నుండై సంకల్పమాత్రంబున నుమావనంబును గల్పించి
యద్దేవికిఁ బ్రసాదించెను. కావునఁ బురుషుండ నగు నే నచ్చటికిఁ బో
వుట కవకాశము లేదు.'' అని చెప్పెను.

ఆమాట విని కామరూపిణి యగుయక్షిణి మృగరూపముం
దాల్చి యిలుని యెదుట విహరింపఁ దొడంగెను. ఆసమీపముననే
యక్షుండును నిలిచి యుండెను. మృగయాసక్తచిత్తుం డగునిలుం డా

లేడిం గాంచి యశ్వారూఢుండును, ధనుర్ధరుండునై దానిని వెంబడించి పోయెను. ఆమాయలేడియు నాతని నలయించి యుమావనంబునకుఁ దీసికొని పోయెను. ఇలుం డావనంబునఁ బ్రవేశించినంతనే స్త్రీమూర్తి యైపోయెను. అప్పుడు యక్షిణి మృగరూపమును బరిత్యజించి యథారూపముం దాల్చి యొకయశోకవృక్షంబుచెంత నొకకొమ్మపైఁ జేయి వైచి నిలువఁబడి యుండెను.

దివ్యాభరణభూషితయు, దివ్యవసనాలంకృతయు, దివ్యగంధానులిప్తయు, దివ్యమూర్తియు, నగుయక్షిణి యట్లు కృతకృత్యయై యశ్వారూఢుండును, భ్రాంతుండునగు నమ్మహారాజుం గాంచి నవ్వుచు “ఓయిలాదేవీ! నీవాఁడుదాన వయ్యు నశ్వారోహణంబు గావించి యొంటిగా నెచ్చటికిఁ బోయెదవు? ఇట్లు పురుషవేషధారిణివై యెవ్వరికొఱ కన్వేషించుచున్నావు?” అని ప్రశ్నించెను. మహారాజగు నిలుండు యక్షిణి తన్నిట్లు స్త్రీజనోచితం బగుసంబోధనము గావించినందులకుఁ గ్రోధావిష్టుండై యామెనదలించుచు “నా లేడి యేమైనది?” అని ప్రశ్నించెను. యక్షిణి పకపక నవ్వుచు “ఓయిలాదేవీ! ఇంకను జూచుకొనుట లేదా?” అని పరిహసించుటయు నిలుండు కుపితుండై ధనువున బాణమును సంధించి యక్షిణిపైఁ బ్రయోగింప సంసిద్ధుఁ డయ్యెను. యక్షిణి మరల నెప్పటివలెనే “ఓరమణీమణీ! నిన్ను నీవు బాగుగఁ జూచుకొని, బాగుగ గ్రహించుకొని తరువాత నామాటలయందలి సత్యాసత్యములను బరీక్షింపుము” అని పలికెను.

ఆమాట విని యిలుం డదరిపడి తనవక్షంబును బరీక్షించుకొని నిర్విణ్ణుండై “ఏమిది! ఇట్లయిపోయితి నేమి?” అని విచారించుచు యక్షిణిం గాంచి “ఓసువ్రతా! నీవెవ్వరు? నేనిచ్చటికి వచ్చి యిట్లు స్త్రీనై పోవుటకుఁ గారణ మేమి? దయ యుంచి సర్వమును స్పష్టము

గా నెంచిరింపుము" అని వేడుకొనుటయు యక్షిణి "ఓరాజేంద్రా! నీవింతవఱకును ప్రవేశించియున్న హిమాలయసుందరకందరము మా నివాసస్థానము. నాభర్త యక్షరాజగు సుమన్యుడు. నీవు మానివాసము నాక్రమించుటచే నిన్ను యుద్ధంబున జయింపజాలక నేనిట్లు మృగరూపంబుఁ దాల్చి యియ్యుమావనంబునకు నిన్నుఁ దరలించుకొని వచ్చితిని. ఈయుమావనంబునఁ బురుషు లెవ్వరు ప్రవేశించినను స్త్రీలైపోవుదు రని మున్ను మహాదేవుండు నిర్దేశించి యుండెను. అందుచే నీవిచ్చటికి వచ్చి స్త్రీత్వముం గాంచితివి. జరిగినదాని కింక విచారించుటవలన లాభము లేదు. విచిత్రం బగుభవితవ్యతాగతివిలాసము లెవ్వరు గ్రహింపఁగలరు?" అనియెను.

ఆమాటలు విన్నంతనె స్త్రీరూపధారి యగు నిలుండు ఖిన్నుండై యశ్వమునుండి యిలాతలంబునఁ బడియెను. యక్షిణి యాతని లేవనెత్తి యుపచారంబులు చేసి యూఱడించుచు "ఓరాజా! నీవు స్త్రీవైపోయితివి. ఇఁక దీనికిఁ బ్రతిక్రియ యేదియును లేదు. ఎవ్వరును నిన్ను మరలఁ బురుషునిఁగాఁ జేయఁజాలరు. కావున నీవింతటినుండి స్త్రీజనోచితంబులగు నృత్యగీతాదివిద్యల నభ్యసించి రమణీయమణీయాలంకారములం దాల్చుచు, స్త్రీలాలిత్యములను, స్త్రీవిలాసములను గాంచి స్త్రీజనకర్తవ్యంబులను నిర్వర్తింపుచుండుము" అనిబోధించెను.

ఆమె యట్లు చెప్పుచుండఁగనె యిలునకు స్త్రీజనోచితంబులగు వేషభూషణాదులును, విలాసవిభ్రమహావాదులును విచిత్రంబుగా సంప్రాప్తంబు లయ్యెను. అప్పు డిలుం డిలాదేవియై యక్షిణిం గాంచి శోకగద్గదస్వరముతో "ఓకల్యాణీ! దైవనియోగంబుచే నేనిట్లు తరుణినైతిని. కాని నాకు భర్త యెవ్వఁడు? నేనిఁక నేమి చేయవలయును? నాకు మరలఁ బురుషత్వ మెట్లు లభింపఁగలదు? దుఃఖాస్పదాలనగు నా

యందుఁ గరుణించి నాకుఁ దరణోపాయమును బ్రబోధింపుము! ఆర్తుల నుద్ధరించుటకంటె నధికం బగుపుణ్యం బేదియును లేదుగదా!" అని వేఁడుకొనుటయు యక్షిణి కరుణాంతఃకరణముతో "ఓ శోభనాంగీ! ఈయుపవనంబునకుఁ బూర్వభాగంబున సోమనందనుం డగుబుధుని యాశ్రమంబు గలదు. అతఁడు నిత్యమును దనతండ్రియగు చంద్రుని సందర్శించుటకై యీమార్గముననే వచ్చుచుండును. అతఁ డట్లు ప్రశాంతభావంబున వచ్చుచున్నప్పుడు నీవు నీరూపయౌవనవిలాసాదులచే నాతనిం బ్రసన్నునిఁ గావించుకొనుము. ఆబుధునియనుగ్రహంబు వలన నీసర్వాభీష్టంబులును సిద్ధింపఁగలవు." అని యామె నూఱడించి యక్షిణి యంతర్హితయై నిజావాసంబునకుం బోయి భర్తయగుయక్షునకు సకలవృత్తాంతమును సవిస్తరంబుగ నెఱింగించెను. యక్షుండంతయు నాలకించి సంతుష్టుం డయ్యెను.

ఇట్లు నుపవనంబున నిలాదేవి యథాసుఖంబుగ నివసించి యుండి నృత్యగీతాదులచేఁ గాలక్షేపము చేసికొనుచుండెను. ఒకనాఁ డామె యతిలోకవిలాసంబుమెఱయ నృత్యము చేయుచుండఁగాఁ దండ్రి దర్శనంబునకుఁ బోవుచున్న బుధుం డారమణీమణిం గాంచి యాశ్చర్యముతో నామెచెంగటికిం బోయి "ఓసుందరీమణీ! నేను చంద్రనందనుండను. బుధుండను వాఁడను. నీరూపలావణ్యవిలాసంబులకుఁ బ్రేమించి వచ్చితిని. నీవు నన్ను భర్తగా నంగీకరించి యెల్లవిధంబుల నా ప్రాణప్రియ వగుము" అని యాచించెను. ఇలయు యక్షిణివచనంబులం దలంచుకొని యితఁడే విధివిధానంబని నిశ్చయించుకొని భక్తిపూర్వకంబుగ బుధు నభివందించుచు నాతనిపాణిగ్రహణంబున కంగీకరించి పరమానందభరితహృదయ యయ్యెను.

బుధుం డాసుందరీమణి నాత్మేశ్వరిగాఁ బరిగ్రహించి స్వస్థానం

బునకుం గొనిపోయి పరమప్రేమభావంబున నామెతోఁ గలసి సుఖానందంబుల ననుభవించుచుండెను. అయ్యిలాదేవియు నెల్లవిధంబుల భర్త్రయగుబుధుని బరితృప్తుం గావించుచుండెను. ఇట్లు చాలకాలంబు గడచుటయుఁ బరితుష్టహృదయుం డగుబుధుం డొకనాఁ డాసుందరీమణిం గాంచి "ఓప్రియతమా! నీసంసేవనంబులకు నేను సంతుష్టుండనైతిని. నీహృదయంబున నెట్టికోరిక యున్నదో తెలుపుము! తపోబలంబుచే నీయభీష్టం బెట్టిదైనను దీర్చెదను. సంశయ మించుకంతయును లేకుండఁ గోరుకొనుము" అని యనుగ్రహించుటయు నిలాదేవి యాత్మనాథునందే "మహాత్మా! నాకుఁ బ్రేమనుయుం డగునొకసుపుత్రునిఁ బ్రసాదింపవలయును." అని ప్రార్థించెను.

బుధుండును బ్రసన్నహృదయుండై "ఓప్రాణేశ్వరీ! అమోఘవీర్యుండ నగునావలన నీగర్భమునందు క్షత్రతేజోవిలసితుండును, లోకవిశ్రుతుండు నగునొకకుమారుండు జనింపఁగలఁడు. అక్కుమారుండు తేజంబుచే నాదిత్యుండును, బుద్ధిచే బృహస్పతియు, క్షమాగుణంబుచే భూమండలంబును, వీర్యముచే విష్ణుదేవుండును, క్రోధముచే హుతాశనుండును నై త్రిలోకప్రశంసితుండు గాఁగలఁడు. అతనిచేఁ జంద్రవంశంబు సుప్రతిష్ఠితంబు గాఁగలదు" అని యాసతిచ్చెను. అంతఁ గొంతకాలంబున కయ్యిలాదేవిగర్భమునుండి గంభీరఘోషణంబు గావించుచు నొకసుపుత్రుం డుదయించెను. అక్కుమారుని జననసమయంబున స్వర్గలోకమం దంతటను జయధ్వానములు చెలరేగెను. అప్పుడు సకలదేవతలును, బ్రహ్మయు, బ్రహ్మర్షులును బుధాశ్రమంబునకు విచ్చేసి గభీరారావంబు సేయుచు జనించిన యక్కుమారునకు పురూరవుం డని నామకరణంబు గావించి యనేకవిధంబుల నాశీర్వదించిచనిరి.

బుధుండును దనతనయుం డగుపురూరవుని క్షత్రియోచితంబు లగు విద్యలనెల్ల నధ్యయనంబు చేయించుచు సరహస్యం బగుధనుర్వేదమును సంపూర్ణముగ నభ్యసింపఁజేసెను. పురూరవుఁడును శుక్లపక్ష చంద్రునివలెఁ గళలతోఁగూడఁ దానును దినదినప్రవర్ధమానుం డగుచుండెను. ఒకనాఁడు మహామతి యగుపురూరవుండు ఖిన్నవదనయై యున్నతల్లిం గాంచి యామెహృదయమునందు విచార మున్నట్లు గ్రహించి వినయమధురభాషణంబులతో ॥ అమ్మా! నాతండ్రియగుబుధుండు నీకుఁ బ్రియభర్తయై యున్నాఁడు. సర్వలోకసమస్థుండ నగునేను నీకుఁ బుత్రుండనై యుంటిని ఇట్లైనీకు మనస్తాపముగలుగుటకుఁ గారణ మేమున్నది? దయ యుంచి యెఱింగింపవలయును.'' అని ప్రార్థించెను.

ఇలాదేవి కుమారునివచనంబు లాలించి ॥నాయనా! నీవుసత్యమునే వచించితివి. విబుధశ్రేష్ఠుం డగుబుధుని భర్తగను, సకలసుగుణాకరుండ వగునిన్నుఁ దనయునిఁగను బడయఁగలిగిన నేను ధన్యురాలనే. అయినను నాకుఁ బూర్వస్మృతి కలిగినప్పు డెల్ల నన్నొకదుస్సహదుఃఖ మాక్రమించుచుండును.'' అని చెప్పెను. పురూరవుం డామాట విని యదరిపడి ॥ జననీ! ఆదుఃఖమునకుఁ గారణ మేమో తెలుపుము. నీదుఃఖనివారణంబు గావించుట కుమారుండ నగునాకవశ్యకర్తవ్యము గదా!" అనియెను. అప్పు డిలాదేవి ॥వత్సా! అది యతిగూఢ మగువిషయము. నీ కేమని చెప్పఁగలను? చెప్పకుండ నెట్లువిచారమునడఁగించుకొనఁగలను? శోకార్ణవ నిమగ్నులగుతల్లిదండ్రుల నుద్ధరించుటకు తనయునికంటె నన్యగతి యేదియును లేదుగదా!" అనుచుండఁగనే పురూరవుండు జననిచరణకమలంబులకు సాష్టాంగప్రణామం బాచరించి వినయవినమితుండై ॥ తల్లీ! సర్వవిషయంబులను వివరింపఁగ

నాకెఱింగింపుము." అని ప్రార్థించెను.

అప్పు డిలాదేవి యిక్ష్వాకువంశప్రశస్తియు, నావంశమునందుఁ దాను జనించుటయు, దనరాజ్యప్రాప్తియుఁ, దినకుసంతానము గలుగుటయు, వసిష్ఠుండు తనకుఁ బురోహితుం డగుటయు, తనకొక భార్యయుండుటయు, తనప్రాభవంబును, దాను మృగయాసక్తిచే వనంబునఁ బ్రవేశించుటయు, హిమాలయకందరంబునఁ బ్రవేశించుటయు, యక్షవిరోధంబును, యక్షిణీకారణంబున నుమావనప్రవేశంబు చేయుటయు నచ్చటఁ దనస్త్రీత్వప్రాప్తియు, బుధసమాగమంబును, మరల స్త్రీత్వంబునఁబుత్రప్రాప్తియు మున్నగువిషయంబులను సవిస్తరంబుగా నందనున కెఱింగించెను.

ఆచరిత్రం బంతయు నాలకించి కుమారుం డగు పురూరవుండు విచారగ్రస్తహృదయుండై దీనస్వరంబున "తల్లీ! నేనేమి చేయుదును? ఏమి చేసిన నీకు సంతోషముగా నుండును! ఈసంసారమునం దుండుటయే నీకానందముగా నున్నయెడల దీనిని మరలఁ బరిత్యజింపఁ జేయుటకుఁ బ్రయత్నించుట యెందులకు? ఇది కాక నీకిం కేదియైనఁ గోరిక యున్నచో నానతిమ్ము! నాశక్తి నంతను వినియోగించి నీయభీష్ట సంపాదనంబు గావింతును." అని చెప్పెను. ఇలాదేవి విచారముతో "కుమారా! నేను పూర్వమువలెనే మరలఁ బురుషత్వముం గాంచి విపులం బగునారాజ్యమును గ్రహించి పూర్వపుత్రులకు, నిన్నును రాజ్యాభిషిక్తులం గావించి కన్నులపండువుగాఁ గాంచవలయు నని యాసించుచున్నాను. తండ్రీ! నాసంతాన మగుమీ కనుకూలముగా దానధర్మములను, యజ్ఞయాగాదులను గావించి రాజ్య మంతయును మీచేతుల యం దొప్పగించి ముక్తిమార్గముం జూచుకొనవలయు నని యపేక్షించుచున్నాను." అని చెప్పుటయుఁ బురూరవుండు "అమ్మా! నీకు

మరలఁ బురుషత్వము గలుగుట కేమియుపాయ మున్నదో నీవే చెప్ప వలయును. తపంబువలనఁగాని, మఱియేవిధంబుగఁగాని లభించునని నీకుఁ దోఁచినదో నెఱింగింపవలయును. నాశక్తికొలఁదిని బ్రయత్నించి సాధించెదను." అనియెను. ఇట్లు కృతనిశ్చయుండై పలికినకుమారుం గాంచి యిలాదేవి "పుత్రా! నీవు మీజనకునిచెంతకుం బోయి యీ విషయముం గూర్చి యాలోచింపుము. అతఁడు సర్వజ్ఞుఁడు. కావున నీకాతఁ డవశ్యముగ హితోపదేశము చేయఁగలఁడు" అనిబోధించెను.

తల్లిమాట ననుసరించి యిలానందనుం డగుపురూరవుం డా క్షణముననే తండ్రిచెంతకుం బోయి ప్రణామంబాచరించి యెల్లవృత్తాంతంబు నాతనికి నివేదించి కర్తవ్యోపాయము నుపదేశింపవలయు నని ప్రార్థించెను. అప్పుడు బుధుండు నవ్వుచు "కుమారా! మహారాజగునిలుని ప్రభావమును నే నెఱుంగుదును. అతఁ డేవిధముగా నిలాదేవి యైపోయెనో కూడ నెఱుంగుదును. ఉమావనప్రవేశముం గూర్చియు, నీశ్వరాజ్ఞం గూర్చియు నే నెఱుంగుదును. ఈశాపమోక్షణంబునకుమాశంకరుల యారాధనంబుకంటె నన్యోపాయం బేదియును లేదు. వారియనుగ్రహమువలననే యిలకు మరలఁ బురుషత్వము లభింపవలయును." అని బోధించెను. పురూరవుండు తండ్రియుపదేశంబును గ్రహించి "తండ్రీ! నేనీచరాచరవిశ్వంబునకుఁ బితరులగు గౌరీశంకరుల నారాధించెదను. ఏతపంబువలన నేతీర్థసేవనంబువలన నాకు వారి సందర్శనము లభించునో యానతీయవలయును" అని ప్రార్థించెను.

అప్పుడు బుధుండు కుమారునుద్దేశించి "వత్సా! అట్లయినచో నీవు గౌతమీతీరంబునకుం బొమ్ము. అచ్చట నిరంతరమును శివుండు శివాసహితుండై విరాజిల్లుచుండును. శ్రీమంతుఁడును, శాపహంతయు వరప్రదాతయు నగుసద్దేవుని నీవచ్చట నారాధింపుము" అని యుపదే

శించుటయుఁ బురూరవుండు ముదితహృదయుండై తండ్రికి వందనంబు చేసి యాతనికడ సెలవు గైకొని జననీపుంస్త్వంబును గోరి తపంబు గావింపవలయు ననుతమకముతో గిరివరంబగు హిమవంతంబునకును, బూజ్యురాలగు తల్లికిని బ్రణామంబులు గావించి యనుజ్ఞవడసి గౌతమీ తటంబునకుఁ బ్రయాణంబు గావించెను. ఇలాదేవియును, బుధుండును గూడ నాతని వెనుకనే బయలుదేరి పోవుచుండిరి. కొంతకాలంబునకుఁ బురూరవుండు గౌతమిం జేరుకొని మహాపావనసలిలంబులయందవగాహనంబు చేసి స్నానాంతంబున నియమించిత్తుండై దేవదేవుం డగు శంకరునింగూర్చి స్తోత్రపాఠంబులఁ గావింప నారంభించెను. అతనితోఁ గలసి యిలయు, బుధుండును గూడ నిట్లు స్తోత్రము చేయఁదొడంగిరి.

“ స్వశరీరసంజాతంబగు కుంకుమకాంతిచే హేమసుందరవిగ్రహంబులవలెఁ బ్రకాశించునట్టియు, స్కందగణేశ్వరులచే నిత్యారాధితులగునట్టియు జగంబున కంతకును రక్షకు లగునట్టియు దేవదేవులగు నుమాశంకరులు నాకు శరణ్యు లగుదురుగాక ” అని బుధుండు ప్రార్థించుటయు నిలాదేవి—“ఈజగంబునఁ దాపత్రయదావానలదగ్ధులైన జీవు లెవ్వరిఁ జింతించినంతమాత్రమున సుఖలాభంబు నందుదురో యట్టిశంకరీశంకరులు నాకు శరణ్యులగుదురుగాక! ఓదేవదేవా ! మహేశ్వరా ! నేనార్తురాలను. నామనంబు నిత్యపరితప్తం బగుచున్నది. ఈజగంబునఁ గ్లేశాదులనుండి జీవుల నుద్ధరించుటకు నీకంటెఁ గర్తలింకెవ్వరును లేరు. పుణ్యమయంబులును, శరణ్యంబులు నగు నీచరణకమలములు నాకు దిక్కగుఁగాక ” అని ప్రార్థించెను. అనంతరము పురూరవుండు “ ఎవ్వరిప్రభావముచే నీవిశ్వం బంతయు నావిర్భూతంబై యంతంబున సర్వంబు నెవ్వరియందు విలీనం బగుచుండునో యట్టియుమామహేశ్వరుల చరణసరసిజంబులు నాకు శరణంబు

లగుఁగాక ! ఓవిశ్వేశ్వరణ్యా ! విశ్వాత్మకా ! నీవు నాకుఁ బ్రసన్నుండ వగుము. తొల్లి వివాహసమయంబున దేవర్షిగణంబులచేఁ బ్రార్థితుం డవై నీవు ప్రీతిపూర్వకముగా నేదేవిపాదములను గ్రహించితివో యట్టి విశ్వజననిపాదకమలములు నాకాశ్రయంబు లగుఁగాక ! " అని ప్రార్థించెను.

అప్పుడు దేవదేవి యగుశ్రీదేవి ప్రసన్నయై " వత్సా ! పురూరవా ! నీవు కృతకృత్యుండ వైతివి. మీయెల్లరకును మంగళంబగుఁగాక ! మీయభీష్టంబులు దేవదుర్లభంబు లైనను మీకుఁ బ్రసాదించెదను. ఏమికావలయునో యెఱింగింపుఁడు " అని యనుగ్రహించుచుండఁ బురూరవుండు " ఓయంబికా ! ఇళుండనుమహారాజు నీసమయం బెఱుంగక నీవనంబునఁ బ్రవేశించి స్త్రీయై పోయెను. ఓసురేశ్వరీ ! నీవాతని యపచారమును క్షమించి యెప్పటివలె నాతనికిఁ బురుషత్వము లభించున ట్లనుగ్రహింపుము. " అని వేఁడుకొనియెను. అప్పుడు భవాని శివునివంకఁ దిలకించి యాతనియభిప్రాయముం దెలిసికొని " తథాస్తు " అనియెను. ఈశ్వరుండును దేవివచనంబు ననుసరించి " ఈయిళాదేవి గౌతమీసలిలంబుల స్నానంబు గావించినంతనే మరలఁ బుంస్త్వంబు నందఁగలదు. " అని యానతిచ్చెను.

బుధసమాధర్మిణి యగునిళాదేవి యాక్షణమునందే గౌతమీజలంబులఁ బ్రవేశించి స్నానంబు గావించినంతనే యామెశరీరమునుండి యొకజలప్రవాహము వినిర్గతం బయ్యెను. అప్పు డామెకు సంప్రాప్తించిన నృత్యగీతాదికళలును, స్త్రీసహజవిలాసవిభ్రమాదులును గూడ నాప్రవాహముతోఁ గలసి గౌతమీజలంబుల విలీనము లయ్యెను. ఆపావనసలిలంబునుండి నృత్య, గీత, సౌభాగ్య యనుమూఁడునదులు ప్రాదుర్భూతంబు లయ్యెను.

ఆపుణ్యనదీత్రయమును గోదావరీజలంబులఁ గలసిపోయెను. ఆస్థలంబున మూఁడు పుణ్యసంగమతీర్థములు ప్రతిష్ఠితంబు లయ్యెను. ఆసంగమత్రయంబున స్నానదానాదులంగావించువారికి స్వర్గఫలప్రాప్తి యగును. ఉమామహేశ్వరానుగ్రహంబున నిట్లు మరలఁ బురుషత్వంబు గాంచి మహాభ్యుదయంబుకొఱకచ్చట నొకయశ్వమేధ యాగంబు గావించెను. ఆయజ్ఞంబుకొఱకుఁ బురోహితుం డగు వసిష్ఠుండును, భార్యాపుత్రాదులును, అమాత్యులును సేనలును, పరిజనులు నుగూడ నచ్చటికి విచ్చేసిరి.

అయ్యిళుఁడు దండకారణ్యంబునఁ జతురంగబలయుతంబగునొక రాజ్యమును స్థాపించెను. ఇళానగరము దానికి రాజధానియై యుండెను. అతఁడు తనపుత్రులకందఱకును సూర్యవంశనియమానుసారంబుగఁ బట్టాభిషేకంబులు గావించి యనంతరమునఁ దనస్త్రీత్వమునందు జనించినపుత్రుండగు పురూరవుని జంద్రవంశక్రమంబున నభిషిక్తుం గావించెను. ఆపురూరవుండు చంద్రవంశంబున కాదిపురుషుండై సుప్రసిద్ధుండును, శ్రీమంతుండు నగు సార్వభౌముం డయ్యెను. ఇళునిపుత్రులందఱికంటె నాతఁడే బుద్ధిమంతుండును, శ్రేష్ఠుండు నయ్యెను. అయ్యిళుండు యజ్ఞానుష్ఠానంబు గావించినట్టియు, నాతనియిరుతెగలపుత్రులకును సమ్మేళనంబు గూర్చినట్టియు, యక్షిణీదత్తంబు లగునృత్యగీతసౌభాగ్యములు నదీరూపంబులై గౌతమియందుఁ గలసినట్టియు దివ్యస్థలంబులయం దుభయతీరంబులను షోడశసహస్రపుణ్యతీర్థంబులుత్పన్నంబు లయ్యెను. అచ్చట నిళేశ్వరనామంబున నొకశివలింగము విరాజిల్లుచుండును. ఆసకలతీర్థంబులయందలి స్నానదానంబులును సర్వయజ్ఞఫలప్రదంబు లగును.

## — చక్రతీర్థము —

చక్రతీర్థము బ్రహ్మహత్యాదిమహాపాతకవినాశకరమైనది. ఆతీర్థమునందలి చక్రేశ్వరుని యనుగ్రహంబున విష్ణుదేవుండు చక్రిలాభంబు గాంచెను. అస్థానమునందుఁ జక్రి చక్రార్థమై శంకరు నారాధించుటచేతనే దానికిఁ జక్రతీర్థం బను నామము గలిగెను. ఆతీర్థనామస్మరణమాత్రంబుననే పాపనాశనం బగును.

పూర్వకాలంబున దక్షుండు యజ్ఞారంభంబు గావించుటయు సకలదేవగణంబులు నమ్మఖశాల కేతెంచి యుండిరి. కాని దక్షుండు తనయల్లుండగు మహేశ్వరునియందు దోషారోపణంబు గావించి యాతని నయ్యాగంబున కాహ్వానింపలేదు. దాక్షాయణి యగు సతీదేవి తనతండ్రి యజ్ఞంబు చేయుచుండుటయును, రోషముచేఁ దన్నును దన భర్తను బిలువకుండుటయే కాక యనేకవిధముల నిందించుటయును నహల్యవలన విని మిగులఁ గుపితయయ్యెను.

ఆదేవదేవి తనపతిదూషణమును సహింపఁజాలక క్రోధావేశవివశయై "జనకునకు సర్వనాశంబు గావించెదను. పాపాత్ములను నే నెంతమాత్రమును క్షమింపఁజాలను. పతినింద నాలకించియు సహించియుండువారి పాపంబున కవధి యున్నదా? పతి యెట్టివాఁడైనను నాతఁడే సతులకుఁ బరమగతి. అట్టిచోఁ జరాచరగురుండును, సకలలోకజనకుండును, మహాదేవుండు నగునానాథునిమాట చెప్పవలయునా? అట్టినాథునిఁ గూర్చిన నిందావాక్యముల నాలకించిన నాకీదేహముతో నిమిత్త మేమున్నది? కావున నే నెట్లును దేహత్యాగంబు గావించి తీరెదను." అని నిశ్చయించుకొని క్రోధానలప్రజ్వలితహృదయముతో దక్షయజ్ఞవాటంబునకుం బోయి యందుఁ దానును జనకునిచే నవమా

నితనై శివైకప్రాణయగునద్దేవి యోగబలంబుచే దేహత్యాగంబు గావించెను.

ఆఘోరవార్తను మహేశ్వరుండు నారదునివలన నెఱింగి సతీ పరిచారిక లగుజయవిజయలం గాంచి "సతియెచ్చటనున్నది?" యని ప్రశ్నించెను. వారు శోకగద్గదకంఠములతో నెల్లవృత్తాంతమును విన్నవించిరి. అప్పుడు మహేశ్వరుండు క్రోధోజ్జ్వలుండై భయంకరభూత గణంబులచేఁ బరివృతుండై దక్షయజ్ఞవాటంబునఁ బ్రవేశించి యజ్ఞపరి కరంబులన్నియును విధ్వస్తంబులుగాఁ జేయఁదొడంగెను. ఆయాగశాల యంతయు సకలదేవతలతోడను, సకలబ్రాహ్మణగణంబులతోడను నిండియుండెను. యజమానుండగు దక్షుండు పరిశుద్ధభావముతో యజ్ఞరక్షణంబు గావించుచుండెను. మహాతపస్వులగువసిష్ఠాదిమహర్షు లచ్చటికి విచ్చేసి యుండిరి. ఇంద్రాదిదేవతలును, వసుగణంబులును జతుర్దిశలయందును రక్షకులై యుండిరి. ఋగ్యజుస్సామగానం బులును, స్వాహారవంబులును యాగభూమియందంతటను మారు మ్రోగుచుండెను. శ్రద్ధ, తుష్టి, శాంతి, లజ్జ, భూమి, అంతరిక్ష, శర్వరి, క్షాంతి, ఉష, ఆశ జయ, మతి మొదలుగాఁగలదేవీమూర్తులు ను, మఱియు నితరదేవీమూర్తులును యజ్ఞస్థలము నలంకరించియుండిరి. ఆముఖమంటపమును విశ్వకర్మ నిర్మించియుండెను. సురభి, నందిని, కామదోహిని, కామవర్షిణి మున్నగుధేనుగణంబులచే నయ్యజ్ఞక్షేత్ర ము సర్వాధికసమృద్ధిసంపన్నంబై యుండెను. కల్పవృక్ష, పారిజాత, కల్పలతాదులును, మఱియు నుత్తమంబు లగుసకలేష్టవస్తువులు నందు నిండి యుండెను. ఇంద్రుండును, పూషుండును, విష్ణుండును స్వయము గా నయ్యజ్ఞమును సంరక్షించుచుండిరి. యాగశాలయందెల్లయెడలను

॥వర్ధింపుఁడు ! భజింపుఁడు " అను నాదర వాక్యములు ప్రతిధ్వనించు చుండెను.

మొట్టమొదటనే భద్రకాళీసహితుం డగు వీరభద్రుఁడు యజ్ఞశాలయందుఁ బ్రవేశించెను. తరువాతఁ గ్రోధోజ్జ్వలుం డగు పినాకపాణి భూతగణపరివేష్టితుండై ప్రవేశించి యజ్ఞధ్వంసంబు గావింప నారంభించెను. అప్పుడా ప్రమథగణంబుల విక్రమవిజృంభణంబువలన మఖశాలయం దంతటను మహాసంక్షోభ ముదయించెను. కొందఱు పారిపోవుచుండిరి. కొందఱు మహాదేవునిం జేరి ప్రార్థించుచుండిరి. మఱికొందఱు కోపావేశముతో శంకరు నెదిరించుచుండిరి. ప్రమథులందఱును యజ్ఞధ్వంసంబు గావించుచుండుటం గాంచి సహింపఁజాలక మహాక్రోధముతోఁ బూషుండు మహాదేవు నెదిరించి విక్రమించుటయు శంకరుం డాతని దంతంబులను భగ్నంబులుగాఁ జేసివైచెను. అట్లే యింద్రుండును నీశ్వరునిచే వితాడితుం డయ్యెను. వీరభద్రుండు భగుని కన్నులను బెరికివైచి దివాకరుని బాహుద్వయముం బట్టుకొని లాగి యాతని గిరగిరఁద్రిప్పి దూరముగా విసరివైచెను.

అప్పుడు సకలదేవతలును జక్రధరుని శరణంబు గోరి ॥ ఓగదాధరా ! నీవీ భూతనాథుని భయంబునుండి మమ్ముద్ధరింపుము ! మహేశ్వరానుచరుం డగు నీతఁ డెవ్వఁడో గాని ప్రమథనాయకుండై వచ్చి వైష్ణవం బగు నిమ్మహామఖంబు నంతను విధ్వంసంబు గావించుచున్నాఁడు. నీవు రక్షింపకున్నచో నిఁక మా కెట్టి శరణ్యంబును లేదు " అని ప్రార్థించుటయు విష్ణుదేవుండు భూతనాథునిపైఁ జక్రప్రయోగంబు గావించెను. తోడనే భూతపతి యాచక్రంబును మ్రింగివైచెను. ఇట్లు విష్ణుదేవుని సుదర్శనాయుధంబు విజితం బగుటయు లోకపాలకు లందఱును భీతిల్లి కలాయితులై పోయిరి.

అప్పుడు దక్షప్రజాపతి మహాదేవుని సన్నిధికిం బోయి "ఓశం కరా! సోమేశ్వరా! సర్వజ్ఞా! నీకు జయం బగుఁగాక! కల్యాణ కరుండవు, కాలాత్మకుండవు నగు నీకు నమస్కారము. ఓనీలకంఠా! నీ వాదికర్తవు. బ్రహ్మప్రియుండవు. బ్రహ్మస్వరూపుండవగు నీకు వంద నము. ఓత్రిధామా! పరమేశ్వరా! త్రినేత్రా! త్రిమూర్తీ! నీకుఁ బ్రణామము. ఈత్రిలోకంబులకును నీవాధారుఁడవు. కామదాతవు. వేదాంతవేద్యుండవు. పరమాత్మస్వరూపుండ వగునీకు మ్రొక్కెదను. యజ్ఞస్వరూపుఁడవు, యజ్ఞధాముఁడవు, యజ్ఞదాతవు, హవ్యవాహ నుండవు, యజ్ఞహర్తవు, యజ్ఞఫలదుండవు నగునీవు నాకు శరణ్యుండ వగుము. ఓశరణాగతవత్సలా! జగన్నాథా! నన్ను రక్షింపుము. ప్రభూ! నీవు భక్తులకును, అభక్తులకునుగూడ వత్సలుండవు. కావున నాకు రక్షకుండ వగుము!" అని యనేకవిధంబులఁ బ్రార్థించెను.

అప్పుడు పరమకారుణికుండును, సర్వభూతాత్మకుండును మం గళనిధానుండు నగుభగవానుండు ప్రసన్నుండై దక్షునిప్రార్థనానుసారం బుగా నాతనియజ్ఞంబు సర్వసంపన్నంబైనయట్లనుగ్రహించి యాతనికి యజ్ఞఫలంబును బ్రసాదించి భూతగణంబులతోఁగూడ నంతర్హితుం డయ్యెను. యజ్ఞార్థమై యచ్చటికి విచ్చేసిన దేవర్షిగణంబు లెల్లరును దమతమనివాసంబులకుం బోయిరి.

అనంతరము కొంతకాలంబునకు దేవదానవులకుఁ బరస్పరక లహంబు సంభవించుటయు దేవతలు భయభ్రాంతులై యేమియుం జేయఁజాలక జనార్దనుం డగుశ్రీపతింగూర్చి "ఓజగన్నాథా! బ్రహ్మేం ద్రాదులు నీకరుణాకటాక్షలేశముం గోరి బహుకాలంబు తపంబు చేయుచుందురు. శ్రీదేవి నీపాదకమలనిరతయై యున్నది. నీవు బ్రహ్మ భూతుండవు. ఈత్రిలోకంబులయందును గరుడవాహనుండ వగునీకంటె

తక్షకు లింకొక్కరు లేరు. నీకు సమానులు గాని, నీకంటె నధికులు గాని యెవ్వరును లేరు. దయామయుండ వగునీవీ మహాభయంబునుండి సంరక్షింపుము.'' అని ప్రార్థించుటయు శంఖచక్రగదాధరుం డగు భగవానుండు ప్రసన్నుండై ''ఓదేవతలారా! మీయభీష్టమేమో తెలుపుఁడు!" అని యనుగ్రహించెను. అప్పుడు సురవరు లందఱు నేకవాక్యముగా ''మహాత్మా! ఇప్పుడు మాకు సంప్రాప్తించిన యతి తీవ్రంబగుదైత్యభయంబునుండి మమ్ముద్ధరింపుము" అని వేఁడుకొనిరి.

వారిదీనాలాపంబుల నాలకించి కృపాళుండగు విష్ణుదేవుం డించుక యాలోచించి ''సురవరులారా! నేనేమి చేయుదును! నాచక్రాయుధమును శంకరుండు గ్రసించివైచెను. ఇట్టిస్థితిలో మీకును దైత్యపీడనంబు సంఘటిల్లినది. మంచిది. ఇప్పటికి మీమీనివాసంబులకుఁ బొండు! మీకు భద్రం బగునట్టి యుపాయ మాలోచించెదను'' అని ప్రబోధించి వారిని బంపివైచి గోవిందుండు గోదావరీతీరంబునకుఁ బోయి చక్రసంపాదనార్థమై యచ్చట శంకరునిఁగూర్చి తపంబు చేయ నారంభించెను. ఆతఁడు నిత్యమును సహస్రసువర్ణకమలంబులతో భక్తిపూర్వకంబుగా భవానీశ్వరునిఁ బూజింపఁదొడంగెను. నారాయణుం డొకనాఁడట్లు నాగకేయూరుఁడగు నగజామనోనాథునిఁ బూజించుచుండఁగా సహస్రకమలంబులలో నొకకుసుమంబు గానరాదయ్యెను. అప్పుడు కమలాక్షుండగు కమలామనోహరుఁ డన్యోపాయంబు లేక తననేత్రోత్పాటనంబు గావించి యర్ఘ్యంబును గావించి సహస్రకమలాన్వితంబగు నయ్యర్ఘ్యమును ధ్యానాంతంబున మహాత్మునకు సమర్పణంబు గావించుచు ''ఓదేవదేవా! సర్వాంతర్యామివగునీకు సకలజీవహృదయంబులును విదితంబులైయుండును. సకలజీవులకును నీవే కర్తవును, శరణ్యుండవు నైయున్నావు. దయాళుం

డవుచు లోకరక్షకుండవు నగునిన్ను నేను వేఁడుగఁ బ్రార్థింపనక్కఱ లేదు. సర్వదేవతాప్రియంబగు నాయభీష్టమును సఫలంబు గావింపుము." అని ప్రార్థించెను.

అప్పుడు పరమేశ్వరుండు భవానీసహితుండై యాపద్మాక్షునకు సాక్షాత్కరించి యాతనిఁ బరమాదరంబున గాఢాలింగనంబు చేసికొని "మహాత్మా! తొల్లిటివలెనే నీనయనంబు ప్రకాశమానంబగుఁ గాక! నీచక్రంబు మరల నీకు లభించుఁగాక!" అని యింకను ననేక వరంబులను బ్రసాదించెను. ఆసమయంబున సకలదేవతలు నచ్చటి కేతెంచి హరిహరులను, సరిద్వర యగు గౌతమిని ననేకవిధంబుల సన్నుతులం గావించిరి. అప్పటినుండియు నాక్షేత్రమునకుఁ జక్రతీర్థం బను నామము గలిగెను. ఈతీర్థమహాత్మ్యశ్రవణము సర్వపాపవినాశకమైనది. ఈతీర్థంబునందు స్నానంబును, దానంబును, పితృతర్పణాదులను గావించువారు సర్వపాపవిముక్తు లగుదురు. అట్టివారు తమపితృదేవతలతోఁ గూడ స్వర్గలోకసుఖంబులం గాంతురు. చక్రాంకితం బగు నాతీర్థ మిప్పటికిని దర్శనీయం బగుచున్నది.

## —♦ పిప్పలతీర్థము. ♦—

పూర్వకాలంబున గుణాఢ్యుండగు దధీచి యనునొక మునివరుండు గలఁడు. ఆతనిదేవి యగు గభస్తిని కులీనయుఁ బతివ్రతయునై యుండెను. ఆమెకు బడబ యను మఱియొక నామము గలదు. దధీచి గార్హస్థ్యధర్మనిరతుండై ప్రత్యహంబును నగ్నికార్యంబులఁ దీర్చుచు నియమవ్రతుండై యుండెను. ఆతఁడు భాగీరథీతీరంబున నాశ్రమంబు నిర్మించుకొని సహధర్మిణీసహితుండై నిత్యంబును గఠోరతపశ్చరణంబు గావించుచుండెను. ఆతఁడు నిత్యమును దేవార్చనంబును, నతిథిసేవయు యథావిధిగ

నిర్వర్తించుచు సర్వగుణసంపన్నుండై రెండవయగస్త్యుండునుంబోలె విరాజిల్లుచుండెను. ఆతనితపఃప్రభావముచే విపక్షులగుదైత్యు లయ్యాశ్రమప్రదేశంబునఁ బ్రవేశింపఁజాలకుండిరి.

ఒకప్పుడు రుద్రులు, ఆదిత్యులు, అశ్వినీకుమారులు, ఇంద్రుఁడు, విష్ణుదేవుఁడు, యముఁడు, అగ్నిదేవుఁడు మొదలగుదేవత లందఱును మహారణంబున దానవులను బరాజితులం గావించి పరమానంద పులకితశరీరులై, మరుద్గణసన్నుతులై మునిశ్రేష్ఠుండగుదధీచియాశ్రమంబున కేతెంచి యాతనికిఁ బ్రణామంబు గావించిరి. దధీచియుఁ బ్రహృష్టహృదయుండై భార్యాసహితంబుగ నాదేవతలనందఱను వేఱువేఱుగా సత్కృతులం గావించి కుశలప్రశ్నంబు చేసెను. దేవతలును సమాసీనులై యమ్మునివరునకుఁ బునఃపునఃప్రణామంబులు గావించుచు సంతుష్టచిత్తములతో "ఓబ్రహ్మర్షిశేఖరా! భూలోకకల్పకప్రతిమానుండగు నీవంటిసంయమీంద్రుండు మాయెడలఁ బ్రసన్నుండై యుండగా మాకీలోకంబున దుర్లభంబులగునభీష్టంబు లేమియుండును? తపోనిధీ! ఈజగంబున తీర్థస్నానంబును, భూతదయయు, మీవంటిమహాపురుషుల సందర్శనంబును దేహధారులకుఁ బరమఫలదంబులైయుండును. మునీంద్రా! నీవు మాకుశలం బడిగితివిగానఁ జెప్పుచున్నాము. మేము దానవులనందఱను జయించి యందలిమహావీరులనందఱను వధించి విజయోత్సాహముతో నీయాశ్రమంబునకు వచ్చియుంటిమి. ఓబ్రహ్మవిద్వరా! నీసందర్శనమువలన మే మెంతయుఁ బరితృప్తుల మైతిమి. విశేషించి మాకిక నాయుధంబులతోఁ బ్రయోజన మేమియును లేదు. వీనిని నిత్యము వహించుటవలన భారమే గాని యెట్టియుపయోగంబును లేదు. కావున నీయాయుధంబుల నెచ్చటనైన దాఁచికొనవలసి యున్నది. కాని మాకట్టిసురక్షితస్థానం బేదియు నగపడుట లేదు.

వీనిని స్వర్గమందుంచితిమేని శత్రువు లగురాక్షసు లెఱింగి యెట్లయిన నపహరింపఁగలరు. రసాతలమందుంచినను నపహరించుటకు వారి కవకాశమే యుండును. ఓమాననీయా! ఇన్నియు నాలోచించుకొని దానవాగమ్యం బగునీయాశ్రమంబున మాయాయుధంబులనన్నిటిని దాఁచికొనిపోవలయు నని వచ్చితిమి. ఇటనుంచినచో నిఁక మాకెట్టిభయశంకయు నుండదు. నీప్రభావంబుచే సురక్షితం బగునియ్యాశ్రమంబును రాక్షసులు తేరిచూడనైనఁజాలరు. ఇక్కాలంబున నీవంటితపోధనుం డెవ్వండును లేఁడు. ఓబ్రహ్మజ్ఞశిరోమణీ! మేము శత్రువులను జయించితిమి. దానవులెల్లరు నిదివఱకే నిహతులైపోయిరి. కృతార్థంబులును, భారభూతంబులు నగునీయస్త్రంబులతో మాకిఁకఁ గావలసినపని యేమున్నది? ఇఁక నీసాన్నిధ్యమే వీనికి సురక్షితం బగునుత్తమస్థానము. విజయోత్సాహులమగు మేమింక స్వర్గంబునకుఁ బోయి నందనవిహారంబు సేయుచు యథేచ్ఛోపభోగంబుల ననుభవించి సుఖింపఁదలఁచి యున్నారము. అవశ్యకమైనప్పుడు మేమందఱమును మరల నీయాశ్రమంబున కేతెంచి మాయాయుధంబులఁ దీసికొనిపోయెదము. అంతవఱకును వీనిని గాపాడుభార మంతయును నీయందుంచితిమి. వీనిని రక్షించుటకు నీవొక్కండవే సమర్థుఁడవు. కావున నీవీదేవకార్యమున కనుమతించి మాకు సెలవొసంగినచో సుఖంబుగఁ బోయివచ్చెదము" అని ప్రార్థించిరి.

దధీచిమునీంద్రుండు దేవతలవచనంబుల కంగీకరించెను గాని ప్రియశీల యగునాతనిసతీమణిమాత్ర మందుల కిష్టపడక "నాథా! తపోనిరతుల మగుమనధర్మంబునకు విరుద్ధముగా దేవకార్యభారమును తలపైఁ బెట్టుకొని యేమి చేయగలము? శస్త్రా [illegible] నష్టులను, సర్వసంగపరిత్యక్తుల నగు వారి కిహపరసుఖనాశకం బగు

పరకార్యభారవహనము కేవల మనుచితము గాదా! ఇందువలన నూరక మన కెన్నియో యనర్థములు గలుగక మానవు. సర్వసములగు మీరు దేవతలయెడల నభిమానముచే వారియాయుధరక్షణము కొఱకుఁ దావొసంగినచో దేవద్వేషులు మిమ్ము శత్రువుగా భావింపక మానరు. ఇంతేకాక యీయస్త్రంబులలోఁ బ్రమాదవశంబున నేదియైనఁ బోయినచో దేవతలు నన్మాత్రము మీయెడలఁ గుపితులు గాకుందురా? విశేషించి యసురులును మీకుఁ బరమశత్రులగుదురు. కావున నీపరద్రవ్యరక్షణభారమును వహించుట మనవంటివారి కెంతమాత్రమును దగదు. ఈయాయుధములను మీరు గాపాడుచున్నంతవఱకే దేవతలు మీకు మిత్రులై యుందురు. అవి నష్టంబులు గాని, యపహృతంబులు గాని యైనప్పుడు వారే మీకుఁ బరమవిరోధు లగుదురు, నాథా! శక్తిగలవారు ద్రవ్యము నర్థులకు దానము చేయుదురు. అట్టిసామర్థ్యంబు లేనిసాధుపురుషులు మనోవాక్కర్మంబులచేఁ బరోపకారంబు గావించుచుందురు. అంతియకాని పరధనరక్షణభారమును వహించుట సాధుజనోచితంబగుధర్మము గానేరదు. కావున నోనాథా! మీరిక్కార్యమును బరిత్యజించుటయే మీకుఁ బరమధర్మము" అనివిన్నవించెను. దధీచిమునీంద్రుండు యుక్తియుక్తంబులును, ధర్మసంగతంబులు నగు సహధర్మిణీవచనంబు లాకర్ణించియు, దేవతలకు మాఱుమాట చెప్పఁజాలకపోయెను. మునిపత్ని యిఁకఁ జేయునది లేక కానున్నది కాక మానదని దైవముపై భారము వైచి యూరకుండెను.

అప్పుడు దేవతలందఱు నత్యుజ్జ్వలంబు లగుతమతమయాయుధంబు లన్నియు నమ్మునీంద్రునియాశ్రమంబున స్థాపించి యాపరమతపోనిధికిఁ బ్రణామంబులు గావించి కృతకృత్యులై స్వస్థానంబులకుం బోయిరి. దేవతలట్లు పరమప్రీతులై చనుటయు దధీచిమునీంద్రుండును

సతీసహితుండై యథాసుఖంబుగ నయ్యాశ్రమంబున ధర్మాచరణనిరతుండై కాలక్షేపము చేయుచుండెను. ఇట్లు దేవమానానుసారంబుగా సహస్రవర్షంబులు గడచిపోయెను. కాని దేవత లెవ్వరును దమయస్త్రంబులను దీసికొనిపోవుటకై మరల రాలేదు.

అప్పు డాకారణమున దధీచిమునీంద్రుండు భార్యయగు గభస్తినిం గాంచి “ఓ భద్రా! దానవులెల్లరును నాయెడల ద్వేషభావముం గాంచియున్నట్లు తెలియవచ్చుచున్నది. ఇంతకాలమైనను నీయాయుధములం గైకొనిపోవుటకు దేవత లెవ్వరును వచ్చుట లేదు. ఇప్పుడు మనకుం గర్తవ్యమేమో యాలోచింపవలయును.” అనుటయుం బరమపతివ్రత యగునద్దేవి వినయవినమితయై మృదుస్వరంబున “నాథా! నాకుం దోచినవిషయమును నేను మున్నె మొదటనే చెప్పితిని. తరువాత నిప్పు డేమి చేయవలయునో మీరే బాగుగ నాలోచించి నిశ్చయించుకొనవలయును. ఇప్పు డుపాయమెఱింగించుటకు నాకెట్టిసామర్థ్యమును లేదు. దానవులందఱును బలవంతులగుటయే కాక తపోబలసంపన్నులుగూడ నైయున్నారు. వారు సర్వసన్నద్ధులై వచ్చి యెట్లయిన నచిరకాలములోనే యీయస్త్రశస్త్రంబుల నపహరించి కొనిపోక మానరు” అని మనవిచేసెను. దధీచి మునివరుండు కొంతసేపాలోచించి యన్యోపాయంబు గానక మా[illegible] పవిత్రంబులు నగుతనకమండలుజలంబులచే నస్త్ర[illegible] [illegible]తంబులుగాం జేసి వానినుండి వెలువడిన సర్వాస్త్రమయంబును, పవిత్రంబును తేజోమయంబును నగుజలంబును బానము చేసివైచెను. ఆకారణంబుచే నయ్యాయుధంబు లన్నియును నిర్వీర్యంబులై కాలవశంబునం గ్రమక్రమంబుగా క్షయప్రాప్తంబులయ్యెను.

అనంతరము దేవతలు వచ్చి దధీచిం దర్శించి “మునీంద్రా!

శత్రువులగు దానవు లిప్పుడు చెలరేఁగి మమ్ము బాధించుచున్నారు. ఆయుధవిహీనుల మగు మేము వారివిజృంభణము సహింపఁజాలకున్నాము. కావున నీయొద్ద దాఁచుకొన్నమాయాయుధములను మాకుఁ బ్రసాదింపవలయును" అని యడుగుటయు సంయమీంద్రుండు "సురవరులారా! చాలకాలమైనను మీరు మరల రాకుండుటచే మీయాయుధంబులను రాక్షసు లెవ్వ రపహరింతురో యనుభయముచే వానిని రక్షింపఁజాలక మంత్రజలంబులచే ద్రవీభూతంబులుగఁ జేసి పానము చేసివైచితిని. ఇప్పు డవి యన్నియును నాదేహస్థంబులై యున్నవి. ఆయస్త్రశస్త్రంబుల నపహరించుకొనిపోయినచో నసురులు మహాబలవంతు లగుదు రనుభయముచే నేనట్లు చేయవలసివచ్చినది. ఇప్పుడు నన్నేమి చేయుమందురో మీరే చెప్పవలయును" అనియెను.

దేవత లామాట లాలించి మిగులవినయముతో "ఓమౌనిశేఖరా! మాయస్త్రశస్త్రములను మరల మాకు దయచేయవలయు నని కోరుటకంటె మేమేమిచెప్పఁగలము? ఆయుధబలము లేకయున్నచో మేము నిశ్చయముగా నసురులచేఁ బరాజితుల మగుదుము. శత్రువులు దినదినంబును వర్ధిల్లి పోవుచున్నారు. వారిని దప్పించుకొని మేమెక్కడకుఁ బోఁగలము? స్వర్గంబునఁగాని, మర్త్యలోకంబునఁగాని, పాతాళంబునఁగాని మాకు నిలువ నీడ లేకుండఁబోవునని భయపడుచున్నాము. నీవు తపోధనులలో నగ్రగణ్యుండవు. నీసన్నిధి నింతకంటె నధికముగాఁ బ్రసంగించుట యుచితము గాదు. దీనికిఁ దగినయుపాయము నీవె యాలోచింపవలయును" అని విన్నవించిరి.

అప్పుడు దధీచి యిట్లనియె "అమరవరులారా! మీమాయాయుధంబు లన్నియు నిప్పుడు నాదేహస్థితంబులై యున్నవి. నిర్విచారముగా మీరు వానినిఁ గైకొనుఁడు" అనుటయు దేవతలు "మునీంద్రా!

నీయెముకలను గొనిపోయి మేమేమి చేసికొందుము! అమరపీడుల మగుమే మస్త్రవిహీనులమగుటచే నాయసురాకులకు వధయులమై యున్నాము" అని విచారముతోc బలికిరి. దధీచియు నిరాలంబం లగు నిర్జరగణంబులయెడలc గృపాళుండై "సుపర్వశేఖరులారా! నేను యోగబలంబుచే దేహత్యాగంబు గావించెదను. మీరు నాశరీరము నందలి యుత్తమంబులగు నస్థులం గైకొనిపోయి యత్యుత్తమాస్త్ర శస్త్రంబుల నిర్మించుకొనుcడు" అనియెను.

అగ్నికల్పుం డగుదధీచిమునీంద్రుం డట్లు పాయంబు చెప్పుటయు దేవతలందఱు నందుల కంగీకరించిరి. అప్పటికి దధీచిభార్య యంతర్వత్నియై యుండుటచే నాశ్రమంబున లేకుండెను. దేవతల కామెయెడల భయంబు గలదు గావున నామె లేనప్పుడే యీకార్యమును సాధించు కొనవలయు నని తలంచి దధీచింగాంచి సకలామరలోకకల్యాణంబు కొఱకు నీవస్థులయనుగ్రహింపవలయు నని ప్రార్థించిరి.

దధీచిమునీంద్రుండును బరమసంతుష్టాంతరంగుడై మన్స్యజంబులగు ప్రాణంబులను బరిత్యజింప నిశ్చయించుకొని "దేవతలారా! మీరు నా యెముకలను మాత్రము గైకొని తృప్తినందుcడు. తక్కినవనాదేహము తో మీకేమిప్రయోజనమున్నది?" అని చెప్పుచుc బద్మాసనాసీనుం డై నాసాగ్రంబున దృష్టిcగీలించి ప్రసన్నచిత్తుండై యోగబలంబుచే వహ్నిసహితంబుగా వాయువును మెల్లమెల్లగా హృదాకాశమధ్యంబు నకుc గొనిపోయి యప్రమేయంబును, నుపాసితవ్యంబును, నగుబ్రహ్మ స్వరూపంబునందు బుద్ధిస్థాపనంబు గావించి మహాత్ముం డగు నమహ్మాస శేఖరుండు బ్రహ్మసాయుజ్యప్రాప్తుం డయ్యెను.

తోడనే యాతనిపవిత్రశరీరంబు నిర్జీవం బగుటయు దేవతలు విశ్వకర్మం బిలిచి "ఓశిల్పకళాప్రవీణా! నీవిమ్మునీంద్రునిశల్యంబుల చే

నుత్తమాస్త్రశస్త్రంబులను "గ్రాహ్యము" అని కోరిరి. ఆ బ్రాహ్మణో త్తముఁ డాశ్చర్యకరంబగు ఘోరతపంబున వంచి యెముకలను దీసికొని యాయుధ నిర్మాణమును గావించుటకు విశ్వకర్మసాహసింపజాలకపోయెను. అట్టి దారుణకర్మ నాచరించుట కాతండు భీతుం డయ్యెను. ఎవ్వరైన నీ శల్యంబులం గొని నాకిచ్చినచో నాక్షణమునందే యుత్తమాయుధంబు లం గావింపఁగల నని చెప్పెను. అప్పుడు దేవతలు గోగణంబులం బిలి చి "ఓ ధేనుసంఘములారా! మీ హితంబుకొరకే వజ్రాయుధనిర్మా ణంబు గావింపవలసి యున్నది. కావున మీరీమునివరుని దేహంబును విదారితంబుగఁ జేసి యందలిశల్యంబులను బవిత్రంబులుగ నొసరించి మాకర్పింపవలయును" అని ప్రార్థించిరి.

అప్పుడు గోవులు దేవతలయాజ్ఞానుసారంబుగా దధీచియెముకల నొలిచి దేహనంబుచే వాని నన్నిటిని బవిత్రంబులుగఁజేసి విశ్వకర్మ కొసంగెను. అనంతరము దేవతలు దీనవదనంబులతో స్వస్థానములకుం బోయిరి, గోనయంబును వెడలిపోయెను. విశ్వకర్మ యాశల్యంబులం గైకొని సర్వసుపర్వప్రియంబుగా శస్త్రాస్త్రంబులను నిర్మించి దేవత లందఱకును సమర్పించెను.

అనంతరము శీలవతియు, గర్భిణియు, భద్రలక్షణసంపన్నయు నగుదధీచిభార్య జలకలశహస్తయై ఫలపుష్పంబులచే సుమాదేవిని బూజించుటకును, అగ్నిహోత్రంబులను, ఆశ్రమేశ్వరుని, ఆశ్రమంబు ను సందర్శించుటకును సుతూహలంబున బయలుదేఱి వచ్చుచుండెను. మార్గమధ్యంబున నుల్కాపాతముచే నామెకు గమననిరోధంబయ్యెను. అయినను నామె ససంభ్రమంబుగా నాశ్రమంబున కేతెంచి యందు నాథుండు గానంబడకుండుటచే శంకించి యగ్నిచెంతకుంబోయి "నా జీవితేశ్వరుం డెచ్చటికిఁబోయెను?" అనిప్రశ్నించుటయు నగ్నిదేవుండు

విషణ్ణహృదయముతో సమస్తవృత్తాంతము నామె కెఱింగించెను. ఆ మాటలు విన్నంతనే యాసతీమణి దుఃఖావేశముచే నిలువునఁ గూలఁ బడిపోయెను. అగ్నిదేవుం డామె ననేకవిధంబుల నాశ్వాసించుచుండెను.

అప్పుడు గభస్తిని దుఃఖము నడంచుకొని యించుకసేపాలో చించి యొక్క-దీర్ఘ శ్వాసమును విడిచి ॥ దేవతలు స్వార్థపరులై యిట్టి దారుణకర్మంబున కంగీకరించిరి. అట్టియాప్తులగుదేవతలనందఱను శాపోపహతులం గావించుట యుచితము గాదు. నేనే నానాథుని దేహముతోఁగూడ నగ్నిప్రవేశంబు గావించెదను. పతిదేవతనగు నాకింత కంటె నిప్పుడు కర్తవ్యంబు మఱియొండు లేదు'' అని నిశ్చయించుకొని యతికష్టముచేఁ గోపసంవరణంబు గావించుకొని యాత్మేశ్వరు నుద్దేశించి ధర్మసంగతంబు లగువచనంబులతో ॥ప్రాణేశ్వరా! ఈజగంబున నుత్పన్నంబులగువస్తువు లన్నింటికిని వినాశంబు దప్పదు. కావున మరణించినవారికై విచారించుట యవివేకము. పుణ్యాత్ములగుమానవులు గోబ్రాహ్మణదేవహితార్థమై ప్రాణపరిత్యాగంబు గావింతురు. పరిణామశీలం బగునీప్రపంచమునందు ధర్మమయంబును, సమర్థంబునగుదేహము గాంచి దేవతలకొఱకైనను, బ్రాహ్మణులకొఱకైనను దానిని వినియోగించు పుణ్యపురుషులే నిజముగా ధన్యజీవను లగుచున్నారు. దేహధారులగువా రీనాఁడు గాకున్న నేనాఁటికైనను బ్రాణములను విడువవలసినవారే గదా! దేవబ్రాహ్మణులప్రియంబుకొఱ కాత్మసమర్పణంబుగావించువా రీశ్వరతుల్యు లని ప్రశంసింపఁబడుచుందురు. నేను వలదనుచున్నను నాస్వామి దేవతలయాయుధరక్షణభారమును వహించి యుండెను. పరమేశ్వరునియుద్దేశమం దేమియున్నదో యెవ్వరు గ్రహింపఁగలరు? ఆతనివిచిత్రచర్య లన్నియు నలోకసామాన్యములుగదా!'' అని బహుప్రకారంబుల భావించుకొని యమ్మునిపత్ని

యథావిధిగ నగ్నిపూజనంబు నిర్వర్తించి నిజేశ్వరుని శల్యావిహీనం బగు నవశిష్టశరీరము నగ్నియందుంచి తానుగూడ నగ్నిప్రవేశంబు చేయుచుఁ దనగర్భంబు చీల్చుకొని యందలి బాలకుని బైకెత్తిపట్టుకొని గంగాదేవిని, భూదేవిని, పుణ్యాశ్రమంబును, ఆశ్రమస్థంబులగు నోషధులను, వనస్పతులను నాహ్వానించుచు "తల్లియుఁ, దండ్రియు, జ్ఞాతులును, బంధువులును మఱియే రక్షణమును లేని యీ బాలకుని భూతగణంబులును, ఓషధిగణంబులును, లోకపాలకులును బరిపాలింతురుగాత! పితృమాతృవిహీనులగు బిడ్డల నాత్మీయులం బోలె భావించి లాలించి పాలించు పుణ్యాత్ములు బ్రహ్మాదులకుఁగూడ వందనీయు లగుదురు" అని యుగ్గడించుచుఁ బతివ్రతాయగు నాసాధ్వీమణి యక్కుమారుని పిప్పలతరుషండసమీపంబున నుంచి తానగ్నిప్రదక్షిణంబాచరించి నమస్కారంబు చేసి యజ్ఞపాత్రసహితంబుగా ననలమధ్యంబునఁ బ్రవేశించి స్వామిసమేతంబుగా స్వర్గంబును జేరుకొనియెను.

ఆసతీశిరోమణి యతిలోకసత్కృత్యముం గాంచి యమ్మునిదంపతుల యభావంబును సహింపఁజాలక యాశ్రమస్థితంబులగు వృక్షంబులును, వనజంతువులునుగూడ రోదనము చేయ నారంభించెను. "దధీచిముని యిందు మమ్మందఱను బిడ్డలవలెఁ బరిపాలించెను. అతఁడే మాకుఁ దండ్రి యయ్యెను. వేయేల? నేఁడు తల్లిదండ్రులను బాసి ప్రాణములను ధరింపఁజాలము. తల్లిదండ్రులు స్వర్గస్థులైనపిమ్మట వారి పుత్రుల నత్యంతప్రేమంబునఁ బాలించు పుణ్యాత్ములు ధన్యులు. దధీచియు, గభస్తినియు మొదటినుండియు జననీజనకులై మమ్ముఁ గాపాడుచుండిరి. నిర్భాగ్యుల మగు మాకిప్పుడు వారిరువురునుగూడఁ గఱవైపోయిరి. దైవవిధి యిట్లున్నది. కానిమ్ము! ఎట్లయినను మాకింతటి నుండియే [illegible] దధీచిమునిస్థానీయుఁడు. ఇక్కుమారుఁడే జనని

యగునగభస్తిని. ఇట్లు భావించుకొని యీబిడ్డను బ్రేమతోఁ జూచుకొనుచుండుటయే మాకవశ్యకర్తవ్యము." అని యాశ్రమస్థంబులగు వనస్పతులును, ఓషధులును నిశ్చయించుకొని తమయధీశ్వరుండగు సోముని బ్రార్థించి యమృతమును సంపాదించి దాని నమ్మునికుమారునిచే సేవింపఁజేసిరి.

అయ్యమృతపానంబువలన మునిబాలకుండు శుక్లపక్షచంద్రునిం బోలి దినదినప్రవర్ధమానుం డగుచుండెను. పిప్పలవృక్షంబులచే సురక్షితుం డైనయక్కుమారునకు పిప్పలాదుం డనునామంబు గలిగెను. అతఁడు క్రమముగాఁ బెద్దవాఁడై యొకనాఁడు తనజీవితముం గూర్చి విస్మయంబంది మానవులవలన మానవులును, పక్షులవలనఁ బక్షులును, బీజములవలన వనస్పతులు నుత్పన్నంబులగుట సహజము. కాని కరచరణంబులుగల నావంటిజీవి వృక్షంబులవలన జనించుట వింతగానున్నది. ఇట్టివైషమ్యము లోకమునం దెచ్చట నగపడుట లేదు. అని యనుకొనియెను. ఆమాటలు వృక్షంబు లాలించి పిప్పలాదున కాతనిజన్మవృత్తాంతమును, అతనితల్లిదండ్రులపుణ్యచరిత్రమును సవిస్తరంబుగా నెఱిగించెను. అది యంతయును విన్నంతనే పిప్పలాదుండు దుఃఖావేగముచే నిలువునఁ గూలఁబడిపోవుటయు వృక్షములాతని లేవనెత్తి ధర్మసంగతంబులగువచనంబులతో నాశ్వాసించెను.

అప్పుడు పిప్పలాదుండించుక తేరుకొని వనస్పతులం గాంచి "నేను నాపితృహంతకులగుదురాత్ములను శిక్షింపఁజేసెదను. అట్లు చేయకున్నచో నాజన్మమునకుఁ బ్రయోజన మేమున్నది? తండ్రిమిత్రుల కనువర్తనుండును, అతనిశత్రువులకుఁ బ్రతికూలుండునగువాఁడే పుత్రనామంబునకు యోగ్యుఁడగుచున్నాఁడు. అట్లు గానివాఁడు శత్రుఁడే కాని పుత్రుండు గానేరఁడు. పితృమిత్రులగువారి కెట్టియహితుఁడైనను

శత్రుణీయుతే యని పండితులు చెప్పుదురు.'' అనిదుఃఖావేశంబునఁ బలుకుచున్న పిప్పలాదుని వనస్పతులు సోమసమీపంబునకుం గొని పోయి యాతనియుద్దేశ మంతయును జంద్రునకు నివేదించెను. సోముం డక్కుమారునిం గాంచి ''వత్సా! నీవు విధివిహితంబగు విద్యను, తపోబలంబును, మంగళమయంబగువాక్కును, శౌర్యమును, రూపమును, బలంబును వర్ధిల్లఁ జేసికొనుము. నాయాజ్ఞవలన నీకవి యన్నియును లభింపఁగలవు'' అని బోధించెను.

అప్పుడు పిప్పలాదుండు వినయవినమితుండై యోషధీనాథు నుద్దేశించి ''మహాత్మా! పితృహత్యకుఁ బ్రతిక్రియఁ గావింపనంతవఱకు నాకీతపోవిద్యాబలంబులవలన నేమిప్రయోజనము! దేవా! నాసంకల్పము సిద్ధించుటకు నేనెచ్చటికిఁ బోవలయునో, ఏతీర్థమును సేవింపవలయునో, ఏమంత్రమును జపింపవలయునో, ఏదేవత నారాధింపవలయునో ముందుగ నాకుపదేశింపవలయును'' అని ప్రార్థించుటయు నమృతాంశుం డించుక యాలోచించి మహాదేవుండగుమహేశ్వరుఁడే సకలాభీష్టప్రదాయకుఁడు. సకలజీవులకు నాతఁడే భుక్తిముక్తిప్రదాయకుఁ డనుట కెట్టిసంశయమును లేదు. అని చెప్పెను. అది విని పిప్పలాదుండు ''ప్రభూ! నేను బాలకుఁడను. బాల్యచాపల్యము నన్నింకను వదలలేదు. నాకెట్టిసామర్థ్యమును లేదు. ఎట్టితపంబును గావించి యెఱుంగను. ఇట్టినేను మహాదేవు నెట్లు సందర్శింపఁగలుగుదును?'' అని ప్రశ్నించెను. అప్పుడు చంద్రుండు ''కుమారా! నీవు గౌతమీతీరంబునకుఁ బోయి యచ్చటఁ జక్రేశ్వరుండగుమహాదేవు నారాధించి ప్రార్థింపుము. అద్దేవుం డతిసులభంబుగనే ప్రసన్నుండు గాఁగలఁడు. పరమకరుణామయుఁడగు నాభగవానుండు భక్తవత్సలుండై నిరంతరము నచ్చటనే సుప్రతిష్ఠితుండై యుండును. ప్రభవిష్ణుం డగువిష్ణుదేవుం

డాతనిసందర్శించియుండెను. సకలదేవారాధ్యుం డగుశంకరుం డచ్చట నే విష్ణుదేవునకు సుదర్శనచక్రమును బ్రసాదించెను. ఓమహాబుద్ధీ! దండకారణ్యమధ్యమునుండి ప్రవహించుచున్న యాగౌతమీతీరమునకుం బోయి యచ్చట చక్రేశ్వరతీర్థంబున నీశ్వరారాధనంబుఁ గావింపుము. ఆతీర్థ మీవనస్పతు లెఱుంగనిది గాదు. నీకచ్చటఁ బరమేశ్వరుండు ప్రీతుండై సర్వాభీష్టంబులను బ్రసాదించును.'' అని బోధించెను.

ఓమహేశ్వరుం డిట్లు ప్రబోధించుటయు మునికుమారుం డగుపిప్పలాదుండు మహాదేవుండు చక్రేశ్వరరూపంబున విరాజిల్లుచున్న యాపుణ్యక్షేత్రముం గూర్చి బయలుదేఱెను. ఆతనియందలి ప్రేమచే నాశ్రమస్థంబులగు వనస్పతులును బయలుదేఱెను. ఇట్లందఱు నాతీర్థంబుఁ జేరుటయు పిప్పలాదుండు గోదావరీజలంబులయందు స్నానం బాచరించి త్రిభువనేశ్వరునకు నమస్కారంబు చేసి శుచియై యేకాగ్రచిత్తంబున ॥దేవా! ధీరహృదయు లగుసాధువులు మనఃప్రాణంబులను జయించి నిఖిలవాసనా దూరులై, సకలకర్మంబులను బరిత్యజించి ముక్తిలాభంబుకొఱకుఁ గేవల మేకాంతభావంబున నెవ్వనిశరణంబు నపేక్షించుచుందురో యట్టిదేవాదిదేవుండ వగు నీకు నమస్కారము. సర్వసాక్షియు, సకలాంతరాత్ముండును, సకలేశ్వరుండును, సకలకళానిధానుండును, స్మరహరుండును నగుశంకరుండు నామనోభీష్టము నెఱింగి కరుణామయుండై సిద్ధింపఁజేయుఁగాక! దశాననుం డగురావణుండు దిక్పాలురను జయించి దేవపూజ్యుండును, త్రిపురారియు నగునీకైలాసనగరము నాందోళితంబుగఁ జేయఁగడంగుటయు నీవు నీయంగుష్ఠముచే నాతని రసాతలంబునకుంగూడ నధోలోకంబున కడఁచివైచితివి. అప్పుడు విశీర్ణదేహుం డగు రావణుండు భయార్తుండై ప్రార్థించుటయు నీవు కుపితుండవయ్యును నవ్వుచు సతీసహితంబుగ నాతనియెడలఁ బ్రస

న్నుండవై యభీష్టవరంబులఁ బ్రసాదించితివి. అట్టి యయుక్తదాతలు నీకంటె నెవ్వరున్నారు? ఓమహేశ్వరా! నిత్యశివపూజాబలంబున బాణాసురుండు మహేంద్రవైభవమునుగూడ నధఃకరించి ప్రసిద్ధ యశుండయ్యెను. ఒకప్పుడు కార్తికేయుండు సర్వశత్రుసంహారంబు గావించి దేవతలనందఱను బ్రీతులం జేసి జనకుండవగు నీకు నమస్కరించుటకై నీసన్నిధి కేతెంచి నీక్రోడతలంబునఁ గూర్చుండి యున్న గణపతిం గాంచి కుపితుండగుటయు బుత్రవాత్సల్యంబున నీవాతని నంకంబునం జేర్చుకొని హాస్యంబు గావించితివి. బాలకుం డగుకార్తికేయుండు బాల్యచాపలంబున నీయొడియందును, దల్లియొడియందు నొక్కసారియే కూర్చుండవలయు నని కాంక్షించెను. ఎంతబ్రతిమాలినను నక్కుమారుండు పట్టు విడువకుండుటచే నాతనిఁ బోరుడిగించుటకై నీవప్పుడర్ధనారీమూర్తిం దాల్చితివి. మహాదేవా! నీవాత్సల్యము నెవ్వరు వర్ణింపఁగలరు? నేను బాలుండను నాయెడలం గరుణించి నాయభీష్టంబు దీర్పుము!" అని ప్రార్థింపఁదొడంగెను.

అప్పుడు స్వయంభువుం డగుశంభుండు ప్రీతుండై "ఓపిప్పలాదా! నీకుశుభమగుఁగాక! నీయభీష్టంబు నెఱింగింపుము" అనియెను. అమ్మునికుమారుండు పరమానందభరితహృదయుండై "మహాదేవా! మహాయశస్వి యగునాజనకుని దేవతలు వధించియున్నారు. నాతండ్రి యశాంభికుఁ డగుసత్యవాది. నాతల్లి పరమపతివ్రత. ఆయిరువురకును దేవతలమూలంబున వినాశంబు గలిగెననువార్త వినినప్పటినుండియు నేను దుఃఖక్రోధాభిభూతుండనై యున్నాఁడను. ఇఁక నాకీజీవితమునం దెట్టివాంఛయును లేదు. దయాళుండవగునీవు దేవతలకు వినాశంబు గల్పించు సామర్థ్యమును నాకుఁ బ్రసాదింపవలయును. ఓచంద్రశేఖరా! నీవు త్రిలోకజనసేవ్యుండవుగదా!" అని కోరుటయు నీశ్వరుండు

“ వత్సా! నీవు నాతృతీయనయనంబును దర్శింపఁగలిగినచో నసుర వినాశంబునకు సమర్థుండవు గాఁగలవు” అనియెను.

అప్పుడు పిప్పలాదుండు ముక్కంటిమూఁడవకంటిని దర్శించుటకుఁ బ్రయత్నించెను గాని యట్లు చూడఁజాలకపోయెను. ఈశ్వరుం డాతనియెడలఁ గరుణాళుండై “ బాలకా! నీవు కొంతకాలము తపంబు గావింపుము! ఆతపోబలంబుచే నాతృతీయనేత్రమును జూడఁగలవు. అప్పుడు నీసర్వాభీష్టంబులును లభించును” అని ప్రబోధించెను. ధర్మాత్ముండగుదధీచికిఁ దనయుం డగుపిప్పలాదుండు బాలుండయ్యును దపశ్చరణంబునకుఁ గృతనిశ్చయుండై యాక్షేత్రమునందే యనన్యచిత్తంబున శివధ్యానరతుండై బహువత్సరంబులు కఠోరతపంబు గావించెను. అతఁడు ప్రతిదినంబును ప్రాతఃకాలంబున లేచి గౌతమీస్నానంబును, గురువందనంబును గావించి సుఖాసనోపవిష్టుండై సుషుమ్నానాడియందు మనంబును లగ్నంబుగఁ జేసి నాభిస్థానంబున హస్తస్వస్తికారోపణంబు చేసి సకలసంసారస్మృతుల నుజ్జగించి యేకమాత్రంబగు శివజ్యోతిని ధ్యానింపఁ దొడంగెను. ఇట్లుండఁ గొంతకాలంబున కాతని కాక్షేత్రమాహాత్మ్యమువలన మహాదేవునితృతీయనయనము కన్నులఁగట్టినట్లగపడియెను.

అప్పుడు పిప్పలాదుండు మహానందముతోఁ గృతాంజలియు వినయవినమితుండునై “ ఓదేవదేవా ! శంభూ! నీతృతీయనయనజ్యోతి నాదృష్టిపథంబునం దెప్పుడు వెలుంగుచుండునో యప్పుడు నా సర్వాభీష్టంబులును సిద్ధించు నని వరం బొసంగితివి. ఇప్పుడు నాకట్టి దివ్యసందర్శనము లభించినది. కావున శత్రువినాశనంబునకుఁ దగిన సామర్థ్యమును నాకుఁ బ్రసాదింపఁగోరెదను.” అని ప్రార్థించెను. అం తట నాశ్రితమనోరథంబులకు [illegible] [illegible] “ ఓయి పార్వతీ!

నీజనని స్వర్గారోహణంబు గావించునప్పుడు పరద్రోహనిరతులగువా రాత్మహితవిస్మృతులై భ్రాంతిచిత్తంబులు గలవారగుటవలన నిరయ పతితు లగుదురని వచించియుండెను. కావున నీవు మాతృవాక్యపాల నంబు చేయఁదగును. నీవంటివానికిఁ బరద్రోహంబు కర్తవ్యంబు గా నేరదు'' అనిపలుకుటయు పిప్పలాదుండు కంపితుండై యభిమానముచే నంతర్దగ్ధుం డగుచుండెను. తనజననిసాధువాక్య మాతనికి నిరర్థకమని తోఁచెను. అతఁడప్పు డీశ్వరునుద్దేశించి ''వరమిమ్ము! ప్రసన్నుండవై నాయభీష్టంబు దీర్పుము'' అని యేకాగ్రచిత్తముతోఁ బ్రార్థింపఁదొ డంగెను.

అంతలో నద్దేవునితృతీయనయనమునుండి బడబాస్మరణంబు గావించుచు నొకకృత్తి బహిర్గతం బయ్యెను. ఆకృత్తి బాలగర్భిణి యగు పిప్పలాదజననినామమును స్మరించుచు బడబానామంబున ననలగర్భిణియై సర్వప్రాణివినాశంబు గావించుటకు సంసిద్ధయై యుండెను. అది మృత్యుజిహ్వంబోలి యతిభీషణంబగు నాకృతితో మహారౌద్రముం దాల్చియుండెను. ఆకృత్య యట్లుదయించినంతనే పిప్పలాదుం గాంచి ''చెప్పుము! నేనేమి చేయవలయునో యాజ్ఞాపింపుము'' అనియెను. నీవు నాశత్రువులగుసకలదేవతలను భక్షింపవలయు నని పిప్పలాదుం డాజ్ఞాపించెను.

''తథాస్తు'' అని యాకృత్తి మొట్టమొదటనే పిప్పలాదునిఁ బట్టుకొని భక్షింపఁగడంగెను. అమ్మునికుమారుండదరిపడి ''ఇదియేమి!'' అనియెను. నీదియు దేవనిర్మితంబగుశరీరమే కాదా యని యాశక్తి ప్రత్యుత్తరం బిచ్చెను. అప్పు డాతఁడు భీతుండై శివసన్నిధికింబరు గెత్తుకొనిపోయి యద్దేవు ననేకవిధంబుల సన్నుతించుటయు శంకరుండు ప్రసన్నుండై ''ఓకృత్యా! నీవీప్రదేశంబునకుఁ జుట్టును యోజనపరి

మితంబగుస్థలంబునం దున్నప్రజల నేవిధంబునను హింసింపఁగూడదు. కావున నీవు దూరముగఁ బోయి నీకర్తవ్యమును దీర్చుకొనుము!'' అని యాదేశించుటయు ఋషినిర్మితంబును, బకిబాకృతియునగు నాకృతి పిప్పలతీర్థంబునకు యోజనదూరంబునకుఁ బోయి యచ్చట నిలిచియుండెను. దానినుండి లోకక్షయసమర్థంబగు భీషణాగ్నిజ్వాల పరిజ్వరిల్లఁ దొడంగెను.

దానింగాంచి దేవతలందఱును భయభ్రాంతులై గౌతమీతీరంబున కేతెంచి పిప్పలేశ్వరుండగు మహాదేవుని సందర్శించి ‟ఓశివా! ఎల్లవెడలఁ బరిభూతులును, ఆర్తులు, శాంతచిత్తులునగుసకలజీవులను రక్షించుటకు నీవొక్కఁడవే శరణ్యుండవై యున్నాఁడవు. దేవా! నీవలననుత్పన్నంబైన యాకృత్య తనదారుణానలజ్వాలలచే మమ్ముఁ బీడించుచున్నది. మమ్మీవిపత్తునుండి యుద్ధరింపవలయును. నీవార్తుల కభయప్రదుండవుగదా! ఋషిప్రార్థనంబువలన నీయుగ్రనేత్రంబునుండి జనించినయాకృత్తి త్రిలోకంబులను దహించివైచుట కుద్యుక్తయైయున్నది. ఇట్టిస్థితిలో లోకరక్షణంబు గావించుటకు నీకంటె శక్తులింకెవ్వరున్నారు'' అనియనేకవిధంబుల నభినుతులం గావించుటయు నపలేశ్వరుండు ‟ప్రియమరులారా! ఇచ్చట యోజనమధ్యస్థితం బగుప్రదేశంబునంగల జీవుల నీకృత్య యేమియును జేయఁజాలదు. కావున మీరందఱు నిచ్చటనే వసించి యుండుఁడు! అందువలన నీశక్తిచే మీకెట్టి భయంబును గలుగదు.'' అని యానతిచ్చెను.

దేవతలాదేవునివచనంబు లాలించి ‟ఓజగన్నాథా! మేమెల్లరమును నివసించుటకు నీవు మాకు స్వర్గమును బ్రసాదించి యుంటివి. దానిని బరిత్యజించి మేమిచ్చట నెట్లుండఁగలము?'' అనిప్రశ్నించుట

యు శంకరుండు "సురవరులారా! ఈదేవుండగు దివాకరుండు విశ్వచక్షువు, విశ్వముఖుండునై తనరశ్మిజాలంబుచే నిత్యము జగములంతయు నుత్తాపితంబుగఁ జేయుచు జగజ్జనకస్వరూపుండై యున్నాఁడు. కావున నాతఁడొక్కఁడె యీస్థానంబున నిలిచియున్నఁ జాలును." అని యుపదేశించెను. అట్లు చేయుటకు దేవతలందఱు నంగీకరించిరి. అప్పుడు త్వష్ట్రి భాస్కరునిం గాంచి "ఓ జగత్ప్రభూ! విబుధరక్షణంబుకొఱకు నీవిచ్చట నిలిచియుండవలయును. మేమందఱము గూడ మాయాంశముల నిందు మహాదేవసాన్నిధ్యమున నిలిపి యుంచెదము." అని ప్రార్థించి దేవతలందఱును జక్రేశ్వరతీర్థంబునకు యోజనమధ్యప్రదేశమునందు నలుదెసల నుభయతీరంబులను స్వాంశంబులతో నివసించి యుండిరి. ఈవిధముగా సకలదేవాంశలను గాంచియున్న యాప్రదేశము మహామహిమంబుచే విరాజిల్లుచుండెను. అప్పటినుండియు నాక్షేత్రము మూఁడుకోట్లైనువందలతీర్థములతో విలసిల్లుచుండెను. ఆసకలతీర్థమాహాత్మ్యంబుల నెవ్వరును వర్ణించుటకుఁగాని, యాకర్ణించుటకుఁగాని సమర్థులు గాఁజాలరు.

అనంతరము సురలందఱును వినయవినమితులై సదాశివునుద్దేశించి "ఓ దేవదేవా! జగన్మయా! నీవిప్పలాదుని శాంతింపఁజేయవలయును" అని ప్రార్థించుటయు జగన్నాథుండగు శంకరుండు మునికుమారుం గాంచి "వత్సా! ఈదేవతలనందఱను భస్మము చేసివైచినను నీ తల్లిదండ్రులు తిరిగి రానేరరుగదా! ధర్మవేదియగు నీతండ్రి దైవతకార్యముకొఱకే తనప్రాణములను త్యజించియున్నాఁడు. వాస్తవముగా నీజనకునివంటి దీనదయాళుఁడును, ఆర్తత్రాణపరాయణుఁడును నగు మహాత్ముఁ డీజగంబునందు మఱియొకఁడు లేఁడు. నీజనని మహాపతివ్రత. ఆమెయు స్వర్గారోహణము గాంచినది. ఆదంపతులవంటిప్పు

లెవ్వారు మఱి యెవ్వరున్నారు? అగస్త్యపత్నియగు లోపాముద్రయు, వసిష్ఠసహధర్మిణి యగునరుంధతియు బహుగౌరవశాలిని యగునీతల్లితో సమానలగుయశస్వినులు గారు. ఎవ్వనియస్థులమూలమున దేవతలందఱును, విజయవంతులును, సుఖవంతులు నైయుండిరో యట్టినీతండ్రి ప్రఖ్యాతయశస్కాయముతో విరాజిల్లుచున్నాడు. నీవంటిసుకుమారునిం గాంచిన నీతల్లియు నక్షయమగుకీర్తిగాంచినదై యున్నది. ఇంతకంటె నీకుం జెప్పవలసిన దేమున్నది? నీశాపముచే నీదేవతలందఱును భీతులై కింకర్తవ్యతావిమూఢులై స్వర్గభ్రష్టులై యెట్లు తల్లడిల్లుచున్నారో చూచుము! శాంతచిత్తుండవై వారిమొఱలం గరుణామయుండవగుము. ఆర్తజనత్రాణంబుకంటె సత్యసనాతనధర్మం బేదియును లేదని యెఱుంగుము. మానవుని కీర్తి జగంబున నెంతకాలంబు ప్రకీర్తితంబగుచుండునో యంతకాలము నాతండు స్వర్గసౌఖ్యంబుల ననుభవించుచుండును. పరలోకంబున నాతండు దివ్యకాయుండై వసించి యుండును. యశంబులేనివారును, శాస్త్రసంస్కారరహితులు నగువారు జీవించియుండియు మృతప్రాయులు, నరకప్రాయులై యుందురు. దానశీలురుగానివారు నపుంసకులకంటె నధములై యుందురు. ధర్మశీలురుగానివారు రోగులై యుందురు'' అని బోధించెను.

దేవదేవుని ప్రబోధవచనంబు లాలించి పిప్పలాదుండు శాంతుండై యంజలివట్టి ''ఓదేవా! మనోవాక్కర్మంబులచే నిరంతరమును సుదీయహితంబు గోరువారియొక్కయు, నితరజీవులయొక్కయు మంగళంబుకొఱకు నేను నీకు నమస్కరించుచున్నాను. నన్నుం బెంచినట్టియు నాకు సహస్రములైనట్టియు భక్తులకు నీవు సర్వాభీష్టంబులను బ్రసాదింపవలయును. ఓ బాలేందుశేఖరా! నీకు నమస్కారము. ఓ సర్వేశా! నాకెన్నివిధములం దల్లిదండ్రులై నన్నులాలించి పాలించిన పిప్పలవృక్షంబు

లనామముతో నీతీర్థంబు ప్రసిద్ధంబగుఁగాక! ఇందువలన వానికీర్తి చిరప్రతిష్ఠితం బగుఁగాక! ఇట్లు నీవనుగ్రహించినచో నేను వానిఋణమునుండి విముక్తుఁడ నగుదును. ఈభూలోకంబునం గలదేవతీర్థక్షేత్రంబు లన్నిటికంటె నీతీర్థము మహామహిమాన్వితంబగుఁగాక! దేవతలందఱు నాయీవచనంబుల కామోదింతురుగాక! వారట్లనుగ్రహించినచో నేను వారియపరాధంబును క్షమింపఁగలను" అనియెను.

అప్పు డింద్రాదిదేవతలందఱును దధీచితనయుండగుపిప్పలాదుని మధురవచనంబులయెడలఁ దమయామోదమును బ్రకటించిరి. శంకరుండును బాలకుండైనపిప్పలాదుని బుద్ధివిద్యావినయశౌర్యబలసాహసంబులకును, సత్యవచనంబులకును, జననీజనకులయెడలం గలభక్తిభావంబునకును బ్రీతుండై "వత్సా! ఎట్టిదుర్లభంబగుప్రియకామ్యవస్తువులైనను నీకుఁ బ్రాప్తంబులు గాఁగలవు. ఇంకను నీకుఁ గల్యాణకరంబులగు నభీష్టంబులున్నచోఁ జెప్పుము! నీవెంతమాత్రమును సంశయింపవలదు" అని యనుగ్రహించుటయు మునికుమారుండు సంతుష్టుండై "దేవా! ఈగోదావరీజలంబులయందు సుస్నాతులై భవత్స్మరణంబు గావించు ధర్మపరులకు సర్వాభీష్టసిద్ధియు, శివపదలాభంబును సంప్రాప్తించుఁగాక! నాజననీజనకులకును, నన్నుఁ బాలించిన యీపిప్పలాదిబంధువులకును భవత్పదంబు దయచేయవలయును. వారు పరమప్రభుండవగునిన్ను సందర్శించుచుఁ బరమసుఖప్రాప్తు లయ్యెదరుగాక!" అని ప్రార్థించెను.

దేవదేవుండగు మహేశ్వరుం డక్కుమారునికోరినవరంబుల నెల్లఁ బ్రసాదించి తానును దేవతలతోఁ గూడ నేకవాక్యంబుగా నాతని నభినందించెను. దేవతలందఱును భయవిముక్తులై శివసన్నిధానంబున దధీచినందను నుద్దేశించి "బ్రహ్మజనందనా! నీమూలమున దేవతలయుద్దే

శేము నిస్సంశయముగా ఫలించినది. దేవదేవుండును, త్రిలోకవంద్యుం డనగు త్రిలోచనునియాజ్ఞను నీవు పాలించితివి. నీవు నీకొఱకు కొఱకొ రికను గోరుకొనలేవు. పరోపకారార్థమే నీవు వరప్రార్థనంబు గావిం చితివి. కావున మేము నీకొకవరదానమును గావింపం గుతూహలపడు చున్నాము. నీవు మఱియొకవరంబును గోరుకొనుము'' అని యర్థించు టయు పిప్పలాదుండు కృతాంజలియై శంకరప్రముఖసకలదేవతలకును, ఉమాదేవికిని, పిప్పలవృక్షంబులకును బ్రణామంబు లాచరించి ''నాకు నాజననీజనకులను దర్శింపవలయు నని కోరికయున్నది. వారు నాకు సాక్షాత్కరింతురుగాక! ఈజగంబునం దల్లిదండ్రుల యాజ్ఞలలో మెలం గుచు, నిత్యమును వారిని సేవించుచు, వారిపాదపద్మంబుల నారాధిం చుచుండు కుమారుడు ధన్యుండుగదా! ఇంద్రియములను, శరీరమును కులమును, బలమును, బుద్ధియుం గలిగినందులకు ఫలముగాం బితృకా ర్యతత్పరు లగువారే కృతకృత్యులు. పశుపక్ష్యాదులకుం గూడ నతిసు లభం బగుమాతృదర్శనము నిర్భాగ్యుండ నగునాకు దుర్లభ మైపోయి నది. నేనెంతటిమహాపాపము గావించుటచే నిట్టిగతి నాకుం గలిగినదో తెలిసికొనంజాలకున్నాను. తల్లిదండ్రులసందర్శనము లోకమందందఱ కును దుర్లభమే యైనచో నాకింతదుఃఖ మ గలుగదు. అందఱికిని సులభ మగునది నాయొక్కనికే లభింపకుండం బోయినది. ఓదేవతలారా! నాతల్లిదండ్రుల నొక్కసారి దర్శింపంగలిగినచో నేని నామనోవాక్కర్మఫల ప్రాప్తి కాంగలదు. తల్లిదండ్రులదర్శనము లభింపనిచో నెన్నిమహా పాపములను జేసికొనియుండునో యెవ్వరు లెక్కింపంగలరు?'' అని యెను.

ఆమాట లాలించి దేవతలును మహర్షులును నాలోచించుకొని ''కుమారా! నిన్ను దర్శించుటకై నీతల్లిదండ్రులు విమానారూఢులై

వచ్చుచున్నారు. నీవు వారి నిప్పుడే దర్శింపఁగలవు. శోకమోహ విషాదంబులను బరిత్యజించి శాంతచిత్తుండవై యుండుము. అదిగో! చూడుము. స్వర్ణమణిమయభూషణాలంకృతం బగుదివ్యవిమానము నధిరోహించి నీజననీజనకు లంతరాళంబున నిలిచియున్నారు. దేవతాకాంతలాపుణ్యదంపతులనుఁ జామరంబులు వీచుచున్నారు చూచితివా? కిన్నరులు వారిని సేవించుచున్నారు" అని చూపిరి. పిప్పలాదుఁడు తల్లిదండ్రులను గన్నులారఁగాంచి పరమానందుండై శివసన్నిధానంబున వారికినమస్కారంబులు గావించెను. వారినయనంబులనుండి హర్షాశ్రుజలంబు లొలుకుచుండెను. పుత్రుండు వారింగాంచి యతికష్టముతో విషాదగద్గదస్వరంబున "జననీజనకులారా! కులప్రదీపకులగుపుత్రులు తల్లిదండ్రుల నుద్ధరింతురు. కాని నేనుమాత్రము కేవలము మాతృక్లేశముకొఱకే యామెగర్భంబున నిలిచితిని. అట్టికర్మకారియైనను నేను దేవతాప్రసాదముచే మీసందర్శనభాగ్యముం గాంచితిని" అని విచారించుచు వారితో మఱి యేమియు మాటాడఁజాలకపోయెను. అప్పుడు దేవతలందఱును "వత్సా! ఈజగంబున నీవే ధన్యుండవు. నీకీర్తి స్వర్గంబువఱకును వ్యాపించినది. నీవు త్రిలోచనుని సందర్శించి దేవతల ననుగ్రహించితివి. నీవంటిపుత్రునిం గాంచిన నీ తల్లిదండ్రుల కక్షయలోకప్రాప్తి గలిగినది." అని పలుకుచుండఁగా స్వర్గలోకమునుండి యాతనియుత్తమాంగముపైఁ బుష్పవర్షము గురిసెను. దేవతలాతనిఁ గూర్చి జయధ్వానములం గావించిరి.

సతీసహితుండగుదధీచి యొక్కమారు నాశీర్వదించి శంకరునకును, సురపతులకును, గౌతమీగంగకును నమస్కారంబులు గావించి "కుమారా! నీవు దారపరిగ్రహంబు గావించి భక్తిభావంబున నీను మహేశ్వరుని, గౌతమిని సేవించుచుఁ బుత్రవంతుండవై ఉపాంతదక్షిణాస్వ

తేజంబులను యజ్ఞంబులను నిర్వహించి కృతకృత్యుండవై చిరకాలంబు స్వర్గసుఖంబు లనుభవింపుము." అని యాశీర్వదించెను. పిప్పలాదుండును పితృవాక్యపాలనంబునకు బద్ధకంకణుం డయ్యెను. అప్పుడు దధీచి కుమారుని మరలమరల నూఱడించుచు భార్యాసహితుండై సురగణానుమతంబున మరలస్వర్గారోహణంబు గావించెను.

అప్పుడు దేవతలు ససంభ్రములై "మునికుమారా! నీచే నిర్మితంబైన యీకృత్యనుండి దారుణానలజ్వాలలు వెలువడుచున్నవి. జగద్ధితంబుకొఱకు దీనిని శాంతింపఁజేయుము." అని వేడుకొనుటయు పిప్పలాదుండు "నేనీకృత్యను నివారించుటకు సమర్థుండను గాను. నే నసత్యము చెప్పఁజాలను. మీరే దానిని శాంతింపఁజేసికొనుఁడు. ఈభీషణాకారిణి యగుకృత్తి నాయెడలఁగూడ విపరీతభావముతో నున్నది." అనియెను. అంత దేవతలు కృత్యను సందర్శించి శాంతింపవలయునని యామెను, అగ్నిదేవునిఁగూడ ననేకవిధంబులఁ బ్రార్థించిరి. కాని యాయిరువురునుగూడ నందుల కంగీకరింపక "మీయాదటను భక్షించుటకొఱకే మేమిబ్రాహ్మణునిచే నుత్పాదితులమైతిమి. మేము సర్వభూతభక్షణంబునకై యుదయించితిమి. ఇది యన్యథా యెట్లు కాఁగలదు? పంచమహాభూతంబులును, చరాచరంబగు సమస్తప్రపంచమునుగూడ మాముఖద్వారమునఁ బ్రవేశింపవలసినదే. ఈవిషయంబున నికఁ జెప్పవలసిన దేమున్నది?" అని నిశ్చయంబుగాఁ బలుకుటయు దేవతలు బ్రహ్మతో నాలోచించి మీయిరువురును క్రమక్రమముగా లోకగ్రాసంబు గావింపుఁడని కోరిరి. మీయిచ్ఛానుసారంబుగ సర్వంబును నాకు భక్ష్యంబగుఁగాక యనిపలుకుచు నాకృత్య యాక్షణమునందే సరిత్తైన గౌతమీప్రవాహమునఁ గలసిపోయెను. దానినుండి వెలువడిన యగ్నిజ్వాలమాత్రము లోకభీకరంబుగ వెలుఁగుచుండుట

యు సుర లయ్యగ్నిం గాంచి ‘‘ఓయగ్నిదేవా! జలం బన్నిటికంటెను శ్రేష్ఠతమం బైనది. నీవును ఆదిమూర్తివే. జలంబులకంటెను సముద్రుండు శ్రేష్ఠుండు. కావున నీవాతని భక్షింపుము. మా చెప్పినమాట విని నీవచ్చటికిం బోయి సముద్రుని యథాసుఖంబుగ భుజింపుము” అని ప్రార్థించిరి.

అగ్నిదేవుం డించుక శంకితుండై ‘‘జలంబులలో నేను ప్రవేశించుట యెట్లు? నేనచ్చటికిం జేరినంతనే మీరందఱును జేరి నన్నా మహాజలంబునం బ్లావితునిం గావింపుదురు” అనియెను. దేవత లాతనిం దీసికొనిపోవుట కుపాయంబు గానక ‘‘ఓ వైశ్వానరా! నిన్నచ్చటి కెట్లు గొనిపోవలయునో నీవే చెప్పవలయు నని యడిగిరి. అగ్ని యించుక యాలోచించి ‘‘ గుణవతి యను కన్యక స్వర్ణకలశంబున నన్నుంచి యచ్చటికిం దీసికొనిపోయినచో నేనశ్రమంబుగం బోఁగలను” అని చెప్పెను. అప్పుడు దేవతలు వీతిహోత్రుని వరుణాలయంబునకుం గొనిపోవలయు నని సరస్వతీదేవిం బ్రార్థించిరి. సరస్వతి వారిం గాంచి ‘‘ నేనొక్కతె నీతనిం దీసికొని పోఁజాలను. నావంటివారు మఱినలుగురైనచో నీతని నతిశీఘ్రముగ సముద్రమునందుం జేర్పఁగలుగుదుము” అని చెప్పెను. అమరు లామాట లాలించి గంగను, యమునను, నర్మదను, తపతిని సరస్వతికి సాయపడవలయు నని ప్రార్థించిరి. వారందులకు సమ్మతించుటయు సరస్వతీదేవి వారి సాహాయ్యంబున నయ్యనలుని గనకకలశంబునం జేర్చి జగత్పతి యగు సోమనాథునితో విబుధగణసహితుండై వెలసియున్న ప్రభాసతీర్థంబున కాతనిం దీసికొనిపోయెను. ఆ క్షేత్రంబునందు సరస్వతీప్రముఖపంచనదులును విశ్రమించెను. ప్రబలుండగు ననలుం డచ్చట నుండి మెల్లమెల్లగా జలపానంబు గావింపఁ దొడంగెను.

అనంతరము దేవతలు పరమేశ్వరుం గాంచి "దేవా! దధీచిమునీంద్రునియస్థిసమూహమును స్పృశించియున్నమాకును, గోగణంబులకును బవిత్రత యెట్లుచేకూరునో యానతీయవలయును" అని ప్రార్థించుటయు శివుండు "దేవతలును, గోగణంబులునుగూడ యత్నపూర్వకంబుగ గంగావగాహనంబు గావించినచోఁ బాపవిముక్తి యగును. అమ్మునీంద్రునిశల్యంబులును బావనగంగాజలధౌతంబులై పవిత్రంబులు గాఁగలవు" అని బోధించెను. దేవతాగణంబులు మహాదేవునియాజ్ఞానుసారంబుగా గంగాస్నానంబు చేసి పాపముక్తిం గాంచెను. అందువలన నాతీర్థంబునకుఁ బాపనాశనం బనునామంబు గలిగెను. అచ్చటఁ గావించుస్నానదానాదికంబులు బ్రహ్మహత్యాదిమహాపాపవిమోచకంబులు. గోగణంబులు స్నానముచేసిన స్థానము గోతీర్థంబనునామంబు గాంచెను. అచ్చట స్నానంబు గావించిన గోమేధయాగఫలంబు సిద్ధించును. దధీచిశల్యంబులు ధౌతంబులైనచోటు పితృతీర్థనామంబున విరాజిల్లుచున్నది. ఆతీర్థంబునఁ బ్రేతభస్మమునుగాని, శల్యములనుగాని, నఖరోమాదులనుగాని నిక్షేపించినచో నట్టిప్రేతల కాచంద్రార్కముగ స్వర్గావాసంబు లభించును. అట్టివా రెంతపాపాత్ములైనను వారికి నిస్సంశయముగా స్వర్గప్రాప్తి కాఁగలదు. చక్రేశ్వరతీర్థము మొదలుకొని మూఁడుతీర్థంబులును సకలపుణ్యఫలదంబులైయుండును.

తరువాత దేవతలు సంప్రీతులై మహాదేవు నుద్దేశించి "దేవదేవా! ఈస్థానంబున సూర్యనారాయణుండు సుప్రతిష్ఠితుండై యుండఁగలఁడు. మేమిఁక మాస్థానంబులకుం బోవుట కనుమతింపఁగోరెదము. సూర్యుఁడే యీజగంబునకు సనాతనాత్మస్వరూపుఁడై యున్నాఁడు. అతఁడే సర్వదేవమయుఁడు. మేమాతని నీతీర్థంబునఁ బ్రతిష్ఠించితిమి. జగద్ధాత్రి యగుగంగయు, త్రిలోచనుండగుమహాదేవుండును వెలసి

[illegible]స్థానము సర్వదేవాధిష్ఠితంబే కదా!" అని విన్నవించి దేవత
లు పిప్పలాదునికడ సెలవు గైకొని నిజనివాసంబులకుం జనిరి. కాల
క్రమంబునఁ బిప్పలవృక్షంబు లన్నియును స్వర్గావాసంబు గాంచెను.
పరితాపవంతుం డగుపిప్పలాదుం డొకపిప్పలవృక్షమును క్షేత్రపాల
కత్వంబునకు నియోగించి తాను శివపూజం గావించుచు గౌతమాత్మ
జాతను బెండ్లియాడి యామెవలన సంతానంబు గాంచి శ్రీలాభంబును
యశోలాభంబును గాంచి యంతంబున సుహృజ్జనసహితంబుగా స్వర్గ
ప్రాప్తిం గాంచెను. అప్పటినుండియు నాతీర్థము పిప్పలేశ్వరనామంబున
విఖ్యాతంబయ్యెను. ఆతీర్థస్మరణమాత్రంబున సకలయజ్ఞఫలంబులును
లభించును. దానిని దర్శించుటవలనను, నచ్చట స్నానదానాదులం
గావించుటవలనను నెట్టిపుణ్యఫలంబులు సిద్ధించునో యెవ్వరును వర్ణిం
పఁజాలరు. అచ్చట మహాదేవుండు చక్రేశ్వరపిప్పలేశ్వరనామంబుల
చేఁ బ్రఖ్యాతుండై యుండెను. సరహస్యంబుగ నీవృత్తాంతము నెఱిం
గినవారికి సర్వకామప్రాప్తి యగును. సూర్యప్రతిష్ఠవలనను, సకలదే
వతాధిష్ఠానమువలనను నీక్షేత్రమునకుఁ బ్రతిష్ఠానంబను నాహ్వయం
బు గలిగెను. ఇది దేవతలకతిప్రియమైనది. అతిపుణ్యతమం బగునీ
చరిత్రమును శ్రద్ధతో వినువారును, పఠించువారును, స్మరించువారును
దీర్ఘాయుష్మంతులై ధనవంతులును, ధార్మికులునై యంతంబున శివ
సాయుజ్యంబు నందఁగలరు.

## నాగతీర్థము.

నాగేశ్వరమహాదేవునిచే విరాజితం బగునాగతీర్థము సర్వకామ
ప్రదమైనది. పూర్వకాలంబునఁ బ్రతిష్ఠానపురంబు రాజధానిగా సోమ
వంశతిలకుం డగు శూరసేనుం డనురాజు పాలించుచుండెను. శ్రీమం

త్తుండును, మతిమంతుండు నగు నాభూపాలుండు సంతానంబుకొఱకు సతీసహితంబుగ ననేకపుణ్యవ్రతంబు లాచరించెను. వానికి ఫలంబుగాఁ గొంతకాలంబున కాతనిసహధర్మిణి గర్భిణియై కర్మవశంబున నతిభీషణాకారుండగు నొకసర్పకుమారునిఁ బ్రసవించెను. మహారాజకుమారునిసంగతి యితరుల కెవ్వరికిని దెలియనీయక యతిరహస్యంబుగ నాతని బెంచుచుండెను. రాజునకు సర్పకుమారుం డుదయించె ననువిషయము తల్లిదండ్రులకుం దప్ప నితరులెవ్వరు నెఱుంగరు. అమాత్యులు పురోహితులు దాదులు మొదలగువారికిఁ గూడ నీవృత్తాంత మవిదితమై యుండెను.

మహారాజు సర్పకుమారునిం జూచుకొనుచుఁ బ్రత్యహమును సతీసహితంబుగా సంతప్తుం డగుచుండెను. "మాగర్భంబున నిట్టిసర్పంబుదయించుటకంటె మేము పుత్రహీనులమై యున్నను మంచిదే గదా! ఇది మహావిషధరంబయ్యును మనుష్యునివలె మాటలాడఁగలుగుచున్నది. ఈవిచిత్రజన్మమునకుఁ గారణమేమి చెప్పుమా!" అని తల్లిదండ్రులు విచారించుచుండిరి. ఇట్లుండ నొకనాఁడు సర్పకుమారుండు తండ్రిం గాంచి "ఓజనకా! నాకుఁ జాతకర్మంబును నిర్వర్తించి యుపనయనంబు గావించి వేదాధ్యయనంబు చేయించుటకుఁ బ్రయత్నింపుము. ద్విజాతులగువారు వేదాభ్యాసము గావింపనంతవఱకును శూద్రతుల్యులై యుందురు." అని ప్రార్థించెను. శూరసేనుండును కుమారువచనంబు లాలించి మిగులదుఃఖితుండై యొకసద్బ్రాహ్మణుని రావించి యా పుత్రుని కుచితసంస్కారంబుల నాచరింపఁ జేయించెను.

నాగకుమారుండా బ్రాహ్మణునిచెంత వేదాధ్యయనంబు చేయుచు నొకనాఁడు జనకునిం గాంచి "తండ్రీ! నేను పెద్దవాఁడనైతిని. నాకు వివాహంబు గావింపవలయును. కుమారునకుఁ బెండ్లిగావింప

నంతవఱకుఁ దండ్రికిఁ గార్యసిద్ధి గానేరదు. పుత్రవంతుండై యెవ్వఁడకుమారునికి వేదవిహితంబులగు సకలసంస్కారంబులను గావింపఁజాలకుండునో యాతఁడు నరకపతితుండగును" అని చెప్పుటయు మహారాజు విస్మితుండై పన్నగరూపుండగు తనయుం గాంచి యెట్లో తప్పించుకొనవలయు నను నుద్దేశముతో "నాపేరు విన్నంతనే మహావీరపురుషులుగూడ భయభ్రాంతు లగుచుందురు. అట్టి నాకుమారునకుఁ గన్యాదానము చేయుదు నని నాయొద్ద కెవ్వరు వచ్చి చెప్పఁగలరు" అనియెను.

ఫణికుమారుం డామాటలాలించి "తండ్రీ! వివాహంబులు బహుప్రకారంబులై యున్నవి. అందు రాజులకు శస్త్రబలప్రకటనంబుచేఁ గన్యాహరణంబుగావించి చేసికొనువివాహమే యుత్తమమైనది. పుత్రునకుఁ బరిణయంబు గావించువఱకును దండ్రికృతకృత్యుండు గానేరఁడు. నాకు నీవు పెండ్లి చేయకున్నచో నేను నిశ్చయముగా గంగాజలంబులం బడి ప్రాణత్యాగంబు గావించుకొందును" అనియెను. మహారాజు కుమారుని దృఢోద్దేశము నెఱింగి యమాత్యులను బిలిపించి "నాకుమారుండగు నాగేశ్వరుండు యౌవరాజ్యాభిషేకంబునకర్హుండై యున్నవాఁడు. అతఁడు గుణాకరుండును, మతిమంతుండును శూరుండును, దుర్జయుండును, శత్రుతాపనుండునై యుండెను. రథగజతురగధనుర్విద్యాలయంబున నాతనితో సమానుఁ డీజగంబున నెవ్వండును లేఁడు. నేనిప్పుడు పెద్దవాఁడ నైతిని. కుమారునకు వివాహంబు గావించుట నాకవశ్యకర్తవ్యమై యున్నది. రాజ్యభారం బాతనికప్పఁజెప్పి నేనిఁక విశ్రాంతుండనై యుండెదను. వివాహంబైనఁగాని కుమారుని బాల్యచాపల్యంబు వదలదు. కావున నాకెల్లవిధంబుల హితులగు మీరు నాకుమారునిపెండ్లిప్రయత్నంబు గావింపవలయును

అతనికిఁ బరిణయంబైనచో నాయెల్లవిచారంబులను వదలిపోఁగలవు. పుత్రునియందు రాజ్యభారంబునుంచి వనవాసంబు గావించురాజులే సుకృతాత్ములుగదా!'' అని చెప్పెను.

అమాత్యులును రాజాజ్ఞను శిరంబునం దాల్చి కృతాంజలిపుటులై వినీతభావంబున ''ఓమహారాజా! నీవు జగత్ప్రసిద్ధచరిత్రుఁడవు. అట్టినీకుమారుఁడును గుణశ్రేష్ఠుండగును. అతనివివాహంబుకొఱ కింత యాలోచన మెందులకు?'' అనుటయు రాజు గంభీరభావముతో నూరకుండెనే కాని తనకుమారుఁ డొకసర్పమూర్తి యని యమాత్యులకుఁ గూడఁ దెలుపలేదు. అమాత్యుల కావిషయమేమియును దెలియనే తెలియదు. రాజాసంగతినట్లే రహస్యముగ నుంచి మిత్రులనుద్దేశించి మరల ''మంత్రులారా! ఎచ్చటనైన సద్గుణవతియగుకన్యయున్నట్లు మీకుఁ దెలియవచ్చినదా? ఎవ్వరితో సంబంధముచేసికొనిన మనకుల గౌరవములకు భంగము కలుగకుండునో, ఎవ్వరివంశ ముత్తమమైనదో యట్టి శ్రీమంతుఁడును, భాగ్యభోగసంపన్నుఁడును, శౌర్యసాహసాలంకారుండును, గుణవంతుండు నగు[illegible] నాకుఁ [illegible]వలయును'' అని యడిగెను.

అప్పుడు రాజకుటుంబాభిమానియు, హితాకాంక్షియు, సాధుచరిత్రుండును, సత్కులసంజాతుండు నగునొకమంత్రి రాజాభిప్రాయంబును గ్రహించి ''ఓమహాప్రభూ! పూర్వదేశంబున విజయుం డను నొకభూపాలశేఖరుండు గలఁడు. అతనిచతురంగబలంబులకును, రత్నంబులకును లెక్కలేదు. ఆమహారాజునకు మహాధనుర్ధరులగు నెనమండ్రుపుత్రులు గలరు. వారికి భోగవతి యనునొకసోదరి యున్నది. ఆమెసాక్షాల్లక్ష్మీస్వరూపిణియే. [illegible]! [illegible] నయువరాజున కర్ధాంగియగుటకు యోగ్యురాలు [illegible]'' అని మనవి

చేసెను. రాజావృద్ధామాత్యునివచనంబుల కానందించి "అమాత్యశేఖరా! విజయభూపాలుండు తనతనయను మనయువరాజున కిచ్చునట్టి యుపాయ మాలోచింపవలయును" అనియెను. ఆమాటవిని యామంత్రి యక్కార్యనిర్వాహణంబునకుఁ దన్ను నియోగింపవలయు నని కోరెను. మహారాజందులకు సమ్మతించి వస్త్రభూషణాదులచే నాతని సన్మానించి విపులసైన్యముతో నాతని విజయభూపాలుచెంతకుఁ బంపించెను.

అమాత్యుండును బూర్వదేశంబునకుం జని వివిధనీతిగర్భితవచనంబులచేతను, వివిధోపాయంబులచేతను విజయభూపతినిమన్ననలం గాంచి యాతనితనయ యగుభోగవతిని శూరసేనమహీకాంతునితనయుని కొసంగునట్లు సంబంధమును స్థిరపఱచుకొనియెను. విజయుండు సభాస్థానంబున నామంత్రిశేఖరుని సన్మానించి తనకన్యనిచ్చుటకు సమ్మతించెను. అట్లుకృతకృత్యుండై వృద్ధామాత్యుండు విజయమహీరమణునికడ సెలవుగైకొని మరలఁ బ్రతిష్ఠానంబున కేతెంచి శూరసేనున కెల్లవిషయంబులను సవిస్తరంబుగ విన్నవించెను. మహారాజు మంత్రిశేఖరునిసామర్థ్యమును గొనియాడెను.

తరువాతఁ గొంతకాలంబునకు రాజానుమతముం గాంచి యాతని యాలోచనము నంగీకరించి వృద్ధామాత్యుండు వస్త్రాలంకారభూషితులగు నితరసచివగణంబులతోడను, బంధుజనంబులతోడను, బహుసేనాబలంబులతోడను మహావైభవముతోడను వివాహప్రస్తావంబు గైకొని మహారాజగువిజయునిచెంతకుం బోయి సభాముఖంబున నాతని సందర్శించి "మహారాజా! మాశూరసేనభూపాలునినందనుం డగు నాగేశ్వరుఁడు మిగులసుగుణవంతుఁడు. బుద్ధిమంతుఁడు. కొండొక కారణంబున నాతఁడిచ్చటి కేతెంచుట కంగీకరింపలేదు. ఓనృపాలా!

క్షత్రియవివాహంబు లనేకప్రకారంబులై యుండునుగదా! వసునిశ స్త్రంబునకును, భూషణంబునకునుగూడఁ బెండ్లి గావింపవచ్చును. కేవలము క్షత్రియులకైనను, బ్రాహ్మణులకైనను సర్వదా సత్యవాక్యమే ప్రధానమైనది. ఈవిశ్వాసమునుంచి మీరు మాయువరాజు కృపాణంబునకును గిరీటంబునకును వరప్రాతినిధ్యంబు గల్పించి కన్యాదానంబు గావించుట కంగీకరింపవలయును'' అని ప్రార్థించెను.

విజయమహీరమణుం డావృద్ధామాత్యునివచనంబులయందు విశ్వాసముంచి వరస్థానంబున నాతనిఖడ్గంబునుంచి భోగవతీపరిణయమును సంపన్నంబు గావించి, తన ప్రధానామాత్యునితోఁ గూడ నాబిడ్డను భర్తృగృహంబునకుఁ బంపించెను. రాజగువిజయుండు ప్రహృష్టహృదయుండై తనకుమారికకు యౌతకంబుగా బహుగోహిరణ్యంబులను దాసదాసీజనంబును, రథగజతురగాదులను నొసంగి తనమంత్రితోఁగూడఁ బంపించెను. మఱియు నాతఁడు వరపక్షమునుండి యేతెంచినవారినెల్ల బహువిధసన్మానంబులచేఁ బరితృప్తులం గావించెను. క్రమముగా వారు ప్రతిష్ఠానంబున కేతెంచుటయు వృద్ధామాత్యుండు నవవధూసహితంబుగా విజయభూపాలుం డొసంగిన యెల్లబహుమానంబులను శూరసేనధరణీవరునకు నివేదించి యెల్లవిషయంబులను సవిస్తరంబుగ విన్నపంబు చేసి కృతకృత్యుండయ్యెను. కన్యయగుభోగవతితోఁగూడ వచ్చిన యమాత్యాదిపరిజనంబులకందఱకును శూరసేనుండు బహుమానపురస్సరంబుగ సత్కృతులం గావించి వారి సంపించెను.

రూపయౌవనగుణసంపన్న యగుభోగవతీకన్య స్వామిగృహంబుఁ జేరి సర్వదా ప్రశాంతచిత్తంబున నత్తమామలకు శుశ్రూషలం గావించుచు సుఖముగా నుండెను. ఆమె భర్త యొకభయంకరసర్ప

ముగదా? ఆసర్పకుమారుఁడు రాజభవనంబునం దొకసువర్ణమణిమయంబును, సుగంధకుసుమమయంబును, సుశీతలంబును, నిర్జనంబును నగుగృహంబున నివసించి యుండెను. భోగవతి యత్తవారింటికి వచ్చుటయే గాని యింతవఱకును దనభర్తను దర్శించి యుండలేదు. సర్పకుమారుఁడు ప్రతిదినమును దల్లిం గాంచి నాభార్యయగు రాజకుమారి నాచెంతకు వచ్చుట లేదేమమ్మా యని యడుగుచుండెను. కుమారుని యాత్రముం గాంచి తల్లి యొకనాఁడు దాసిం బిలిచి "ఓసుభగా! నీవు నాకోడలు భోగవతిచెంతకుఁ బోయి యామెతో నేకాంతముగా నీభర్త యొకనాగకుమారుఁ డని చెప్పుము! ఆమాట విని యామె యేమనునో వచ్చి నాకుఁ దెలుపుము." అని చెప్పి యామెను బంపెను.

దాసియు రాణియాజ్ఞ నంగీకరించి భోగవతిచెంతకుం బోయి యెవ్వరు లేకుండఁ జూచి సవినయంబుగా "అమ్మా! నీభర్త కేవలము మానవపురుషుఁడు గాఁడు. అతఁడు దేవతామూర్తి. సర్పాకారముతో నుండును. నీవీమాట యెవ్వరికిని దెలియనీయవలదు" అని చెప్పెను. భోగవతి యామాట విని "సాధారణముగా మానవమానవతులకు మానవులే భర్తలగుదురు. నాపుణ్యావశంబున నాకు దేవమూర్తి స్వామి యయ్యెను" అని పరమానందముతోఁ బలికెను. అప్పుడు దాసి మరలివచ్చి యాసర్పకుమారునకును, రాజునకును, రాణికిని భోగవతిమనస్సంతుష్టినిగూర్చి యెఱింగించెను. రాజంతయు నాలించి కర్మగతింగూర్చి తలంచుకొని విచారింపఁదొడంగెను.

ఇట్లు కొంతకాలము గడచినతరువాత నొకనాఁడు భోగవతి తనప్రాణసఖిం గాంచి "చెలీ! నావయసంతయును నిరర్థకముగాఁ గడచిపోవుచున్నది. నానాథు నొకసారి చూపింపవా?" అనియెను. సఖి యుసులవిచారించియు దనహృదయంబు నెఱుకపడనీయక యాభోగవతిని

గొంటఁబెట్టుకొనిపోయి యతిభీషణంబగుసర్పగృహంబును బ్రవేశించి యందున్న నాగేశ్వరుని దర్శింపఁజేసెను. అరమణీమణి యానిర్జనస్థానంబున సుగంధకుసుమశయ్యపై శయనించియున్న సర్పాకారుండగు స్వామిం గాంచి కృతాంజలియై మృదుమధురస్వరంబున ॥ నాథా! నేను దేవతల్లి నైతిని. నీచే నిట్లనుగ్రహింపఁబడి నేను ధన్యనైతిని." అని పలుకుచు నాతనిపర్యంకంబుఁ జేరి యాసర్పమును సర్పభావముచేతనే యనేకప్రకారంబుల నుపలాలించి సంతృప్తిం గూర్పఁదొడంగెను. అప్పుడామె గీతవాద్యంబులచేతను, అంగసంగమంబులచేతను నాథుండగు నాసర్పకుమారునితో నతివిలాసముగ విహరింపఁదొడంగెను. సుగంధకుసుమంబుల నర్పించియు, నమృతపానీయాదుల నర్పించియు నాతని సంతృప్తుం గావించుచుండెను. ఆభోగవతి యిట్లు విహరించుచుండఁ నామె ప్రసాదంబువలన నానాగకుమారునకుఁ బూర్వజ్ఞానం బుదయించెను.

అట్లు దైవకృతంబగుసమస్తవృత్తాంతము నాతనికి బోధమాగుటయు నాసర్పకుమారుం డారాత్రి యేకాంతముగా భోగవతింగూర్చి ॥ ప్రియా! నీవు రాజకుమారివయ్యును భీకరాకారుండ నగునన్నుఁ జూచి యేల భయపడుట లేదు?" అని ప్రశ్నించెను. అప్పుడు భోగవతి ॥ ఆత్మేశ్వరా! దైవవిహితంబులగు సంఘటనములఁ దప్పించుకొనుట యెవ్వరితరము? విశేషించి పతివ్రతా సతులకుఁ బతియగతి గదా!" అనియెను. ఆమాటకు నాగేశ్వరుండు సంతుష్టుండై మందహాసంబు చేయుచు ॥ దేవీ! నీకు నాయెడలం గలభక్తికి నేను సంతుష్టుండ నైతిని. నీకేమి గావలయునో కోరుకొనుము. ఓతన్వంగీ! నీప్రసాదంబుచే నాకుఁ బూర్వస్మృతి గలిగినది. పూర్వము నేను దేవదేవుం డగుపినాకపాణిచే శపింపఁబడితిని. శేషపుత్రుండ నగునేను మహాదేవునకుఁ గరాలంకార

నై యుంటిని. అప్పుడు నీవే నాదు భార్యవు. ఒకప్పు డీశ్వరుం డుమాదేవితో సరససల్లాపంబులాడుచు నామె వచనంబులకుఁ బ్రీతుండై బిగ్గరగా నవ్వుచుండెను. ఆతని సన్నిధానమునం దున్న నేనును నిస్సంశయముగా హసింపసారంభించితిని. అది చూచి శంభుండు కుపితుండై నన్ను మానవగర్భంబున సర్పజన్మంబు గాంచునట్లు శపించెను. అందువలన నీవును నాకొఱకు మానవివై జనించితివి. కాని నీకుఁ బూర్వస్మృతి యున్నది. మహేశ్వరుండు నన్ను శపించినప్పుడు నేను నీతోఁ గలసి యద్దేవుని క్షమాప్రార్థనంబు గావించుటయు నాతండు ప్రసన్నుండై "నీవు నీపత్నితోఁ గలసి గౌతమీతీరంబున నన్నారాధింపుము. అప్పుడు నీవు నీభార్యసాహాయ్యంబువలన శాపవిముక్తుండ వయ్యెదవు" అని యనుగ్రహించెను. ఓశుభాననా! అందువలననే నేనిట్లు సర్పాకృతినై జనించితిని. ఇప్పుడు నన్ను నీవు గౌతమీతీరంబునకుఁ దీసికొనిపోయి నాతోఁగూడ శివపూజ గావింపుము. ఈరీతిగాఁ జేసినచో నేను శాపముక్తుండ నగుదును. తరువాత మనమిరువురమును శివపదలాభంబు నందఁగలము. ప్రియా! ఈజగంబునందలి జీవుల కందఱకును శివుఁడే యేకమాత్రశరణ్యుఁడు గదా!" అని చెప్పెను.

భర్తృవచనంబు లాలించి భోగవతీదేవి యీవృత్తాంతమంతయు నత్తమామల కెఱింగించి వారియనుమతిం గాంచి తననాథుని గౌతమీతటంబునకుం దీసికొనిపోయి యాపావనజలంబుల నవగాహనంబు గావించి పతితోఁగలసి శివపూజం గావింప నారంభించెను. అప్పుడు భగవానుం డగుశివుండు ప్రసన్నుండై యానాగేశ్వరునకు దివ్యరూపంబును బ్రసాదించెను. సర్పకుమారుండును మనోహరరూపధారణంబు గావించి సతీసహితంబుగా జననీజనకుల చెంతకుం జని

నమస్కారంబు గావించి తమశివలోకగమనంబునకు వారియనుమతిం గోరుటయు మహామతియగుశూరసేనభూపతి యంతయు నెఱింగినవాఁడై "వత్సా! నీవే మా కేకపుత్రుఁడవు. ఈరాజ్యమంతయు నీయది. కావున నీవింకెల్లవిధంబుల రాజభోగంబు లనుభవించుచు బహుపుత్రవంతుండై మద్వంశము నభివృద్ధిగావించి తల్లిదండ్రులమగుమేము పరలోకంబున కరిగినతరువాత శివపురంబునకుఁ బోవచ్చును. కుమారా! మాయభీష్టంబుదీర్చి కొంతకాలంబు మాపుత్రుండవై విహరించి మాకన్నులపండువు చేయుము" అని సరితిశయప్రేమపూర్వకంబుగ వచియించెను.

నాగేశ్వరుండును బితృవచనంబుల కంగీకరించి కమనీయాకారుండై జననీజనకులపరమాదరంబు గాంచుచు రాజ్యపాలనభారంబు వహించి పుత్రవంతుండై పితరులయనంతరంబునఁ బుత్రులకుమహీరాజ్యంబును భాగించి యొసంగి కొంతకాలంబు వానప్రస్థాశ్రమంబుస్వీకరించి పిమ్మటఁ గళత్రసహితుండై శివపురంబుఁ జేరుకొనియెను. అప్పటినుండియు నాతీర్థము నాగతీర్థంబని ప్రసిద్ధిగాంచెను. అచ్చటనే భోగవతీదేవి నాగేశ్వరునిఁ బ్రతిష్ఠించెను. ఆతీర్థంబునందలి స్నానదానాదులు సకలయజ్ఞఫలదాయకంబులు.

## — మాతృతీర్థము —

జగద్విఖ్యాతం బగుమాతృతీర్థము మానవులకు సర్వసిద్ధిప్రదమైనది. ఆతీర్థస్మరణమాత్రంబున సకలజీవులకును మనస్తాపశాంతి యగును. పూర్వకాలంబున నతిభీషణంబగు దేవ సురయుద్ధము సంప్రాప్తంబయ్యెను. ఆసమరంబునం దమరు లసురవీరులను జయింపఁజాలఁ పోయిరి. అప్పుడు బ్రహ్మాదేవ్పుండు సురసహాయంబుగా శూలపాణిసన్ని

ధరించి బోయి కృతాంజలిపుటుండై ''దేవదేవా! మున్ను సురాసురులు గలసి సముద్రమథనంబు గావించినప్పు డందు ముందుగాఁ గాలకూటం బుదయించెను. దానిని నీవుగాక యెవ్వరు ధరింపఁగలిగిరి? మన్మథుం డు కుసుమధన్వియై కుసుమశరంబులచేఁ ద్రిభువనంబులను జయించి మించిన యోధుఁడు. అట్టివాఁడు సురాసురవంద్యుండవగు నీపై శర సంధానంబు గావించినంతనే వినాశంబు నందెను. ఓస్మరహరా! క్షీర సాగరమువం దుదయించినయమృతమును దేవతల కనుగ్రహించి నీవు హాలాహలంబును గంఠంబునం దాల్చియుంటివి. ఓనీలకంఠా! అంతటి సహస్రాక్షప్రభృతులు నీకంటె నెవ్వరున్నారు? అట్టి త్రిభువనేశ్వరుండ వగు నీ వసురవిజితులగు నమరులనుద్ధరింపవలయును'' అని ప్రార్థించెను.

భగవానుండగు శూలపాణి పద్మాసనుని స్తోత్రంబునకుఁ బ్రసన్నుండై ''ఓదేవతలారా! మీయభీష్టవరప్రార్థనంబు గావింపుఁడు'' అని యనుగ్రహించెను. అప్పుడు దేవతలు సంతుష్టులై ''ఓవృషభధ్వజా! దానవులవలన మాకతివిషమసంకటంబు సంప్రాప్తించినది. నీవు మాకు సహాయుండవై వచ్చి దురాత్ములగు నయ్యసురుల నిర్జింపవలయును. మమ్ము రక్షింపవలయును. మేము నీమూలముననే దిక్కుగలవారమైతిమి. నీవు మాకు కారణమిత్రుండవు గాకయున్నచో నార్తులమగు మాకన్యగతి యేమున్నది?'' అని ప్రార్థించుటయు మహాదేవుండు కరుణించి దేవతలతోఁ గలసి యసురదళంబులు విడిసియున్నచోటికిం బోయి వారితో నతిఘోరరణంబు గావించెను.

ఆసంగరంబున శంకరుండు శ్రాంతుండై భీమోరూపంబును ధరియించెను. ఆతనిలలాటఫలకమునుండి స్వేదబిందువులు నిపతితంబు లగుచుండెను. ఇట్లాతఁడు తామసీమూర్తిం దాల్చి దైత్యసంహారంబు చేయఁ దొడంగెను. అసురవీరు లా భయంకరాకారముం గాంచి యాత

నితో రణంబు చేయఁజాలక మేరుపృష్ఠంబునుండి భూతలంబునకుఁ బలాయితులైపోయిరి. ఈశ్వరుండును వారిని దరిమిదరిమి కొట్టుచు వెంబడించుటచే వారు భూమండలమంతటను బరిభ్రమింపఁదొడంగిరి. కాని శూలపాణిమాత్రము కోపావేశముచే వారిని వెంబడించి చంపు చునే యుండెను. అట్లు మహారణంబు గావించుచుండఁగా శివుని లలాటమునుండి ఘర్మబిందువులు జారుచునే యుండెను. అట్టి దేవుని స్వేదబిందువులు పడినచోటునందెల్ల మాతృగణంబు లుద్భూతంబు లగుచుండెను. అమ్మాతృగణంబులందఱును గలసి మేమిా రాక్షసులను భక్షించెద మని శంకరునిం గూర్చి ప్రార్థించిరి. భగవానుం డగు రుద్రుండు వారింగాంచి "ఈ దానవులు స్వర్గమునుండి భూతలంబునకు ను, అటనుండి రసాతలంబునకును బరుగులెత్తుచున్నారు. వారెచ్చటికిఁ బోయిన నచ్చటికి మిారును బోయి యాసురులను వధింపుఁడు! ఇప్పు డయ్యసురులు నాభయంబుచే రసాతలంబున దాఁగియున్నారు. మిారును వారినను సరించి రసాతలంబునకరుగుఁడు!" అని యాజ్ఞాపించెను.

మాతృగణంబు లప్పుడు భూతలంబును భేదించుకొని దైత్యవీరులు దాఁగియున్నరసాతలంబునఁ బ్రవేశించి యయ్యసురులపయింబడి మహాసంగ్రామంబుగావించి యతిభీషణాకారంబులతో వారినందఱను వధించి మరల దేవత లున్నచోటికేతెంచి విజయవార్తం దెలియఁ జేసిరి. మాతృగణంబు లట్లు మరలివచ్చునంతవఱకును దేవతలా గౌతమిాతీరంబుననే నిలిచియుండిరి. మాతృగణంబులప్రస్థానంబును, సురగణంబులప్రతిష్ఠానంబును గాంచినయాక్షేత్రము ప్రతిష్ఠానకనామంబునఁ బ్రసిద్ధం బయ్యెను. మాతృగణంబులు జనించినప్రదేశంబు లన్నియు మాతృతీర్థంబు లయ్యెను. ఆతీర్థంబు లన్నిటియందును రసాతలంబువఱకును భూబిలంబులు విరాజిల్లుచుండెను. అప్పుడు దేవతలంత

ఆరు మాతృగణంబులకు శివునివలెనే మీరును లోకము వారిచేఁ బూజింపఁబడుదురుగాక యని వరంబుల నొసంగి యంతర్హితుఁడయ్యెను. మాతృగణంబు లచ్చటనే ప్రతిష్ఠితంబులై యుండెను. ఆమాతృదేవీ మూర్తులు విరాజిల్లుచుండు స్థానంబు లన్నియును మాతృతీర్థంబు లయ్యెను.

ఆసకలతీర్థంబులును సురసేవ్యంబులే యనుచుండ నింక మానవులమాట చెప్పనేల ? అందలిస్నానదానాదులును, తర్పణంబులును గూడ నక్షయఫలప్రదంబు లగునని మహాదేవుం డానతిచ్చెను. ఈమాతృతీర్థవృత్తాంతమును స్మరించువారును, పఠించువారును, ఆకర్ణించు వారునుగూడ నాయురారోగ్యసుఖభోగంబులం గాంచఁగలరు.

## — బ్రహ్మతీర్థము —

దేవదుర్లభంబగుబ్రహ్మతీర్థము మానవగణంబులకు భోగమోక్ష ప్రదమైనది. పూర్వకథయందు వర్ణింపఁబడినట్లుగా దానవసేనలు రసాతలంబునకుఁ బలాయితంబులగుచుండ మాతృగణంబులు భీషణాకారములతో వారిని వెంబడించుచుండెను. దేవతలందఱును గౌతమీతటంబున నిలిచి యుండిరి. అప్పుడు గర్దభాకృతిం గాంచిన యతిభీషణంబగు బ్రహ్మదేవుని పంచమవక్త్రము మేఘగంభీరంబగునుచ్చైస్స్వరముతో "ఓ దైత్యవీరులారా ! దానవసైనికులారా ! మీరేల భయపడి యేలపాఱిపోయెదరు ? మీ కెంతమాత్రమును నపాయము లేదు. శీఘ్రముగా మఱలిరండు ! నే నీసకలదేవతలను క్షణములో భక్షించివైచెదను." అని హెచ్చరించుచు దేవతలను భక్షించుటకుఁ బ్రయత్నింపఁ దొడంగెను.

అప్పుడు విబుధవరులందఱును భయభ్రాంతులై విష్ణుదేవునిం గూర్చి "ఓజగన్నాథా! మమ్ము రక్షింపుము! మావినాశంబునకు హేతుభూతం బైనయీబ్రహ్మశిరంబును ఖండింపుము! అని ప్రార్థింప నారంభించిరి. అప్పుడు విష్ణుదేవుండు వారికి సాక్షాత్కరించి "ఓయమరశేఖరులారా! నేనీచక్రంబుచే సరసిజాసనునివక్త్రంబును భేదింపఁగలను. కాని యట్లు విచ్ఛిన్నంబయ్యు నాతని వదనంబు సకలలోకసంహారంబు చేయఁగలదు. కావున నే నొకయుపాయంబు చెప్పెదను వినుండు. త్రిలోచనుం డొక్కఁడే యీబ్రహ్మశిరచ్ఛేదనంబున కర్హుఁడు. అతఁడే దీనిని ధరించుటకు సమర్థుఁడు" అని బోధించుటయు నిర్జరులందఱును నిశ్చలచిత్తంబులతో శివస్తోత్రంబులను బఠింప నారంభించిరి.

అంతశివుం డమరగీతంబులకు సంతృప్తుండై వారికి సాక్షాత్కరించి "సురవరులారా! నేనీబ్రహ్మదేవుని యతిభీషణం బగుపాపశిరంబును నఖంబులచేఁగాని, శస్త్రంబులచేఁ గాని ఖండింతును గాని దాని నెచ్చటఁ బాఱవేయవలయునో తోఁచుటలేదు" అని చెప్పుచుండఁగా భూదేవి "ఓదేవా! నేనీశిరంబును మోయఁజాలను. ఆశిరఃపతనంబువలన నేను రసాతలంబుకంటె నధోలోకంబునకుఁ గ్రుంగిపోవలసినదాన నగుదును" అని భయసంభ్రమంబులతో విన్నవించెను. తరువాత సముద్రుండును భీతుండై "మహాదేవా! నేనైనను దీని ధరింపఁజాలను. దీనిని నాయందుఁ బాఱవైచినంతమాత్రముననే నేను శుష్కీభూతుండ నైపోవుదును." అని మనవి చేసెను. అప్పుడు సకలదేవతలు నేకవాక్యముగా "శంకరా! భక్తవశంకరా! లోకానుగ్రహంబుచే నీవే యాశిరంబును ధరింపవలయును" అని ప్రార్థించిరి.

ఈపుస్తకంబు ఖండింపకున్న లోకవినాశంబు చేయక మాన

ము. ఖండించినను దీనివలన జగద్వినాశమే కలుగునట్లున్నది." అని
యాలోచించి శివుం డాశిరంబును నఖంబులచే ద్రుంచివైచి తనకరంబు
ననే నిలుపుకొనియెను. అమ్మహాదేవునిదుష్కరకార్యంబును గాంచి
యమరులందఱు నాగౌతమీతటంబున నిశ్చలభక్తిభావంబులతో ననే
కవిధంబుల నంబికానాథుని బ్రస్తుతించుచు ॥ ఓ దేవా! అతిభీషణం
బగు నీబ్రహ్మశిరంబు మాకు మృత్యుముఖంబై మమ్మెల్లరను గబళింప
నుద్యుక్తంబై యుండ నీవు మాయెడలఁ గరుణాళుండవై సూచీముఖం
బగునఖాగ్రంబున దాని ఛిదిలించివైచి యెందుఁ బడవైచినను నపాయంబ
గునని భావించి నీవే కరంబునం దాల్చి మమ్మును లోకంబులను రక్షిం
చితివి. నీకృపాపరతయ యసాధారణమైనది" అని మహాదేవునిఁ గీర్తిం
చిరి.

అప్పటినుండియు నాతీర్థంబునకు బ్రహ్మతీర్థంబని పేరు గలి
గెను. చతుర్ముఖబ్రహ్మమూర్తి యిప్పటికి నందు విరాజిల్లుచున్నది.
ఆబ్రహ్మశిరంబును దర్శించినంతమాత్రమున బ్రహ్మపదప్రాప్తి యగు
ను. రుద్రుండు బ్రహ్మశిరచ్ఛేదంబు గావించినస్థానము రుద్రతీర్థమ
య్యెను. ఆతీర్థమునందే సర్వదేవతాస్వరూపుఁడగు దివాకరుఁడును విరా
జిల్లుచుండును. ఈరెండుతీర్థంబులును గూడ సూర్యనామంబు గాంచి
సకలయజ్ఞఫలప్రదంబులై యున్నవి. ఇచ్చట స్నానం బాచరించి సూ
ర్యనారాయణుని సందర్శించువారికిఁ బునర్జన్మంబు గలుగదు. మహాదే
వుండు బ్రహ్మదేవుని పంచమశిరంబు నిట్లు ఖండించి దాని నవిముక్త
క్షేత్రంబున స్థాపించెను. గౌతమీతటంబున బ్రహ్మతీర్థంబునందు
బ్రహ్మశిరస్థానమాత్రంబు దర్శించి యవిముక్తక్షేత్రంబున శివప్రతిష్ఠి
తం బగు బ్రహ్మకపాలముం గాంచువారు బ్రహ్మహంతకు లైనను
పవిత్రు లగుదురు.

## — అవిఘ్నతీర్థము —

అవిఘ్నతీర్థము సర్వవిఘ్నవినాశకమైనది. ఒకప్పుడు గౌతమీనది కుత్తరతీరంబున దేవయజ్ఞంబు ప్రారంభింపఁబడి విఘ్నదోషంబులచే సంపూర్ణంబు గాక యుండెను. అప్పుడు దేవతలందఱును బ్రహ్మదేవునిపాలికిం బోయి సర్వవృత్తాంతమును నివేదించిరి. బ్రహ్మదేవుం డించుకసేపు ధ్యానంబు గావించి " ఓసురవరులారా! వినాయకుండు గావించువిఘ్నంబులవలన మీయజ్ఞంబు పూర్తి గాక యున్నది. కావున మీరందఱును గలసి యాదిదేవుం డగు వినాయకుని బ్రార్థింపుఁడు" అని బోధించెను. దేవతలట్లు చేయుదుమని విన్నవించి మరల గౌతమీతీరంబున కేతెంచి గోదావరీజలంబులయం దవగాహనంబులు చేసి నిర్మలచిత్తులై భక్తిపూర్వకంబుగా " సమస్తకార్యంబుల కధీశ్వరుండును, బ్రహ్మవిష్ణుప్రముఖనిఖిలదేవగణంబులకును సర్వదా వంద్యుండును, పూజ్యుండును, చింతనీయుండును నగువిఘ్ననాయకుండు మాకు శరణ్యుండగుఁగాక! వినాయకునింబోలి మఱియే దేవతలును గూడ నభీష్టప్రదులు గాఁజాలరు. ఇట్టిదృఢనిశ్చయముతోనే త్రిపురవినాశంబుకొఱకుఁ ద్రిపురాంతకుండును వినాయకుని ముందుగఁ బూజించి యుండెను. అట్టియంబికానందనుండు మాయజ్ఞంబును నిర్విఘ్నముగఁ గొనసాగించుఁగాక! ఎవ్వని ధ్యానించుటచే సకలజీవాభిమతంబులును సిద్ధించునో, ఎవ్వఁడు దేవదేవియగు భవానిసంకల్పమాత్రంబుననే జన్మించెనో, ఎవ్వనియుదయంబువలన చరాచరప్రపంచమంతయును మహానందముం గాంచెనో, కృతార్థులగు దేవతలందఱు నేకవాక్యముగా జననసమయంబుననందే యెవ్వనికి విఘ్నేశ్వరుం డని నామకరణంబు గావించిరో, ఎవ్వఁడు తల్లియొడిలోనుండి యేమె పలదని వారించుచున్నను వినోదముకొఱకు బాలచంద్రుని బలవంతముగా శివజటాజూటము

ధ్యంబుఁ గప్పియుంచునో, ఎవ్వఁడు తృప్తుండయ్యును, సోదరమాత్సర్యంబువలనఁ దల్లిని విడువక స్తన్యపానంబు గావించుచుండునో, నీవు లంబోదరుండ వగుమని శివుం డెవ్వానికి నామకరణంబు గావించి యుండెనో, ఎవ్వఁడు నూపురారవంబు చెలంగ నతిలోకవినోదంబుగా నృత్యంబు చేయుటం జూచి సురగణపరివేష్టితుండగు శంకరుండు సంతుష్టుండై యెవ్వానికి గణాధిపత్యంబు నొసంగి యభిషేకంబు గావించెనో, ఒకకరంబున విఘ్నపాశంబును, మఱియొకభుజంబునఁ గుఠారమును ధరించి యెవ్వఁడు తన్నుఁ బూజింపనితల్లిదండ్రులకైనను విఘ్నంబుల నాపాదించుచుండునో యట్టి విఘ్నేశ్వరునితో సమానులగు దేవత లెవ్వరున్నారు? ధర్మార్థకామకర్మంబులయందు సర్వపూజ్యుండును, దేవాసురులకు నిత్యారాధ్యుండును, సఫలారాధితుండును, పూర్వపూజ్యుండు నగువినాయకునకు మానమస్కారము. స్వతంత్రుండును, సమర్థుండును, అతిగర్వితుండును, భ్రాతృప్రియుండును, మూషకవాహనుండును, సర్వఫలదాయకుండును, నగుదేవుఁడు మాకు వందనీయుఁడగుఁగాక! సరసనృత్యగీతవిశారదుండును, వివిధవినోదంబులచేఁ దల్లికానందంబుఁ గూర్చువాఁడును, సంతుష్టుండు నగుగణేశ్వరుఁడు మాకు రక్షకుండగుఁగాక! దేవప్రియుండును, అసురవైరియు, పితృభక్తుండును సర్వసమృద్ధిశాలియు నగుగణపతిని మేమాశ్రయించెదము. ఎవ్వఁడు తండ్రిచేఁ బూజితుండై నిర్విఘ్నంబుగ నాతనికిఁ ద్రిపురవిజయంబును చేకూర్చెనో, యట్టివిఘ్ననాయకునకు మావందనములు.” అని యనేకవిధంబుల వినాయకునిఁ బ్రార్థింపఁ దొడంగిరి.

గణనాథుండును వారిసన్నుతులకు సంతుష్టుండై “ఓ నిర్జరప్రవరులారా! నాప్రసాదంబుచే మీయజ్ఞంబు నిరంతరాయముగ సంపన్నం బగుఁగాక! మీరు నన్నుఁ గూర్చి కావించిన యాస్తోత్రమును

నియతపవిత్రులై నిశ్చలభక్తిభావంబునఁ బఠించువారికి దారిద్ర్యాది దుఃఖంబులు లేకుండుఁగాక! ఈక్షేత్రంబున భక్తిశ్రద్ధలతో స్నానదానంబులు గావించువారికి నిశ్చయంబుగా సర్వకార్యసిద్ధి కాఁగలదు" అని యనుగ్రహించుటయు సమకాలముననే దేవతలందఱును "తథాస్తు" అని యేకగ్రీవముగా నుచ్చరించిరి. తరువాత వారందఱును యజ్ఞపరిసమాప్తి గావించుకొని స్వధామంబులకుం జనిరి. అప్పటినుండియు నాక్షేత్రమున కవిఘ్నతీర్థం బను నామంబు గలిగెను. అది సర్వకామప్రదంబును, సర్వవిఘ్నవినాశకంబు నైనది.

## శేషతీర్థము.

లోకవిఖ్యాతం బగు శేషతీర్థము సర్వాభీష్టదాయక మైనది. పూర్వకాలంబున శేషుండు రసాతలంబునకంతకును ప్రభుండై పన్నగకులంబునంతను బరిపాలించుచుండెను. కాని కొంతకాలంబునకు దైత్యదానవులందుఁ బ్రవేశించి యాతని విదూరితునిం గావించిరి. అప్పుడు సర్పనాయకుండు విహ్వలుండై బ్రహ్మదేవుని చెంతకుం బోయి "దేవా! నీవు మాకును దానవులకునుగూడ రసాతలమును దానము చేసితివి. ఇప్పుడా రాక్షసులు ప్రబలులై మాకందుఁ దావులేకుండఁ జేయుచున్నారు. కావున మేమిప్పుడు నీశరణంబుగోరి వచ్చితిమి. నీవే మాజీవనంబున కుపాయంబు చూపవలయును" అని ప్రార్థించుటయుఁ బద్మగర్భుండు "ఓయురగేంద్రా! నీవు గౌతమీతీరంబునకుం బోయి యచ్చటఁ బరమేశ్వరుని బ్రార్థించినచో నీమనోరథసిద్ధి కాఁగలదు. ఆతనికంటె నభీష్టప్రదాత త్రిలోకంబులయం దెవ్వరును లేరు" అని యానతిచ్చెను.

అంత ననంతుండు గౌతమిం జేరి యందు స్నానంబు గావించి

గంగాధరు నుద్దేశించి "ఓ మహాదేవా! నీవు త్రిలోకనాథుండవు. దక్ష యజ్ఞధ్వంసకుండవు. ఆదికర్తవు. ఈ విశ్వంబంతయును నీస్వరూపము. సహస్రశీర్షుండవు, సర్వసంహారకుండవు, సోమసూర్యాగ్నిజలస్వరూపుఁడవు; సర్వస్వరూపుఁడవు, సర్వేశ్వరుఁడవు నగు నీకుఁ బునఃపునః ప్రణామంబు లాచరించుచున్నాను." అని స్తోత్రంబు గావించుచు నచ్చటఁ బరమేశ్వరు నుద్దేశించి హోమంబులం గావించెను. అయ్యగ్నికుండము సర్వదా ప్రజ్వరిల్లుచుండును. అందుచే నచ్చటిజలంబులు నిత్యోష్ణంబులై యుండును.

మహేశ్వరుం డాతనిభక్తికి సంతుష్టుండై యానాగేశ్వరునకు రసాతలరాజ్యంబును బ్రసాదించెను. శేషుండును గృతార్థుండై శంకరుని యనుజ్ఞంగాంచి రసాతలంబుఁ జేరి యచ్చట సుఖంబుగ నుండెను. అప్పటినుండియు నాతీర్థము శేషతీర్థంబయ్యెను. అది సర్వకామప్రదంబును, పవిత్రంబును, రోగదారిద్ర్యహరంబునై విరాజిల్లుచుండును. అచ్చటసుస్నాతు లగువారి కాయురారోగ్యభాగ్యంబులు సిద్ధించును. ఈచరిత్రశ్రవణపఠనాదులు భుక్తిముక్తిప్రదాయకంబులు. అచ్చట శేషేశ్వరుండు ప్రతిష్ఠితుండై యున్నాఁడు. ఆప్రదేశంబున గౌతమికి నిరువంకలను రెండువేలనూఱుతీర్థంబులు గలవు. అవియన్నియును సర్వకామదాయకంబులు.

## — బడబానలతీర్థము —

బడబానలతీర్థంబున మహానలేశ్వరుండు ప్రతిష్ఠితుండై యుండెను. అందు బడబానది ప్రవహించుచుండును. ఈతీర్థము జరామృత్యునివారకమైనది. పూర్వము నైమిశారణ్యంబున మహర్షు లొకదీర్ఘసత్రము బ్రారంభించిరి. అయ్యజ్ఞంబునందు ఋషులు మృత్యువును

శమితృపదంబున నియోగించిరి. ఆదీర్ఘయజ్ఞంబునందు మృత్యువు సవనకార్యనియుక్తుఁడై యుండుటచేఁ జరాచరప్రపంచమునందుఁ బశువులుదక్క మఱియెవ్వరును మృతులు గాకుండిరి. మానవులందఱు నమరులైపోయిరి. అప్పుడు స్వర్గము శూన్యంబై మర్త్యలోకము జనసంకుల మగుచుండెను. మృత్యువిట్లు జీవహత్యయం దుపేక్షం జూపుచుండుటవలన దేవతలు రాక్షసులనుద్దేశించి "మీరుపోయి మహర్షులయజ్ఞమును ధ్వంసము చేయుఁడు" అని చెప్పిరి. ఆమాటలు విని రాక్షసులు "యజ్ఞధ్వంసంబు గావించుటవలన మాకేమిలాభము! నిష్కారణంబుగా నిష్ఫలంబుగాఁ గార్యారంభంబు గావించునవివేకు లెవ్వరుందురు?" అని ప్రశ్నించుటయు నమరులు మీకు యజ్ఞార్థభాగంబు లభింపఁగలదని చెప్పిరి.

అప్పుడు రాక్షసులందఱు నందుల కంగీకరించి యజ్ఞవినాశార్థంబుగా నైమిశవనంబునకుం జనిరి. ఋషులీవృత్తాంతమంతయుం దెలిసికొని మృత్యువుం గాంచి "ఓమృత్యువా! రాక్షసులు యజ్ఞవినాశంబు గావింపవచ్చుచున్నారు. ఇప్పుడు మేమేమి చేయవలయును?" అని ప్రశ్నించి మృత్యువు చెప్పినయుపాయంబు ననుసరించి వారందఱు నవ్వనంబును బరిత్యజించి యజ్ఞపరికరంబులన్నియు నచ్చటనే విడిచి యగ్నిమాత్రము గైకొని గౌతమీతీరంబునకుం బోయి యచ్చట స్నానంబులు గావించి మఖసంరక్షణార్థమై మహాదేవు నారాధించి యంజలిబద్ధులై "లీలామాత్రంబుగ నీవిశ్వంబును సృష్టించినవాఁడును, భువనత్రయంబునకు విధాతయు, విశ్వమూర్తియు, సదసద్విగ్రహుండును, పరమపురుషుండు నగు సోమేశ్వరుండు మాకు శరణ్యుం డగుఁగాక!" అని ప్రార్థింపఁదొడంగిరి. అప్పుడు మృత్యువు "ఓదేవా! నీవిచ్ఛామాత్రంబున జగదుత్పత్తిస్థితిలయంబులఁ గావించుచుందువు.

త్రిదశపతీ! శంకరా! నీవు మాకు రక్షకుండ వగుము. మహాకాయుం డవు, మహానలుండవు, మహానీలుండవు, మహామూర్తిధరుండవు నగు నో మహేశ్వరా! మమ్ము రక్షింపుము!" అని ప్రార్థించుటయు భగ వానుండు ప్రసన్నుండై వరప్రార్థనంబుగావింపుమని యనుగ్రహించెను.

మృత్యువు పరమానందముతో "మహాదేవా! మాయజ్ఞంబు నకు రాక్షసులవలన మహాభయంబు వాటిల్లినది. ఈయజ్ఞంబు సంప న్నంబగునట్లును నీవు మమ్ములను మఖంబునుగూడ సంరక్షింపవల యును" అని ప్రార్థించెను. శంకరుండట్లే యని యనుగ్రహించెను. ఇట్లు మృత్యుసాహాయ్యముచే మహర్షులయ్యజ్ఞంబును బూర్తి గావిం చిరి. అప్పుడమరులు హవిర్భాగంబులకై క్రమక్రమంబుగ నేతెంచు టయు మృత్యువు వారిం గాంచి "మీరు మాయజ్ఞంబును విధ్వస్తంబు గావింపుటకై రాక్షసులను ప్రేరేపించితిరి. హవిర్భాగహారులయ్యును మీరిట్టియకార్యంబు గావించితిరి కావున నింతటినుండి మీకు రాక్ష సులు శత్రువులయ్యెదరుగాక!" అని శపించెను. అప్పటినుండియు నసురు లమరుల శత్రువులైరి.

ఆసమయంబున మహర్షులు మృత్యువునెడలఁ బ్రీతులై బడబ యనుకృత్య నాతనికి భార్యగాఁ జేసి యామెకు మంగళస్నానంబు గావించిరి. ఆయభిషేకజలము ప్రవహించి బడబానది యయ్యెను. ఆస్థానంబునందు మృత్యువొకశివలింగమును బ్రతిష్ఠించెను. ఆలింగము మహానీలనామంబున విఖ్యాతం బయ్యెను. అప్పటినుండియు నాతీర్థము నకు బడబాసంగమనామంబు గలిగెను. మహావలేశ్వరుండు వెలసియు న్నయాక్షేత్రము భుక్తిముక్తిప్రదమైనది. ఆక్షేత్రంబునందు గౌతమీ యుభయతీరంబులను సర్వకామదంబులగు సహస్రతీర్థంబులు గలవు. అని యన్నియును స్మరణమాత్రంబుననే సకలపాపములను నశింపఁ జేయును.

## ఆత్మతీర్థము

జ్ఞానేశ్వరక్షేత్ర మగు నాత్మతీర్థము భోగమోక్షదాయకమైనది. అత్రినందనుం డగు దత్తాత్రేయుండు సర్వజ్ఞుండును, శర్వభక్తుండునై యుండెను. ఆతఁ డొకనాఁడు తండ్రి కడకుం బోయి ప్రణామం బాచరించి „ఓ బ్రహ్మవిద్వరా! నాకు బ్రహ్మజ్ఞానంబు గావలయును. అందుకొఱకు నే నెచ్చటికిఁ బోవలయునో, యెవ్వరి నాశ్రయింపవలయునో యెఱింగింపవలయును” అని ప్రార్థించుటయు నత్రిమునీంద్రుం డించుక యాలోచించి „కుమారా! నీవు గౌతమీతీరంబునకుం బోయి మహాదేవు నారాధింపుము. ఆతండు ప్రీతుండైనచో నీకు జ్ఞానలాభంబు చేయఁగలఁడు.! అని బోధించెను.

దత్తాత్రేయుండు పితృవచనానుసారంబుగా గౌతమికిం బోయి యందుఁ గృతస్నానుండై భక్తిభావంబునఁ గృతాంజలియై శంకరు నుద్దేశించి „ఓ సోమనాథా! నేను దైవవశంబున మోహాంధుండనై సంసారకూపంబున భవదుఃఖపంకనిమగ్నుండనై యుంటిని. మఱియు నజ్ఞానాంధకారాచ్ఛన్నుండనై శ్రేయోమార్గముం గనుఁగొనఁజాలకుంటిని. పాపంబులను శూలపుఁబోటులచేతను, సంకల్పంబులను కత్తివరకులచేతను నిరంతరమును బీడితుండనై, భీషణంబులగు పంచేంద్రియంబుల తీవ్రతాపంబునఁ బ్రతప్తుండనై యత్యంతశ్రాంతుండనై యున్న నన్ను రక్షింపుము. భీకరదారిద్ర్యపీడనంబునను, దారుణరోగానలతాపంబునను గృశించి మృత్యుభుజంగమాక్రాంతుండనై నితాంతభీతుండ నగు నే నిప్పుడేమి చేయుదును? స్వామీ! నీవు జననమరణదుఃఖదూషితుండనై క్షుత్తాపంబుచేతను, తృష్ణచేతను, రజస్తమోగుణంబులచేతను పరిభూతుండనై వివశుండనై యున్న నాయెడలఁ గృపాదృష్టిఁ బ్రసరింపఁజేయుము. దేవా! కామక్రోధాదిశత్రువులచే విజితుండనై

యున్ననన్నుద్ధరింపుము. ఈజగంబున నెక్కడనైన దుఃఖార్తులగువారి కెవ్వరేన నూఱడించువారు లభింతురు. కాని నాకుమాత్రము నీకంటె రక్షకులును బ్రియవక్తలును గానవచ్చుట లేదు. “ నమశ్శివాయ ” యను మంత్రమును జపించుభాగ్యము లభించువఱకును గోధమోహాభయదుఃఖములును, అజ్ఞానమును, దారిద్ర్యమును, వ్యాధులును, మృత్యువును గూడ బాధించుచునే యుండును. మహాదేవా! నాకుఁ ధర్మము లేదు. భక్తి లేదు. వివేకము లేదు. దయ లేదు. సర్వవిధముల నతిదీనుండ నగుసేను నీకు రక్షణీయుండను. నాచిత్తకమలంబున నీచరణపద్మంబుల నిలిపి ధ్యానించుటకంటె స్వర్గాధిపత్యముగూడ నాకు వాంఛనీయము గాదు. కావున నాకట్టిభాగ్యమును ప్రసాదింపవలయు నని ప్రార్థించుచున్నాను. నాయభీష్టంబు సఫలంబు గావింపుము. నేను పాపాత్ముండనైనను శరణాగతుండను గావున నాపలుకు లాదరింపుము. శివనామకీర్తనంబులు వినవచ్చుచోటనే నాకు నిత్యనివాసంబు లభించుఁగాక! “ ఓగౌరీపతీ! శంకరా! సోమనాథా! విశ్వేశ్వరా! కరుణానిధీ! సర్వాత్మా! ” అని పుణ్యపురుషులు స్తోత్రంబులుగావించుదివ్యస్థలంబున నిలిచియుండుట కష్టాలగువారు లోకంబునఁ గొలదిమందిమాత్రమే యుందురు. స్వామీ! నాకట్టిభాగ్యమును బ్రసాదింపుము! ” అని ప్రార్థించుటయు శంకరుండు ప్రసన్నుండై వరప్రార్థనంబు గావింపుమని యనుగ్రహించెను.

అత్రినందనుం డందులకుఁ బరమానందభరితుండై “ ఓత్రిదశవందితా! నాకాత్మజ్ఞానంబును, భవభయనాశకంబులగు భుక్తిముక్తులను బ్రసాదింపుము! ఈతీర్థము సర్వతీర్థంబులయందును బుణ్యతమం బగుఁగాక! ” అని ప్రార్థించెను. ఈశ్వరుండు “ తథాస్తు ” అని యనుగ్రహించి యంతర్హితుండయ్యెను. అప్పటినుండియు నాదివ్యస్థలంబు

నాశ్వత్థతీర్థం బని పండితులు కీర్తించుచుండిరి. అందలి స్నానదానంబులు ముక్తిప్రదంబులు.

## —। అశ్వత్థతీర్థము. ।—

పూర్వకాలంబున భగవానుం డగునగస్త్యుండు దేవతాప్రేరణం బున సహస్రమునిజనపరివృతుండై యత్యున్నతంబును, సుధీరంబును, మేరుమార్తాండవిపక్షంబును, శతశృంగవిశిష్టంబును, బహుతరుషండ సమాకులంబును, నగశ్రేష్ఠంబునగు వింధ్యపర్వతమును సమీపించి యాశీర్వదించి దేవకార్యసిద్ధింగోరి "ఓనగరాజా! నేను తత్త్వజ్ఞులగుమునిగణంబులతోఁ గలసి దక్షిణతీర్థయాత్ర గావించుచు న్నాఁడను. నీవు నాకాతిథ్యరూపంబుగా మార్గంబు నొసంగి మరల నేను వచ్చువఱకు నిట్లే యుండవలయును. ఇదియే నాకోరిక." అను టయు వింధ్యపర్వతం బట్టే యని యంగీకరించెను.

అనంతర మగస్త్యుండు మునిజనసహితంబుగా ప్రయాణంబు గావించి గౌతమీతీరంబుఁ జేరి యచ్చట యజ్ఞదీక్షితుండై యేకవత్సర వ్యాప్తం బగుమఖంబును గావింప నారంభించెను. ఆసమయంబునఁ గైటభతనయులగు నశ్వత్థుండును, పిప్పలుండు ననునిరువురుపాపపు రక్కసులు క్రూరులై యాసవనధ్వంసంబు గావించుటకు ఛిద్రాన్వేష ణంబు గావించుచుండిరి. అందశ్వత్థుండు వృక్షరూపముం దాల్చి తన్నుఁ జేరినవారినెల్ల భక్షించివైచుచుండెను. పిప్పలుండు బ్రాహ్మణ రూపధరుండై సామగానంబు చేయుచు విద్యార్థులై తన్నుఁజేరవచ్చిన శిష్యుల నుదరస్థులం గావించుకొనుచుండెను. ఆకారణముచేతనే యి ప్పటికిని బ్రాహ్మణులలో సామగాయకు లగువారు నిర్దయులుగాఁ బరిగణింపఁబడుచున్నారు.

ఆరక్కసులవలనఁ గ్రమక్రమముగా బ్రాహ్మణులందఱు నిట్లు భక్షించుచుండ టను మునులు గ్రహించి యాగౌతమీదక్షిణతీరంబునఁ దపోనిరతుండై యున్న రవినందనుం డగు శనైశ్చరుని చెంతకుం బోయి రాక్షసకృతంబు లగుదుష్కృతంబుల నెల్ల నాతనికి నివేదించిరి. అప్పుడు సూర్యనందనుండు "ఓమునిప్రవరులారా! నాతపంబు పూర్తిమైన పిమ్మట నేనా రాక్షసులను వినాశంబు గావించెదను. తపస్స్థితిమైనఁ గాని నాకట్టిసామర్థ్యంబు గలుగదు" అని చెప్పుటయు మును లాతనికిఁ దమతపోబలంబు నిచ్చెదమని దృఢనిశ్చయులై పలికిరి. అందులకు రవిపుత్రుం డంగీకరించి వారివలనఁ దపోబలసంపన్నుండై బ్రాహ్మణరూపంబు దాల్చి ముందుగా నశ్వత్థాకృతి యగు రాక్షసునొద్దకుం బోయి ప్రదక్షిణంబు గావింపఁదొడంగుటయు నాదానవుం డాతని బ్రాహ్మణమాత్రుండుగనే భావించి మాయారూపంబున గ్రసించివైచెను. శనియు నాతనియుదరంబునఁ బ్రవేశించి యందుఁ గన్నులు విచ్చి యాంత్రంబుల నన్నిటిం గాంచుటయు నాతీవ్రదృక్ప్రసారంబువలన నావృక్షమాక్షణంబుననే భస్మీభూతం బయ్యెను.

ఈవిధముగా సూర్యనందనుం డేకవీరుండై పాపనిలయుం డగు నయ్యశ్వత్థరాక్షసుని నిహతుం గావించి దోషాకరుం డగువిప్రరూపదైత్యునియొద్దకుం జని వినయముతోఁ దన్ను శిష్యునిగా గ్రహింపవలయు నని యర్థించెను. అట్లేయని దారుణచరిత్రుం డగు నాపిప్పలదైత్యుం డంగీకరించి పాఠంబు చెప్పుచు నాతని సామాన్యబ్రాహ్మణునిగనే భావించి యాకస్మికముగఁ గబళించివైచెను. మార్తాండనందనుం డాతనిగర్భంబునం జేరి కన్నులు విచ్చి చూచుటయు నశ్వత్థదైత్యుని వలెనే యాతండును నిమిషములో భస్మమైపోయెను. ఇట్లు శనైశ్చరుం డయ్యసుర నరాశనులను వధించివైచి యింకను నేనేమి చేయ

వలయునో యానతీయవలయునని మునులం గోరెను.

అప్పు డగస్త్యాదులగుమహామునులందఱును బరమానందభరిత హృదయులై యాతని కనేకవరంబులనొసంగిరి. అంతశనైశ్చరుండు సంతుష్టుండై "మదీయంబగువారంబున నీయశ్వత్థతీర్థంబునం దనగాహనంబు గావించువారికి సర్వకార్యసిద్ధి యగును. వారికి నావలన నెట్టి పీడయును గలుగదు. శనివారంబునం బ్రాతఃకాలంబున లేచి యిందు స్నానంబు జేయువారికి సకలగ్రహపీడలును శమింపంగలవు" అని యానతిచ్చెను. అప్పటినుండియు నాతీర్థ మశ్వత్థపిప్పలనామంబులచే విరాజిల్లుచుండెను. అందు శనైశ్చరము, ఆగస్త్యము, సాత్రికము, యాజ్ఞికము, సామగము మొదలుగాగలషోడశసహస్రతీర్థంబులు గలవు. అవి యన్నియును సత్రయాగఫలప్రదంబులై యుండును.

## — సోమతీర్థము. —

సోమతీర్థస్నానంబువలన సోమపానఫలంబు లభించునని పెద్దలు చెప్పుదురు. పూర్వ మోషధు లన్నియును జగన్మాతలుగా నిర్మితంబులై యుండెను. ధర్మస్వాధ్యాయయజ్ఞకర్మంబులు వానియందుఁ బ్రతిష్ఠితంబు లయ్యెను. సచరాచరంబగు త్రైలోక్యంబు నవియే భరించి యుండెను. వానివలన నఖిలరోగోపశాంతి యగుచుండెను. జగజ్జీవనధారణమున కేకమాత్రహేతు వగునన్నము వానివలననే లభించుచుండెను. అట్టిజగద్వంద్యంబు లగునోషధులన్నియు నహంకారశూన్యంబులై బ్రహ్మదేవునుద్దేశించి "ఓదేవా! మాకొకయధీశ్వరుని బ్రసాదింపవలయును." అనికోరుటయు హిరణ్యగర్భుండు మీకచిరకాలంబుననే యొకప్రభుండు లభింపంగలండని యానతిచ్చెను. అప్పు డోషధులు "మే మెక్కడకుం బోయిన మాప్రభుండు లభించును" అని

యడిగెను. బ్రహ్మ యోషధులమొదలఁబ్రసన్నుండై “ మీరందఱును గౌతమీతీరంబునకుం జనుఁడు. అట గౌతమిని బ్రార్థించినచో లోకపూజితుండగుపతి భుండు మీకు లభింపఁగలఁడు ” అని చెప్పెను.

ఓషధు లప్పుడు గౌతమింజేరి “ ఓపుణ్యవాహినీ! భవాని! గౌతమీ! నీవీభూమండలంబున నవతరింపకున్నచో వివిధదుఃఖభాగులగుజీవులకు నన్యశరణ్యం బేమున్నది? నీవు సాక్షాత్కరించి మహాపాపంబులు నశింపఁజేయుచుండుటవలన భూలోకవాసు లెల్లరును ధన్యులగుచున్నారు. ఓత్రిలోకవందితా! నీయపారవిభూతిం గూర్చి యెవ్వరును వర్ణింపఁజాలరు. స్మరారియగుశంకరుండు గౌరిచే నాలింగితుం డయ్యును నిన్ను శిరంబునఁ దాల్చియున్నాఁడు. ఓయభీష్టదాయినీ! మాతా! నీకు నమస్కారము. పాపనాశినీ! బ్రహ్మమయీ! విష్ణుపాదపద్మోద్భవా! శంభుజటావినిర్గతా! నీకుఁ బ్రణామంబులు.” అని యనేకవిధంబుల సన్నుతించుటయు గౌతమి ప్రసన్నయై మీ కేమికావలయు నని యడిగెను. అప్పు డోషధు లోజగన్మాతా! మాకుఁ బతిగాఁ దేజస్వియగు నొకరాజు గావలయు నని కోరెను.

గౌతమి యోషధులం గాంచి “ నేనును మాతృగణంబులగు మీరునుగూడ నమృతస్వరూపలము. కావున నేను మీకమృతాత్ముండగు సోమునిఁ బతిగా నొసంగుచున్నాను.” అని యనుగ్రహించెను. దేవతలును, ఋషులును, సోముండును, ఓషధిగణంబులును గూడ నవ్వాక్యంబు లామోదించిరి. అప్పు డోషధులు సర్వాపనివారకుండును, అమృతాత్మకుండు నగు చంద్రుని రాజుగాఁ బడసి సంతోషముతో స్వస్థానంబులకుం జనియెను. అప్పటినుండియు నాస్థానము సోమతీర్థనామంబున విఖ్యాతంబయ్యెను. అందు స్నానదానంబులు

గావించుటవలనఁ బితృగణంబులకు స్వర్గప్రాప్తి యగును. ఈతీర్థమా హాత్మ్యంబు నాకర్ణించువా రాయుష్మంతులును, ధనవంతులును, బుత్ర వంతులు నగుదురు.

## —♦ ధాన్యతీర్థము. ♦—

సర్వకామప్రదంబును, సర్వాపన్నివారకంబును, సుభిక్షదం బును, క్షేమదాయకంబు నగు ధాన్యతీర్థము జగత్ప్రసిద్ధంబైనది. ఓష ధులు సోముని రాజుగను, బతిగను బడసి పరమానందముతో గంగా దేవివలనఁ దాము గాంచిన వరంబునుగూర్చి సకలలోకంబులయందును బ్రశంసించుచుండెను. "వేదవిదులు వేదచోదితం బగు నొక పుణ్యగాథ నిట్లు చెప్పుచుందురు:—గంగాసమీపంబున మాతృస్వరూపంబును, సస్యశ్యామలంబు నగుభూమిని దానము చేయువా రభిలషితసకలఫల ప్రాప్తు లగుదురు. సస్యవతి యగుభూమిని, గోవును, ఓషధులను విష్ణు బ్రహ్మేశ్వరస్వరూపుండగు బ్రాహ్మణునకు దానము చేయువారి సకల పుణ్యకర్మంబులు నక్షయంబు లగును. వారి సకలాభీష్టంబులును సిద్ధిం చును. సోముండోషధులకుఁ బతియుఁ బ్రభుండు నని యెఱింగి యోష ధులను దానము చేయువారు సర్వాభిమత ఫలంబులం గాంచుటయే కాక బ్రహ్మలోకంబునఁ బూజితు లగుదురు. ఓషధులు పరమానం దముతోఁ దమప్రభుం డగుచంద్రు నుద్దేశించి "ఓ యోషధీశ్వరా! ఉత్తమోత్తముఁడ వగు నీకీచరాచరప్రపంచ మంతయు నధీనమైనది. ఓ రాజా! మమ్ము బ్రాహ్మణులకెవ్వరు దానము చేయుదురో వారిని నీవు భవసాగరమునుండి యుద్ధరింపుము. బ్రహ్మరూపిణులము, ప్రాణ రూపిణులము నగుమమ్ము శ్రద్ధాపూర్వకంబులయందు నివేదించువారికి నీవు ముక్తి నొసగుము! నిత్యమును మమ్ము బ్రాహ్మణులకు దానము

చేయు జితవ్రతుల కట్టి దానక్రియచే మాయుపాసనంబగుఁగాక! మాచే నధిష్ఠితంబును, స్థావరజంగమ సంకలితంబు నగుభూమిని విప్రవరులకు దానము చేసి వారికుపభోగయోగ్యంబు లగుహవ్యకవ్యామృతంబుల నర్పించి యెవ్వఁడీవైదికగాథను బఠియించునో యట్టివానిని నీవుద్ధరింప వలయును" అని వేఁడుకొనియెను.

ఈవైదికగాథ యోషధులచే గానము చేయఁబడినయాగౌతమీ తీరమే ధాన్యతీర్థనామంబున విఖ్యాతంబయ్యెను. అందోషధీతీర్థము, సోమతీర్థము, అమృతతీర్థము, వేదగాథాతీర్థము ననుమఱికొన్నితీర్థంబులుగలవు. ఈసకలతీర్థంబులయందును గావింపఁబడిన స్నానజపహోమదానతర్పణాదు లక్షయపుణ్యఫలదంబులై యుండును. అచ్చటనే గౌతమికుత్తరతీరంబునఁ బదునాఱువందలపుణ్యతీర్థంబులు విరాజిల్లుచుండును. అవియన్నియును సర్వపాపహరంబులు.

## — విదర్భారేవతీసంగమతీర్థములు —

గౌతమీతీరంబున విదర్భాసంగమంబును, రేవతీసంగమంబు ననురెండు తీర్థంబులు గలవు. పూర్వకాలంబునఁ దపఃప్రియుండును, మహాత్ముండు నగుభరద్వాజుండను నొకమహర్షి గలఁడు. అతనికి వికృతాకారిణియు, వికృతస్వరయు నగు రేవతి యనునొకసోదరి కలదు. భరద్వాజుం డొకప్పుడు గౌతమీగంగాదక్షిణతీరంబునఁ గూర్చుండి చింతాకులితహృదయముతో "భీషణాకారిణి యగు నాసోదరి నెవ్వని కిచ్చి పెండ్లి చేయుదును? ఈమె నెవ్వరి కిచ్చెద ననిన వారే వలదను చున్నారు. ఎవ్వరికి నక్కఱకురాని యీకన్య నాకు దుఃఖకారణమై యున్నది." అని విచారించు చుండఁ దరుణవయస్కుండును, శుభాకారుండును, శాంతుండును, దాంతుండును, గుణాకరుండు నగు కఠుం

డను మునివరుం డాతనిసన్నిధి కేతెంచి యభివాదనంబు గావించెను.

భరద్వాజుం డాతనికి విధివిహితంబుగా సత్కారంబు లాచరించి సమ్ముఖంబునం దాతనిఁ గూర్చుండఁ జేసి యాగమనకారణంబు ప్రశ్నించుటయు కతుండు వినయవినమితుండై నేనువిద్యార్థినై భవద్దర్శనంబునకు వచ్చితిని. మీకు యోగ్యమగురీతి నాచరింపఁగోరెద నని విన్నవించెను. భరద్వాజుం డందులకు సంతుష్టుండై "పురాణములు, స్మృతులు, వేదములు, నితరంబులగు ధర్మశాస్త్రములు మొదలగు వానిలో నీయిష్టమగువాని నధ్యయనంబు గావింపుము! ఓమహాప్రాజ్ఞా! ఈసకలవిద్యలును నాకు విదితంబులే. నీకేవిద్య గావలయునో యెఱింగింపుము. వాస్తవముగా కులీనుండును, ధార్మికుండును, గురుశుశ్రూషాపరతుండును, అభిమానియు, శ్రుతిధరుండు నగు శిష్యుండు లభించుట పుణ్యవిశేషంబుగదా!" అనియెను. అప్పుడు కతుండు "ఓ బ్రహ్మవిద్వరా! నేను నిష్పాపుఁడను. సత్యవాదిని. ఇట్టిసచ్ఛిష్యుండ నగునాకు సర్వవిద్యలను బోధింపవలయును" అని కోరెను. భరద్వాజుం డందులకు సమ్మతించి కొలఁదికాలములోనే యాతనికెల్ల విద్యలను బ్రసాదించెను.

కతుండిట్లు ప్రాప్తవిద్యుండై గురుండగు భరద్వాజునుద్దేశించి "గురుదేవా? నేను నీకభీష్టం బగుదక్షిణ నొసంగవలయు నని కుతూహలపడుచున్నాను. మీకేది దుర్లభంబై యుండెనో యెఱింగింపఁగోరెదను. మీకు నమస్కారము. గురువునొద్ద విద్యాలాభంబు గాంచి యవివేకముచే నాతనికిఁ బారితోషికంబు నివేదింపకుండఁ బోవువారు ఆచంద్రతారార్కముగా నిరయపతితు లగుదురు." అని విన్నవించుటయు భరద్వాజుండు సంతోషించి "నీవు విధిపూర్వకంబుగా నాసోదరి యగు రేవతిని భార్యారూపంబునఁ బరిగ్రహింపుము. ఈమెలో

గూడి ప్రేమపూర్ణుండవై విహరింపుము. ఇదియే నాకు గురుదక్షిణ!” అనియెను. కఠుండు విస్మితుండై “గురుప్రవరా? శిష్యుండు సర్వథా గురునకు సోదరునివంటివాఁడును, బుత్త్రునివంటివాఁడు నై యుండును. శిష్యునకు గురుండు పితృసమానుం డగును. ఇట్టిచో మనయిరువురికిని వివాహసంబంధము ధర్మసంగత మెట్లు కాఁగలదు?” అని విన్నవించెను.

భరద్వాజుండు శిష్యునిం గాంచి “నీవు నామాటను జెల్లింపుము. నాయాజ్ఞను బరిపాలించుటయే నీవు నాకిచ్చుగురుదక్షిణ. ఇదియంతయు బాగుగ నాలోచించుకొని నీవి రేవతిని బరిగ్రహింపుము.” అని దృఢనిశ్చయుండై యాజ్ఞాపించెను. కఠుం డిఁక మాఱుమాట చెప్పక రేవతీకరగ్రహణంబున కంగీకరించెను. భరద్వాజుండును రేవతి నాతనికిచ్చి విధివిహితంబుగా వివాహంబు గావించెను. కఠుం డకాంతను బరిగ్రహించి యామె వికృతరూపంబును మాన్పవలయునని సంకల్పించి యాగోదావరీతీరంబుననె శంకరారాధనంబు గావింప నారంభించెను. ఆతనితపంబునకు మహాదేవుండు ప్రసన్నుండై రేవతిని శుభరూపలావణ్యసంపన్నం గావించెను. అప్పుడు కఠుండు రేవతి నభిషేకించుటయు నాజలంబు నదీరూపంబునఁ బ్రవహించి గౌతమీజలంబులం జేరుకొనియెను. సౌభాగ్యదాయిని యగు నానది రేవతీనామంబున విఖ్యాతమయ్యెను. పిమ్మట రేవతి పుణ్యరూపసిద్ధికొఱకు దర్భదకంబుచే నభిషిక్త యయ్యెను. ఆజలధార విదర్భానామకంబగునది యయ్యెను. ఆ రేవతీవిదర్భావాహినులు రెండును గౌతమీసంగమంబు గావించినచోటులందు గావించు స్నానదానాదులు సర్వపాపక్షయకంబులును, విష్ణులోకప్రాప్యంబులు నగును. అచ్చట గౌతమియుభయతీరంబులందును నుత్తమంబు లగు శతతీర్థంబులు విరాజమానంబు

లమ్యేశ. అవియన్నియును సర్వసిద్ధిప్రదంబులు.

## — పుణ్యతీర్థాదివర్ణనము. —

గంగానది కుత్తరతీరంబున సువిఖ్యాతం బగు పూర్ణతీర్థంబు గలదు. మానవుం డజ్ఞానంబుచే నైన నందు స్నానముచేసి పాపవిముక్తుం డగును. భగవానుఁ డగుచక్రపాణియును, పినాకపాణియుం గూడ సుస్థితులై యుండు నాదివ్యస్థలమును దన్మాహాత్మ్యమును దేవాదు లెవ్వరును వర్ణించి కృతార్థులు గాఁజాలరు.

పూర్వము కల్పాదియందు మహారాజగునాయువుకుమారుండు ధన్వంతరియను ప్రభుండు బహుదక్షిణాలతో నశ్వమేధాదిమహాయజ్ఞంబులను గావించి పుష్కలంబులగుభాగ్యభోగంబు లనుభవించిసంసారము నందలిపరిణామవైరస్యమును గ్రహించి పరమవైరాగ్యంబు నవలంబించి గిరిశృంగంబులు, గంగాదినదీతటంబులు, సముద్రతీరంబులు, శివమందిరములు, విష్ణుభవనములు మొదలగుపుణ్యక్షేత్రములు జపహోమాదులకుఁ బ్రశస్తంబు లనియు, నక్షయఫలప్రదంబు లనియు వినియున్నవాఁడు గావున గౌతమీసాగరసంగమస్థానంబున భీమేశ్వరచరణాసన్నిధానంబున జ్ఞానవైరాగ్యయుక్తంబగుచిత్తంబుతో మహాతపంబు గావింప నారంభించెను.

పూర్వ మాధరావసుశాసనంబునకు భయపడి తముండను నొక్కరక్కసుండు సముద్రంబునఁ బ్రవేశించి సహస్రవర్షంబులవఱకు నందు దాగియుండెను. ఇప్పుడు ధన్వంతరి రాజ్యంబును విడిచి తపంబు చేయుచుండె నని యెఱింగి యాదానవుండు నిర్భీతుండై సముద్రంబు వెలువడి పూర్వవైరంబువలన ధన్వంతరి నెట్టులైన వధింపవలయు నను

నుద్దేశముతో నాతని యాశ్రమంబునకుం బోయి ధన్వంతరిం గాంచి శంకాకులితహృదయుండై " ఈతఁడు రాజ్యపాలనసమయంబున నన్ననేకపర్యాయములు నిర్జించియున్నాఁడు. ఇప్పుడు రాజ్యత్యాగంబు గావించుటచే నీతఁడసమర్థుఁడై యుండునని భావించితిని. కాని యిదియేమి ! బ్రహ్మజ్ఞానసంపన్నుండగు నీతఁడు జపహోమనిరతుండై నాకే కాక త్రిలోకంబులకును దుర్నిరీక్ష్యుండై యున్నాఁడు. ఇట్టి యీతని నేనెట్లు సంహరింపఁగలను ? " అని యనేకవిధంబుల నాలోచించుకొని యారక్కసుండు మాయాబలంబువలన రమణీయాకారముగలయొక రమణీమూర్తిం దాల్చి మందహాససుందరవదనముతో, మోహమయంబులగు నపాంగావలోకనంబుల నలుదెసలఁ బ్రసరింపఁ జేయుచు నారాజర్షియెదుట నృత్యగీతంబులు గావించుచు విహరింపఁదొడంగెను.

సౌమ్యాకృతియు, నయనశోభాన్వితయు, ననురక్తయు, సుందరాంగియు, చతురయు, నగునక్కపటకామినిం గాంచి మహారాజగు ధన్వంతరి దయాన్వితుండై " ఓకల్యాణీ ! నీవెవ్వరవు ? ఈవనంబునకేలవచ్చితివి ? నీవెవ్వరిం గాంచి పరితోషంబు నందుచున్నావు ? " అని ప్రశ్నించుటయు నమ్మాయామానవతి " రాజేంద్రా ! నాసంతోషమునకుఁ గారకులీజగంబున నీకంటె మఱియెవ్వరున్నారు. హృదయనయనానందకరుండవగు నిన్ను దర్శించియే పరమహర్షంబున మాటిమాటికిని నేనిట్లు నీసమ్ముఖమునందు విహరించుచున్నాను. నేనెంతటి పుణ్యాత్ములకైనను దుర్లభురాలను " అని చెప్పుటయు ధన్వంతరి యాక్షణంబుననే కఠోరతపంబును జాలించి తన్నిష్ఠుండును, తత్పరాయణుండునై నిరంతరము నారమణీమణినే మనంబున ధ్యానించుచుఁ దదేకశరణ్యుండై పోయెను. తమోదైత్యుఁడీరీతిగా నాతనితపోవినా

శనంబు గావించి యంతర్హితుం డయ్యెను.

ధన్వంతరిమహాతపంబునకు మెచ్చి యాతనికి వరంబు లీయ వచ్చిన బ్రహ్మదేవుం డాసమయంబున దపోభ్రష్టుండై విహ్వలీభూతుం డును, మృతప్రాయుండునై యున్నయారాజుం గాంచి విచారించి యనే కంబులగు విశేషోక్తులచే నాతని నాశ్వాసించి "ఓరాజా! నీశ్రమం దగుతముండను దానవుండు నీతపోవినాశంబు గావింపవచ్చి యిట్లు కృత కృత్యుండై పోయినాడు. ఇంక విచారించుటవలన నేమిలాభము? సాధారణముగ నీమునులే మానవుల కానందకారకులును, తాపకారకులు నగుచుందురు. అట్టిచో మాయామయి యగునాసుందరిమాట చెప్పవలయునా?" అనుటయు ధన్వంతరి విచారించుచు సమీహిత ప్రాప్తికై నేనేమిచేయవలయునో యానతీయవలయు నని బ్రహ్మ దేవుని ప్రార్థించెను.

చతురాననుం డాతనిమొగలం గనుంగొంచి "రాజా! నీవిప్పుడు సర్వప్రయత్నంబులచేతను జనార్దనదేవు నారాధింపుము. అట్లయి నచో నీయభీష్టసిద్ధి కాగలదు. ఆతండే యఖిలజగంబులకును గర్తయు, భర్తయునై యున్నాడు. వేదవేద్యుండును, బుద్ధిమంతుండు నగునాత నికంటెను సర్వాభీష్టప్రదాత త్రిభువనత్రయంబునం దెవ్వడును లేడు" అని ప్రబోధించుటయు నాన్నృపోత్తముండు నగశ్రేష్ఠం బగుహిమాల యంబునకుం జని భక్తిపూర్వకంబుగ గృతాంజలిపుటుండై దేవదేవుం డగు విష్ణుమూర్తి నిట్లు స్తుతింప నారంభించెను.

"ఓవిష్ణూ! అచింత్యా! జిష్ణూ! అచ్యుతా! గోపాలా! లక్ష్మీశా! జగన్మయా! కృష్ణా! భూతిపతి! సర్వగా! గోవిందా! నీకు జయ మగుగాక! ఓనాథా! పన్నగశయనుండవు, విశ్వకర్తవు, విశ్వభోక్తవు, విశ్వధారివి, ఈశ్వరుండవు, మాధవుండవు, సదసదాత్మ

కుఁడవు, ధర్మరూపుఁడవు నగునీకు నమస్కారము. కల్యాణదాతయు, భూతపుండును, భూతేశ్వరుండును, కామదుండును, రాముండును, మానవిధాతయు నగునీకువందనము. ఓపీతాంబరధరా ! సర్వేశా ! కర్మంబును, కర్మదుండవును నీవే. నీమంగళాకృతికి జయము. సత్యాధనాథునకు, వేదవిదునకు జన్మదునకు, జన్మస్థునకు, పరమాత్మునకు, ముక్తిదాతకు, ముక్తిస్వరూపునకు, భక్తిదునకు, లోకదునకు, లోకేశునకుఁ, గేశవునకు నీకు నమస్కారము. పాపవినాశకుని, భక్తవత్సలుని, చక్రిధారిని, మానదుని, మానమూర్తిని, ధర్మదుని, ధర్మస్వరూపుని నిన్ను ధ్యానించెదను. లోకనమస్కృతుండును, సంసారపారగుండును, అన్నదుండును, అన్నంబును, వాచస్పతియు, శాంతిదుండును, శాంతియు, సర్వజయవరప్రదాతయు, యజ్ఞకుండును, యజ్ఞంబును, తత్కర్మఫలేక్షుణుండును, దానదాతయు, దానమూర్తియు, కైటభసూదనుండును, కీర్తిదుండును, కీర్తియు, ముక్తిదుండును, ముక్తిధరుండును, సౌఖ్యదుండును, సౌఖ్యాత్ముండును, పావనపావనుండును, పానదుండును, పానమూర్తియు, జ్యోతిర్మూర్తియు, వామనుండును, విత్తేశ్వరుండును, ధూమకేతనుండును, సర్వజగద్ధాతయు నగునీకు జయమగుఁగాక ! ఓపుండరీకాక్షా ! త్రిలోక్యజీవక్లేశవినాశనదక్షా ! కృపానిధీ ! విష్ణుదేవా ! నాశిరంబున నీకరకమలంబుఁ జేర్చి యాశీర్వదింపుము ”

అని సన్నుతించుచుండ సర్వకామప్రదుండును, భగవానుండును, శంఖచక్రగదాధరుండును, నగుమహాదేవుండు వరదానోద్యతుండై సాక్షాత్కరించుటయు ధన్వంతరి యద్దేవదేవు నవలోకించి కృతపరిణాముండై సురరాజ్యాధిపత్యమును వాంఛించెను. భక్తవత్సలుండగుగోవిందుండు నాతని కట్టి వరం బిచ్చి యాతనిచే సన్నుతుండై

యంత్రితుం డయ్యెను. ఇట్లు నరనాథుండు త్రిదశేశ్వరత్వము గాంచెను గాని పురాకృతదుష్కర్మవశంబున నాతఁడు సహస్రాక్షుం డగుటయే కాక మూఁడుసారులు పదచ్యుతుండు గూడ నయ్యెను. మఱియు నహుషునిచే నవమానితుం డయ్యెను. బ్రహ్మహత్యాపాపదూషితుం డయ్యెను. వృత్రవధ, అహల్యాగమనము మొదలగు దుష్కర్మములచేఁ గలుషితుం డయ్యెను.

ఇట్లాతఁడు తనకుఁ దటస్థించిన యవస్థల నన్నిటిని దలంచుకొని వికలహృదయుండై యొకప్పుడు బృహస్పతి నవలోకించి "ఓగురుదేవా! నేనేకారణముచే రాజ్యభ్రష్టుండ నైతిని! నడుమనడుమఁ బదభ్రష్టత్వముకంటె నరులకుఁ జిరదరిద్రతయే మంచిదిగదా! అగ్రాహ్యమగు కర్మగతి నిజస్వరూపము నెవ్వరెఱుంగఁగలుగుదురు? ఈవిషయంబున నిఖిలాగమరహస్యవేది వగు నీకంటె బోధింపఁగలవా రెవ్వరును లేరు." అని ప్రార్థించుటయు దేవగురుండు "మహేంద్రా! నీవు త్రికాలవేది యగు విధాతపాలికిం బోయి ప్రశ్నింపుము. నీకీదశ యెందువలనఁ గలిగెనో యాతఁడు చెప్పఁగలఁడు." అని బోధించి యాతని వెంటఁబెట్టుకొని బ్రహ్మదేవునిసన్నిధికిం బోయెను.

అప్పు డయ్యిరువురును హిరణ్యగర్భునకుఁ బ్రణామంబులు గావించి బద్ధాంజలిపుటులై "దేవా! మాకిట్టిమహావిపత్తు సంభవించుటకుఁ గారణ మేమో తెలుపవలయును" అని ప్రార్థించుటయుఁ బద్మాసనుం డించుక యాలోచించి "ఓబృహస్పతీ! ఖండధర్మదోషంబున నీమహేంద్రునకు రాజ్యచ్యుతి గలిగినది. దేశకాలాదుపదోషంబువలనను, శ్రద్ధామంత్రాదులవిపర్యయంబువలనను, యథాయోగ్యదక్షిణాదానంబువలనను, అయోగ్యద్రవ్యదానంబువలనను, దేవభూదేవాజ్ఞవలనను, మఱియు నితరదోషంబులవలనను మానవులకు స్వధర్మఖండ

త్సము తలపెట్టించెను. అందుచే మనస్తాపంబును, దుర్నివార్యంబగు నదివ్యాప్తియుఁ గలుగుచుండును. వికలచిత్తముతో ధర్మకార్యానుష్ఠానంబు చేసినచో నందువలన సిద్ధిస్థితి కాకుండుటయేకాక యనిష్టంబు గూడ సంభవించును. కావున ధర్మకర్మంబులు నిర్మలచిత్తంబుతోడనే నిర్వహింపవలయును" అని బోధించి యామునివిపూర్వవృత్తాంతంబును, ధన్వంతరియగు నాతనితపంబునకుఁ దమోవైత్యంబు విఘ్నంబు గల్పించుటయు, విష్ణుదేవుం డాతని గాంచించి యింద్రాధిపత్యంబును బ్రసాదించుటయు నెఱింగించెను.

ఇట్లు ధన్వంతరి తనపూర్వవృత్తాంతంబు నాలకించి విస్మితుండై కమలాసనునకుఁ బునఃప్రణామంబు గావించి " మహాత్మా ! ఇట్టి నా దోషంబు నివృత్తింబగునుపాయం బానతీయవలయును." అని ప్రార్థించెను. బ్రహ్మయు నించుకసేపు ధ్యాననిమీలితనయనుండై యనంతరము " ఓ సాధువర్యా ! మీ విపన్నివారకం బగునుపాయము దెల్పెద నాలింపుఁడు. మీరు గౌతమీతీరంబునకుం బోయి యచ్చట సర్వసిద్ధికారణులును, సంసారదుఃఖతారణులును, నిర్వాణస్వరూపులు నగు హరిహరులను గూర్చి స్తోత్రంబు గావింపుఁడు. గౌతమీకంటెను, శివకేశవులకంటెను మహాపాపశాంతికి నన్యోపాయం బేదియును లేదు" అని బోధించుటయు సంతృప్తస్వాంతులై తత్క్షణంబుననే బయలుదేఱి గౌతమీతీరమునకుం బోయి యాగోదావరీసలిలంబుల సుస్నాతులై పరమానందహృదయములతో హరిహరులను వినుతింప నారంభించిరి.

అప్పుడింద్రుండు విష్ణుదేవునిఁ గూర్చి " దేవా ! మత్స్యాదిదశావతారమూర్తి వగునీకు నమస్కారము. వరుణేంద్రయమసూర్యరూపుఁడ వగునీకు వందనము. త్రిలోకమూర్తివి పరమేశ్వరుండవు నగునీకుఁ బ్రణామశతంబులు. ఓ మధుసూదనా! లక్ష్మీనివాసం బగువక్షముగలనీవు

శ్రీమంతుఁడవు. నీవు బహుబాహూదరపాదుఁడవు. బహునేత్రాక్షిశిరస్కుండవు. సుఖనిధానుండవగు నిన్నాశ్రయించి యీజగంబున బహుజీవులు సుఖించుచుందురు. కరుణాసాగరుండవగు నీశరణంబు లభింపనంతవఱకు మానవులు నిశ్శ్రీకులును, మలినులును, దీనులునై యుందురు" అని ప్రార్థించుచుండ గురుండును "ఓదేవా! సూక్ష్ముండవు, అనంతరూపుఁడవు, ఓంకారాత్మకుఁడవు, ప్రకృతికిఁ బరుండవు, చిద్రూపుఁడవు, ఆనందమయుండవు, విశ్వస్వరూపుఁడవునని ముముక్షువులు చెప్పుదురు. వారునిష్కాములయ్యును నీశ్వరుండవగు నిన్నుఁ బంచవిధయజ్ఞంబులచే నారాధించుచుఁ గృతకృత్యులై సంసారార్ణవంబు నుత్తరించి దివ్యభావనంబు నాశ్రయింతురు. ఓశంకరా! సర్వభూతసము లగునట్టిమహాత్ములు నిశ్చలచిత్తులై జ్ఞానప్రభావముచే కర్మఫలంబుల నుజ్జగించి ధ్యానమూలంబున నీయందు విలీనులై యుందురు. వర్ణాశ్రమధర్మంబులచేఁ గాని, వేదశాస్త్రజ్ఞానముచేఁ గాని, ధ్యానయోగముచేఁ గాని, సమాధినిష్ఠచేఁ గాని మఱియేయితరసాధనముచేఁగాని నిన్నుఁ బడయుట కవకాశము లేదు. అందుచేతనే మేము భక్తిభావముతో జగన్మంగళకరుండవు, మంగళమూర్తివి, సోమమూర్తివి, రుద్రుండవు నగు నిన్నాశ్రయించి యున్నారము. ఓదేవదేవా! నీచరణకమలంబుల నాశ్రయించినమూర్ఖులైనను ముక్తులు గాఁగలరు. వివిధంబులగు జ్ఞానములును, యజ్ఞములును, తపంబులును, ధ్యానంబులును, హోమంబులును మఱియు మహాఫలదాయకంబులగు నితరకార్యంబులును నీయెడలం గలనిరంతరభక్తితో సమానంబులు గాఁజాలవు. ఓజగన్నివాసా! సకలజీవప్రార్థనీయంబులగు స్వర్గమోక్షాదిఫలంబులు ప్రాప్తించుటకు నీపాదభక్తియే పరమోపాయమై యున్నది. నీపాదభక్తి లభించుటకు, బరమోపాయ మింతవఱకుఁ గెట్టినీయును గనుపట్టియుండ లేదు. సచరాచ

రం బగునీజగంబున కంతకు నంతరాత్మయు, కర్తయు, హర్తయు, పరిపోషకుండు నగునిన్ను మాయామోహితచిత్తు లగుమం డెట్లు గ్రహింపఁగలుగుదురు ? కావున నో దయానిధీ ! భక్తి యున్నను లేకయున్నను మాకు నీస్థూలరూపసంపూజనంబుకంటె గత్యంతరం బేదియును లేదు. ఓయీశ్వరా ! నీవు నీమహాత్త్వంబును బ్రకటించి మావంటి పాపాత్ముల కెడలఁ బ్రసన్నుండ వగుము. దేవా ! నీవు స్థూలసూక్ష్మస్వరూపుఁడవు; అనాదివి, నిత్యుఁడవు, జగజ్జనకుఁడవు; జగన్మాతవు, సదసత్స్వరూపుఁడవు. పురాణపురుషు లిట్టిమహావాక్యములచే నిన్ను స్తుతించి యున్నారు. అట్టిపరమేశ్వరుండ వగునీకు నమస్కారము." అని యనేకవిధంబుల సంస్తవంబు గావించెను.

అయిందద్రిబృహస్పతులస్తోత్రంబులకు హరిహరు లిరువురును బ్రీతులై మీయభీప్సితంబు తెలుపింగింపవలయు నని యానతిచ్చుటయు నింద్రుండు ఓయీశ్వరేశ్వరులారా ! నాయెడల మీకనుగ్రహంబుగలదేని నాయింద్రత్వంబునకు మాటిమాటికిని భంగంబు గల్పించునట్టి పాపము శాంతించి యింద్రపదంబు సుస్థిరం బగునట్లనుగ్రహింపఁగోరెదను. " అని ప్రార్థించుటయు నిరాధారధారకనిర్వికారస్వరూపులును, సర్వలోకశరణ్యులును, భుక్తిముక్తిప్రదులు నగుహరిహరులు "తథాస్తు" అనుచు నింద్రగురుల నభినందించి సుప్రసన్నహృదయములతో మందస్మితంబు సేయుచు ‹‹ ఓమహాభాగులారా ! ఈగౌతమీనది త్రిలోకేశ్వరి. ఇమ్మహాతీర్థము వాంఛితార్థప్రదమైనది. మీరీనదియందు భక్తిపూర్వకంబుగ స్నానంబు గావింపుఁడు. బృహస్పతి మహేంద్రునిశుభంబునకును, ఐశ్వర్యస్థైర్యముకొఱకును మమ్ము స్మరించుచు నభిషేకంబు సేయుంగాక ! ‹‹ ఓగోదావరీ ! నేనీజన్మంబునను, బూర్వజన్మంబులయందును గావించిన సుకృతలేశ మేమాత్రమైన

నున్న మొకల నకి సంపూర్ణత్వ మొసఁగుఁగాక! తల్లీ! నీకు నమస్కారము”
అను మంత్రమును బఠించుచు గౌతమీస్నానంబు గావించువారి యసంపూ
ర్ణధర్మంబులన్నియు మాయనుగ్రహంబుచే సంపూర్ణంబులు గాఁగలవు.
అట్టివారు పూర్వజన్మకృతం బగుఖండధర్మదోషమునుండి విముక్తు
లగుదురు.

అని బోధించుటయు సురపతియును, వాచస్పతియును సంప్రీ
తులైరి. అప్పుడు బృహస్పతి దేవేంద్రుని గౌతమీజలంబులచే యథా
విధిగ నభిషిక్తుం గావించెను. ఆయుదక మొకపుణ్యనదిగాఁ బరిణమిం
చెను. అది గౌతమితో సంగమించినస్థాన మతిపుణ్యప్రద మైనది.
అచ్చట నింద్రసమ్మతుం డగు విష్ణుదేవుండు స్వయముగ నావిర్భవించి
యుండెను. అవ్విష్ణుని ప్రసాదంబుచే శక్రుండు త్రిలోకరాజ్యముం గాం
చెను. అచ్చట హరి గోవిందనామంబున విఖ్యాతుం డయ్యెను. శ్రీ
వేశ్వరునకుఁ ద్రిలోకసమ్మతంబగు గో (గా) దానంబు గావించుటచే
విష్ణుం డచ్చట గోవిందనామంబుఁ గాంచి యుండెను. విష్ణుం డింద్రు
నకు రాజ్యదానంబు గావించెను. శివుం డది నిశ్చలంబుగా నుండున
ట్లనుగ్రహించెను. ఇంద్రుని శ్రేయస్సాధనంబుకొఱకుఁ బృహస్పతి శివు
నిం బ్రార్థించినస్థానమునం దీశ్వరుండు త్రిలోకపూజితం బగుసిద్ధేశ్వర
లింగమూర్తిం దాల్చి యుండెను. అప్పటినుండియు నది గోవిందతీర్థం
బయ్యెను. తుంగళాసంగమము. పూర్ణతీర్థము, ఇంద్రతీర్థము, బార్హస్ప
త్యతీర్థము, గోవిందతీర్థము, సిద్ధేశ్వరతీర్థము వీనియందుఁ గావించు
స్నానదానాదికంబు లక్షయఫలదంబులు. ఈతీర్థంబు లన్నియును విశ్వ
లోకవల్లభంబులు. ఈతీర్థమాహాత్మ్యమును, బఠించువారును, వినువా
రును, స్మరించువారును తీర్థస్నానఫలప్రాప్తులగుదురు. గౌతమీనది
యుభయతీరంబులయందు నీరీతిగా ముప్పది యేను వేలతీర్థంబులు గలవు.

అవి యన్నియును సర్వసిద్ధిప్రదంబులు. అందు పూర్వతీర్థంబులోఁ దుర్లభం బగునది యేదియును లేదు. ఆతీర్థమును సేవింపనివారిజన్మము నిష్ఫలమైనది.

## రామతీర్థము.

సుప్రసిద్ధం బగురామతీర్థముం గూర్చి యాలకించినంతనే మానవులు సర్వపాపవిముక్తు లగుదురు. అది భ్రూణహత్యాపాపనాశక మైనది. ఇక్ష్వాకువంశంబున సువిఖ్యాతుండును, బలవంతుండును, మతిమంతుండును, శూరుండు నగుదశరథుండను మహారాజు జనించి పైతృకంబగురాజ్యమును పాలించుచుండెను. ఆతనికి రూపలక్షణవతులును, సౌభాగ్యసంపన్నలు నగు కౌసల్య, సుమిత్ర, కైక యను ముగ్గురు భార్యలు గలరు. బ్రహ్మవిద్వరుండగువసిష్ఠుండు పురోహితుండుగాఁ బాలించుచున్నయారాజు రాజ్యంబున నాధివ్యాధులును, అనావృష్టిదుర్భిక్షంబులును లేక సర్వవర్ణంబులవారును స్వధర్మనిర్వాహకులై పరమానందముతో నుండిరి.

ఆదశరథునిరాజ్యపాలనసమయంబున స్వర్గరాజ్యంబుకొఱకు దేవదానవులకుఁ బరస్పరవివాదంబు తటస్థించెను. వారు మహారణంబు గావించుచు నొకప్పుడు దేవతలును, మఱియొకప్పుడు దానవులును జయలాభంబు గాంచుచుండిరి. అందుచేఁ ద్రిభువనంబులును సంక్షుబ్ధంబు లగుచుండుటచే వారిసంగ్రామప్రయత్నమును శాంతింపఁజేయుటకై బ్రహ్మదేవుం డనేకప్రయత్నములం గావించెను. కాని యందెవ్వరును రణవిముఖులుగాక పోరాడుచుండిరి. అప్పుడు దేవతలు రాక్షసులను జయింపఁజాలక తమవిపత్తుంగూర్చి హరిహరులకు విన్నవించుకొనుటయు శివకేశవులాలోచించి ॥ మీరు తపోబలసంపన్నులై

మరల యుద్ధంబు చేసినచో జయంబు నందఁగలరు " అని బోధించిరి.

సురలందఱు నట్లే మహాతపంబుఁ గావించి బలసంయుక్తులై మాత్సర్యంబు విడువక మరల దైత్యుల నెదిరించి మహారణంబు గావింపఁదొడంగిరి. ఆదారుణాసమరంబున నేపక్షమునకును జయంబు చేకూరలేదు. ఆసమయంబున నాకాశవాణి "దశరథమహారాజెవ్వరిపక్షమునుండునో వారికి జయంబు లభించును " అని యానతిచ్చెను. ఆదివ్యవాక్యము నాలించి సురాసురులిరువురును దశరథసాహాయ్యంబు గాంచఁగోరి ప్రయాణంబు చేసిరి. ఆసమయంబున మహాజవశాలి యగు వాయుదేవుండు శీఘ్రముగా దశరథునిం జేరి "ఓమహారాజా! దేవతల కును దైత్యులకును యుద్ధము జరగుచున్నది. నీసహాయంబు గాంచినపక్షమునకు జయము గలుగునని దివ్యవాణి వచించినది. కావున నీవు మాపక్షమునఁ జేరినచో దేవతలకు విజయంబగును " అని యర్థించుటయు దశరథుండు "వాయుదేవా! నేను తప్పక మీకు సహాయము చేసెదను. నీవు యథాసుఖముగాఁ బోవచ్చును. " అని చెప్పి యాతనిఁ బంపివైచెను.

పిమ్మట రాక్షసవీరులు వచ్చి దశరథుని సందర్శించి విజయదాతవగు నీవు మాకు సాహాయ్యంబు చేయవలయు నని ప్రార్థించిరి. అప్పుడా రాజు "ఓదానవవరులారా! ఇంతకుముందే వాయుదేవుఁడు వచ్చి సన్నుతించి యున్నాఁడు. నేను దేవతలపక్షమునఁ జేరుట కంగీకరించితిని. మాట తప్పుట పాడిగాదుగదా! కావున మీరు దయచేయుఁడు" అని చెప్పెను. రాక్షసులు హతాశులై వెడలిపోయిరి.

అట్లే దశరథుఁడు స్వర్గమునకుఁ బోయి మహాగ్రరంబున దైత్యవీరులఁ జెండాడుచుండ నముచిభ్రాతృగణంబుల నిశితశరంబులచే నాతనిరథమునఁ బడి యక్షము భగ్నమైపోయెను. రాజున కాసంగతి యే

తెలియును. కాని యాతని చెంతనే యున్న కైకేయి యాసంగతిని గ్రహించి రాజునకుఁ జెప్పుచుండఁగనే స్యందనాక్షస్థానమునందు దన హస్తమునుంచి రథగమనంబున కెట్టినిరోధమును లేకుండఁ గాపాడెను. అయత్నకృతకృత్యమువలననే దశరథుండు విజయుండై దేవతలవలన వరలాభంబు గాంచి మరల నయోధ్యకుఁ బోవుచుఁ మార్గమధ్యంబునఁ గైకేయి సాహసకృత్యముం గూర్చి తెలిసికొని విస్మితుండై సుప్రసన్న చిత్తంబున నామెకు మూఁడువరంబుల నొసంగెను. కైకేయియుఁ దన యిచ్చవచ్చినప్పు డావరంబులఁ గోరుకొందు నని విన్నవించెను. అప్పుడు దశరథుం డామె ననేకాలంకారములను బారితోషికముగా నొసంగి సుఖంబుగా నిజనగరంబును బ్రవేశించెను. ఉచితసమయంబులయందుఁ బ్రియులచేఁ బ్రియురాండ్రకుఁ బ్రసాదింపఁబడఁదగని దేమున్నది ?

ఒకప్పుడు దశరథుండు కొందఱుమృగయులచేఁ బరివృతుండై వేఁటకొఱకరణ్యంబునకుం బోయి రాత్రికాలంబున నొకజలాశయ స్థానంబున దాఁగి యుండెను. రాజునకు సప్తవ్యసనంబులందగుట యనుచితం బని యెఱింగి యుండియు దశరథుండు జలాగతజంతుసంతానమును వధింప నారంభించెను. కాలవిపర్యయముం గూర్చి నేమని చెప్పఁగలము ? ఆ రాజు విడిసినపర్వతంబునందే శ్రవణుం డను నొక మునీంద్రుని యాశ్రమంబు గలదు. ఆమునియు, నతనిభార్యయును గూడ నంధులును, బధిరులు నైయుండిరి. ఆదంపతులు పుత్త్రునిం బిలిచి ॥ కుమారా ! మాకు దప్పి యగుచున్నది. కాని యీయర్ధరాత్రి యంధకారబంధురమై యున్నది. నీవు బాలుఁడవు. ఏమి చేయఁ గలుగుదువు ? అంధులును, బధిరులు నగువృద్ధులజీవనము హేయమైనది గదా ! జరాజీర్ణదేహుల జీవితంబుకంటె దుస్సహంబగునది యేమున్నది ? సకలాంగకము లను వృథంబులై యూష్మ లప్రతిహతం

బునై యున్నంతవఱకుమాత్రమే మానవులు జీవించుట యుచితము. తరువాత బ్రతికియుండుటకంటెను బుద్ధ్యాతీర్థంబులయందు దేహత్యాగంబు గావించుటయే మేలు" అని విచారించుచుండుటయు విష్ణుభక్తితత్పరుడగునక్కుమారుండు తల్లిదండ్రుల యవస్థకు దుఃఖితుండై మధురభాషణంబులతో "నేను బ్రతికియుండఁగా మీకు విచారమేందులకు? తల్లిదండ్రుల మనఃపీడనమును హరింపఁజాలని తనయునివలనఁ గులమున కేమిప్రయోజనము!" అని చెప్పి మునిపుత్త్రుం డయ్యార్ద్రరాత్రంబునఁ గలశహస్తుండై మెల్లమెల్లగా సరోవరంబు కడకుం జనియెను.

ఆమునికుమారుండు వ్యగ్రభావముతో సరసి నవతరించుచుండుటయు నాచప్పుడాలించి దశరథుం డావైపున కగ్రసరుం డయ్యెను. ఆయిరువురును స్వకార్యమునందు నియతచిత్తులై యుండుటచే నొకరి నొకరు చూచుట లేదు. ఋషికుమారుఁ డతిత్వరితముగా గలశమునందు జలము నింపుకొనుచుండెను. ఆధ్వని నాలించి దశరథుండు గజభ్రాంతిచే శబ్దానుసారంబుగా శరసంధానంబు గావించెను. వనగజము రాజుల కవధ్యంబను ధర్మము నాతఁ [illegible] డై వంచితుండై దశరథుఁ డు[illegible] [illegible] యమోఘశరంబుచే నాహతుండగు మునిబాలకుఁ [illegible] "అయ్యో! స[illegible] హ్మణుండ నగు నాయెడల నిట్టి [illegible] గావించినవా రెవ్వరు? నే నెట్టి యపరాధమును జేసి యెఱుంగనే!" అని యార్తనాదము చేయుచు భూతలపతితుం డయ్యెను. అయ్యార్తస్వరము నాలించి, క్రమంబుగా నవసన్నుం డగుచున్న మునికుమారుం గాంచి దశరథుండు నిరుత్సాహముతో మెల్లమెల్లగా నాతని సమీపించి బ్రహ్మతేజోనిధి యగు నాబాలకుని యవస్థకు దురన్విత శరాహతుండగుచుం బోలి తాను

ను మూర్ఛితుండై దశరథుం గొంతవడికి స్మృతిఁగల్గించుకొని కరుణారసపూర్ణంబు లగువచనంబులతో ॥ ఓద్విజనందనా ! నీవెవ్వరు ? ఈ పాపాత్మునకుఁ దెలిపి యీబ్రహ్మహంతకుని మహాపాపమునకు నిష్కృతి నెఱింగింపుము. బ్రహ్మక్షత్రియవైశ్యశూద్రులజాలమాట యటుండ శ్వపచులైనను బ్రహ్మఘ్నునిదర్శనస్పర్శనంబులు గావింపఁజాలరు. అయ్యా ! నాయపచారంబు సైరించి యనుగ్రహింపుము ” అని ప్రార్థించెను.

ఆమాటలు విని విప్రకుమారుండు ॥ అయ్యా ! నాప్రాణములు పోవుచున్నవి. ఇఁక నేనేమియుఁ జెప్పఁజాలను. నేను నాకొలకు విచారించుట లేదు. నాతల్లిదండ్రులసహాయులగువృద్ధులై యున్నారు. ఇఁక వారిసేవ యెవ్వరు చేయుదురు ? నేను లేక వారిమ్మహారణ్యంబున నెట్లు జీవింపఁగలరు ? నే నెంతనిర్భాగ్యుఁడనో గాని వారి శుశ్రూష గావింపకుండఁ బ్రాణంబుల విడుచుచున్నాఁడను. ఓయీశ్వరా ! ఎంతపని చేసితివి ? ” అని విచారించుచు దశరథునుద్దేశించి ॥ అయ్యా ! విధికృత మైనది. నీవలితీర్థోదకంబుగ నీజలకలశంబు గైకొని నాతల్లిదండ్రులకడకుం బోయి వారిదాహముం దీర్చి బ్రతికింపుము. ” అని చెప్పుచునే యాబాలకుండు గతాసుం డయ్యెను. అప్పుడు రాజు శరశరాసనంబుల విసర్జించి యాజలకలశముం గొని యతివేగంబుగ నావృద్ధదంపతులకడకుం బోయెను. ఆరాత్రివేళయందాదంపతు లిద్దఱు నిస్సహాయులై యడలుచు ॥ అయ్యో ! మనయూరితకొల యగుకుమారుం డింకను రాలేదేమి ? ఎక్కడనైన భయపడియెనో, క్రూరమృగంబులబారిఁ బడెనో, యేమయ్యెనో కదా ! మనమేమి చేయఁగలము ? ఇఁక గతి యేమి ? అట్టికుమారుం డీలోకమునందు మఱియెవ్వఁడున్నాఁడు ! తిట్టినను గూడ వాఁడు మనమాటకెన్నఁడును నెదురాడి యెఱుఁగఁడు. అకటా ! మనకన్నులయు మొలకవి

నమైనది ! కాకున్నచో నింతసేపాసని విడిచి మనప్రాణములు నిలిచి యుండఁగలవా ?" అని యనేకవిధంబుల వాపోవుచుండిరి.

ఆసమయంబున దశరథుండు మెల్లమెల్లఁగా వారిని సమీపించు టయు నడుగులచప్పుడాలించి వారు తమకుమారుండు వచ్చె నని భావించి యాత్రముతో " నాయనా ! ఇంత యాలస్యము చేసితి వేమి ? అంధులమగు మాకు దృష్టిస్వరూపుఁడవు నీవే కదా ! మాకు నీకంటె నాధార మేమున్నది ? మాటాడవేమి తండ్రీ ! అంధులమును, వృద్ధులము నగువారిమీఁద నీకుఁ గోపమా ? " అనిపలుకుచున్నయా మునిదంపతులపలుకులు ములుకులవలె హృదయంబునం దగిలి వేధించుచుండుటయు దశరథుండు తనదుష్కర్మంబును దలంచుకొని పరిత పించుచు భీతచిత్తుండై సంకుచితస్వరంబున " మునివరులారా ! మీతనయుండు సరోవరమునొద్దనే యున్నాఁడు " అని చెప్పెను. ఆమాట విని వారదరిపడి " అయ్యా ! అదేమి ! నీవెవ్వరు ? ఏమిజరిగినదో నిజము చెప్పుము " అని ప్రశ్నించిరి. దశరథుండును క్రమముగా నెల్ల సంగతులను వారికి నివేదించుటయు నమ్మునిదంపతులు దుఃఖావేగముచే భూతలపతితులై " అయ్యా ! నీవు మమ్ముఁగూడ నచ్చటికిఁ దీసికొని పొమ్ము ! మమ్ముమాత్రము ముట్టుకొనవలదు. బ్రహ్మఘ్నుని స్పృశించుట మహాపాతకముగదా " అని వేడుకొనుటయు రాజు వారిని వారిపుత్రుఁడు పడియున్నతావును జేర్చెను.

ఆదంపతు లచ్చట మృతుఁడై పడియున్నసుతుని స్పృశించుచు ననేకవిధంబుల విలపించి రాజునుద్దేశించి " ఓపాపాత్మా ! నీవు మృత్యుమూర్తివై మాకుఁ బుత్రవియోగంబు గల్పించితివి. కావున నీవును బుత్రవియోగదుఃఖముతోనే మృతుండ వయ్యెదవుగాక " అని శపించి ప్రాణంబులను విడిచిరి. అనంతరము రాజు వారికి దహనసంస్కారం

ములు గావింపఁజేసి దుఃఖాంతఃకరణముతో మరలఁ బురంబునకు విచ్చేసి వసిష్ఠమునీంద్రునకు సకలవృత్తాంతమును విన్నవించెను. సూర్యవంశపవిత్రులగు మహీపతులకందఱకును వసిష్ఠుఁడే పరమగతి గావున నాతఁడు బుద్ధిమంతులగు నితరద్విజశ్రేష్ఠులతోఁ గలసి యాలోచించి రాజునుద్దేశించి “దశరథరాజేంద్రా! నీవు గాలవుఁడు, వామదేవుఁడు, జాబాలి, కశ్యపుఁడు మొదలుగాఁగల సకలవిశిష్టశాస్త్రజ్ఞగణంబుల నాహ్వానించి బహుదక్షిణాన్వితంబుగా నశ్వమేధయాగంబు నిర్వర్తింపుము.” అని యుపదేశించెను. దశరథుఁడుకూడ నట్లే యాగంబు గావించెను. ఆసమయంబున దశరథుండు పవిత్రుఁడయ్యె నని యాకాశవాణి వచించెను. మఱియు నాతఁడు వ్యవహార్యుం డయ్యె ననియు, నాతని జ్యేష్ఠపుత్త్రునివలన నాతఁడు నిష్పాపుం డగుననియుఁ గూడ వచించెను.

అనంతరము చిరకాలంబునకు ఋష్యశృంగమునీంద్రునియనుగ్రహంబువలన దేవకార్యసిద్ధికొఱకు దశరథునకు దేవసము లగునలువురుకుమారులు గలిగిరి. కౌసల్యయందు రాముఁడును, సుమిత్రయందు లక్ష్మణశత్రుఘ్నులును, కైకేయియందు భరతుండును జనించి నలువురును జననీజనకులకుఁ బ్రియులగును, వంశవర్ధనులై వర్ధిల్లుచుండిరి. ఒకప్పుడు విశ్వామిత్రుండు రామలక్ష్మణులమహిమ నెఱింగినవాఁడై వారిని దనయజ్ఞరక్షణార్థమై సహాయముగ నొసగవలయు నని దశరథునర్థించెను. కాని రాజు వృద్ధత్వమునందు సంతతిం గన్నవాఁడగుటచే బిడ్డల నమ్మునికర్పింపఁజాలక “మహాత్మా! నేను నారాజ్యమునైనను, శరీరమునైనను మీకు సమర్పింపఁగలను గాని యీకుమారుల నొసగఁజాలను.” అని మనవి చేసెను. అప్పుడు వసిష్ఠుఁడు నవ్వుచు “మహారాజా! రఘువంశీయు లెవ్వరు నెన్నఁడును ప్రార్థనా

భంగము గావించుట నేర్పియుండలేదు'' అని యుగ్గడించుటయు దశరథుం డెట్టకేల కతికష్టముతో రామలక్ష్మణులను విశ్వామిత్రునితోఁ బంపించెను. శ్రీరామలక్ష్మణులును పితృవాక్యానుసారముగా విశ్వామిత్రునితో యజ్ఞసంరక్షణార్థమై బయలుదేఱిరి. అప్పుడు విశ్వామిత్రుండు సంతుష్టుండై రామలక్ష్మణులకు మాహేశ్వరీమహావిద్యను, ధనుర్విద్యను, శస్త్రాస్త్రవిద్యలను రాజయోగ్యంబు లగుసకలవిద్యలను గూడ నుపదేశించెను. రామలక్ష్మణు లట్లు విద్యాలాభంబు నంది వనవాసులహితంబుకొఱకు తాటకి యను రక్కసిని వధించి యహల్యాశాపవిమోచనంబు గావించి యాగవిఘ్నకారులగురాక్షసులనందఱ నిహతులం జేసి విశ్వామిత్రమఖంబును సంపన్నంబు గావించిరి.

పిమ్మట విశ్వామిత్రుండు రామలక్ష్మణులను వెంటఁబెట్టుకొని జనకసందర్శనంబునకై మిథిలానగరంబునకుం బోయెను. అచ్చట రాజమండలమధ్యంబున శ్రీరాముండు లక్ష్మణసహితుండై విచిత్రధనుర్విద్యాప్రదర్శనంబొనరించెను. అందులకు జనకుండు సంప్రీతుండై శ్రీరామచంద్రునకు లక్ష్మీస్వరూపిణియు, అయోనిజయు నగుసీతాదేవిని ప్రదానంబు గావించెను. మహారాజగుదశరథుండు వసిష్ఠమతానుసారంబుగా లక్ష్మణభరతశత్రుఘ్నులకును బరిణయంబులు నిర్వర్తించి మఱికొంతకాలంబు చన్న వెనుక గురుజనానుమతంబున రామచంద్రునకుఁ బట్టాభిషేకంబు చేయ నిశ్చయించెను. ఆసమయంబునఁ గైకేయి దురదృష్టవశంబున మంథరబోధనంబులకు వివశయై శ్రీరామునిఁ బదునాల్గువత్సరంబులు వనవాసంబు చేయించునట్లును, భరతునకుఁ బట్టంబు గట్టునట్లును భర్తను వరంబులుగాఁ గోరుకొనియెను. కాని దశరథుం డావరంబుల నిచ్చుట కంగీకరింపఁ జాలఁడయ్యెను గాని శ్రీరాముఁడే తండ్రి నం

గీకరింపఁజేసి యాతని సత్యప్రతిజ్ఞుం గావించి తాను సీతాసౌమిత్రిసహితుండై వనమధ్యంబునఁ బ్రవేశించెను.

రాముం డిట్లు రాజ్యమునందలియాశను విసర్జించి సీతాలక్ష్మణసహితుండై బహిర్గతుం డగుటయు దశరథుండు దుఃఖాకులితచిత్తుండై బ్రాహ్మణశాపంబు దలంచుకొనుచు శోకావేగముచేఁ బ్రాణత్యాగంబు గావించెను. అతఁడు కర్మవశంబున యమదూతలచే నాకర్షితుండై యమభవనంబు జేరవలసినవాఁడయ్యెను. అచ్చట నతిఘోరంబులును, భీకరంబులు నగుననేకనరకంబులు గలవు. దశరథుం డానరకంబు లన్నిఁటియందును గ్రమక్రమముగా నిక్షిప్తుండై యనేకవారంబు లనేకవిధంబులుగ వేధింపఁబడుచుఁ బాపఫలభోగంబు గాంచుచుండెను. రాముండును వనాభిముఖుండై పోయిపోయి చిత్రకూటంబున నివాసంబు గావించుకొనియెను. అతఁడచ్చటనే మూఁడువత్సరంబు లుండెను. పిమ్మట నాతఁడు దండకారణ్యంబునఁ బ్రవేశించెను. సకలప్రదేశంబులయందు నీదండకారణ్యమే యధికపుణ్యప్రదమైనది. శ్రీరామచంద్రుఁ డందుఁ జేరి యచ్చటి రాక్షసుల నందఱను సంహరించి దైత్యభయంబు వాపుటయు నది మహర్షులకుఁ బునఃప్రవేశయోగ్యం బయ్యెను. రాముం డిట్లు పంచయోజనంబు లతిక్రమించి గౌతమిం జేరుకొనియెను. అప్పటికి దశరథుండు నిరయంబున నుండెను. యముండు తనకింకరులం గాంచి "దశరథకుమారుం డగురాముం డిప్పుడు గౌతమీతటంబునకుఁ బోవుచున్నాఁడు. అతఁడు గౌతమికిఁ బంచక్రోశంబు లతిక్రమింపకుండునంతెపటికును మీరు దశరథుని నరకమునుండి వెడలించి తీసికొని రండు! ఇఁక నాతని నరకమునం దుంచఁగూడదు. ఈనాపుణ్యాదేశమున్న బాలింపకున్నచో మీరును నరకపతితు లగుదురు. ఏకయు, నిత్యయు, శివస్వరూపయు నగుశివసంబంధపరాశక్తి జలాకారంబునఁ బరిణమించి గౌతమీ

రూపిణియై యున్నది. అది హరిహరబ్రహ్మాదులకుఁగూడ మాన్య యైనది. దానిం దిరస్కరించినదోషమున కెవ్వరివలనను నిష్కృతి గలుగదు. గౌతమీస్మరణమాత్రంబు గావించు పుత్రునివలన నెంతటిపాపాత్ముండైనను దుర్గమనరకంబునుండి యుద్ధరింపఁబడును. అట్టిచో రామునివంటిపుత్రుఁడు గౌతమీతీరమునందుండఁగా నాతనితండ్రిని నరకమునం దుంపఁగలశక్తి యెవ్వరికున్నది?" అని యాజ్ఞాపించుటయు యమకింకరులు నరకపచ్యమానుండగు నయోధ్యాపతిని నరకమునుండి వెడలించుచు "ఓరాజసింహా! రామునివంటిపుత్రునిం గాంచిననీవు ధన్యుఁడవు. అట్టిసత్పుత్రు నెవ్వరు పడయఁగలరు?" అని కీర్తించిరి. దశరథుండు నొకించుక విశ్రాంతుఁడై "ఓకింకరులారా! ఘోరనరకయాతనలఁ గాంచుచున్ననన్నింతలోనే తప్పించి రక్షించుటకుఁ గారణమేమో దయయుంచి తెల్పవలయును" అని ప్రార్థించుటయు సందోకశాంతచిత్తుండగు కింకరుండు "ఓరాజేంద్రా! నీకుమారుండగుశ్రీరాముం డిప్పుడు గౌతమీతీరంబునం దున్నాఁడు. అందుచేనీకు ఘోరనరకవిముక్తి లభించినది. ఈగౌతమీమహత్వము వేదశాస్త్రపురాణాదులయందుఁ బ్రశంసితమైయున్నది. దానినిప్పుడు నీతనయుండు సువ్యక్తము గావించెను. ఇప్పుడు శ్రీరాముండు లక్ష్మణసహితుండై నిన్ను స్మరించుచుఁ బిండప్రదానంబు గావించినచో నీవు సర్వపాపవిముక్తుండవై స్వర్గంబుఁ జేరఁగలవు." అని చెప్పెను.

అది విని దశరథుండు "మహాత్ములారా! నేను మీకు శరణాగతుఁడను. మీయనుజ్ఞ యైనచో నేనిప్పు డచ్చటికిం బోయి మీవాక్యములను నాకుమారులకు బోధించి వచ్చెదను" అని ప్రార్థించి వారి యనుమతిం గాంచి యప్పటి తనభీషణయాతనామయశరీరముం గాంచి తానే లజ్జితుం డగుచు నింతకుఁ గారణంబైనతనపాపకర్మంబును స్మరిం

చుకొనుచు గౌతమీతటంబునకు బయలుదేఱెను. అప్పుడు సీతారామ లక్ష్మణులు నదీతీరంబున విలాసవిహారంబు గావించి పదంపడి యథావిధిగ స్నానంబుచేసి తీరంబున నుపవసించియుండిరి. ఆనాఁడు తీరవాసులెవ్వరికిని గూడ నెట్టియాహారంబును లేకయుండెను. అది చూచి లక్ష్మణుండు విచారముతో రాముని గాంచి "సోదరా! మనము దశరథరాజేంద్రుని తనయుల మైయుండియు మనకును, మనతోడి తీర్థవాసులకును దగినయాహారమును సమకూర్చుటకుఁగూడ శక్తి లేనివార మైతిమిగదా!" అనియెను. రాముండును విచారముతో "వత్సా! లక్ష్మణా! విధివిహితంబు లగుకర్మఫలంబుల నెట్టివారైన ననుభవింపక తప్పదు. కాకున్న నీధాత్రి యన్నపూర్ణమై యున్నను మనకీయన్నాభావ మెందులకు? మనము నిశ్చయముగా విప్రముఖంబున హోమము చేయలేదు. అజ్ఞానవశంబున భూదేవార్చనంబును, సంతర్పణంబును జేయఁజాలనివారు సర్వదా క్షుత్పీడితు లగుచుందురు. కావున నవశ్యముగా నగ్నిహోత్రంబు గావింపవలయును. అందువలన మనకన్నంబు లభింపఁగలదు." అని పలుకుచుండఁగా నాసమయమునకు సరిగా దశరథుం డచ్చటికి విచ్చేసెను.

లక్ష్మణుం డాతనివికృతాకారముం గాంచి ధనువు నాకర్షించి "ఓక్రూరరాక్షసా! ఆఁగుమాఁగుము!" అనియెను. అయినను దశరథుం డాఁగక వచ్చుచుండుటం గాంచి యాతఁడు శరణాగతుం డగునని భావించి "ఓయీ! పొమ్ము! పొమ్ము! ఇచ్చట దశరథాత్మజుండును, ధార్మికుండునగు శ్రీరామచంద్రుండు విరాజిల్లుచున్నాఁడు. గురుభక్తుఁడును, సత్యసంధుఁడును, విప్రసేవకుండును, త్రైలోక్యరక్షాదక్షుండు నగునామహాత్ముఁ డున్నచోటికి నీవంటిపాపాత్ములు రాఁజాలరు." అనియెను. పుత్రుం డిట్లు వచించుటయు దశరథుం డించుకసేపు తన

యంతరంగంబునఁ దనదుష్కర్మంబునుగూర్చి విచారించి మనఃపరితాపముతో నధోముఖుండై గద్గదస్వరంబునఁ గోడలగుసీతాదేవి నుద్దేశించి „ అమ్మా ! నేను దశరథుఁడను. ఓకుమారులారా ! నేను మూఁడు బ్రహ్మహత్యాపాపములచే నావృతుండనై యతిదుస్సహంబు లగుఘాతనలఁ బడుచున్నాఁడను. ఇదిగో ! నరకపతితంబగునాదేహ మెట్లు భిన్నభిన్నములై యున్నదో చూడుఁడు ! ” అనుచుండఁగనే సీతారామలక్ష్మణులు ముగ్గురు నాతనికి సాష్టాంగప్రణామంబు లాచరించి కృతాంజలిపుటులై „ మహారాజా ! అదేమి ? అదేమి ? ” అని భయాశ్చర్యములతోఁ బ్రశ్నించుటయు దశరథుండు తనదుష్కర్మముంగూర్చి వారి కెఱింగించి „ కుమారులారా ! బ్రహ్మహంతకుని దర్శించుటకూడ మహాపాపము!” అని పలుకుచు శోకావేగముచే భూపతితుం డయ్యెను. సీతారామలక్ష్మణులును దుఃఖభరంబుచే మూర్ఛితులై పోయిరి. అప్పుడు శ్రీరాముండు తనవనవాసమును, తల్లులదురవస్థయు, దుఃఖహేతువగు కర్మఫలంబువలనఁ దండ్రియగుదశరథునినరకపతనమును దలఁచితలఁచి మూర్ఛితుం డగుటయు సీతాదేవి యాతని నాశ్వాసించుచు „ నాథా ! మీవంటివారు వ్యసనాదులకు లోఁబడఁదగినవారు కారు. వ్యసనము దైవకృతమైనను, మానవకృతమైనను దానికిఁ బ్రతీకారముం గావించుటయే మీవంటివారి కవశ్యకర్తవ్యము. సహస్రయుగములు దుఃఖించినను విపద్విముక్తి కాఁజాలదు. కావున విచక్షణు లగువా రెన్నఁడు మోహాముగ్ధులు గాఁబోరు. ఓ నృపవర ! ఇట్టివో నిష్ఫలం బగుదుఃఖమువలన నేమిప్రయోజనము ? మామగారిబ్రహ్మహత్యలను మనము భరింతము. ముందుగా పితృభక్తుండును, పుణ్యశీలుండును, వేదపారగుండు నగు బ్రాహ్మణునిఁ జంపినపాపమును నేను వహించెదను. తరువాత యథావిధిగాఁ బాపనిష్కృతికిఁ బ్రయత్నించెదను. రెండవబ్రహ్మహత్యను

లక్ష్మణుండు పరిగ్రహించుఁగాక! మూఁడవదానిని మీరు గైకొనుఁడు!"
అని చెప్పెను.

ఇట్లు ధర్మయుక్తంబులును, దృఢనిశ్చితంబులు నగు సీతాదేవివచనంబు లాలించి రామలక్ష్మణు లట్లే యని యంగీకరించిరి. అప్పుడు దశరథుండు ,, అమ్మా! బ్రహ్మవిదుండగు జనకభూపాలుని తనయవగుసీవయోనిజవగుటయే గాక శ్రీరామచంద్రుని యిల్లాలవైతివి. ఇట్టినీవచనంబులు ధర్మసంగతంబు లగుటయందు విచిత్రమేమున్నది? కాని మీరీ విషయంబున నించుకంతయైనను శ్రమపడ నక్కఱలేదు. మీరీగోదావరియందు సుస్నాతులై పిండప్రదానంబు గావించినచో నేను బ్రహ్మహత్యాత్రయవిముక్తుండనై స్వర్గగమనంబునకు సమర్థుండ నగుదును. ఓజానకీ! నీవు స్వకులోచితంబుగ సంభాషించితివి. కులకాంతలు భవసాగరతరణులు. ఈగౌతమీప్రసాదమున నాకుఁ బరసాధనంబుగావించుట యెంత!" అని సంకీర్తనంబుగావించెను.

శ్రీరామచంద్రుం డట్లే చేయుదు నని పిండప్రదానంబున కుద్యుక్తుం డయ్యెనుగాని భక్ష్యభోజ్యాదిపదార్థము లేవియు నాతని కచ్చట లభింపవయ్యెను. అప్పుడు లక్ష్మణుండు ,,అగ్రజా! ఇచ్చట నింగుదీఫలంబులు విశేషముగానున్నవి. వానిని గొనితెచ్చెదను. ఆపిండితోఁ బిండప్రదానము జేయవచ్చును." అనియెను. ఆమాట విని శ్రీరాముఁడు గంగాతీరమునం దండ్రికిఁ బిండదానంబు గావించుట విధాయకంబైనను గారపిండితోఁ బిండదానము చేయవలసివచ్చెనుగదా యని మిగుల విచారించెను. అప్పు డాకాశవాణి ,, ఓరాజకుమారా! నీవెంతమాత్రమును విచారింపవలదు. నీవు ధనలోభంబు లేని ధర్మనిరతుండవు. ఐనను నీవిప్పుడు రాజ్యభ్రష్టుఁడవును, వనవాసివి నిర్ధనుండవు నైయుంటివి. ఇట్టిస్థితిలో నీక్షేత్రంబున ద్రవ్యాభావంబునుగూర్చి నీవు

విచారించుట యుచితము గాదు. విత్తశాఠ్యంబునఁ గర్మంబు నిర్వర్తించు పాతకియే పతితుం డగును. మానవులు తమకు లభించునన్నంబును నివేదించుటవలననే దేవతలును దృప్తు లగుదు రని శాస్త్రంబులు చెప్పుచున్నవి." అని పలుకుటయు రాఘవుండు యథావిధిగ శ్రద్ధాయుక్తుండై యాక్షేత్రంబునఁ బిండదానంబు గావించెను. ఆపిండము భూపతితంబై నక్షణమునందే పితృశరీరము శవతీర్థంబునఁ బతితం బయ్యెను. ఈక్షేత్రము దర్శనమాత్రంబుననే మహాపాతకముల హరించు నని యప్పుడు రామభద్రునకు విశ్వాసము గలిగెను. అంతలోనే దశరథుండు తేజోమయదివ్యదేహముం దాల్చి దివ్యవిమానారూఢుండును, కిన్నరగణస్తూయమానుండునై వియత్పథంబున విరాజిల్లుచుండెను. ఆతనిచుట్టును విమానారూఢు లగుసకలదేవతలును బరివేష్టించి యుండిరి. అప్పుడా దేవగణమధ్యంబున నాదిత్యునివలె వెలుంగుచున్న తండ్రియగుదశరథుని శ్రీరామచంద్రుఁడు గుర్తింపనే లేకపోయెను. అతఁ డంజలిబద్ధుఁడై యాకసమువంకఁ జూచుచు ,, నాతండ్రి యేఁడీ ? " అని ప్రశ్నింపఁ దొడంగెను.

అప్పుడు సీతాదేవికిని శ్రీరామునకును గూడ వినంబడునట్లు ,, రామభద్రా ! నీజనకుండు బ్రహ్మహత్యావిముక్తుండై వెలుంగుచున్నాఁడు. అదిగో చూడుము ! ఆతని దేవత లెల్లరును స్వర్గమునకుఁ బిలుచుకొని పోవుచున్నారు." అని యాకాశవాణియు ,, ఓరామచంద్రా ! నీవు ధన్యుఁడవు. కృతకృత్యుఁడవు. నీతండ్రికి స్వర్గము లభించినది. తనపూర్వపురుషులను నరకమునుండి యుద్ధరింపఁగలమానవుఁడే ధన్యుఁడు. ఆసుకృతాత్మునిమూలమునఁ ద్రిలోకంబులు నలంకృతంబు లగును. వత్సా! సూర్యసన్నిభుండగు నీజనకునిం దర్శింపుము ! పూర్వ మీతఁడు సర్వసంపన్నుం డయ్యును బాపాత్ముండగుటచే దగ్ధ

ద్రుమంబుం బోలియుండెను. ఇప్పుడు నిష్కించనుండయ్యును సుకృతియుఁ జంద్రమౌళిసన్నిభుండు నై యున్నవాఁడు" అని ప్రబోధించిరి. అప్పుడు దశరథుండు పుత్రునింగూర్చి యాశీర్వాదాభినందనపూర్వకంబుగా "కుమారా! నీవు కృతకృత్యుండ వైతివి. నీకు శుభ మగుఁగాక! ఓయనఘా! నేను నీమూలమునఁ దరింపఁబడితిని. తల్లిదండ్రుల నుద్ధరించుతనయుఁడే లోకమునందు ధన్యుఁడు." అని వచించెను. అనంతరము దేవతలు తమకార్యసిద్ధికొఱకు "వత్సా! నీవు యథాసుఖంబుగ బ్రయాణంబు గావింపుము." అని యానతిచ్చుటయు రాముండు వారిం గాంచి "సురవరులారా! పితృవిషయంబున నేనింకను జేయవలసిన దేమైన నున్నచోఁ దెలుపఁగోరెదను" అని ప్రార్థించెను. అప్పుడు దేవతలు "కుమారా! ఈగంగవంటినదియు, నీవంటిపుత్రుఁడును, శివునివంటిదేవతయును, ఓంకారమువంటిమంత్రంబులును నీజగంబున లేవనియే చెప్పవచ్చును. నీవు పెద్దలకుఁ దీర్పవలసినవిధు లన్నియును దీర్చితివి. నీవంటిపుత్రునిం గాంచినపితృదేవతలు ధన్యులు. ఓమానదా! రామా! నీపితృదేవతలందఱును దరించినారు. ఇఁక మీరందఱును యథాసుఖంబుగఁ బయనంబు సాగింపవచ్చును" అని ప్రబోధించిరి. దేవతలవచనంబులును, గౌతమీమాహాత్మ్యంబును గ్రహించి లక్ష్మణుండు విస్మితుండై సీతారాములం గాంచి "ఆహా! ఈగంగప్రభావ మెంతయద్భుత మైనది! త్రిలోకంబులయందును దీనితో సమానం బగునది లేదు. ఇట్టిత్రిలోకపావని యగుగంగను సందర్శించుటచే మనము ధన్యులము." అని పరమానందముతోఁ బలికెను. అనంతరము రాముండు ప్రహృష్టచిత్తుండై యందు శివప్రతిష్ఠ గావించి షట్త్రింశత్కళాశోభితుండగుశంకరుని పావరణంబుగాఁ బూజించి కృతాంజలిపుటుండై యిట్లని స్తుతియింపం దొడంగెను.

పురాణపురుషుం డగుశంభునకు నమస్కారము. అపారభావుం డగు సర్వజ్ఞునకు నమస్కారము. అవ్యయుం డగుపరదేవునకు, లోకగురుం డగునుమాపతికి, దారిద్ర్యనివారకునకు, రోగాపహారికి, అచింత్యకల్యాణస్వరూపునకు, విశ్వోద్భవబీజరూపునకు, విశ్వస్థితిహేతునకు, విశ్వసంహారకారణునకు నమస్కారము. అవ్యయుం డగుగోబ్రాహ్మణప్రియునకు, క్షరునకు, అక్షరునకు, చిద్రూపునకు, అమేయభావునకు, త్రిలోచనునకు, భవకారుణ్యకరునకు, భవభయంకరునకు శంకరునకు సర్వదానమస్కారము. సర్వాభీష్టప్రదాతకు, సోమేశ్వరునకు, ఉమేశ్వరునకు, వేదత్రయలోచనునకు, మూర్తిత్రయవర్జితునకు, సదసదతీతునకు, పుణ్యాత్మునకు, పాపహారికి నమస్కారము. మఱియు విశ్వహితరతుండును, హరుండును, విశ్వరక్షకుండును, సదసత్ప్రణేతయు, బహురూపియు, విశ్వపతియు, యజ్ఞేశ్వరుండును, హవ్యకవ్యస్వరూపుండును, లోకహితకరుండును, నాకుఁ బరమగతియు నగునీశ్వరునకు నమస్కారము. ఆరాధితుండై సమస్తవాంఛితంబులను బ్రసాదించు దేవునకు, దానప్రియునకు నాయిష్టదైవంబగుశర్వునకు నమస్కారము. సోమేశ్వరుండును, అస్వతంత్రుండును, విజయుండును, ఉమాపతియు, విఘ్నేశ్వరనందీనాథుండును, పుత్రప్రియుండును, భవదుఃఖశోకవినాశకుండును, చంద్రధరుండును, గంగాధరుండును, ఉమాధరుండును, దేవవరుండు నగునీశ్వరునకు నమస్కారము. మఱియు నజాదీశపురందరాదిసురాసురులచే నర్చితుండును, పరదైవతంబును నగుమహాత్మునకు నమస్కారము. దేవీముఖవాసనంబు నీక్షించుటకై నేత్రత్రయంబుఁ గాంక్షించిన నాయిష్టదేవతునకుఁ బ్రణామము. మఱియుఁ బంచామృతములు, చందనము, ఉత్తమంబగు ధూపము, విచిత్రంబులగుపుష్పములు, వివిధఖాద్యములు, ఫలమూలాదులు మున్నగునుపచారంబులచే వివిధమంత్రమూలంబున సంపూజితుం

డగునీసోమదేవునకు సహస్రప్రణామంబులు.”

అని యిట్లు రాముండు సన్నుతించుటయు భగవానుండగు శంభుండు సాక్షాత్కరించి రామలక్ష్మణులంగాంచి “ మీకు శుభంబగుం గాక ! వరంబుల నర్థింపుఁడు ” అని యానతిచ్చుటయు రాముండు వృషభధ్వజు నుద్దేశించి “ సురోత్తమా ! నేను గావించిన యీస్తోత్రరాజంబు నెవ్వఁడు భక్తిపూర్వకంబుగాఁ బఠించి నీకు సంతుష్టింగూర్చునో యాతని కాక్షణంబ కార్యసిద్ధి యగుంగాక ! ఈస్తవంబును బఠించుచు నీక్షేత్రంబునఁ బిండప్రదానంబు గావించువారిపితృదేవతలు నరకలోకోత్తీర్ణులయ్యెదరుగాక ! వారందఱును దాపత్రయవివర్జితులై స్వర్గధామంబు నధిగమింతురుగాక ! ఇచ్చటఁ గావించిన స్నానమాత్రంబున మనోవాక్కాయజంబు లగుసకలకలుషంబులును నశించుఁగాక! ఇట భక్తిపూర్వంబుగఁ గావించినదానం బణుమాత్రంబైనను, అక్షయఫలదం బగుఁగాక! ఇట్లనుగ్రహింపవలయును ’’ అని ప్రార్థించెను. శంకరుండు నట్లే యగు నని శ్రీరామచంద్రు ననుగ్రహించి యంతర్ధానంబు నేయుటయు సీతాలక్ష్మణసహితుం డగురాఘవుండు గౌతమీమూలంబుదిక్కుగాఁ బయనంబు సాగించెను.

ఓనారదా ! అప్పటినుండియు నీతీర్థము రామతీర్థంబనునామంబున వ్యవహరింపఁబడుచున్నది. మార్గమధ్యమున లక్ష్మణునిహస్తమునుండి బాణము పతితంబైనస్థానము బాణతీర్థంబయ్యెను. ఈతీర్థముకూడ సర్వాపద్వినివారకమైనది. సౌమిత్రిస్నానము చేసి శివార్చనంబు గావించినచోటు లక్ష్మణతీర్థంబయ్యెను. అట్లే సీతాతీర్థంబును సముద్భూతంబైనది. ఈరెండుతీర్థంబులును బహుపాపభంజకంబులు. ఎవ్వనిచరణసంగంబుచేఁ త్రైలోక్యపావనియగుగంగ యుదయించెనో యట్టిశ్రీరామచంద్రుఁడు స్వయముగా నవగాహనంబుగావించినతీర్థమునకుఁగలగౌరవ

ము వర్ణనాతీతముగాదా ? అయినను చెప్పవలసివచ్చినది. శ్రీరామతీర్థంబువంటియుత్తమతీర్థము మఱియొందును లేదు.

## — పుత్రతీర్థాదివర్ణనము. —

పూర్వకాలంబున దేవాసురయుద్ధంబునందు దితిజులును, దనుజులును క్షీణించి యాదితేయులకే సర్వవిధములఁ బ్రాధాన్యలాభంబు గలిగెను. అప్పుడు దితి పుత్రవియోగదుఃఖపీడితయై సవతి యగునదితి మొదల నసూయతో దనువుచెంతకుం బోయి “ఓభద్రా! మనయిరువురి సంతానమును వినష్టంబైనది. ఏమిచేయుదుము! లోకంబునఁ గర్మమే బలవంత మైనది గదా! అదితిసంతతి యంతయు సర్వసంపత్సమృద్ధమై రాజ్యము, యశము, విజయమును గలిగి విరాజిల్లుచున్నది. మనకందఱకును సమానభర్తృత్వమున్నను, ధర్మకర్మగుణంబులయందు సమత్వమున్నను అదితిబిడ్డలీవిధముగా సమున్నతిం గాంచుటంగాంచి నేను బ్రదుకఁజాలకున్నాను. ఈదుఃఖముచే నేను కృశించిపోవుచున్నాను. అంతటిభాగ్యవతియగునదితిం గాంచి దావానలంబుచేతనుంబోలె నాహృదయము దహించుకొనిపోవుచున్నది. సవతిసౌభాగ్యమును స్వప్నమునందైనను జూడఁజాలకున్నాను” అని యీవిధముగా నిట్టూర్పులు విడుచుచు మ్లానవదనయై దితి వచించుచున్నసమయంబున నారదుండటకు వచ్చి యక్కాంతలిరువురిచేతను బూజితుండై యించుక విశ్రమించి వారినుద్దేశించి మనోజ్ఞవచనంబులతో “ఓరమణులారా! మీరిట్లు విచారించుట యుచితము గాదు. సకలప్రాణములును దమయభీష్టములను బుణ్యమూలముననే పడయఁగలుగుచుందురు! దాని కుపాయమును మహానుభావుండగుకశ్యపప్రజాపతియే మీకుఁ దెలుపఁగలఁడు” అని బోధించెను.

అప్పుడు తనువు దితిం గాంచి "అక్కా! ఆత్మగుణంబుచే భర్త యగుకశ్యపుని బరితుష్టుం గావింపుము. ఆతఁడు సంతుష్టుం డైనచో సకలాభిమతంబులును లభించును." అనియెను. ఆమాట విని దితి యట్లే చేయుదు నని చెప్పి యప్పటినుండి యనేకవిధంబులగు సపర్యలచే భర్తను సంతృప్తుం గావింప నారంభించెను. ఇట్లుండ నొకనాఁడు కశ్యపుండు దితింగాంచి ప్రసన్నుండై వరంబు గోరుకొమ్మని యానతిచ్చుటయు దితి విస్మయాన్వితయై "ఓసురేశ్వరా! ఎవ్వనిజననంబువలన నేను వీరపుత్రిణిం గాఁగలనో యట్టి సర్వలోకవిజయుండును, సర్వలోకనమస్కృతుండును, బహుగుణాన్వితుండు నగుపుత్రుని నాకుఁ బ్రసాదింపవలయును" అని ప్రార్థించినంతనే కశ్యపుండు "తథాస్తు" అని "ఓదేవీ! నేను నీ కొకపుణ్యవ్రతంబు నుపదేశించెదను. ద్వాదశాబ్దంబులు నీవావ్రతపాలనంబు గావించితివేని యతిమహాఫలదంబు కాఁగలదు. ఆవ్రతశేషంబున నేను వచ్చి నీకు సత్సంతానంబును బ్రసాదించెదను. అప్పుడు నీకోరిక సిద్ధించును. నిష్పాపత్వమును సాధించినచో మనోరథములు సిద్ధించును." అని బోధించుటయు దితి సంతుష్టచిత్తయై పతివలన వ్రతోపదేశంబు గాంచి తదనుష్ఠానంబునఁ బ్రవృత్తయై పతిచెప్పినవిధంబున సమస్తకర్మములను యథావిధిగ నిర్వర్తించుచుండెను. ఈజగంబునఁ దీర్ఘసేవ, సత్పాత్రదానము, వ్రతాచరణము మొదలగుసత్క్రియలు గావింపనివారికి మనోరథసిద్ధి యెక్కడిది?

ఇట్లు దితి వ్రతపాలనంబు గావించుటయుఁ గశ్యపుండు ప్రసన్నుండై వచ్చి యామెకు గర్భంబుఁ బ్రసాదించి "ఓశుచిస్మితా! తపోనిరతులగు మునులకుఁగూడ నవహేలావశంబునఁ గర్మవైకల్యంబు హేతువుగా నభీష్టంబు లభింపకపోవుచుండును. కావున నీవు సంధ్యాకార్యంబులు విసర్జించి యుభయసంధ్యలయందు శయనంబును, గమనం

బును, క్షుతంబును, జృంభణంబును, ముక్తకేశియైయుండుటను గావింప కుండవలయును. సంధ్యలయందు భూతసముదయం బిటునటుఁ జరించు చుండుఁగావున నప్పు డొకవేళ నవ్వువచ్చినచో ముఖాచ్ఛాదనంబు గావించుకొని హసించుట కర్తవ్యము. సంధ్యాకాలంబున గృహాంతదేశంబునం దెప్పుడును నిలువఁగూడదు. దివారాత్రులయం దెప్పుడైనను రోలు, రోకలి, చేట, పీట, మొదలగువానిని దాటఁగూడదు. ఉత్తర శీర్షంబుగ నెప్పుడును శయనింపఁగూడదు. విశేషించి సంధ్యాసమయంబున మిథ్యావచనంబు లాడుటయు, బరగృహంబులకుఁ జనుటయుఁ దగదు. నిజకాంతునిదక్క నన్యపురుషు నెన్నఁడు నిరీక్షింపఁజనదు. నీవీ నియమంబులను యథావిధిగ నిర్వహింపఁగలిగినచో నీకుఁ ద్రిలోకైశ్వర్యభాజనుం డగుపుత్రుం డుదయింపఁగలఁడు'' అని బోధించెను.

లోకపూజితుండగుతనభర్త బోధనంబు లాలించి దితియు నట్లే చేసెదనని యంగీకరించెను. అంత కశ్యపుం డటనుండి వెడలిపోయెను. క్రమముగా దితి గర్భము ప్రవృద్ధం బగుచుండెను. ఈరహస్యం బంతయు మయదానవునకుఁ దెలిసెను. ఆతని కింద్రునితో మిగుల సఖ్యంబు గలదు. అందుచే నాతఁ డెల్లవిషయములు నింద్రునకు నివేదించెను. మిత్రుండనిన నపాయత్రిసవర్జితం బగువిశ్వాసైకభవనంబు గదా! బహుసుకృతవిశేషంబునఁగాని యట్టిమిత్రుండు లభింపఁడు.

అని బ్రహ్మదేవుండు చెప్పుటయు నారదుండు ,,మహాత్మా! మయదానవుండు నముచిభ్రాతగదా! అట్టినముచిని వధించిన యింద్రునితో నాతనికి మిత్రత్వం బెట్లు కలిగినది?'' అని ప్రశ్నించుటయు బ్రహ్మ యిట్లు చెప్పం దొడంగెను. పూర్వము బలవంతుం డగు నముచి దైత్యచక్రంబున కధీశ్వరుండై యింద్రునితో మహాభయంకరం బగువైరమును గల్పించుకొని యొకప్పుడు మహారణంబున మహేంద్రుని విజితు

సింగావించెను. అట్లు పరాజితుండై యింద్రుండు పాఱిపోవుచుండ శూరుండగు నముచి యాతని వెంబడించెను. ఆతనిం గాంచి శతక్రతుండు భీతుండై యైరావతంబును బరిత్యజించి జలఫేనమధ్యంబున దాఁగికొనియెను. ఐనను నముచి తనయన్వేషణంబు విడువకుండుటచే శచీవిభుం డాతని ఫేనంబుచేఁ బ్రహారాఘాతంబు గావింప నారంభించెను. ఆ ఫేనాహతిచేతనే తుదకు నముచికి వినాశంబు సంప్రాప్తించెను. అనంతర మాతనితమ్ముఁడగు మయుండును భ్రాతృహంత యగు మహేంద్రుని వినాశంబుఁగోరి తపంబు సేయ నారంభించెను. అతండు విష్ణుదేవు నారాధించి యద్దేవునివలన ననేకవరంబులం గాంచి తత్ప్రభావంబువలన దేవతల కతిభయంకరంబు లగు ననేక మాయల నెఱింగి యతిదాతయు, సదాలాపియు నై యుండెను. అతఁడు నిరంతరము నగ్నిదేవుని, బ్రాహ్మణులను బూజించుచుండెను. కొంతకాలంబున కాతండును దేవేంద్రునిజయించు నుద్దేశముతో సర్వోత్కృష్టుండై తత్కాలంబున వందిజనస్తూయమానుండగుచు నర్థుల కనేకవిధంబుల ధనవితరణంబు గావించుచుండెను. ఆసంగతి వాయుదేవునివలనఁ బురుహూతుం డెఱింగి మాయామయుం డగుమయు నెట్టియిన మాయచేతనే పరాజితునిం గావింపవలయుననునుద్దేశముతో విప్రవేషంబుదాల్చి యాతనిచెంతకుం బోయి దర్శించి ,, ఓయాచకపాలకా ! నేను యాచకుండను, నాయభీష్టంబు దీర్పుము ! నీవు దా[illegible] దిలకస్వరూపుండ వని విని సద్బ్రాహ్మణుండ నగునేను నీదర్శనంబునకు వచ్చితిని. ” అని మాటిమాటికిని బ్రార్థింపనారంభించెను. అది విని మయుం డాతఁడు బ్రాహ్మణుండనియే భావించి ,, ఓయీ ! నీకేమికావలయునో కోరుకొనుము. అర్థులెదుట నిలిచి యుండఁగా సాధువులగుదాతలు వారికోరికలకొలఁదిగొప్పతనములంగూర్చి సంశయింపఁబోరు. ” అని చెప్పుటతోడనే యింద్రుండు ,, అయ్యా ! నేను మీతోడి స్నేహమునుగోరివచ్చితిని. ” అనియెను.

ఆమాట విని మయుండు " ఓద్విజోత్తమా! ఇందువలన నీకుఁగలుగు లాభమేమి ?" అనియెను. " నీతో వైరములేకుండుటయే నాకు లాభము. నీకు శుభమమగుఁగాక!" అని యింద్రుండు ప్రత్యుత్తర మిచ్చుటయు మయుండు నీవెవ్వఁడవో సత్యము వచింపుమనియెను. ఇంద్రుండప్పుడు తనసహస్రాక్షమూర్తిం బ్రదర్శించెను. అది చూచి మయుండు విస్మితుండై " ఇదేమి! వజ్రపాణియగు మహేంద్రుఁడా? ఓసఖా! ఇట్టికార్యము నీవంటివాని కయోగ్యమైనది." అనియెను. అప్పు డింద్రుండు మయు నాలింగనంబు గావించుకొని " మిత్రమా! బుద్ధిమంతు లగువారేవిధముచేనైను గార్యసిద్ధి గావించుకొందురు" అని చెప్పెను. అదిమొదలుగా వారిరువురును బరమమిత్రులైరి. అంతటినుండి మయుండు మహేంద్రహిత నిరతుండై యుండెను.

ఇట్లు మయుండు దివిజపతిభవనంబునకుం జని దితివృత్తాంతంబు సకలంబు నివేదించుటయు సురేశ్వరుండు మాయావి యగుమయుం గాంచి ఇప్పుడు మనకుఁ గర్తవ్యం బేమని ప్రశ్నించెను. అప్పుడు మయుం డాతనికి మాయాప్రదానంబు గావించెను. అంత నింద్రుండు ప్రహృష్టుండై " దీనివలన నేనేమి చేయవలయును" అని ప్రశ్నించుటయు మయుండు "నీవిప్పు డగస్త్యాశ్రమంబునకుం బోయి యట గర్భిణియైయున్న దితిం దర్శించి యామెకు సపర్యలం గావించుచు నటఁ గొన్ని దినంబులుండుము. అవకాశము చూచుకొని వజ్రపాణివై యామెగర్భంబునఁ బ్రవేశించి యాపిండము నీకు వశీభూతంబును, మృతంబునగునంతవఱకు నీ వజ్రముతో భేదింప నారంభింపుము. అట్లయినచో నీకు శత్రుం డగువాఁడు జనియింపఁబోఁడు" అని చెప్పెను. ఇంద్రుండు నట్లే చేసెదనని చెప్పి మయున కనేకసత్కారంబులఁ గావించి యేకాకియై వినీతవేషంబున విమాత యగుదితిచెంతకుం బోయి సరళమార్గంబున నామెకుఁ

బరిచర్యలం గావించుచుండెను. అతనిమరుద్దేశమును దితిదేవిగాని గర్భస్థపిండముగాని తదితరులెవ్వరుగాని గ్రహింపఁజాలకపోయిరి.

సహస్రాక్షుండును దితిగర్భంబునఁ బ్రవేశించు కోరికతోఁ జాల కాల మచ్చట నివసించియుండెను. కాని యాతని కెట్టియవకాశమును లభింపలేదు. ఇట్లుండ నొకనాఁడు దితిదేవి సంధ్యాసమయంబున నుత్తర శిర్షంబుగా శయనించి నిద్రించుచుండ నిదియే తగినసమయమని యింద్రుండు కులిశహస్తుండై యామెగర్భంబునఁ బ్రవేశించెను. అప్పుడు గర్భస్థబాలుం డాతనిం గాంచి నిర్భయముగా ,,ఓవజ్రపాణీ! నన్నేల రక్షింపఁగూడదు? నేను నీకు సహోదరుఁడను గానా? నన్నేల చంపఁ దలఁచెదవు? ఓమహాబాహూ! యుద్ధక్షేత్రంబునఁ గాకుండ నితరస్థలంబున మారణంబు గావించుటకంటె మహాపాతకం బేదియును లేదు. ఓ శక్రా! నేను గర్భమునుండి నిర్గతుండ నైనంతనే నీతో యుద్ధము చేసెదను. అంతేకాని యిచ్చట నన్ను వధించుట నీవంటివాని కుచితము గాదు. నీవు శతక్రతుఁడవు; సహస్రాక్షుఁడవు; శచీవిభుఁడవు; పురందరుఁడవు; వజ్రపాణివి; సురేంద్రుఁడవు——ప్రభూ! ఇట్టినీ వింతటినీచకృత్యము గావించుట తగదు. నీవు నిశ్చయముగా యుద్ధకాముఁడ వైతివేని నేను గర్భమునుండి వెలువడునట్టి యుపాయముం గావింపుము. ఇట నుండి వెడలిపొమ్ము! మహాత్ములగువారు విపన్నమగ్నులయ్యును దుష్టాచార్యప్రవృత్తులు గాఁజాలరు. నేనజ్ఞానుఁడను; అశస్త్రుఁడను; ఇచ్చట నాకాయుధసంగ్రహంబునకుఁగూడ నుపాయంబులేదు. ఇట్టియవస్థలో నోవజ్రపాణీ! నీవు విద్యావంతుఁడ వైయుండియు నన్నుఁ జంప వచ్చితివా- నీకు సిగ్గులేదా? కులీనులగువా రెన్నఁడును గర్హితకర్మంబుల నాచరింపరు. ఇట్టినన్నుఁ జంపుటవలన నీకెట్టి పౌరుషము లభించును. ఎట్టి కీర్తి కలుగునని యోసించితివి? గర్భస్థులగుభ్రాతలను జంపుదురా తమ్ము లె

స్వర్గైన నుందువా ? అన్నా ! నీకు నాతో యుద్ధము చేయవలయునని వాంఛయే యున్నచో—" అని చెప్పుచు నాబాలకుఁడు పిడికిలి బిగించి యింద్రునిపైకి లంఘించెను. అప్పు డింద్రుం డుగ్రుఁడై తనకులిశంబుచే నాతనిసప్తఖండంబులుగావించెను. క్రోధాన్వితులగునాబాలకు లయ్యును వది యుండడుగదా ! అంతమాత్రముచే నాగర్భము మరణింపక యాఖండములు "అన్నా ! మేము నీసోదరులము" అని వచింప నారంభించెను. శక్రుం డామాటలను లక్ష్యము చేయక యందొక్కొక్కఖండము నేడేసితునియలుగా ఖండింపఁదొడంగెను. ఆశకలంబు లన్నియు నైకకంఠ్యముగా "శతక్రతూ ! మేము మాతృగర్భస్థులము; నీతమ్ములము; మమ్ము వధింపవలదు." అని వాపోవఁదొడంగెను. ద్వేషవిధ్వస్తహృదయు లగువారిచిత్తంబునఁ గరుణకుఁ దావుండదుగదా ! ఇంద్రుం డీవిధంబుగా నిష్కరుణుండై యాగర్భస్థపిండమును నలువదితొమ్మిదిఖండంబులు గావించినను ఆశకలంబులు మరణింపక సజీవంబులై కరపాదాదిచిహ్నంబులతో నేకాకృతిం దాల్చి యేడ్చుచుండెను. వానింగాంచి సురపతి విస్మితుండై "మారుత, మారుత" అని ప్రబోధింపఁదొడంగెను. అక్కారణంబుననే వారందఱును మారుతులైరి. అక్కుమారులు మిగులబలవంతులు, నోజస్వంతులు నై యుండిరి. వారట్లు గర్భమధ్యమునందే యుండి శక్రునకై భయపడక తమతల్లి కాశ్రయభూతుం డగునగస్త్యమునీంద్రు నుద్దేశించి "ఓమునీంద్రా ! మాతండ్రి నీకు భ్రాతయైయుండెను. ఆతఁడు నీతోడిస్నేహము ప్రశంసనీయం బని తలంచెను. నీకును మాయందుఁగలప్రేమ యపారమైనది. ఇదిగో ! చూడుము ! ఈవజ్రపాణి చండాలుండైనను జేయఁజాలని దుష్కృత్యముం గావించుచున్నాఁడు." అని విన్నవించిరి.

ఆగస్త్యుం డీసూక్త్యాలాపం బాలకించి ససంభ్రముండై యచటికి

వచ్చి గర్భవేదనావ్యథిత యగుదితిని సంబోధించి యూఱడించి శతక్రతునిమెడలఁ గుపితుండై ,, ఓయింద్రా ! నీవెల్లప్పుడును రణరంగముల యందు శత్రువులకు వెన్నుచూపెదవు గాక ! అట్లు రిపులకు వెన్నిచ్చు యోధునిజీవితముకంటె మరణమే యుత్తమమైనదిగదా !'' అని శపించెను. అప్పుడు దితియు నీవృత్తాంతం బంతయు గ్రహించి ,, ఓరీసహస్రాక్షా ! నీవు పురుషోచితం బగుకార్యంబు గావింపలేదు. అందుచే నీవు స్త్రీజనపరిభవంబున రాజ్యభ్రష్టుండ వయ్యెదవు గాక ! '' అని శపించెను. ఇంతలోఁ గశ్యపుం డచ్చటికి వచ్చుటయు శక్రుండు దితిగర్భంబుననే యుండి భయప్రకంపితుండగుచు ,, తండ్రీ! నేనగస్త్యభయంబునను, దితిభయంబునను గర్భమునుండి వెలువడఁజాలకున్నాను.'' అని విన్నవించెను. కశ్యపుం డప్పుడు తనపుత్రునిదారుణకర్మంబును, గర్భవాసంబును, దిత్యగస్త్యులశాపంబును గ్రహించి వ్యథితహృదయుండై యింద్రునుద్దేశించి ,, కుమారా ! వెడలిరమ్ము ! ఎంతదుష్కర్మమ్ముం గావించితివి. సత్కులోత్పన్ను లగువా రిట్టిపాపమును మనసునందైనఁ బెట్టుకొనఁజాలరు'' అనిన నింద్రుండు లజ్జితుండై దితిగర్భంబు వెలువడి వచ్చి తండ్రియెదుటఁ దలవంచికొని నిలువఁబడియెను. ఆకారణముం బట్టియే పుణ్యపాపకర్మంబులు ప్రకటితంబు లగుచుండును గదా !

అప్పు డింద్రుండు తండ్రిం గాంచి ,, మీరిప్పుడు చెప్పినట్లు చేసెదను. అందుల కెట్టిసంశయంబును లేదు '' అనియెను. అంతఁ గశ్యపుండు లోకపాలకసహితంబుగా సకలదేవతలును దన్నుఁ బరివేష్టింప బ్రహ్మచెంతకుం బోయి సకలవృత్తాంతంబును నివేదించి దితికి గర్భశాంతియు, నింద్రునకు శాపమోచనంబును, గర్భస్థబాలకుల కాతనితోడి మైత్రియు నక్కుమారులకారోగ్యంబును, సహస్రాక్షునకు దోషచ్యుతియు, నగస్త్యునిశాపంబునకుఁ బరిహారంబును గటాక్షింపవలయు నని ప్రా

ర్థించుటయుఁ బద్మగర్భుండు ,, ఓకశ్యపప్రజాపతీ ! నీవిప్పుడు వసులోక పాలగణసహితంబుగా నిందు్రని గౌతమీతటంబునకుఁ గొనిపోయి యందు స్నానంబు చేయించి యీశ్వరస్తవంబు సేయింపుము. అమ్మ హాదేవునియనుగ్రహంబున సకలశుభంబులును జేకూరఁగలవు. ” అని సూనతిచ్చెను. కశ్యపుండు నాక్షణంబ వారిందోడ్కొని గౌతమికిం జని బ్రహ్మవచనపరికారంబు గావించెను. పుణ్యనదియగు గౌతమియు కరుణాకరుం డగుశివుండును సర్వదుఃఖాపనోదనంబునకుఁ బ్రసిద్ధులుగా శాస్త్రంబులు గీర్తించుచున్నవి. అప్పుడు కశ్యపుండు మహాదేవు నిట్లని వినుతింపం దొడంగెను. ,, ఓదేవేశా ! శంకరా ! రక్షింపుము. లోకన మస్కృతా ! పావనా ! పన్నగభూషణా ! వాగీశా ! రక్షింపుము. ధర్మ స్వరూపా! వృషధ్వజా! వేదత్రియలోచనా రక్షింపుము. గోఘరుండవు, లక్ష్మీశుండవు, గజచర్మాంబరుండవు, శర్వుండవు, సోమార్కభూషణుం డవు, త్రిపురఘాతివి, యజ్ఞేశ్వరుండవు, సోమేశ్వరుండవు, అభీష్టప్రదా యకుండవు, కారుణ్యనిలయుండవు, మంగళదాయకుండవు, సర్వభూతప్ర భవుండవు, పాలకుండవు, వాసవుండవు, భాస్కరుండవు, విత్తేశ్వరుండవు, బ్రాహ్మణనమస్కృతుండవు, విశ్వేశ్వరుండవు, సిద్ధేశ్వరుండవు, పూర్ణుం డవు, కృపాసింధుండవు, నగుసీవు మాయెడలఁ బ్రసన్నుండవగుము. ఓప రమేశ్వరా ! ఘోరంబగుసీసంసారం బనుకాంతారంబునఁ జరించుచుండు సకలజీవులకును నీకంటె దిక్కెవ్వరున్నారు ? అట్టినీకు నమస్కారము ” అని ప్రార్థించెను.

అంతలో వృషభధ్వజుండు కశ్యపునకు సాక్షాత్కరించి వరంబు గోరుకొమ్మనియెను. అప్పుడు కశ్యపుండు వినీతభావంబున నిందు్రనిచ ర్యయంతయు నివేదించి శక్రశాపంబును, ఆతనిపాపంబును, భావిరాజ్య వినాశంబును, దనపుత్రులలోని పరస్పరవైరంబును, శమించునట్లు ప్రా

క్షించెను. అంత శివుండు ప్రసన్నుండై దితిదేవిని, అగస్త్యమునీంద్రుని నుద్దేశించి ,, ఓదితీ ! నీకుమారులందఱును మరుత్తులు గాఁగలరు. వారందఱు నింద్రునకు మిత్రులును యజ్ఞభాగులును నగుదురు. యజ్ఞంబులయం దింద్రునకు భాగంబిచ్చునప్పుడు ముందుగా మరుద్గణంబులకు భాగంబు కల్పితం బగుఁగాక ! ఈమరుద్గణసహితుం డగునింద్రుని శత్రువు లెవ్వఁడును జయింపఁజాలరు. కేవల మింద్రుఁడే విజయుండు గాఁగలఁడు. ఓకశ్యపా ! నీవు సుఖంబుండుము. ఇంతటినుండి భ్రాతృహత్యకు వొరకొనుపాపాత్ములకు వంశవిచ్ఛేదంబును, మాటిమాటికి విపన్నిమగ్నతయుఁ దటస్థించుచుండుఁగాక!'' అని యానతిచ్చి యాశ్వరుం డగస్త్యుంగాంచి ,,మునీంద్రా! నీవీయింద్రునియెడలఁ గోపంబు నుపసంహరింపుము. ఓమహాప్రాజ్ఞా! శాంతింపుము! ఈమరుత్తు లమరు లగుదురుగాక!'' అనిచెప్పి శివుండు మఱియును బ్రసన్నచిత్తముతో దితిం గాంచి ,, ఓదేవీ! నీవు త్రైలోక్యైశ్వర్యమండితుం డగు నొకపుత్రుండు గావలయునని కోరి పుణ్యవ్రతాచరణంబు గావించితివి. అట్టినీకోరిక యిప్పుడు సఫలం బైనది. శుభదర్శనులును, బలవంతులును, శూరులును, విశిష్టగుణవంతులు నగుబహుపుత్రులు నీకు లభించి యున్నారు. కావున నీవిఁక విచారింపవలదు. ఓసతీమణీ! నీకింకను గావలసినదేమైన నున్నచో వర్ధింపుము'' అని యానతిచ్చుటయు దితిదేవి కృతాంజలియై మహాదేవునకు నమస్కారంబుఁజేసి ,,ఓసురపూజితా! లోకమునఁ దల్లిదండ్రులలో విశేషించి తల్లికే పుత్రదర్శనము ప్రియకరమైనది. అట్టిస్థితిలో శౌర్యవిక్రమసంపన్నుఁడగు సత్పుత్రుఁ డుదయించినచో దల్లికెంతిసంతోషమో చెప్పవలయునా? అట్టిబహుపుత్రులను నాకుఁ బ్రసాదించిన నీకృపామహిను నెంతనివర్ణింపఁగలను? ఈనాబిడ్డలు నీకరుణచే బలవంతులును, విజయులు నగుదు రనుట కెట్టిసంశయమును లేదు. అగస్త్యను

గ్రహంబునను, గంగాప్రసాదంబునను నాతిసయులు కశ్యపునివాత్సల్యం
బును, మహేంద్రునిసౌభ్రాతృత్వంబును బడయుదురు గాక! ఓదేవా!
నీవు మాకుఁ బ్రసన్నుండ వైనయిచ్చోటు శుభమయంబు గాకుండు
నా? దేవా! నేనిట్లు కృతార్థురాల నైతిని. అయినను భక్తివశంబున
నొక్కవిజ్ఞాపనంబు గావించుకొనుచున్నాను. నామాట మన్నించి జగన్మం
గళంబు గావించున ట్లనుగ్రహింపవలయును" అని ప్రార్థించెను.

శివుండును బ్రసన్నుండై నీయభిప్రాయంబు దెలుపుమని యవ
కాశ మిచ్చుటయు నప్పుడు దితి మరల ,, ఓజగద్విధాతా! శివా!
సుజనవందితా! ఈజగంబున సంతతి యనునదియే దుర్లభమైనది. విశే
షించి తల్లికే యది ప్రియకరమైనది. అది పుత్రసంతానమైనచో నింకఁ
జెప్పవలసిన దేమి? ఆపుత్రుండు గుణవంతుఁడును, శ్రీమంతుఁడును,
ఆయుష్మంతుండునైనచో నింక స్వర్గంబుతోడను, బ్రహ్మపదంబుతో
డను ప్రయోజనం బేమున్నది? ఇహపరసుఖాభిలాషులగు నెల్లవారును
గుణవంతుఁ డగుపుత్రునే యభిలషించుచుందురు. కావునఁ బోసర్వే
శ్వరా! లోకకల్యాణార్థమై యీక్షేత్రంబున స్నానంబు గావించువారికిఁ
బుత్త్రప్రాప్తి యగునట్టివిధానంబు గావింపుము." అని ప్రార్థించెను.

అది విని శంకరుండు ,, దేవీ! అపుత్రతయనునది మహాపాప
మునకు ఫలము. ఇచ్చట స్నానము చేసినంతనే పాపనాశనం బగును.
ఇందు మునింగి సత్పాత్రదానపూర్వకంబుగా నీస్తోత్రమును బఠించు
వానికిఁ బుత్త్రప్రాప్తి యగును. మూఁడుమాసంబు లేవిధిగా స్నానదా
నంబులు గావించువారికిఁ గోటిసంతతిసంతానము లభించును. అపుత్త్రికై
యగురమణి యిందవగాహనంబు గావించి పుత్రవతి యగును. ఋతు
స్నానాంతంబున నిందుమజ్జనంబాడుమానిని బహుపుత్రవతి యగును.
గర్భవతియగుకాంత భక్తిపూర్వకంబుగా ఫలంబులతోఁగాని, తిలలతోఁ

గాని యిందు స్నానంబు చేసి నన్ను సందర్శించి నాస్తోత్రంబు బఠించి నచో నామెకు శక్రతుల్యుండగుతనయుం బడయింపఁగలఁడు. పితృదోషంబుచేఁగాని, పత్నీదోషంబుచేఁగాని, ధనాభావంబుచేఁగాని, మఱి యేకారణంబుచేఁగాని సంతానంబు పడయఁజాలనివా రీక్షేత్రంబున విధి విహితంబుగాఁ గు్రింకి పితృదేవతలకుఁ బిండప్రదానంబు చేసి స్వల్ప మాత్రంబైనను స్వర్ణదానం బొనరింపఁగలిగినచోఁ దప్పక పుత్రవంతు లగుదురు. న్యాసాపహారులును, రత్నహర్తలును, పితృకర్మవిహీనులును నగువారుగూడ వంశవృద్ధిం గాంచఁగలుగుదురు. ఈతీర్థసేవనంబున జీవు లకందఱకును శ్లాఘ్యం బగుసంతానంబు గలుగును. నియతవ్రతులై యాదితిగంగాసంగమంబున స్నానంబాచరించి తీరంబునఁగల యనాది మూర్తియు, అజరుండును, అపారుండును, సదానందవిగ్రహుండును, దేవర్షిసిద్ధసాధ్యయోగీశ్వరాదిసేవితుండును, అనామయుండును జ్యోతిర్మ యుండును, లింగాత్మకుండును, ప్రభుండును నగుసిద్ధేశ్వరమహాదేవుని యథాశక్తి నుపచారాదులచేఁ బ్రతిదినంబును భక్తిపూర్వకంబుగఁ బూజించుచుఁ జతుర్దశి, అష్టమిమొదలగుతిథులందు బ్రాహ్మణులకు సువర్ణదానంబు చేయుచు నన్ను సంతర్పణంబు సేయువాఁడు శతపుత్రవం తుండును సకలార్థసిద్ధుండునై యంతంబున శివసాయుజ్యంబు నందఁగ లఁడు. మఱియు నెవ్వఁడైనను, ప్రస్థానంబునందైనను ఈస్తోత్రంబుఁ బఠించినచోఁ బుత్రవంతుం డగును " అని యానతిచ్చెను.

అప్పటినుండియు నాతీర్థము పుత్రతీర్థంబనువిఖ్యాతిం గాంచెను. అందలి స్నానదానాదులు సర్వకామప్రదంబులు. అచ్చట మరుద్గణం బులతో నింద్రునకు మిత్రత్వంబు గలిగినచోటు మిత్రతీర్థంబనియు శక్రుండు నిష్పాపుండైనచోటు శక్రతీర్థంబనియు, శక్రునకు లక్ష్మీలా భంబగుతావు కమలాతీర్థంబనియుఁ బ్రకీర్తితంబు లయ్యెను. ఈసకలతీర్థ

బులును సర్వాభీష్టప్రదంబులు. భగవానుండగు శివుండును దితిప్రభృతు
లకు సర్వంబును మీ ప్రార్థనానురూపంబుగ నగు నని యానతిచ్చి యం
తర్ధానం బయ్యెను. పిమ్మట నందఱును దమతమనివాసంబులకుం జనిరి.
గౌతమీతీరంబునందిట్టిపుణ్యతీర్థములు లక్షలకొలంది విరాజిల్లుచున్నవి.

## —♦ యామ్యాదితీర్థవర్ణనము ♦—

ఈయమతీర్థము పితృగణంబులకుం బ్రీతికరంబును, దృష్టాదృష్టద
బగునిష్టసాధకంబును, సర్వదేవర్షి సేవితంబును, సర్వపాపవినాశకంబునై
విరాజిల్లుచుండును. పూర్వకాలంబున అనుహ్లాదంబను బలవంతంబగు
నొకకపోతంబు గలదు. దానికిం గామరూపిణి యగు హేతి యను కపో
తి భార్యయై యుండెను. అనుహ్లాదుండు మృత్యువునకుం బౌత్రుండును,
హేతి దౌహిత్రియు నై యుండిరి. కాలక్రమంబున నాదంపతుల కనేక
పుత్రపౌత్రు లుదయించి వర్ధిల్లుచుండిరి. ఉలూకుం డనుపక్షిరాజు వా
రికి శత్రువై యుండెను. అతనిసంతానం బంతయు నాగ్నేయనామంబున
విఖ్యాతం బైయుండెను. వారందఱును మిగుల బలవంతులు.

ఆయిరుతెగలవిహంగంబులకును జిరకాలంబునుండియును వైరంబు
ప్రవర్తిల్లుచుండెను. గంగానదికుత్తరతీరంబునం గపోతసంతతియు, దక్షిణ
తీరంబున నులూకసంతతియు వాసము చేయుచుండెను. పరస్పరవిరు
ద్ధంబు లగునాపక్షిసంఘము లెప్పుడును బోరాడుచునే యుండెను. పుత్ర
పౌత్రసేనాపరివృతులై వారిట్లెంతకాలంబు మహారణంబు గావించినను
నందెవ్వరికి నెన్నండును జయంబు లభించుట లేదు. అనంతరము కపోత
ము యమునిగూర్చియుం బితామహుం డగుమృత్యువుంగూర్చియు నా
రాధనంబు గావించి యామ్యంబులగు నస్త్రంబులను సంపాదించి సర్వా
ధికసామర్థ్యంబు సంపాదించెను. ఉలూకంబును అగ్నిదేవునుపాసించి

మహాబలసంపన్నం బయ్యెను. ఇట్లు యమాగ్నులవలన వరప్రాప్తు లగు నయ్యిరుతెగలవారును మదోన్మత్తులై మరల నతిభీషణంబగు మహారణంబు గావింప నారంభించిరి. అప్పుడు కపోతముపై నులూక మాగ్నేయాస్త్రముం బ్రయోగించెను. కపోతంబును శత్రువుపై యమపాశంబును, దండంబును, మృత్యుపాశంబునుగూడఁ బ్రయోగించెను.. అప్పుడు భయావహం బగునయ్యాహవంబు పూర్వకాలంబున నాడీబకసంగ్రామంబును బోలి యుండెను.

అప్పు డులూకప్రయుక్తంబు లగుమహానలజ్వాలలచేఁ బరివేష్టితులై తనపుత్రపౌత్రులందఱును వేగిపోవుచుండ మహాపతివ్రత యగు కపోతసతి చూచి దుఃఖవిహ్వలయై వివిధకాతరవచనంబులచే నగ్నిదేవు నుద్దేశించి ,, అరూపుండును, అదానుండును, అపరోక్షుండును, నగు నగ్నిదేవునకు నమస్కారము. ఈజగంబునందలి సకలపదార్థములు నెవ్వనియాత్మభూతములో, ఎవ్వనిమూలమున దేవతలు హవ్యభోజనంబు గావింతురో అట్టియజ్ఞభుజుండును, స్వాహాప్రియుండునగు సర్వవ్యాప్తుంతు నకుఁ బ్రణామము. దేవతలకు ముఖంబును, హవ్యవహానుండును, దేవహోతయు, దేవదూతయు, నగువిభావసుని నేశరణంబు వేఁడెదను. ప్రాణరూపంబున జీవులయంతస్థితుండును, బహిర్భాగంబున నన్నప్రదుండును, యజ్ఞసాధనస్వరూపుండును నగుధనంజయుండు నాకు రక్షకుండగుఁగాక !'' అని యిట్లు వినుతించుటయు నగ్నిదేవుండు ,, ఓసాధ్వీ ! కపోతీ ! ఈరణరంగమున విడిచిన నాసంబంధమగునీయస్త్రము మమోఘమైనది. ఇమ్మహాస్త్రంబునకు విశ్రామస్థానంబు గల్పించు నుపాయంబేమైన నున్నచో నాకెఱింగింపుము !" అనియెను. అంతఁ గపోతి వినీతస్వరముతో ,, ఓహవ్యవాహా ! ఈయమోఘశరంబు నాభర్తకును బుత్రపౌత్రాదులకు నెట్టియపాయంబును గావింపక నాయందు విశ్రమిం

చుంగాక! “ఓ జాతవేదా! నీవు సత్యవచనుండ వగుము. నీకు నమస్కారము.” అని ప్రార్థించుటయు జాతవేదుండు “ఓ పతివ్రతా! నీపతిభక్తికి నేను పరమసంతుష్టుండ నైతిని. ఓ సతీ! నేను నిన్నును, నీభర్తను, నీపుత్రపౌత్రులనందఱను గూడ క్షమించితిని. ఈయగ్నిజ్వాలలు మిమ్మెవ్వరిని దహింపకుండుంగాక! — నీవు సుఖంబుగ నుండుము!” అని యనుగ్రహించెను.

ఇది యిట్లుండంగా యమపాశబద్ధుండై యమదండతాడితుండగు నిజభర్తను రణరంగమునం గాంచి యులూకి దుఃఖితయై యమసన్నిధానంబునకుం జని యాతని సందర్శించి “ఓ ప్రభూ! యమరాజా! జనులు నీవలనిభయంబు చేతనే బ్రహ్మచర్యానుష్ఠానంబు గావింతురు. ధీరులగు వారు నీభయంబుననే కర్మనిష్ఠులయ్యెదరు. మఱియు సత్కార్యాచరణంబు సేయుదురు. అనశనాదివ్రతంబులైనను, గ్రామంబులు విడిచి యరణ్యవాసంబులు సేయుటయైనను, సామ్యభావము నాశ్రయించుట యైనను నీభయంబువలననే — నీభయంబువలననే సోమయాజు లగుచుందురు. నీభయంబువలననే విప్రులు వేదోచ్చారణంబు సేయుచుందురు. దేవా! అట్టినీశరణంబు గోరివచ్చిన నన్ను రక్షింపుము” అని ప్రార్థించుటయుం బతివ్రతయగు నయ్యులూకపత్నిస్తోత్రంబునకు యముండు ప్రసన్నుండై “ఓ సతీమణీ! నీకు శుభంబగుంగాక! నీయభీష్టం బేదియో తెల్పుము” అని యానతిచ్చెను. అప్పుడయ్యులూకి యముం గాంచి “ఓ సురశ్రేష్ఠా! నాభర్త నీపాశంబుచే బంధితుండై, నీదండంబుచే దాడితుం డగుచు బాధితుం డగుచున్నాడు. అట్టిమహాపన్నుం డగునాభర్తను, బుత్రపౌత్రాదులను రక్షింపవలయును” అని ప్రార్థించెను. ఆమాట విని యముండు కృపామయుండై “ఓ శుభాననా! మదీయంబులగు పాశదండంబు లమోఘంబులు. వానికిం బలిసయోగ్యం బగుస్థానంబు

నిర్దేశింపుము" అనియెను. అనుటయు నయ్యులూకియుఁ గపోతివలెనే "ఓజగన్నాథా ! నీపాశంబునన్ను బధించుఁగాక ! నీదండంబు నన్ను దండించుఁగాక ! వానిమూలమున నాపతి పుత్రపౌత్రాదుల కెట్టి యపాయంబును గలుగకుండుఁగాక '" అని చెప్పుటయు భగవానుండగు యముండు కృపాయత్తచిత్తుండై "సాధ్వీ ! నీపతిపుత్రాదులు నిరపాయులగుదురుగాక ! నీకును సుఖంబగుఁగాక !" అని కరుణించి తనపాశదండంబుల నుపసంహరించెను. అట్లే యగ్నిదేవుండును దనయస్త్రంబు నుపసంహరించెను.

అనంతర మయ్యిరువురును గలసిపోయి యులూకంబునకును, గపోతంబునకును బరస్పరమిత్రత్వముంగూర్చి యాపక్షుల నుద్దేశించి "ఓవిహంగశ్రేష్ఠంబులారా ! మీయభీష్టంబు గోరుకొనుఁడు" అని యానతిచ్చుటయు నవ్విహంగద్వయం బైకకంఠ్యముగా "ఓసురోత్తములారా ! మావైరవ్యాజంబున నతిదుర్లభం బగుమీదర్శనము మాకు లభించినది. మేము పాపమతులమగుపక్షులము. అట్టిమాకు వరంబులతోఁ బ్రయోజన మేమున్నది ? అయినను మీరు కరుణించి వరప్రదానంబు గావింపఁదలంచితిరి గావున మేమును గోరుకొనుచున్నాము. మాకొఱకు మేమెట్టివరంబును గోరుటలేదు. స్వార్థంబుతోఁ గూడినప్రార్థనము శోచనీయమైనది. పరార్థోద్యతుం డగువానిజీవితమే సార్థకమైనది. అగ్నియు, జలంబును, రవియు, పృథివియు, వివిధంబు లగుధాన్యంబులును బరార్థసాధనంబుకొఱకే ప్రవృత్తంబు లగుచుండును. విశేషించి సాధువులుగూడ నట్టివారే—బ్రహ్మాదిదేవతలుగూడ మృత్యుముఖపతితు లగుదురన్నచో నిఁక నితరులలెక్క యేమున్నది ? ఇది యంతయు నాలోచించి చూడఁగా స్వార్థంబునకై శ్రమపడుట నిరర్థకం బని బోధ యగుచున్నది. జననకాలంబున విధియెట్లు లిఖించి యుంచెనో

యిట్లు జరుగకమానదు. కాని జీవులు వృథాపౌరుషమును బ్రకటించుచుఁ గేవలక్లేశమునే యనుభవించుచుందురు. కావున నో దేవతలారా! మాకు జగన్మంగళకరం బగునొకవరంబును బ్రసాదింపఁ గోరెదము" అని ప్రార్థించిరి.

అంతలోకవిఖ్యాతులగు యమాగ్నులు ప్రసన్నులై యాపక్షిద్వయంబునకు ధర్మకీర్తివర్ధనంబుగను, సకలలోకశుభకరంబుగను వరంబు గోరుకొనుఁడని యానతిచ్చుటయు నవ్విహంగంబు లొక్కటే వాక్యముగా ,,ఓసురవరులారా! ఈగంగానది యుభయతటంబులను మా యాశ్రమంబులు ప్రతిష్ఠితంబు లగుఁగాక! సుకృతియైనను దుష్కృతియైనను ఈక్షేత్రమునందు స్నానదానజపహోమతర్పణాదులం గావించువాఁడు సకలాభీష్టసిద్ధుం డగుఁగాక! ఇదియే మాకుఁ బరమవరంబు" అనుటయు నద్దేవద్వయంబును ,,ఓపక్షులారా! మీరుకోరినట్లె యగుఁగాక! మఱియు మీయందలిప్రీతిచే నింకొకవరం బిచ్చుచున్నాము. ఈగౌతమియుత్తరతీరంబున నెవ్వరీయమస్తోత్రమును బఠింతురో వారివంశంబున సప్తపురుషాంతరంబులవఱకు నకాలమృత్యువు వొరయనేరదు. ఆపురుషుండు సర్వదా సంపద్భాజనుండు గాఁగలఁడు. ప్రతిదినంబును మృత్యుస్తోత్రంబు పఠించువాఁ డష్టాశీతిసహస్రవ్యాధులనుండియు విముక్తుం డగును. మఱియు నీక్షేత్రంబున సప్తాహమాత్రంబు స్నానంబు చేసినవో సతులు త్రిమాసమధ్యంబునను,వంధ్యలు షణ్మాసమధ్యంబునను గర్భవతు లగుదురు. ఆనారి వీరప్రసవినియు, సబ్బాలుం డాయుష్మంతుఁడును, ధనవంతుఁడును, మతిమంతుండును, బలవంతుండును, బుత్రపౌత్రవంతుండు నగును. ఇచ్చటఁ బిండాదిదానంబువలనఁ బితృదేవతలకు ముక్తిలాభం బగును. నరున కీక్షేత్రంబున స్నానమాత్రంబుననే మనోవాక్కాయజంబు లగుకలుషంబులు నశింపఁగలవు." అనియిట్లు

యము ననుగ్రహించుటయు నగ్నిదేవుండును, ,,ఓపక్షివరులారా! ఈగౌతమీదక్షిణాతీరంబున నియతవ్రతులై యెవ్వరుమదీయంబగుస్తవంబును బఠింతురో వారి కాయురారోగ్యభాగ్యంబులు నేను ప్రసాదించెదను. ఎట్టినరుండైనను, నెట్టిచోట నైనను నీస్తవంబు పఠించినచో నగ్నిభయనివారణంబు గాంగలదు. ఈస్తోత్రమును లిఖించి గృహమధ్యంబున స్థాపించినయెడల గృహదాహంబు గలుగదు. ఈయగ్నితీర్థంబున స్నానదానాదు లగ్నిష్టోమఫలదంబు లగును." అని యనుగ్రహించెను.

అప్పటినుండియు నాతీర్థంబులు యామ్యతీర్థము, అగ్నితీర్థము నను నామంబులచేఁ గీర్తితంబు లయ్యెను. అచ్చటనింకను మూఁడువేల మూఁడువందలతొంబదిపుణ్యతీర్థంబులు గలవు. అవియన్నియు భుక్తిముక్తిప్రదంబులు. ఈసమస్తతీర్థంబులయందును స్నానంబు చేసినచో పవిత్రత్వముం గాంచినవారగుటచేఁ బవిత్రులై పుత్రవిత్తాదిసమృద్ధిం గాంచి పుణ్యవంతులై స్వర్గవాసంబుఁ గాంచఁగలరు.

## తపస్తీర్థాదివర్ణనము

ఈతపస్తీర్థము సర్వకామప్రదంబును, పుణ్యజనకంబును, పితృప్రీతికరంబు నైనది. పూర్వకాలంబులలో జల మధికమా, అగ్ని యధికమా యను తర్కవితర్కంబులు పుట్టెను. అందుఁ గొందఱు జలంబును, గొందఱగ్నిని బ్రశంసింపఁదొడంగిరి. వారిట్లు వాదప్రతివాదములు చేయుచుండ నందుఁ గొందఱు ,,అగ్ని జీవభూతం బగుటచే ననలంబుకంటె జననాధారం బేదియును లేదు. అగ్నియే యాత్మభూతంబును, హవ్యభూతంబు నై యున్నది. ఈయఖిలజగంబు నగ్నిమూలంబుననే యుత్పన్నంబై నది. అగ్నిచేతనే సకలలోకంబులును ధరింపఁబడినవి. అగ్నియే జ్యోతిర్మయంబును, తైజసంబు ననుజగదాకారముగాఁ బరిణమించినది.

కావున నగ్నికంటె శ్రేష్ఠంబును, పావనంబు నగునది యేదియును లేదు.. అగ్నికంటెఁ బరదైవతంబును లేదు. అగ్నియే అంతర్జ్యోతి యని కీర్తింపఁ బడుచుండుటచే నదియే పరంజ్యోతి. అగ్నిభిన్నముగ నేపదార్థంబునకును శక్తి లేదు. ఈజగత్త్రయంబు నగ్నితేజంబుచేతనే వ్యాప్తంబై యున్నది. కావునఁ బంచభూతంబులలో నగ్నియే శ్రేష్ఠమైనది. గర్భస్థంబగు బీజము సకలాంగకంబులంగాంచి వర్ధిల్లుట యగ్నిశక్తిమూలముననే. విశేషించి యగ్నియే దేవతలకు ముఖంబై యుండెను. కావున నగ్నికంటెఁ బ్రధానపదార్థము మఱియొకటి లేదు." అని వాదించిరి.

మఱికొందఱు వేదవాదు లగుమునులు జలశ్రేష్ఠత్వమును బ్రతిపాదించుచు "జలమూలముననే యన్నము సంపన్నం బగుచున్నది. జలమువలననే జనులు శుచులగుచున్నారు. జలముచేతనే చరాచరజగంబంతయు రక్షితమైయున్నది. జలమే జగంబునకు మాతృస్వరూపము. జలము త్రైలోక్యమునకును జీవనము. జలంబునుండియే యమృతముదయించె నని పెద్దలు చెప్పియుండిరి. దానినుండియే యోషధు లన్నియు నుదయించెను గావున జలమే సర్వభూతశ్రేష్ఠమైనది." అని ప్రశంసింప నారంభించిరి. ఇట్లు కొందఱు అగ్నిని, కొందఱు జలంబును గీర్తించుటయే గాని యందెవ్వరు శ్రేష్ఠులో నిర్ధారణ కాదయ్యెను. అందుచే నమ్మహర్షులు పరస్పరవిరుద్ధవాదు లగుచు నెట్టి సిద్ధాంతంబును చేయఁజాలక యందఱును గలసి బ్రహ్మదేవుని చెంతకుం బోయి జలాగ్నులయం దెవ్వరుప్రధానులో యెఱింగింపవలయునని ప్రార్థించిరి.

అప్పుడు జలజసంభవుం డించుక యాలోచించి నియతవ్రతులగునమ్మహర్షుల నుద్దేశించి "ఓమునివరులారా! జలాగ్నులు రెండును జగంబునఁ బూజ్యతమంబులైనవియే. ఆరెండింటివలననే లోకమంతయు నుత్పన్నంబైనది. వానిమూలంబుననే హవ్యంబును, కవ్యంబును,

అమృతంబులు జనించినవి. వానిమూలముననే జీవనమును, శరీరధారణము నగుచున్నవి. ఆ రెండింటిలో నొకదానిమించినవిశేష మింకొకదానికి లేదు. కావున నా రెండింట శ్రేష్ఠత్వమును సమానమైనదనియే తోంచుచున్నది " అని బోధించెను. అందువలన జలాగ్నులయందు దేని శ్రేష్ఠత్వమును నిర్దిష్టము కాకుండుటచే మునులందఱును బ్రహ్మవచనంబులచే సంతృప్తిసందఁజాలక వాని శ్రేష్ఠత్వమును దేల్చుకొనవలయు ననుకుతూహలముతో వాయుదేవునిసన్నిధికిం బోయి " ఓ మహాత్మా! నీవు ప్రాణస్వరూపుఁడవు. కావున జలాగ్నుల శ్రేష్ఠత్వంబు నిర్దేశింపవలయును. నీవు సత్యమూర్తివి " అని ప్రార్థించుటయు వాయుదేవుండు యుక్తియుక్తంబుగా " తపోధనులారా! అగ్నియందే సకలజగంబును బ్రతిష్ఠితమై యున్నది. కావున జలంబుకంటె ననలమే శ్రేష్ఠతమంబైనది " అని చెప్పెను.

ఆమాట విని ప్రతిపక్షులగుమహర్షులా సిద్ధాంతము నంగీకరింపఁజాలక తక్కినరుషులతోఁగూడఁ గలసి వసుంధరచెంతకుం బోయి " ఓ భూదేవీ! నీవు చరాచరంబున కాధారభూతంబవు. కావున నీవు సత్యము చెప్పవలయును! జలాగ్నులయందు శ్రేష్ఠు లెవ్వరు " అని ప్రశ్నించుటయు ధాత్రీదేవి మృదుస్వరముతో " సర్వభూతంబుల కానందప్రదంబును, సనాతనంబు నగుజలము నాకుఁగూడ నాధారంబై యున్నది. ఆజలమునుండియే సర్వభూతంబులు నుత్పన్నంబు లగుచుండును. కావున నన్నిటియందును జలమే శ్రేష్ఠమైనది. " అని చెప్పుటయు నగ్నిపక్షము వారు కాదుకాదని నిషేధించిరి. అప్పటికిని వారిభిన్నాభిప్రాయములు తీరనందున వారందఱును క్షీరజలధిశయనుండును భగవానుండు నగువిష్ణుదేవునిసన్నిధికిం బోయి శంఖచక్రగదాధరుం డగునద్దేవుని వివిధప్రకారంబుల నిట్లు వినుతింపందొడంగిరి.

"భూతభవిష్యద్వ్యాపకుండును, బుద్ధిగుహానివేశుండును, చిత్రవిచిత్రపరిణామశీలుండును, జగత్త్రయస్వరూపుండు నగుదేవుండు మాకు దిక్కగుంగాక! ప్రళయకాలంబున సర్వంబు నెవ్వనియందు లయంబగుచుండునో, మహర్షులు దేవుని శాశ్వతుం డనియు, అప్రమేయుం డనియు, వేదవేద్యుం డనియు, అక్షయుం డనియు నిర్దేశించి యుండిరో ఎవ్వనియాశ్రయంబు సర్వాభీష్టదాయకమో, అట్టిసత్యవస్తువు నాశ్రయించెదము. పంచభూతాత్మకుండును, జగదాశ్రయుండును, ప్రకృతిరూపుండును, సర్వవ్యాపకుం డయ్యును యోగిగణంబులకుంగూడ నవిదితుండు నగుదేవుండు మాకుఁ బ్రసన్నుండగుఁగాక! ఓవిష్ణుదేవా! అట్టిపరదైవతంబవు నీవే. ఓజగన్నివాసా! జలాగ్నులయందేది శ్రేష్ఠమైనదో యెఱింగించి మాసంశయంబుఁ దీర్పవలయును. అందుకొఱకే మేమిందఱమును నీసన్నిధి కరుదెంచి యున్నాము. నీవు స్వయముగా సత్యనిర్ధారణంబు గావింపవలయును. ఈసమస్తజీవులకును నీవంతరాత్మవై యున్నావు. ఓజగన్నాథా! ఈవిశ్వమంతయును నీవే—నీయందే సర్వంబును బ్రతీయమానం బగుచున్నది. విశ్వాత్ముండవగు నీవీజగంబులోపలను, వెలుపలను, అంతటను నిండి యున్నావు. అయినను ప్రకృతిప్రభావముచే నెవ్వరును నిన్ను గ్రహింపఁజాలకున్నారు. దేవా ప్రసన్నుండవై మాసంశయంబు నివారింపుము"

అని వారు ప్రార్థించుచుండగా జగద్ధాత్రియు నశరీరియు నగు దేవవాణి "ఓఋషివరులారా! తపోనియమభక్తియుక్తంబుగా మీరు జలంబును అగ్నినిగూడ నుపాసింపుఁడు. అం దెవ్వరియారాధనంబు ప్రప్రథమంబున ఫలసిద్ధిఁగాంచునో యాదైవతమే శ్రేష్ఠమైన దని నిశ్చయించుకొనుఁడు!" అని వినంబడియెను. అప్పుడు మునులందఱు నవ్వాక్యంబు నంగీకరించి యటనుండి కదలి సర్వలోకమాతృస్వరూపిణియు,

భువనత్రయ పావనియు నగుగౌతమీతటంబునకుం జని యచ్చటఁ దపోని యతవ్రతులై జలాగ్నుల నుపాసింపనారంభించిరి. అట్లు కొంతకాలంబు చనుటయు మరల వేదమాత యగుసరస్వతి యశరీరిణియై ,, ఓమౌని పుంగవులారా ! అగ్నిదేవునకు జలమే జననీస్వరూపిణి యైయున్నది. ఆజ లంబువలననే సర్వంబును శుచిమంతం బగుచున్నది. కేవలాగ్నిపూజకులు గూడ జలవ్యతిరిక్తంబుగ నగ్ని నారాధింపఁజాలరు. సర్వత్రజలసంచారం బగుటచేతనే కర్మాధికారము గలుగుచున్నది. మానవుం డెంతటివేదవి దుం డైనను జీవితకాలం బంతయు శీతలజలావగాహనంబు సేయుచునే యుండవలెను. అట్లు సేయకున్నచో మలయుక్తుండును, అశుచియు, ధర్మ కర్మానుష్ఠానంబున కనధికారియు నగుచున్నాఁడు. జలమే సకలజగంబు నకు మాతృస్వరూపిణి యగుటచే నదియే సర్వభూతంబులయందును శ్రేష్ఠతమం బైనది. విశేషించి జల మగ్నికిఁగూడ జననియై యున్నది. అందుచేఁ గేవలము జలమునకే శ్రేష్ఠత్వము నిష్పన్నం బగుచున్నది. ”
అని యెతింగించెను.

అయ్యాకాశవాణివచనంబు లాకర్ణించి యచ్చటివేదవాదు లగు మును లందఱు నప్పుడు వాదోపవాదంబులు వదలుకొని యేకాభిప్రా యులై జలశ్రేష్ఠత్వమునే యంగీకరించిరి. అట్లువారందఱు నొకసిద్ధాంత మునకు వచ్చిన యాపుణ్యక్షేత్రము తపస్తీర్థం బగునామముచే విఖ్యా తం బయ్యెను. మఱియు దానికి శక్రతీర్థంబనియు, నగ్నితీర్థంబనియు, సారస్వతతీర్థం బనియు, నామంబులు గలిగెను. ఆసకలతీర్థంబులయం దును స్నానదానాదులు మహాఫలదాయకంబులు. అచ్చటఁ బుణ్యజన కంబు లగుపదునాలుగువందలతీర్థంబులుగలవు. అవి యన్నియు స్వర్గమో క్షప్రదంబులు. దైవవాణి యాస్థలంబున మహర్షులసంశయవిచ్ఛేదంబు గావించిన యాస్థానంబు సరస్వతీగంగాసంగమస్థానము. అస్థానమహా

త్మ్యము నెంతటివారును వర్ణింప సమర్థులు గారు.

## —♦ దేవతీర్థవర్ణనము. ♦—

గంగానదియుత్తరతటంబున సర్వపాపవినాశకం బగుదేవతీర్థంబు గలదు. పూర్వము సర్వసద్గుణవంతుండగు ఆర్ష్టిషేణుండను నొకరాజుం డెను. ఆతనికపరలక్ష్మింబోలి జయయనుపేరుగలరమణి భార్యయై యుం డెను. ఆదంపతులకు భరుండను పుత్రుండొకం గలఁడు. అతఁడు పితృభ క్తుండును, మతిమంతుండును, కార్యదక్షుండును, ధనుర్వేదవిదుండు, వేదపారదర్శియు నై యుండెను. ఆభరునకురూపవతియు, విఖ్యాతచరి త్రయు నగుసుప్రభ యను కాంత సహధర్మిణియై యుండెను. మహారా జగు నార్ష్టిషేణుఁడు పుత్రుం డగుభరునియందు రాజ్యభారము నుంచి యశ్వమేధయాగంబు నిర్వర్తింపఁదలంచి సరస్వతీతీరంబున నాత్మపురో హితునిచే దీక్షాగ్రహణంబు గావించి వేదశాస్త్రపరాయణు లగు ఋత్విగ్గణంబులతోడను, బ్రధానులగుమహర్షిగణంబులతోడను, బరివే ష్టితుండై బ్రాహ్మణాగ్నిసాన్నిధ్యంబున నుండఁగాఁ బ్రతాపవంతుండును శూరుండునగు మిథుం డనురక్కసుం డయ్యధ్వరధ్వంసంబు సేయం దలంచి భార్యాపురోహితసహితంబుగా నారాజేంద్రుని బట్టి రసాతలం బునకుం గొనిపోయెను. ఇఁకఁ జేయునదిలేక ఋత్విజులును, దేవతలును, స్వస్థానంబులకుఁబోయిరి.

ఆరాజపురోహితునకు దేవాపి యను తనయుండు గలఁడు. అతఁ డు తనతండ్రిం గానక విస్మితుండై దుఃఖితచిత్తంబుతో నిజజననిం గాంచి „ అమ్మా! నాతండ్రి యెక్కడకుఁ బోయెను? పితృవిహీనుండనై నేనెట్లు జీవములతో నుండఁగలను? తల్లీ నీవు సత్యము వచింపుము. పితృవిహీనులగు నిర్భాగ్యులజీవితము నీచమైనది. నీవీవిషయంబున సత్య

ము వచింపవేని నేను జలంబులయందైనను, నగ్నియందైనను బడి ప్రాణవిసర్జనంబు చేసికొనక మానను.” అని యడిగెను. ఆమాటలు విని తల్లి “వత్సా! నీతండ్రి రాజసహితంబుగా నొకదానవునిచే రసాతలంబునకుఁ గొనిపోఁబడియెను” అనునంతనే దేవాపి “అమ్మా! ఎవఁడా రాక్షసుఁడు? ఎందుకొఱకు నాతండ్రిని దీసికొనిపోయినాఁడు? అట్లు కొనిపోవుచుండ నెవ్వరు చూచినారు? ఆపాపపురక్కసునినివాస మెచ్చట? ఈసంగతు లన్నియును స్పష్టముగాఁ దెలుపుము” అని ప్రశ్నించెను. అప్పుడాతనితల్లి “నాయనా! మహారాజు యజ్ఞదీక్షితుండై యుండఁగా మిథుండనుదానవుం డారాజును, ఆతనిదేవిని, మీతండ్రిని గూడ వహ్నిబ్రాహ్మణదేవగణసమక్షంబున బలవంతముగఁ బట్టి రసాతలంబునకుఁ గొనిపోయెను” అని చెప్పెను.

ఆవృత్తాంత మంతయు నాలకించి దేవాపి “దేవతలను, అగ్నిని ఋత్విక్కులను, రాక్షసులను గాంచి నాతండ్రిని వెదకవలయును. ఇంతకంటె మఱియొకమార్గము లేదు.” అని యాలోచించి రాజపుత్రుండగు భరునిచెంతకుం బోయి “ప్రభుకుమారా! దానవాపహృతులగుమన వారిని రసాతలమునుండి తపోనియమవ్రతప్రభావంబుచే గ్రహించి కొనితెచ్చెదను. అతిఘోరంబగుపరాభవంబు తటస్థించినప్పుడు తగినప్రతిక్రియ గావింపఁజాలని నరాధముని జీవితముకంటె మరణమే శ్రేష్ఠమైనది. నీతండ్రియగునార్షిషేణుం డెట్లు పాలించుచుండెనో యట్లే నీవును నిమ్మహీమండలంబును శాసించుచుండుము. రాజపుత్రా! నేను కృతకృత్యుండనై మరల వచ్చువఱకును నాతల్లిని గాపాడుచుండుము. ఇఁక నాకు సెలవొసంగుము”! అనిచెప్పెను. రాజపుత్రుండును సకలవిధంబులఁ గార్యనిశ్చయంబు సేయుచు బురోహితపుత్రుం డగుదేవాపిం గాంచి “విప్రనందనా! నీవు పరమేశ్వరానుగ్రహంబునఁ గార్యసిద్ధిం గాంచఁగ

లవు. యథాసుఖంబుగఁ బోయి రమ్ము? ఇంచుకంతయును జింతింప వలదు " అని ప్రోత్సహించెను.

అనంతర మబ్బాలుం డగు దేవాపి యమరేంద్రుని చరణధ్యానం బునఁ దత్పరుండై ఋత్విగ్గణంబుల నన్వేషించుచు, వారినిదర్శించి వేఱు వేఱుగ నమస్కారంబు లర్పించి కృతాంజలిపుటుండై ,, ఓ మహాభాగులారా! యజ్ఞదీక్షితుం డగుయజమానుని, బురోహితుని, యజమానపత్నిని రక్షించుభార మంతయు ఋత్విజులపై నుండునుగదా! అట్టిచో మీసమక్షమునందే వారు దానవునిచే నపహృతులై పోయిరి. ఇది కేవల మనుచితముగను, అయుక్తముగను లేదా? కావున మీరీక్షణంబ మహారాజును, రాజమహిషిని, మాతండ్రియగు పురోహితుని భద్రంబుగఁ దీసికొని రావలయును. వారికెట్టియపాయంబును గలుగఁగూడదు. మీరట్లు చేయకున్నచో నాశాపంబునకుఁ బాత్రులు కాకమానరు" అని యుగ్గడించుటయు ఋత్విజులు భయపడి ,, భూసురకుమారా! యజ్ఞంబులయం దగ్నియే ప్రథమపూజ్యుఁడు. అతఁడే దైవతము. కేవలము మేమగ్నిపరిచారకులము. అట్టిమే మేమిచేయఁగలము? దాతయైనను, భోక్తయైనను, హర్తయైనను, గర్తయైనను హవ్యవాహనుం డగు నయ్యగ్నియే——" అని సమాధానము చెప్పిరి.

అది విని దేవాపి యాఋత్విజులను విడిచి యథావిధిగ జాతవేదునిఁ బూజించి సర్వవృత్తాంతంబు నాతనికిని నివేదించుటయు నగ్నిదేవుండు నివ్వెఱపడి ,, కుమారా! యజ్ఞంబులయందు ఋత్విజు లెట్టివారో నేను నట్టివాఁడనే. దేవతలహవ్యమును వహించుటయే నాపని. యజ్ఞభోక్తలైనను, రక్షకులైనను దేవతలే కాని నేను గాను. నేను దేవతలను వేఱువేఱుగ నాహ్వానించి సప్రియత్నంబుగ హవిర్భాగంబుల నిచ్చుచుందును. ఇందలినాయపరాధ మింతమాత్రమే. నీవీవిషయము

దేవతలనే యడుగుము." అనియెను. అంత దేవాపి దేవతలచెంతకుం బోయి ప్రత్యేకంబుగ వారికి నమస్కరించి తనయభిప్రాయంబును, ఋత్విజులయు, అగ్నిదేవునియు ప్రత్యుత్తరంబులును వారికి నివేదించెను. దేవతలావిషయంబు నాకర్ణించి విస్మితులై ,, విప్రనందనా! మేము వైదికమంత్రంబులచేతను ఋత్విక్కులచేతను సమాహూతులమై హవిర్భాగంబులఁ గైకొనుచుందుము. అంతేకాని మేము స్వతంత్రులము గాము. వేదంబుల ననుసరించుటయే మావిధి. అందుచే మేము వేదప్రేరితులమై పని చేయుచుందుము. కావున నీవు వేదంబులనే యడుగుము" అని చెప్పిరి.

అనంతరము దేవాపి వేదంబుల నారాధించి సాక్షాత్కరింపఁజేసి కొని వానికిఁ బునఃప్రణామంబులుచేసి ఋత్విజులును, అగ్నియు, దేవతలును జెప్పనవిషయంబులను నివేదించెను. అప్పుడు వేదములు ,,కుమారా! మేమును బరతంత్రులమే గాని, స్వతంత్రులము గాము. మేమెప్పుడు నీశ్వరపరవశవర్తులమై యుండెదము. అశేషజగంబున కాధారుండయ్యు నిరాధారుండును, నిరంజనుండును, సత్యంబున కేకమాత్రాశ్రయుండును, సర్వసంపన్నిధానుండును, మహేశ్వరుండు నగుమహాదేవుఁడే సర్వంబునకుఁ గర్తయు హర్తయునై యున్నాఁడు. మేము కేవలము శబ్దమయులము. అందుచే సకలంబును వచించుటకును, సర్వంబును గ్రహించుటకును జాలియుందుము. మాప్రయోజన మింతమాత్రమే. నీవేమియడిగినను జెప్పఁగలము. మీజనకాదుల నెవ్వరపహరించిరో, యాతనినామంబును, నివాసంబును, బలపరాక్రమంబులు నెట్టివో చెప్పఁగ గలము. మఱియు మీవారేదైత్యునిచే భక్షితులైపోయిరో, యింకను సజీవులై యుండిరో వెల్లడింపఁగలము. నీసామర్థ్యమెట్టిదో, ఎచ్చట నెవ్వరి, నేవిధముగా నారాధించి నీవు వారిని బడయఁగలవో

ఆయుపాయముగూడ నీకు బోధింపఁగలము. ఇంతకంటె మేమేమియుఁ జేయఁజాలము. నీయాత్మీయులపోకడకు మే మెంతమాత్రమును బాధ్యులము గాము'' అని స్పష్టముగాఁ దెలియఁ జేసెను.

దేవాపియు నావచనంబు లాకర్ణించి తన మనంబున నించుక యాలోచించి వేదగణంబుల నుద్దేశించి ,, ఆదైత్యునిచే నపహృతు లగు మాతండ్రియు, రాజును, రాణియు మరల నెట్లు లభింతురు? వారికెట్లు క్షేమముగలుగును? ఈవిషయము నాకెఱింగింపవలయును.'' అనుటయు వేదంబులు ,, ఓభూదేవకుమారా ! నీవీక్షణంబ గౌతమీతీరంబునకుం బోయి యందు వెలసియున్న మహాదేవు నారాధింపుము. అందువలనఁ గృపాకరుం డగు మహేశ్వరుండు సుప్రసన్నుండై నీయభీష్టంబు నెఱవేర్పఁగలఁడు. ఓమహామతీ! దేవుండగుశివుండు సన్నుతుఁడై నిశ్చయంబుగఁ బ్రీతుం డగును. మహారాజగు నార్ష్టిషేణుండును, ఆతనిదేవి యగుజయయు, నీతండ్రియగు నుపమన్యుండును నిరోగశరీరులై పాతాళతలంబున నున్నవారు. నీవు పరమేశ్వరవరప్రభావంబున నమ్మహాదైత్యుని సంహరించి స్వధర్మనిర్వహణంబువలన మహాయశంబు నందఁగలవు. మాకు శక్తియున్నంతవఱకు నీకీయుపాయము నెఱింగించితిమి. ఇంతకంటె మాకేమి చేయుటకును శక్తి చాలదు___''

అని వేదంబులు బోధించుటయు విప్రబాలకుం డగుదేవాపి యప్పుడే వేదంబులకడ సెలవుగైకొని గౌతమికిం జని యందు సుస్నాతుండై యించుకసేపు ధ్యానంబు గావించి యనంతరము మహాదేవు నుద్దేశించి ,,ఓదేవదేవేశా! నేనుబాలకుఁడను. నీవు నాగురులకు గురుండవు. నిన్ను స్తోత్రముచేసి మెప్పించుటకు నాకు శక్తి లేదు. నీసత్యస్వరూపమును నిగమనిచయంబులును, దేవతలును, మునిగణంబులును, బ్రహ్మయు, వైకుంఠవాసుం డగువిష్ణుదేవుండునుగూడ నెఱుంగంజాలరు. నీవెట్టివాఁడ

శ్శైవ నగుదువుగాక! నేను నీకు నమస్కరించుచున్నాను. ఓమహేశ్వరా! నీవీలోకంబునందుగల యనాథులకును, కృపణులకును, దరిద్రులకును, రోగులకును, పాపాత్ములకును గూడ రక్షకుండవు. జగన్నాథా! తపోనియమయంత్రాదులచేఁ బూజితుఁడవై దేవతలు మానవులకు భవత్ప్రదత్తంబులగుఫలంబులనే ప్రసాదించుచుందురు. ఒక్కసారి „శివ" యను నీనామంబు నుచ్చరించినంతమాత్రమున నెంతటియజ్ఞానులనైనను, ఎంతటి పాపాత్ములనైనను, ఎంతటి నరకార్ణవ నిమగ్నులనైనను, నీవు రక్షించుచుందువు. అట్టిదయాళుండవగునీవు నన్ను రక్షింపవలయును"

అని దేవాపి ప్రార్థించుటయుఁ ద్రిలోచనుండాతని యెట్టయెదుట సాక్షాత్కరించి ప్రసన్నహృదయముతో „వత్సా! నీయెడల నేను సంతుష్టుండనైతిని. నీవు దైన్యంబు విడిచి నీయభీష్టంబు గోరుకొనుము" అని యానతిచ్చినంతనే దేవాపి కృతాంజలియై „ఓజగన్నాథా! మా రాజును, రాజపత్నిని, నాతండ్రిని నేను మరలఁ బడయఁగోరుచున్నాను. మరియు రిపుండగు మధుదైత్యునినిధనంబును గావించుచున్నాను" అని విన్నవించెను. అప్పు డఖిలేశ్వరుం డగుత్రిలోచనుం డట్లే యగుఁగాక యని యనుగ్రహించి గణేశ్వరుని నందికేశ్వరునిఁ బిలిచి స్వయముగఁ ద్రిశూలాయుధమును బ్రసాదించి వానిని రసాతలంబునకుఁ బంపించెను. వారాక్షణంబ పాతాళంబునకుం జని ససైన్యంబుగ మధుదైత్యుని సంహరించి దేవాపితండ్రిమొదలగువారిని విడిపించి తెచ్చి దేవాపికి సమర్పించిరి.

ధీమంతుండగు నార్ష్టిషేణుని యశ్వమేధం బప్పు డాక్షేత్రంబుననే సంపన్నం బయ్యెను. అప్పు డాదిదేవుండును, ఋత్విజులును, దేవతలును వేదంబులును, మహర్షులును దేవాపినుద్దేశించి „ఓవిప్రనందనా! భక్తవత్సలుండును, దేవదేవుండు నగుమహేశ్వరుండు నీకు సాక్షాత్క

రించిన యీస్థానము దేవతీర్థం బనునామంబున విఖ్యాతం బగుంగాక ! ఈతీర్థంబు మానవులకు సర్వపాపాపహంబును, సర్వసిద్ధిప్రదంబును, బుణ్యజనకంబునై నీనిర్మలకీర్తిని శాశ్వతంబుగఁ జేయుచుండుఁగాక !" అని యభినందించిరి. అశ్వమేధంబు సంపన్నంబైనంతనే ఆర్ష్టిషేణునకు దేవతలు వరప్రదానంబు చేసి యాగౌతమీజలంబులనవగాహనం బాచరించి తమ్ముఁ గృతార్థులుగా భావించుకొనుచు స్వర్గంబునకుం జనిరి. అది మొదలుగా నాక్షేత్రంబు నుభయతీరంబులను నేఁబదివేలయెనిమిదివందలతీర్థంబు లుద్భూతంబు లయ్యెను. ఆసకలతీర్థంబులును మహాఫలదాయకంబులు.

# ఆంధ్ర ప్రచారిణీ గ్రంథనిలయము,

(1911 వ సంవత్సరములో స్థాపింపఁబడినది.)

## పిఠాపురము.

నవలలు—నవరసభరితములగునవలలు—పుణ్యచరిత్రములు, 200—250 పుటలకు మించకుండ—రెండుమాసముల కొకసారిగా వెలువడును.

చందాదారులసౌకర్యమునకై నవలల వెలలు [illegible] మేమే భరించి పూర్వపునిబంధన లీక్రిందివిధముగా మార్చినాము.

—♦ నిబంధనలు ♦—

1. ఇందుఁ జందాదారులుగఁ జేరువారు ప్రవేశరుసుము [illegible] ముందుగా 0-4-0 చెల్లింపవలయును.

2. ఇందు రెండేసిమాసములకొకసారిగ వెలువడుచుండు [illegible] రేపరుబైండుగల ప్రతిగ్రంథమును పోస్టేజి మనీఆర్డరు [illegible] మేమేభరించి రు 1-0-0 కిమాత్రమే చందాదారులకుఁ బంపు[illegible]

3. చందాదారు లగువారు వెనుకటిగ్రంథములన్నియుఁ [illegible] వలయునను నియమములేదు. కాని వారు కోరినచో వెనుకటిపుస్తకములుకూడఁ జందాదారుల వెలలకే పంపుచుందుము. క్రొత్తగ వెలువడుచుండు గ్రంథములు మాత్రము చందాదారులు తప్పక పుచ్చుకొనుచుండవలెను.

4. ఇందుఁ బ్రకటింపఁబడు అనుబంధములు చందాదారులు తప్పక పుచ్చుకొనవలయునను నియమము [illegible] కోరినవారికే పంపు చుందుము.

5. సంవత్సరముచందా అనఁగా [illegible] పుస్తకములకు రు 5-4-0 లు ముందుగ [illegible] ఉపటుర ప్రతిపుస్తకమును అన్ రిజష్టరుపా[illegible]

# స్త్రీలవ్రతకథలు.

(బాలాంత్రపు వేంకటరావుచే రచింపఁబడినవి)

ఇవి బాలికలకును స్త్రీలకందఱికిని అత్యంతోపయుక్తములుగ నుండునట్లు రచింపఁబడినవి. అందులో నోములు పట్టని స్త్రీలుండరు. పూర్వమునుండి కథలు వచ్చిన పెద్దముత్తైదువలు లేని యీయిరువదియవశతాబ్దిని, స్త్రీలలో విద్య వ్యాపించుచున్న యిప్పుడు, స్త్రీలందఱును సులభముగఁ జదువుకొని యీనోములు పట్టుటకై సులభశైలిని రచింపఁబడినవి. ఎంతకాలముక్రిందటనో 1—2 కూర్పులు చెల్లిపోయినవి. మరల మూఁడవకూర్పు ముద్రించినాము.

ఇవి రెండుభాగములుగ, భాగమునకు 32 నోములు (ఉద్యాపనములసహా) చొప్పున రెండుభాగములలోను 64 నోములు కలవు. వెల భాగము 1 కి 0—6—0 పోస్టేజి కొనువారే భరింపవలెను. 1—2 భాగములు వెలకు సిద్ధముగ నున్నవి.

## ప్రథమ భాగము.

1 కోచేటిపద్మము (మూఁగనోము) 2 పదారుకుడుముల తద్దికథ, 3 ఉండ్రాళ్ళతద్దికథ, 4 అట్లతద్దెకథ, 5 శ్రావణమంగళవారము కథ, 6 వరలక్ష్మీవ్రతకథ, 7 [illegible]కథ, 8 పసుపుగౌరికథ, 9 మొగదోసిళ్ళకథ, 10 చిత్రగుప్తునినోముకథ, 11 కృష్ణకాంతకథ, 12 కంచుగౌరికథ, 13 ఉప్పుగౌరి, 14 గణేశునినోముకథ, 15 గాడిసెనోము కథ, 16 పాటిల లక్ష్మివారము కథ, 17 మారేడుదళముకథ, 18 సంకట+శుక్రవారము నోముకథ, 19 మార్గశిరలక్ష్మివారముకథ, 20 కార్తికమునెలసోమవారము కథ, 21 పూర్ణాదివారముకథ, 22 గ్రామకుంకుమనోముకథ, 23 వెలగలగౌరికథ, 24 అపదసేని ఆదివారముకథ, 25 ముప్పదిమూఁడు పున్నములనోము కథ 26 కుందేటి అమావాస్యనోముకథ, 27 దంపతాంబూలములనోముకథ, 28 పదహారుఫలములనోము కథ, 29 సౌభాగ్య తదియలకథ, 30 మాఘపాదివారముకథ, 31 సూర్యపద్మముకథ, 32 నందికేశ్వర వ్రతకథ.

## ద్వితీయ భాగము.

1 గాజుల గౌరీదేవికథ, 2 గ్రహణగౌరికథ, 3 పోలిస్వర్గమునకెళ్ళు కథ, 4 పోలాలమావాస్యకథ, 5 కడుళ్ళగౌరీదేవికథ, 6 నిత్యశృంగారముకథ, 7 ఉదయకుంకుమనోముకథ, 8 కుంకుమగౌరినోముకథ, 9 [illegible]గౌరికథ, 10 తవుడుగౌరికథ, 11 శాకదానముకథ, 12 చద్దికూటిమంగళవారములకథ, 13 రేగులగౌరికథ, 14 పండుతాంబూలములనోముకథ, 15 మునికార్తికచరిత్రము, 16 కన్నెతులసెమ్మకథ, 17 కాటుకగౌరికథ, 18 అట్లమీఁదఅవపువ్వులకథ, 19 పది పువ్వులనోముకథ, 20 కార్తికచలిమిళ్ళనోముకథ, 21 తరగపాశివారములకథ. 22 గుమ్మడిగౌరికథ, 23 పువ్వులతాంబూలములనోముకథ, 24 గంధంతాంబూలాలనోముకథ, 26 పసుపుతాంబూలములకథ, 27 మఘుగౌరికథ, 28 బాలాడివారములకథ, 29 లచ్చలిగౌరికథ, 30 ధైర్యలక్ష్మికథ, 31 చిలుకముగ్గులనోముకథ, 32 బొమ్మలనోముకథ

రెండుభాగములును ముద్రణమై సిద్ధముగానున్నవి. విరివిగా కొనువారలకు మంచి కమీషను ఇయ్యఁబడును. బాలాంత్రపు వేంకటరావు.

ముంమురాంబోవుపుష్పము.

నానాధర్మప్రతిపాదకమగు

# బ్రహ్మపురాణము.

(నాల్గవసంపుటము.)

ప్రతులు వలయువారు:—

వడకుదుటి వీరరాజు పంతులుగారు

సంపాదకుఁడు,

పురాణగ్రంథమాలిక,

పిఠాపురము.

అని వ్రాయవలెను.